శుక్రవారం
7•6•2019
కరీంనగర్
• వెల. రూ. 6.50
• సంపుటి 8 • సంచిక 343
• పేజీలు : 16 + 16

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE




PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD



# 200 ఇంజినీరింగ్ కాలేజీలకు
# ఏఐసీటీఈ అనుమతి


- 1,05,120 మంది విద్యార్థుల ప్రవేశానికి అనుమతి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో 2019-20 విద్యా సంవత్సరానికి 200 ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీలకు అనుమతినిస్తూ అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) నిర్ణయించింది. ఈ కాలేజీల్లో 1,05,120 సీట్లలో విద్యార్థుల ప్రవేశానికి అనుమతి లభించింది. ఓయూ పరిధిలోని 14 ఇంజినీరింగ్ కాలేజీల్లో 8,900 సీట్లు, జేఎన్టీయూహెచ్ పరిధిలోని 181 కాలేజీల్లో 94,300 సీట్లు, కేయూ పరిధిలోని 1,920 సీట్లు అందుబాటులోకి వచ్చాయి. ఇవికాకుండా 14 ప్రభుత్వ/ యూనివర్సిటీ కాలేజీల్లో మొత్తం 3,055 సీట్లున్నాయి. బీఫార్మసీ 124 కాలేజీల్లో 10,762 సీట్లు, ఎంబీఏ 303 కాలేజీల్లో 41,049 సీట్లు, ఎంసీఏ 36 కాలేజీల్లో 2,721 సీట్లు, ఫార్మా-డీ 60 కాలేజీల్లో 1,770 సీట్లకు ఏఐసీటీఈ అనుమతులు మంజూరు చేసింది. జేఎన్టీయూహెచ్ పరిధిలో 160 కాలేజీలకు అఫిలియేషన్ జేఎన్టీయూహెచ్ పరిధిలో 181 ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీలకు ఏఐసీటీఈ అనుమతులు మంజూరు చేసినప్పటికీ, వాటిలో ఈ ఏడాది ఇప్పటివరకు 160కాలేజీలకు మాత్రమే మంజూరుచేసినట్టు వర్సిటీ రిజిస్ట్రార్ యాదయ్య తెలిపారు. 20 కాలేజీలకు ఈసారి జేఎన్టీయూహెచ్ అఫిలియేషన్ ఇవ్వలేదని తెలిసింది. టీఎస్ఎంసెట్-2018 వివరాలు www.sbtet.telangana.gov.inలో పొందుపరిచినట్టు క్యాంపుఆఫీసర్ శ్రీనివాస్ తెలిపారు.

## 14 నుంచి న్యూయార్క్‌లో
## నిజాం నగల ప్రదర్శన

- 19న ఆన్‌లైన్‌లో వేలంపాట

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** నిజాం నవాబుల నగలను ఈ నెల 14 నుంచి న్యూయార్క్‌లో ప్రదర్శనకు ఉంచనున్నారు. నిజాం నవాబులు ధరించిన నెక్లెస్, గోల్కొండ వీధుల్లో కొనుగోలు చేసిన వజ్రంతోపాటు మొఘల్ చక్రవర్తి షాజహాన్ వినియోగించిన కత్తి, హైదరాబాద్ దక్కన్ పాన్‌బాక్స్‌తోపాటు వజ్ర వైఢూర్యాలు, ఆభరణాలెన్నో ఈ ప్రదర్శనలో కొలువుదీరనున్నాయి. మొఘల్, నిజాం నవాబులతోపాటు పలు రాజ కుటుంబాలకు చెందిన సుమారు 400 రకాల ఆభరణాలు, వజ్రాలు, కత్తులు, బంగారు కప్పులు, తైలవర్ణ చిత్రాలను ప్రదర్శించనున్నారు. ద అల్ థాని కలెక్షన్ ఫౌండేషన్ సేకరించిన ఈ ఆభరణాలను న్యూయార్క్‌కు చెందిన క్రిస్టీస్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఈ నెల 19న ఆన్‌లైన్‌లో వేలం వేయనున్నది. ఒక్కో ఆభరణం విలువను రూ.కోటి నుంచి రూ.20 కోట్ల వరకు నిర్ణయించారు. వేలం ద్వారా వచ్చే నిధులను ప్రపంచవ్యాప్తంగా ఎగ్జిబిషన్లు, పుస్తక ప్రచురణలు, మ్యూజియాల నిర్వహణకు, విద్యార్థుల చదువులకు, స్కాలర్‌షిప్‌లు తదితరాలకు వినియోగించనున్నారు.





# ఆర్డీఎస్ ఆధునీకరణకు అడుగులు

తెలంగాణ, ఏపీ మధ్య సత్సంబంధాలు

- ఏపీ సహకరిస్తే అభ్యంతరం లేదన్న కర్ణాటక
- 11న తుంగభద్ర బోర్డు సమావేశం
- ఆర్డీఎస్ నీటి వాటా, పెండింగ్ పనులపై సమీక్ష
- సమావేశానికి హాజరుకానున్న జూరాల అధికారులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ /ఐయిజ:**

రాజోలిబండ డైవర్షన్ స్కీం ప్రాంత రైతుల కష్టాలకు ఇక తెరపడబోతున్నది. మొదటిసారిగా ఏపీ, తెలంగాణ మధ్య సత్సంబంధాలు నెలకొన్న నేపథ్యంలో ఆర్డీఎస్ ఆధునీకరణకు అడుగులు పడనున్నాయి. ఆర్డీఎస్ ఆధునీకరణకు ఏపీ సహకరిస్తే తమకేమీ అభ్యంతరంలేదని ఇప్పటికే కర్ణాటక ప్రకటించిన నేపథ్యంలో సానుకూలత నెలకొన్నది. ఈ క్రమంలో తొలిసారిగా స్నేహపూర్వక వాతావరణంలో తుంగభద్ర బోర్డు ఈ నెల 11న హోస్పేటలోని తుంగభద్ర డ్యాం వద్ద సమావేశంకానున్నది. మూడు రాష్ట్రాల నీటిపారుదలశాఖ అధికారులు పాల్గొనే ఈ సమావేశానికి మన రాష్ట్రం నుంచి ఇరిగేషన్ అధికారులు, జూరాల ప్రాజెక్టు ఇంజినీర్లు కూడా హాజరుకానున్నారు. ఈ మేరకు నివేదికలు కూడా సిద్ధం చేస్తున్నారు. ఈ నెల రెండోవారంలో రుతుపవనాల రాక మొదలుకాబోతుండటం, ప్రాజెక్టులకు నీటిప్రవాహం పెరిగే సూచనలు కనిపిస్తుండటంతో ముందస్తుగానే నీటి కేటాయింపులు జరిపేందుకు ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. రుతుపవనాల ప్రభావంతో వానలు కురవగానే మొట్టమొదటిసారి వరద ప్రవాహం తుంగభద్ర ప్రాజెక్టుకే చేరుకుంటుంది.

### ఆర్డీఎస్ ఆధునీకరణ

రాజోలి బండ డైవర్షన్ స్కీం (ఆర్డీఎస్) ఆధునీకరణ పనులు ఏండ్ల తరబడి పెండింగ్ పడుతూనే ఉన్నాయి. ఈ పనులు చేస్తేనే ఆర్డీఎస్ పరిధిలోని పూర్తి ఆయకట్టుకు సాగునీరందించే వీలుంటుంది. తెలంగాణ ఉద్యమ సమయంలో అప్పటి ఉద్యమ నేతగా టీఆర్‌ఎస్ అధ్యక్షుడు కే చంద్రశేఖర్‌రావు ఆర్డీఎస్ దగ్గర నుంచే పాదయాత్ర ప్రారంభించారు. ఆర్డీఎస్ ఆధునీకరణ పనులకు ముందునుంచీ ఉమ్మడి పాలనలో సమైక్య నేతలు, విభజన తర్వాత టీడీపీ నేతృత్వంలోని ఏపీ ప్రభుత్వం నుంచి అడ్డంకులు ఎదురయ్యాయి. పనులు చేసేందుకు వెళ్లినవారిని కొందరు అడ్డుకోవడమే కాకుండా, సిమెంట్, ఇసుకను నీటిలో వేయడం, ఇనుమును ఎత్తుకెళ్లడం వంటి పనులు చేసేవారు. ఫలితంగా ఆధునీకరణ పనులు ముందుకుసాగలేదు. ప్రస్తుతం ఏపీ ముఖ్యమంత్రిగా జగన్ బాధ్యతలు చేపట్టడం, తెలంగాణ సీఎం కేసీఆర్‌తో స్నేహపూర్వక సంబంధాలు నెలకొనడం ఆర్డీఎస్ ఆధునీకరణ పనులపై ఆశలు రేపుతున్నాయి.



తుంగభద్ర ప్రాజెక్టు (ఫైల్)

### వాటా 17 టీఎంసీలు.. వినియోగం మూడు టీఎంసీలే!

బ్రిజేశ్ ట్రిబ్యునల్ కేటాయింపుల ప్రకారం ఆర్డీఎస్‌కు 17.09 టీఎంసీల నీటి వాటా ఉన్నది. ఆధునీకరణ పనులు పూర్తి చేయకపోవడంతో.. ఏటా మూడు టీఎంసీలను కూడా వినియోగించుకోవడం లేదు. ఐదు, పదివేల ఎకరాలకు మాత్రమే సాగునీరు అందుతున్నది. ఆర్డీఎస్ పనులకు అడ్డుకునే ధోరణితో అప్పటి ఏపీ సీఎం చంద్రబాబు ఉండటంతో తెలంగాణ సీఎం కేసీఆర్.. తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకాన్ని యుద్ధప్రాతిపదికన పూర్తిచేశారు. ఏపీ, కర్ణాటక పరిధిలోని ఆర్డీఎస్ ఆనకట్ట పటిష్టత పనులు, ఆటోమెటిక్ షట్టర్ల బిగింపు, ఆనకట్ట బకెట్ల ఏర్పాటు, ప్యాకేజీ -2లోని కాల్వల ఆధునీకరణ, బ్రిడ్జిల నిర్మాణం పనులన్నీ పూర్తిచేస్తే అలంపూర్ నియోజకవర్గంలోని 87,500 ఎకరాలకు చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందుతుంది. దీని ప్రాముఖ్యాన్ని గుర్తించే.. ఆర్డీఎస్ ఆధునీకరణ పనులు పూర్తిచేసేందుకు ఐదేండ్ల నుంచి తెలంగాణ ప్రభుత్వం, ఇరిగేషన్ అధికారులు.. ఏపీ, కర్ణాటక ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేస్తూ వచ్చారు. కానీ.. ప్రధానంగా ఏపీ ప్రభుత్వం వాటికి ఎప్పటికప్పుడు మోకాలడ్డింది. కర్ణాటక ప్రభుత్వం మాత్రం.. ఆధునీకరణ పనులకు ఏపీ ప్రభుత్వం సహకరిస్తే తమకు ఎలాంటి అభ్యంతరం లేదని ముందు నుంచీ చెప్తూనే ఉన్నది. లిఖితపూర్వకంగా కూడా ఒప్పుకొన్నది. ప్రస్తుతం ఏపీతో సత్సంబంధాలు ఉండటంతో ఆర్డీఎస్ ఆధునీకరణకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని భావిస్తున్నారు.

### ఆర్డీఎస్ ఆధునీకరణకు చర్యలు కోరుతాం




ఈ నెల 11న తుంగభద్ర బోర్డు సమావేశం జరుగనుంది. డ్యాంకు వచ్చే నీటి ప్రవాహం, నీటి కేటాయింపు, పెండింగ్‌లో ఉన్న ఆధునీకరణ పనులు తదితర అంశాలపై చర్చించనున్నాం. ఆర్డీఎస్ ఆధునీకరణ పనుల పూర్తికి చర్యలు తీసుకోవాలని కోరుతాం. బ్రిజేశ్ ట్రిబ్యునల్ కేటాయింపులకు అనుగుణంగా నీటిని విడుదలచేయాలని బోర్డు చైర్మన్‌కు వివరిస్తాం.

– శ్రీనివాసులు ఈఈ, ఆర్డీఎస్ ప్రాజెక్టు, జోగుళాంబ గద్వాల

## వేరే పార్టీలో చేరడం వల్లే
# అనర్హత వేటు

- అసెంబ్లీ ఎన్నికలకు ముందు రాహుల్, సోనియాను పిటిషనర్ కలిశారు
- పార్టీ మారినట్టు మండలి చైర్మన్ ఎదుట అంగీకరించారు
- భూపతిరెడ్డి అనర్హత కేసులో ప్రభుత్వ వాదనలు



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** అసెంబ్లీ ఎన్నికలకు ముందు అనర్హతకు గురైన ఎమ్మెల్సీ భూపతిరెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారని, పార్టీ మారిన విషయాన్ని ఆయనే స్వయంగా శాసనమండలి చైర్మన్ ఎదుట అంగీకరించారని రాష్ట్రప్రభుత్వం గురువారం హైకోర్టుకు నివేదించింది. సహజ న్యాయసూత్రాలకు విరుద్ధంగా, వివరణ ఇవ్వడానికి అవకాశం లేకుండా తనపై అనర్హత వేటువేశారని పేర్కొనడంతోపాటు రాజ్యాంగంలోని షెడ్యూల్ 10 పేరా 8ను సవాల్‌చేస్తూ భూపతిరెడ్డి గతంలో హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై ప్రభుత్వం తరపున అదనపు అడ్వకేట్ జనరల్ రామచంద్రారావు వాదనలు వినిపిస్తూ భూపతిరెడ్డి ఢిల్లీలో కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ, యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీని కలిశారని పేర్కొన్నారు. దీనిపై అన్ని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో కథనాలు కూడా వచ్చాయని తెలిపారు. సదరు కథనాల ఆంగ్ల అనువాద ప్రతులతోపాటు వీడియోలను ధర్మాసనం ముందుంచారు. నిజామాబాద్ స్థానిక సంస్థల నుంచి టీఆర్‌ఎస్ తరపున ఎన్నికైన భూపతిరెడ్డి కాంగ్రెస్ తరపున అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేశారని పేర్కొన్నారు. కాంగ్రెస్ నుంచి నామినేషన్ వేసి, పోటీలో నిలిచినందున.. వివరణకు అవకాశంఇవ్వలేదని, సహజన్యాయ సూత్రాలకు విరుద్ధమనే ప్రశ్నే ఉత్పన్నం కాదని స్పష్టంచేశారు. అసెంబ్లీలో లేదా మండలిలో ఏ సభ్యులు ఏ పార్టీకి ప్రాతినిధ్యం వహిస్తున్నారు.. ఏ పార్టీపక్షాన కూర్చుంటున్నారు అనడానికి స్పీకర్ లేదా చైర్మన్ ప్రత్యక్ష సాక్షులని తెలిపారు.

**వాదనలు వినిపించిన కేంద్రం..**

స్పీకర్ లేదా చైర్మన్‌కు పలు అధికారాలను దఖలుపరుస్తున్న రాజ్యాంగంలోని షెడ్యూల్ 10 పేరా 8ను పిటిషనర్ సవాల్‌చేసిన నేపథ్యంలో కేంద్రం తరపు న్యాయవాది వాదనలు వినిపించారు. పేరా8 రాజ్యాంగాన్ని ఉల్లంఘించడం లేదని, మండలికి సంబంధించినంతవరకే చైర్మన్‌కు రూల్ మేకింగ్ అధికారం ఉంటుందన్నారు. పేరా 8 రాజ్యాంగబద్ధతను కేంద్రం తరపు న్యాయవాది సరిగా అర్థంచేసుకోలేకపోయారని పేర్కొన్న హైకోర్టు.. పూర్తివివరాలతో మళ్లీ రావాలని ఆదేశించింది.

## నావికుడు ఆకాశ్ ఆత్మహత్య

- పుణెలోని ఐఎన్‌ఎస్‌లో ఘటన
- నిర్మల్ జిల్లా పార్డి(బి) గ్రామంలో విషాదం



ఆకాశ్ (ఫైల్)

**కుభీర్:** మహారాష్ట్రలో పుణె జిల్లా లోనవాలాలోని భారత నౌకాదళ స్థావరం (ఇండియన్ నావల్ స్టేషన్: ఐఎన్‌ఎస్)లో నావికుడిగా పనిచేస్తున్న నిర్మల్ జిల్లా కుభీర్ మండలంలోని పార్డి(బి) గ్రామానికి చెందిన కన్నాల ఆకాశ్(20) ఆత్మహత్య చేసుకున్నాడు. స్థావరంలోని రిక్రియేషన్ కేంద్రంలో ఉన్న గదిలో బుధవారం తెల్లవారుజామున 4.30 గంటల ప్రాంతంలో బెడ్‌షీట్‌తో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. ఘటనాస్థలంలో ఎలాంటి సూసైడ్ నోట్ లభించలేదు. ఆకాశ్ ఆత్మహత్యపై నౌకాదళ అధికారులు విచారణకు ఆదేశించారు. కన్నాల సాయినాథ్, బోజవ్వ దంపతుల పెద్దకొడుకు ఆకాశ్ తొమ్మిది నెలల కిందట నేవిలో ఉద్యోగంలో చేరాడు. ఇందులోభాగంగా నౌకాదళంలో డైరెక్ట్ ఎంట్రీ ఇంజినీరింగ్ మెకానిక్స్ కోర్సులో శిక్షణ పొందుతున్నాడు. బుధవారం తెల్లవారుజామున ఐఎన్‌ఎస్ శివాజీ వద్ద ఆయన శవమై కనిపించినట్టు అక్కడి నౌకాదళ అధికారులు తెలిపారని గ్రామస్థులు చెప్పారు. గురువారం నౌకాదళ అధికారులు.. ఆకాశ్ మృతదేహాన్ని పార్డి(బి)కి తీసుకొచ్చారు. ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు జరిపించారు. పేద కుటుంబంలో పుట్టిన ఆకాశ్ ఇంటర్మీడియట్ వరకు ప్రభుత్వ బడుల్లోనే చదువుకున్నాడు. ఆకాశ్ మృతితో గ్రామంలో విషాదం అలుముకున్నది.

## ముగిసిన దోస్త్ దరఖాస్తుల గడువు

**హైదరాబాద్ నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాలకు నిర్వహించిన దోస్త్-2019 దరఖాస్తుల గడువు గురువారంతో ముగిసింది. తొలివిడుత దోస్త్ కౌన్సెలింగ్ కోసం 1,20,860 మంది విద్యార్థులు ఫీజు చెల్లించగా, వారిలో 1,16,780 మంది విద్యార్థులు కౌన్సెలింగ్‌లో పాల్గొనేందుకు దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 1,10,361 మంది వెబ్‌కౌన్సెలింగ్‌లో పాల్గొన్నట్టు దోస్త్ కన్వీనర్ ప్రొఫెసర్ ఆర్ లింబాద్రి తెలిపారు. దోస్త్‌కు సంబంధించి ఈ నెల 10న సీట్లు కేటాయిస్తామని చెప్పారు.

# రేపే చేప ప్రసాదం పంపిణీ

- సాయంత్రం 6 గంటల నుంచి ప్రారంభం
- విస్తృతంగా ఏర్పాట్లుచేసిన సర్కారు

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:**

చేప ప్రసాదం పంపిణీకి సర్వం సిద్ధమయింది. నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ప్రభుత్వం విస్తృతంగా ఏర్పాట్లుచేసింది. మృగశిర కార్తె సందర్భంగా ఆస్తమా వ్యాధిగ్రస్తులకు బత్తిని మృగశిర ట్రస్ట్ ఆధ్వర్యంలో చేప ప్రసాదం పంపిణీ శనివారం (ఈ నెల 8న) సాయంత్రం 6 గంటలకు ప్రారంభమై.. ఆదివారం సాయంత్రం 6 గంటల వరకు కొనసాగనున్నది. మత్స్యశాఖ.. కొరమీను చేపపిల్లలను అందుబాటులో ఉంచుతుండగా, బత్తిన సోదరులు చేప ప్రసాదాన్ని ఉచితంగా అందించనున్నారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో 1.6 లక్షల కొర్రమీన్లను అందుబాటులో ఉంచారు. చేప ప్రసాద పంపిణీకి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో 36 కౌంటర్లను ఏర్పాటుచేస్తున్నారు. మహిళలకు, వికలాంగులకు, వృద్ధులకు, ప్రముఖులకు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటుచేశారు. తెలుగు రాష్ట్రాలతోపాటు ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, ఒడిశా తదితర రాష్ట్రాల నుంచి జనం చేప మందు తీసుకొనేందుకు ఇప్పటికే హైదరాబాద్‌కు వచ్చి ఎగ్జిబిషన్ మైదానం సహా పలు ప్రాంతాల్లో సేదతీరుతున్నారు. సదూర ప్రాంతాల నుంచి వచ్చేవారికోసం ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో తెలుగు, హిందీ, ఇంగ్లిష్, ఉర్దూ భాషల్లో సూచికబోర్డులను ఏర్పాటుచేశారు. శాఖల మధ్య సమన్వయం కోసం కంట్రోల్ రూం ఏర్పాటుతోపాటు 60 సీసీ కెమెరాలను బిగించారు. రద్దీని తెలుసుకొనేందుకు 3 -4 ఎల్‌ఈడీ స్క్రీన్లను ఏర్పాటుచేశారు. మైదానంలో ఆరు వైద్య బృందాలు, మూడు అగ్నిమాపక శకటాలు, మరో మూడు బుల్లెట్ శకటాలు, ఫైర్ కంట్రోల్ రూంలను అందుబాటులో ఉంచారు. చేప ప్రసాద పంపిణీకి ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయని జిల్లా సంయుక్త కలెక్టర్ గుగులోతు రవి చెప్పారు. బత్తిని మృగశిర ట్రస్ట్ ద్వారా అందరికీ ఉచితంగా ప్రసాదాన్ని అందించాలన్నదే తమ ఆకాంక్షని బత్తిని హరినాథ్‌గౌడ్ తెలిపారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు సీఎస్, మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ చొరువ తీసుకొని అన్ని ఏర్పాట్లు చేస్తున్నారని పేర్కొన్నారు. ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో చేప ప్రసాదాన్ని స్వీకరించలేనివారు ఆందోళనకు గురికావొద్దని, మరుసటిరోజు హైదరాబాద్‌లోని నాలుగుప్రాంతాల్లో ఉచితంగా ప్రసాదాన్ని అందజేస్తామని తెలిపారు.



చేపమందు కోసం ఎగ్జిబిషన్ గ్రౌండ్‌కు ముందుగానే ఉత్తరాది నుంచి తరలివచ్చిన ఉబ్బసం బాధితులు

### చేప ప్రసాదం.. ఏర్పాట్లు ఘనం

- మైదానంలోకి వచ్చినవారి సందేహాలను నివృత్తిచేయడం, బస్సులు, రైళ్ల రాకపోకల సమాచారాన్ని అందజేసేందుకు 'మే ఐ హెల్ప్' బూత్‌లను నెలకొల్పారు.
- చేప ప్రసాదం పంపిణీకి వచ్చేవారి కోసం గత ఏడాది వంద బస్సులు నడుపగా, ఈసారి హైదరాబాద్‌లోని 14 ట్రాఫిక్ హబ్‌ల నుంచి 150 ఆర్టీసీ బస్సులను ఏర్పాటుచేశారు. జీహెచ్‌ఎంసీ నుంచి 100 మొబైల్ టాయిలెట్లు, పారిశుద్ధ్య నిర్వహణకు వెయ్యిమందికిపైగా సిబ్బందిని కేటాయించారు.
- రోగులు, సహాయకుల కోసం రూ.5 భోజన కౌంటర్లు, బద్రివిశాల్ పన్నాలాల్ ట్రస్ట్, అగర్వాల్‌ట్రస్ట్, అగర్వాల్ సేవాదళ్, హైదరాబాద్ జైశ్వాల్‌సేవా సమితిలతో ఉచితంగా టిఫిన్లు, భోజనాలను సమకూర్చేందుకు ఏర్పాట్లు చేశారు.





## నీట్‌లో సత్తాచాటిన గురుకులాలు

- ప్రతిభ ప్రదర్శించిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు
- 150 మందికి దక్కనున్న ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్లు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దేశవ్యాప్తంగా నిర్వహించిన నీట్-2019 పరీక్ష ఫలితాల్లో ఎస్సీ, ఎస్టీ గురుకులాల విద్యార్థులు ప్రతిభ చాటారు. 150 మంది విద్యార్థులు అధిక మార్కులు సాధించారు. విద్యార్థులకు వచ్చిన మార్కులు, జాతీయస్థాయి ర్యాంకుల ఆధారంగా 100 మంది ఎస్సీ, 50 మంది ఎస్టీ విద్యార్థులు ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో చేరే అవకాశం ఉందని ఎస్సీ, ఎస్టీ గురుకుల విద్యాలయాల సొసైటీ కార్యదర్శి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం కేసీఆర్ అందిస్తున్న ప్రోత్సాహం, మంత్రి కొప్పుల ఈశ్వర్ సహకారంతో ఆపరేషన్ బ్లూక్రిస్టల్ అండ్ ఆపరేషన్ ఎమరాల్డ్ కార్యక్రమాలను నిర్వహిస్తూ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ద్వారా మూడేండ్లుగా అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నట్టు తెలిపారు. అధిక మార్కులు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. నీట్ ఫలితాల్లో అధికమార్కులు సాధించిన విద్యార్థుల్లో ధారావత్ రాజేశ్ (528 మార్కులు), కే చిన్న (524), కేతావత్ విష్ణు (488), బానో త్ చందూలాల్ (478), బానోత్ రవికుమార్ (472), రమావత్ స్నేహలత (452), కొవ్వూరు రసజ్ఞ (543) ఉన్నారు.

# రిజిస్ట్రేషన్లశాఖలో ఏసీబీ కలకలం

- కార్యాలయాల్లో ప్రైవేట్ సిబ్బంది అవినీతి దందా
- ప్రైవేట్‌వ్యక్తులను ఉపసంహరించండి: కమిషనర్ ఆదేశాలు
- ఔట్‌సోర్సింగ్‌లో సిబ్బందినివ్వండి: ఉద్యోగసంఘాల ప్రతినిధులు

**ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** స్టాంపులు, రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో అవినీతి నిరోధక శాఖ అధికారులు చేపడుతున్న ఆకస్మిక తనిఖీలు రిజిస్ట్రేషన్‌శాఖలో కలకలం సృష్టిస్తున్నాయి. యాదగిరిగుట్టతోపాటు మరికొన్ని కార్యాలయాల్లో ఆకస్మికసోదాలు చేస్తున్న ఏసీబీ అధికారులు.. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రభుత్వం నుంచి కాని, ఉన్నతాధికారుల నుంచి కాని ఎలాంటి చట్టబద్ధ అనుమతిలేకుండా ప్రైవేట్‌వ్యక్తులు పనిచేస్తున్నట్లు గుర్తించారు. వారికి రోజువారీ కూలీని సబ్‌రిజిస్ట్రార్లు, లేదా సీనియర్ అసిస్టెంట్లు తమ సొంత జేబుల నుంచి ఇవ్వడాన్ని ఏసీబీ అధికారులు తప్పుబట్టారు. చట్టపరమైన అనుమతిలేకుండా ఏవిధంగా పనిలో పెట్టుకుంటారని ప్రశ్నించారు. దీంతో గత మూడ్రోజులుగా చాలా కార్యాలయాల నుంచి ప్రైవేట్ సిబ్బందిని ఉపసంహరించారు. దీంతో రిజిస్ట్రేషన్లు మందకొడిగా సాగుతున్నాయి. గతఏడాదిగా దేశంలో ఎక్కడా లేనివిధంగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డితోపాటు రాష్ట్రంలోని చాలా జిల్లాల్లో భూముల క్రయ, విక్రయాలు పెరిగాయి. దేశంలోని బడా కంపెనీలు కూడా హైదరాబాద్ చుట్టూ రియల్‌ఎస్టేట్‌రంగంలో పెట్టుబడులు పెడుతుండటంతో రిజిస్ట్రేషన్లు ఒక్కసారిగా నాలుగురెట్లు పెరిగాయి. దీంతో చాలామంది సబ్‌రిజిస్ట్రార్లు ప్రైవేట్‌వ్యక్తులతో కంప్యూటర్లను అప్పగించి డాక్యుమెంట్ పనులు చేయిస్తున్నారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో అనుమతిలేకుండా, రికార్డుల్లోకి ఎక్కకుండా పనిచేసేవారి సంఖ్య పెరిగింది. రిజిస్ట్రేషన్‌శాఖలో 1,302మంది ఉద్యోగులు ఉండాలని.. ప్రస్తుతం 920 మంది మాత్రమే ఉన్నారని, వారిలో 720 మంది మాత్రమే క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నారని అధికారులు వివరించారు. ప్రస్తుతం తెలంగాణలో ఏడాదికి దాదాపు 16లక్షల డాక్యుమెంట్లు రిజిష్టరవుతున్నాయి. రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, యాదాద్రి భువనగిరి, నల్లగొండ, మెదక్ జిల్లాల్లోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రతి ఏటా కనీసం 20వేల నుంచి 50వేల డాక్యుమెంట్లు రిజిష్టరవుతున్నాయి.

### ఔట్ సోర్సింగ్‌లోనైనా సిబ్బందినివ్వండి

రిజిస్ట్రేషన్ల వ్యవహారాలన్ని చూడటానికి కనీసం 12మంది సిబ్బంది ఉండాల్సినచోట ఆరుగురు కూడా లేరని.. తీవ్ర పని ఒత్తిడి కారణంగా కొందరు ప్రైవేట్‌వ్యక్తులను ఆశ్రయించాల్సి వస్తున్నదని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఉద్యోగసంఘాల నాయకులు ఉన్నతాధికారులకు వివరించారు. స్థిరాస్తి రిజిస్ట్రేషన్లే కాకుండా వివాహాల రిజిస్ట్రేషన్లు, చిట్‌లు, ఎంకబరెన్స్ సర్టిఫికెట్లు, సీసీకాపీలను తీసిఇవ్వాల్సి ఉంటుందని, స్టాంపుపేపర్లను కూడా విక్రయించాల్సి ఉంటుందని చాలీచాలని సిబ్బందితో చాలా ఇబ్బందిగా మారిందని అధికారులతో వాపోయారు. ఔట్‌సోర్సింగ్ ద్వారానైనా కొంతమంది సిబ్బందినిస్తే.. రిజిస్ట్రేషన్ల స్పీడ్ పెరిగి రాష్ట్ర ఖజానాకు మరింత రాబడి వస్తుందని వారు అధికారులకు వివరించారు.

### ప్రైవేట్ వ్యక్తులను ఉపసంహరించండి

రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ప్రైవేట్ వ్యక్తులతో కంప్యూటర్ సేవలను ఉపయోగించుకోవడం తగదని అటువంటిదేమైనా ఉంటే వెంటనే ఉపసంహరించుకోవాలని ఆ శాఖ కమిషనర్ చిరంజీవులు ఆదేశించారు. ఈ విషయంలో ఎటువంటి నిర్లక్ష్యాన్ని సహించేదిలేదన్నారు. రిజిస్ట్రేషన్‌శాఖకు అత్యవసరంగా 500మంది సిబ్బంది కావాలని ఆయన ప్రభుత్వానికి నివేదించినట్టు సమాచారం.



భద్రాచలం అడవుల్లో కనిపించిన పెట్టె ఆకారంలో రాతిబండలు

## భద్రాచలం అడవుల్లో రాకాసి గూళ్లు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం గొందిగూడెం సమీపంలో రాకాసి గూళ్లు బయటపడ్డాయి. తెలంగాణ చరిత్ర పరిశోధకులు జగన్మోహన్‌రావు, నారాయణ, రామారావు, శేషుల బృందంతో కలిసి తెలంగాణ జాగృతి చరిత్ర బృందం సభ్యుడు కొండవీటి గోపి ఈ మెగాలిథిక్ సమాధులను కనుగొన్నారు. గొందిగూడెం నుంచి దట్టమైన అడవిలో పది కిలోమీటర్లదూరం వెళ్లిన తర్వాత టన్నుల కొద్దీ బరువున్న బండ కనిపించిందని తెలంగాణ జాగృతి బృందం సభ్యుడు శ్రీరామోజు హరగోపాల్ తెలిపారు. ఈ బండ నాలుగు పక్కల దాపులు పెట్టి ఉన్నాయి. గతంలో ఇతర ప్రాంతాల్లో కనిపించిన మాదిరిగా డోల్మెన్ సమాధిలా లేదు. బండకింద సందు కూడా లేదు. దీనిని లోతుగా పరిశీలిస్తే ఇదొక శ్మశానవాటికకు ప్రతీకగా కనిపిస్తున్నదని పరిశోధకులు అభిప్రాయపడ్డారు. ఎందుకంటే.. ఈ మహారాతికి కూతవేటుదూరంలో అనేక సమాధులు పదుల సంఖ్యలో ఉన్నాయి. ఆ సమాధులు శవపేటికల మాదిరి.. అత్యంత రాతి పలకలతో నిర్మించిన పెట్టెల్లా ఉన్నాయి. వీటిపైన ఉన్న కప్పు శిల 10x10 అడుగుల విస్తీర్ణంతో ఉన్నది. మూత మాదిరిగా ఉన్న ఈ శిలను నిధికోసం తొలిగించి ఉండవచ్చని వారు పేర్కొన్నారు. రాకాసి బండ ఒకేఒక్కటి ఉండి.. మిగతావి కాస్త ఆధునిక సమాధుల మాదిరిగా ఉండటం వల్ల ఇదొక చారిత్రక చిహ్నంగా ఉండే అవకాశం ఉన్నదని తెలిపారు. ఈ సమాధుల నిర్మాణంలో డంగు సున్నం వాడినట్లు అర్థమవుతున్నదన్నారు. వీటిలో మానవావశేషాలు కానీ, గుర్తింపదగిన రాతి పనిముట్లు కన్పించలేదని చెప్పారు.

శుక్రవారం
7•6•2019
కరీంనగర్

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE
PUBLISHED FROM KARIMNAGAR | HYDERABAD | WARANGAL | KHAMMAM | NALGONDA | MAHABUBNAGAR | NIZAMABAD










# కారెక్కిన కాంగ్రెస్

## టీఆర్ఎస్ఎల్పీలో విలీనం కోరిన 12మంది ఎమ్మెల్యేలు

- స్పీకర్ పోచారంను స్వయంగా కలిసి లేఖ అందజేత
- 12 మందిని టీఆర్ఎస్‌లో విలీనంచేస్తూ అసెంబ్లీ బులెటిన్
- అసెంబ్లీలో 104కు చేరిన టీఆర్ఎస్ సభ్యుల సంఖ్య
- ప్రతిపక్ష హోదా కోల్పోయిన కాంగ్రెస్
- అసెంబ్లీలో రెండో పెద్ద పార్టీగా ఎంఐఎం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

రాష్ట్ర కాంగ్రెస్‌కు కోలుకోలేని దెబ్బ తగిలింది. కాంగ్రెస్ నాయకత్వంపై నమ్మకంలేని ఆ పార్టీ ఎమ్మెల్యేలు 12 మంది ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు నాయకత్వంలో పనిచేయడానికి ముందుకొచ్చారు. రాష్ట్ర ప్రజలు సీఎం కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని, ఇప్పటివరకు జరిగిన అనేక ఎన్నికల్లో ఇదే రుజువైందని, తాము కూడా తమ నియోజకవర్గ అభివృద్ధి కోసం, బంగారు తెలంగాణలో భాగస్వామ్యం కావడానికి టీఆర్ఎస్‌లో విలీనమవ్వాలని నిర్ణయించుకున్నామని ప్రకటించారు. ఈ మేరకు తమను టీఆర్ఎస్‌లో విలీనం చేయాలంటూ గురువారం ఉదయం శాసనసభాపతి పోచారం శ్రీనివాస్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి లేఖ ఇచ్చారు. తమను రాజ్యాంగబద్ధంగా టీఆర్ఎస్ ఎమ్మెల్యేలుగా గుర్తించాలని కోరారు. అసెంబ్లీలో ఏదైనా పార్టీ సభ్యులు మరో పార్టీలో విలీనం కావాలంటే.. మూడింట రెండొంతుల మంది సుముఖత వ్యక్తంచేస్తూ స్పీకర్‌కు లేఖ ఇవ్వాల్సి ఉంటుంది. గతంలో టీడీపీ ఎమ్మెల్యేలు ఇదే విధంగా టీఆర్ఎస్ఎల్పీలో విలీనమయ్యారు. కొంతకాలం క్రితం శాసనమండలిలో కాంగ్రెస్ ఎమ్మెల్సీలు ఇదే పద్ధతిలో టీఆర్ఎస్‌లో చేరారు. తాజా పరిణామంలో కాంగ్రెస్‌కు చెందిన మూడింట రెండొంతుల మంది ఎమ్మెల్యేలు


మిగతా 4వ పేజీలో




టీఆర్ఎస్‌లో విలీనమైన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు

| పేరు | నియోజకవర్గం |
| --- | --- |
| 1. రేగా కాంతారావు | పినపాక |
| 2. ఆత్రం సక్కు | అసిఫాబాద్ |
| 3. హరిప్రియనాయక్ | ఇల్లెందు |
| 4. చిరుమర్తి లింగయ్య | నకిరేకల్ |
| 5. జాజుల సురేందర్ | ఎల్లారెడ్డి |
| 6. సబితా ఇంద్రారెడ్డి | మహేశ్వరం |
| 7. డీ సుధీర్‌రెడ్డి | ఎల్బీనగర్ |
| 8. కందాల ఉపేందర్‌రెడ్డి | పాలేరు |
| 9. బీ హర్షవర్ధన్‌రెడ్డి | కొల్లాపూర్ |
| 10. వనమా వెంకటేశ్వర్‌రావు | కొత్తగూడెం |
| 11. గండ్ర వెంకటరమణారెడ్డి | భూపాలపల్లి |
| 12. పైలట్ రోహిత్‌రెడ్డి | తాండూరు |

గురువారం స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి తమను టీఆర్ఎస్‌లో విలీనం చేయాలంటూ లేఖ అందజేస్తున్న 12మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు

- కాంగ్రెస్ నాయకత్వంపై ప్రజలకు విశ్వాసం లేదు
- కేసీఆర్ సారథ్యంలో పనిచేయడానికి ముందుకొచ్చాం
- మా నియోజకవర్గాలను అభివృద్ధి చేసుకుంటాం
- స్పీకర్‌ను కలిసిన అనంతరం మీడియాతో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు



ముగ్గురు పిల్లలతో భువనగిరి వద్ద మల్లారెడ్డి

## ధర్మగంట

- తండ్రి భూమిని తన పేరిట పట్టా చేయాలని కోరిన బాధితుడు
- మూడేండ్లుగా ముప్పుతిప్పలు పెట్టిన అధికారులు
- మూడున్నర ఎకరాల భూమికిగాను 15 గుంటలకే పట్టా ఇస్తామని మెలిక

5

ఆటోడ్రైవర్‌తో

# రెవెన్యూ ఆట

**సమస్య** పరిష్కారం కోసం తమ వద్దకు వచ్చేవారంటే రెవెన్యూ అధికారులకు ఎంత అలుసో ఈ ఉదంతం నిరూపిస్తున్నది! చనిపోయిన తన తండ్రి పేరిట ఉన్న మూడున్నర ఎకరాల భూమికి తన పేరిట పట్టా ఇవ్వాలని కోరిన ఓ ఆటోడ్రైవర్‌ను అధికారులు ముప్పుతిప్పలు పెట్టారు! ఎప్పుడు వెళ్లినా చేస్తాం.. చూస్తాం.. అని చెప్పటమే తప్ప ఫలితం లేదు! లాగిన్ అవటంలేదని ఒకసారి.. తాసిల్దార్ తిరుపతి వెళ్లారని, రాగానే అయిపోతుందని మరోసారి.. ఆయన వచ్చిన తర్వాత కూడా వేరే పనులున్నాయి.. టైం పడుతుందని ఇంకోసారి దాటవేస్తూ వచ్చారు! చివరికి ఆటోడ్రైవర్ నెత్తిన పిడుగు పడేస్తూ.. కొంతభూమిలో వేరొకరు కబ్జాలో ఉన్నారంటూ కొత్త సమస్య తెచ్చారు! మరో భాగాన్ని వేరొకరికి రిజిస్టర్ చేశారని చెప్పారు. 1996లో చనిపోయిన తన తండ్రి 2013లో వేరొకరికి భూమిని ఎలా రిజిస్టర్ చేశారని నిలదీసినా అధికారులు స్పందించలేదు. దీంతో విసుగెత్తిన ఆటోడ్రైవర్.. ఆత్మహత్య చేసుకుంటున్నట్టు వీడియో రికార్డు చేసి, ఇంట్లో లేఖ రాసిపెట్టి.. తన ముగ్గురు పిల్లలతో కలిసి అదృశ్యమయ్యాడు! సకాలంలో స్పందించిన పోలీసులు.. వారిని సురక్షితంగా తీసుకొచ్చారు.

# వడ్డీరేట్లు పావుశాతం తగ్గింపు



ముంబైలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్బీఐ గవర్నర్ శక్తికాంతదాస్

- 5.75 శాతానికి రెపోరేటు
- గృహ, వాహన రుణాలు మరింత చౌక
- బ్యాంక్ ఖాతాదారులకు భారీ ఊరట
- నెఫ్ట్, ఆర్టీజీఎస్ లావాదేవీల చార్జీల ఎత్తివేత

11



అడ్లూరులో పిడుగుపాటుకు దగ్ధమవుతున్న ఇల్లు

## పెండ్లి వేడుకకు వెళ్లి ప్రాణాలు నిలుపుకొన్నారు

పిడుగుపాటుకు ఇల్లు దగ్ధం
తప్పించుకున్న నలుగురు
నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం అడ్లూర్‌లో ఘటన

7

# గాలివాన బీభత్సం

- యాదాద్రి జిల్లాలో గోడ కూలి ఒకరు.. నారాయణపేట, వికారాబాద్ జిల్లాల్లో పిడుగుపాటుకు ముగ్గురు మృతి
- పలుచోట్ల కూలిన చెట్లు, ఎగిరిపోయిన ఇంటి పైకప్పులు
- నల్లగొండ, ఖమ్మం జిల్లాల్లో వడగండ్లు
- ఈసీ నదిలో పెరిగిన నీటి ప్రవాహం









## నేడు ఎంపీపీ అధ్యక్ష ఎన్నికలు

ప్రత్యేక సమావేశంలో ఎన్నుకోనున్న ఎంపీటీసీలు
రాష్ట్రంలో 445కుపైగా ఎంపీపీలు టీఆర్ఎస్‌కే!
ప్రమాణస్వీకారం లేకుండానే ప్రత్యేక భేటీ

4

## నేటినుంచి ఇంటర్ సప్లిమెంటరీ

పరీక్షలకు హాజరుకానున్న 4.63 లక్షల మంది విద్యార్థులు
గంటముందే పరీక్షకేంద్రాలకు చేరుకోవాలి
నిమిషం ఆలస్యమైనా అనుమతించరు

## ఆధారాలు చూపినా అడ్డదిడ్డంగానే..

పోలీసుల విచారణలో రవిప్రకాశ్ పొంతనలేని సమాధానాలు
మూడోరోజు 10 గంటల పాటు విచారణ
అరెస్టుపై కొనసాగుతున్న ఉత్కంఠ

8

## అమిత్‌షా నంబర్2!

కేంద్ర క్యాబినెట్‌లో ప్రధాని మోదీ తర్వాత కీలకస్థానం ఆయనదే
మొత్తం ఎనిమిది మంత్రివర్గ కమిటీల్లో విశేష ప్రాధాన్యం

9



గురువారం టీఆర్ఎస్‌లో చేరిన తర్వాత పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి. చిత్రంలో మంత్రి ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీలు శేరి సుభాష్‌రెడ్డి, నవీన్‌కుమార్ కూడా ఉన్నారు.



గురువారం హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరిన తాండూరు ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, నవీన్‌కుమార్ ఉన్నారు.

## ఘనంగా బోనాలు

**వేములవాడ కల్చరల్ :** బహుజన పూజారుల శివసత్తుల సేవాసమితి ఆధ్వర్యంలో గురువారం వేములవాడ లో 3000 మంది శివసత్తులు బద్దిపోశమ్మకు బోనాలు సమర్పించారు. పట్టణంలోని భీమేశ్వర గార్డెన్ నుంచి సుభాష్‌నగర్‌మీదుగా రాజన్న ఆలయం ముందు నుంచి దాదాపు 2,116 బోనాలతో బద్దిపోశమ్మ ఆలయానికి చేరుకుని అమ్మవారికి బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ బీజేపీ జిల్లా అధ్యక్షులు ప్రతాప రామకృష్ణ, జిల్లా కార్యదర్శి రేగుల మల్లికార్జున్, కౌన్సిలర్లు కూరగాయల శ్రీశైలం, జంగం రాజేందర్, నాయకులు, కార్యక్రమంలో కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ పాల్గొన్నారు.



వేములవాడలో బోనాలతో బద్దిపోశమ్మ దర్శనానికి వెళ్తున్న శివసత్తులు



## నేటినుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

- హాజరుకానున్న 4.63 లక్షల మంది విద్యార్థులు
- గంటముందే పరీక్షకేంద్రాలకు చేరుకోవాలి
- నిమిషం ఆలస్యమైనా అనుమతించరు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో శుక్రవారం నుంచి ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం కాబోతున్నాయి. ఈ పరీక్షలను ఈ నెల 14వ తేదీ వరకు నిర్వహించనున్నారు. విద్యార్థులు పరీక్ష ప్రారంభం కావడానికి గంటముందే పరీక్షకేంద్రాలకు చేరుకోవాలని, నిమిషం ఆలస్యమైనా అనుమతించబోమని ఇంటర్‌బోర్డు అధికారులు పేర్కొన్నారు. పరీక్ష ప్రారంభమైన తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ కేంద్రంలోకి అనుమతించే ప్రసక్తేఉండదని ఇదివరకే ప్రకటించారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు ప్రథమ సంవత్సరం, మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు ద్వితీయ సంవత్సరం పరీక్షలను నిర్వహిస్తారు. రాష్ట్రవ్యాప్తంగా 4,63,236 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలోప్రథమ సంవత్సరం విద్యార్థులు 3,00,847మంది కాగా.. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 1,62,389 మంది ఉన్నట్లు ఇంటర్ బోర్డు సెక్రటరీ ఏ అశోక్ తెలిపారు. పరీక్షల నిర్వహణ కోసం రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటుచేసిన 857 పరీక్ష కేంద్రాల్లో 857 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 15,045 మంది ఇన్విజిలేటర్లతో పాటు ప్రతి కేంద్రంలోనూ డిపార్టుమెంటల్ అధికారులను నియమించామని పేర్కొన్నారు.






**ముహూర్తం**

సూర్యోదయం: 5.45 గంటలకు

సూర్యాస్తమయం: 6.45 గంటలకు

వికారినామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, శుక్లపక్షం చతుర్థి ఉదయం 7.40 వరకు, తదుపరి పంచమి, నక్షత్రం: పుష్యమి సాయంత్రం 6.57 వరకు, తదుపరి ఆశ్లేష, అమృతఘడియలు: మధ్యాహ్నం 12.57 నుంచి 2.33 వరకు, రాహుకాలం: ఉదయం 10.38 నుంచి మధ్యాహ్నం 12.15 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 8:21 నుంచి 9.13 వరకు, తిరిగి మధ్యాహ్నం 12.41 నుంచి 1.33 వరకు, వర్జ్యం: తె. 3.58 నుంచి 5.34 వరకు.

# కారెక్కిన కాంగ్రెస్


మూడోపేజీ తరువాయి...


సుముఖత వ్యక్తంచేయడంతో వారి విజ్ఞప్తిని స్పీకర్ ఆమోదించారు. ఈ మేరకు 12 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను టీఆర్ఎస్ఎల్పీలో విలీనంచేస్తూ అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వీ నరసింహాచార్యులు గురువారం సాయంత్రం బులెటిన్ విడుదలచేశారు. ఇకపై ఈ 12 మంది టీఆర్ఎస్ సభ్యులుగా కొనసాగనున్నారు. వీరికి అసెంబ్లీలో టీఆర్ఎస్ సభ్యుల క్యాటగిరీలో సీట్లు కేటాయించనున్నట్టు బులెటిన్ పేర్కొన్నారు. కాంగ్రెస్‌కు చెందిన 18 మంది సభ్యుల్లో మూడింట రెండొంతుల మంది విలీనం కోరుతూ లేఖ ఇచ్చినందున.. రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ నాలుగో పేరా, సబ్ పేరా రెండు ప్రకారం వారిని విలీనంచేసినట్టు బులెటిన్‌లో తెలిపారు. టీఆర్ఎస్ కూడా 12 మంది సభ్యులను తమ పార్టీలో విలీనంచేసుకునేందుకు అంగీకరిస్తూ లేఖ ఇచ్చిందని వెల్లడించారు. ఈ పరిణామంతో అసెంబ్లీలో ఆరుగురు సభ్యులకు తగ్గిపోయిన కాంగ్రెస్.. ప్రతిపక్ష హోదా కోల్పోయింది. ఏడుగురు సభ్యులున్న ఎంఐఎం రెండో పెద్ద పార్టీగా అవతరించింది. మూడింట రెండొంతుల మంది విలీనం కోరుకున్న నేపథ్యంలో వారిపై అనర్హత వేటువేసే అవకాశంలేదని రాజ్యాంగ నిపుణులు స్పష్టంచేస్తున్నారు. రాజ్యాంగంలోని పదో షెడ్యూలు నాలుగో

### అసెంబ్లీలో తాజా బలాలు

| మొత్తం | 120 (నామినేటెడ్ సహా) |
|---|---|
| టీఆర్ఎస్ | 104 (నామినేటెడ్ సహా) |
| ఎంఐఎం | 7 |
| కాంగ్రెస్ | 6 |
| బీజేపీ | 1 |
| టీడీపీ | 1 |
| ఖాళీ | 1 (ఉత్తమ్ రాజీనామాతో) |



TELANGANA LEGISLATIVE ASSEMBLY

BULLETIN

12 మంది కాంగ్రెస్ సభ్యులను టీఆర్ఎస్ఎల్పీలో విలీనం చేస్తున్నట్లు పేర్కొంటున్న అసెంబ్లీ బులెటిన్

పేరా ఈ విషయాన్ని స్పష్టంచేస్తున్నదని పేర్కొంటున్నారు. చట్టపరంగా ముమ్మాటికీ ఇది సరైన పద్ధతేనని తేల్చిచెప్తున్నారు.

### 104కు పెరిగిన టీఆర్ఎస్ బలం

గత ఏడాది డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్ఎస్ 88 స్థానాల్లో గెలుపొందింది. ఆ తర్వాత జరిగిన రాజకీయ పరిణామాల్లో 15 మంది ఎమ్మెల్యేలు సీఎం కేసీఆర్ నాయకత్వాన్ని బలపరుస్తూ టీఆర్ఎస్‌లో చేరడానికి ముందుకొచ్చారు. వీరిలో స్వతంత్ర ఎమ్మెల్యేలు కోరుకంటి చందర్ (రామగుండం), రాములు నాయక్ (వైరా) టీఆర్ఎస్‌లో చేరారు. అనంతరం టీడీపీకి చెందిన సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య సీఎం కేసీఆర్ నాయకత్వంలో పనిచేస్తానని ప్రకటించారు. ఆ జోరు కొనసాగుతూ.. తాజాగా కాంగ్రెస్‌కు చెందిన 12 మంది ఎమ్మెల్యేలు టీఆర్ఎస్‌లో విలీనమయ్యారు. ఈ పరిణామంతో అసెంబ్లీలో నామినేటెడ్ ఎమ్మెల్యే సహా టీఆర్ఎస్ బలం 104కు పెరిగింది. కాంగ్రెస్‌లో మల్లు భట్టివిక్రమార్క, శ్రీధర్‌బాబు, సీతక్క, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, జగ్గారెడ్డి, పొదెం వీరయ్య మాత్రమే మిగిలారు. హుజూర్‌నగర్ ఎమ్మెల్యే ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో ఎంపీగా గెలుపొందటంతో ఎమ్మెల్యే పదవికి రాజీనామాచేసిన సంగతి తెలిసిందే. ఈ స్థానం ఖాళీగా ఉన్నది.



వనమా వెంకటేశ్వర్‌రావు



సబితా ఇంద్రారెడ్డి



గండ్ర వెంకటరమణారెడ్డి



సుధీర్‌రెడ్డి



రోహిత్ రెడ్డి



ఉపేందర్‌రెడ్డి



హర్షవర్ధన్‌రెడ్డి



జాజుల సురేందర్



ఆత్రం సక్కు



హరిప్రియనాయక్



రేగా కాంతారావు



చిరుమర్తి లింగయ్య

### కేటీఆర్‌ను కలిసిన రోహిత్‌రెడ్డి

కాంగ్రెస్‌కు చెందిన తాండూరు ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి గురువారం టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావును కలిశారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో పనిచేయడానికి ఆసక్తి వెలిబుచ్చారు. రాష్ట్రాన్ని, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకోవాలంటే సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమవుతుందనే ఉద్దేశంతో టీఆర్ఎస్‌లో చేరాలని నిర్ణయించుకున్నట్టు తెలిపారు. రోహిత్‌రెడ్డి వెంట ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, కూర్మయ్యగారి నవీన్‌కుమార్, శేరి సుభాష్‌రెడ్డి ఉన్నారు.

### నియోజకవర్గ అభివృద్ధి కోసమే

నియోజకవర్గ అభివృద్ధి కోసమే టీఆర్ఎస్‌లో విలీనం అవుతున్నాం. ప్రజల ఆకాంక్షల మేరకు నడుచుకుంటాం. ప్రజలు టీఆర్ఎస్ వైపు ఉన్నారు. బంగారు తెలంగాణలో భాగస్వాములమవుతాం. రాజ్యాంగబద్ధంగానే టీఆర్ఎస్‌లో విలీనం అవుతున్నాం. కాంగ్రెస్‌లో మెజార్టీ ఎమ్మెల్యేలం సీఎం కేసీఆర్‌ను కలిశాం. మమ్మల్ని టీఆర్ఎస్‌లో చేర్చుకునేందుకు సీఎం అంగీకరించారు. ఈ క్రమంలోనే 12 మంది ఎమ్మెల్యేలను టీఆర్ఎస్‌లో విలీనం చేయాలని కోరుతూ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డికి లేఖ అందజేశాం. మా నియోజకవర్గాల అభివృద్ధికి నిధులు ఇవ్వాలని సీఎం కేసీఆర్‌ను కోరాం. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం అన్ని రంగాల్లో నియోజకవర్గాలను అభివృద్ధి చేస్తాం.

- ఎమ్మెల్యే రేగా కాంతారావు

### బంగారు తెలంగాణ కోసమే

మా నియోజకవర్గాల అభివృద్ధికి తోడ్పడుతానని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారు. ఆయన నాయకత్వంలో పనిచేయడానికి టీఆర్ఎస్‌లో విలీనం అవుతున్నాం. నియోజకవర్గంలో ఎన్నో హామీలు ఇచ్చి గెలిచాం. ప్రజలు సీఎం కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారు. ఆయనపైనే నమ్మకం చూపుతున్నారు. మమ్మల్ని రాజ్యాంగబద్ధంగా టీఆర్ఎస్‌లో విలీనం చేయాలని స్పీకర్‌ను కోరాం.

- ఎమ్మెల్యే జాజుల సురేందర్

### సీఎల్పీ సమావేశం నిర్వహించి నిర్ణయం

సీఎల్పీ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించుకున్నాం. కేసీఆర్ నాయకత్వాన్ని బలపరుస్తూ వారి ఆధ్వర్యంలో పనిచేయాలని తీర్మానించుకున్నాం. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు అమలుచేయడానికి, తెలంగాణను బంగారు తెలంగాణ చేయడానికి ప్రజలు కూడా మా విలీనాన్ని ఆమోదించారు. భవిష్యత్‌లో కూడా ఆమోదిస్తారనే నమ్మకం మాకు ఉన్నది.

- ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

### టీఆర్ఎస్‌లో భాగంగా చూడాలి

నియోజకవర్గ అభివృద్ధికి ఎన్నో హామీలు ఇచ్చాం. వాటన్నింటినీ నెరవేర్చడానికి కేసీఆర్ నాయకత్వంలో పనిచేయాలని 12 మంది ఎమ్మెల్యేలం నిర్ణయించుకున్నాం. మూడింట రెండు వంతుల మంది ఎమ్మెల్యేలం షెడ్యూల్ 10 ప్రకారం టీఆర్ఎస్‌లో భాగంగా చూడాలని కోరాం.

- ఎమ్మెల్యే హరిప్రియనాయక్

### మూడో విలీనం

**టీఆర్ఎస్** సారథ్యంలోని తెలంగాణ ప్రభుత్వానికి ఎల్లెడలా మద్దతు వెల్లువెత్తుతున్నది. ప్రజాభీష్టంమేరకే తాము నడుచుకుంటామని, అభివృద్ధి మార్గమే తమ పథమంటూ ఎమ్మెల్యేలుగా ఎన్నికైనవారుకూడా టీఆర్ఎస్‌వైపు క్యూ కడుతున్నారు. రాష్ట్ర ఆవిర్భావం నేపథ్యంలో జరిగిన ఎన్నికల అనంతరం టీఆర్ఎస్ అధ్యక్షుడు కే చంద్రశేఖర్‌రావు సారథ్యంలో ఏర్పడిన ప్రభుత్వం పనితీరును, ప్రజల నుంచి వస్తున్న మద్దతును చూసిన అప్పటి బీఎస్పీ సభ్యులు ఇద్దరు టీఆర్ఎస్‌లో విలీనమయ్యారు. ఆ తర్వాత ఎర్రబెల్లి దయాకర్‌రావు నేతృత్వంలో టీడీపీ ప్రజాప్రతినిధులుకూడా ప్రజాభీష్టంమేరకు టీఆర్ఎస్‌లో భాగమయ్యారు. ఇప్పుడు తాజాగా మూడోసారి కాంగ్రెస్ నుంచి 12 మంది ఎమ్మెల్యేలు టీఆర్ఎస్ పక్షాన చేరారు. దీనితో వరుసగా మూడుసార్లు మూడు పార్టీల శాసనసభ్యులు టీఆర్ఎస్‌లో విలీనమైనట్టయింది.

# నేడు ఎంపీపీ అధ్యక్ష ఎన్నికలు

- ప్రత్యేక సమావేశంలో ఎన్నుకోనున్న ఎంపీటీసీలు
- రాష్ట్రంలో 445కుపైగా ఎంపీపీలు టీఆర్ఎస్‌కే!
- ప్రమాణస్వీకారం లేకుండానే ప్రత్యేక భేటీ
- పరిషత్ సభ్యుల అపూర్వ రికార్డు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పరిషత్ ఎన్నికల ప్రక్రియలో భాగంగా శుక్రవారం మండల పరిషత్ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కోఆప్షన్ సభ్యుల ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక సమావేశంలో రాష్ట్రంలోని 538 మండలాలకు కొత్త పాలకవర్గాలు ఏర్పడనున్నాయి. సాధారణంగా ఎంపీటీసీలు, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, జెడ్పీ చైర్మన్లు ప్రమాణం స్వీకరించిన తర్వాత తొలి సమావేశం నిర్వహించుకుంటారు. కానీ.. రాష్ట్రంలో ఏర్పడిన ప్రత్యేక పరిస్థితి నేపథ్యంలో ప్రమాణం స్వీకరించకుండానే తొలి సమావేశం పేరిట ప్రత్యేక భేటీలో పాల్గొని, మండల పరిషత్ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కో ఆప్షన్ సభ్యులు, జిల్లా పరిషత్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కో ఆప్షన్ సభ్యులను ఎన్నుకోనున్నారు. పంచాయతీరాజ్ చట్టం రూపొందిన తర్వాత ఇలా ప్రత్యేక సమావేశంలో పాల్గొనడం, అధ్యక్షులు, చైర్మన్లను ఎన్నుకోవడం ఇదే ప్రథమం. దీనికోసమే పంచాయతీరాజ్ చట్ట సవరణ ఆర్డినెన్స్ తీసుకురావాల్సిన పరిస్థితి కూడా ఏర్పడింది. మండల పరిషత్ అధ్యక్ష, ఉపాధ్యక్ష, కో ఆప్షన్ సభ్యుల ఎన్నిక కోసం శుక్రవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిస్తున్నామని, ఎన్నికైన పరిషత్ సభ్యులు హాజరుకావాలని ప్రిసైడింగ్ అధికారులు గురువారం నోటీసులు జారీచేశారు. ఆయా పార్టీలు విప్‌లు కూడా జారీచేశాయి. అత్యధికంగా కాంగ్రెస్‌పార్టీ తమ సభ్యులకు విప్ జారీచేసింది. ప్రత్యేక భేటీలో ముందుగా కో ఆప్షన్ సభ్యుని ఎన్నిక, తదుపరి మండల పరిషత్ అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికను నిర్వహించనున్నారు. నిబంధనల ప్రకారం కోరం ఉంటేనే అధ్యక్ష ఎన్నిక నిర్వహిస్తారు. లేకుంటే మరో రోజుకు వాయిదావేస్తారు. వరుసగా మూడుసార్లు కోరం రాకుంటే.. ఆ తర్వాత వచ్చిన సభ్యులతోనే ఎన్నిక నిర్వహించి, అధ్యక్ష, ఉపాధ్యక్షులను ప్రకటిస్తారు.




### ఎంపీపీ ఎన్నికకు అంతా సిద్ధం

శుక్రవారం జరిగే ఎంపీపీ అధ్యక్ష, ఉపాధ్యక్ష, కో ఆప్షన్ సభ్యుల ఎన్నికకు రాష్ట్ర ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు చేసింది. ప్రతి మండలానికి సదరు మండల ఎంపీడీవో పర్యవేక్షకుడిగా ఉంటారు. ప్రిసైడింగ్ అధికారులుగా జిల్లా, అదనపు జిల్లాస్థాయి అధికారులను నియమిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. సాయంత్రం ఐదుగంటల వరకు మండల పరిషత్ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కో ఆప్షన్ సభ్యుల ఎన్నికను పూర్తిచేయాలని ఎస్ఈసీ సూచించింది.

### ఎక్కడికక్కడే ప్రకటన

మండల పరిషత్ అధ్యక్షులు, ఉపాధ్యక్షులను ఎంపీటీసీ సభ్యులు ఎన్నుకోగానే.. అక్కడికక్కడే అధికారులు ఫలితాలను ప్రకటించనున్నారు. తర్వాత వీరంతా ఒకేసారి ప్రమాణ స్వీకారం చేసేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఒక తేదీని ప్రకటిస్తుంది.

### టీఆర్ఎస్‌కు ఏకపక్షమే

రాష్ట్రంలో మెజార్టీ మండలాలన్నీ టీఆర్ఎస్ ఖాతాలోనే ఉండనున్నాయి. మండల పరిషత్ అధ్యక్ష ఎన్నికల సందర్భంగా ఆయా పార్టీలు విప్ జారీచేసినా టీఆర్ఎస్ మాత్రం ఆత్మవిశ్వాసంతో ఉన్నది. ప్రతి మండలంలో ఎక్కువ స్థానాల్లో టీఆర్ఎస్ అభ్యర్థులే గెలిచారు. కొన్నిచోట్ల స్వతంత్రుల అవసరం ఉన్నా.. టీఆర్ఎస్‌కు మద్దతునిస్తున్నామని వారు ఇప్పటికే ప్రకటించిన నేపథ్యంలో ఎంపీపీల ఎన్నిక ఏకపక్షంగా సాగనుంది. అయితే కొన్నిచోట్ల తమ సభ్యులు కూడా టీఆర్ఎస్‌కు మద్దతునిస్తున్నారనే సమాచారంతో కాంగ్రెస్ పార్టీ విప్ జారీచేసింది.

### బాధ్యతలు మాత్రం జూలై 3 తర్వాతే

శుక్రవారం ఎంపీపీ, శనివారం జెడ్పీ చైర్మన్ల ఎన్నిక నిర్వహిస్తున్నా.. వారు బాధ్యతలను ఇప్పుడే స్వీకరించబోవటం లేదు. ప్రస్తుతం ఉమ్మడి ఖమ్మం జిల్లా మినహా రాష్ట్రవ్యాప్తంగా జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, జెడ్పీ చైర్మన్లు, ఎంపీపీల పదవీకాలం జూలై 3 వరకు ఉన్నది. జూలై 4న కొత్త సభ్యులు పదవీ బాధ్యతలు చేపట్టాల్సి ఉంటుంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మాత్రం ఆగస్టు 5 తర్వాత ఎంపీపీ అధ్యక్షులు, ఆగస్టు 6 తర్వాత జెడ్పీ చైర్మన్లు పదవీ బాధ్యతలు చేపడుతారు.

# గులాబీ జిల్లాలు!

## రేపు జెడ్పీ చైర్మన్ల ఎన్నిక.. నేడు విప్ జారీ

- 32 స్థానాల్లో టీఆర్ఎస్‌దే అధిపత్యం
- చైర్‌పర్సన్లుగా 16 మంది మహిళలు
- ఎస్టీలకు నాలుగు జిల్లా పరిషత్తులు
- ఎస్సీలకు, బీసీలకు ఆరు చొప్పున టీఆర్ఎస్ మెజార్టీతో ఎన్నికలు లాంఛనం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని జిల్లా ప్రజాపరిషత్ పీఠాలపై గులాబీ దళాలు ఆసీనులుకానున్నాయి. పరిషత్ ఎన్నికల్లో విజయదుందుభి మోగించిన టీఆర్ఎస్.. 32 జెడ్పీలను ఏకపక్షంగా కైవసం చేసుకునే సంఖ్యలో జెడ్పీటీసీలను గెలిచిన సంగతి తెలిసిందే. శనివారం జిల్లా పరిషత్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కో ఆప్షన్ సభ్యుల ఎన్నిక నిర్వహించనున్నారు. ప్రతీ జిల్లా పరిషత్‌లో ఇద్దరు కో ఆప్షన్ సభ్యులను ఎన్నుకుంటారు. దీనికి సంబంధించిన మార్గదర్శకాలను రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటికే జారీచేసింది. జిల్లా పరిషత్ ఎన్నిక సందర్భంగా రిజర్వేషన్లను మరోసారి ప్రకటించారు. 32 జిల్లాల్లో మహిళలకు 50 శాతం కోటా ప్రకారం 16 స్థానాలు దక్కుతున్నాయి. నూతన పంచాయతీరాజ్ చట్టం అమల్లోకి రావడంతో కొత్తగా రిజర్వేషన్లు వచ్చాయి. ఈ టర్మ్‌తోపాటు వచ్చే టర్మ్‌కు కూడా ఇవే రిజర్వేషన్లు వర్తించనున్నాయి. వీటి ప్రకారం జెడ్పీ చైర్మన్లలో ఎస్టీలకు నాలుగు, ఎస్సీలకు ఆరు, బీసీలకు ఆరు స్థానాలు దక్కాయి. మహిళలకు అన్నింటా 50% కేటాయించారు.

### నేడు నోటీసులు

జెడ్పీ చైర్మన్, వైస్ చైర్మన్, కో ఆప్షన్ సభ్యుల ఎన్నికకు శుక్రవారం జిల్లా కలెక్టర్లు నోటిఫికేషన్ జారీచేస్తారు. జిల్లాల పరిధిలోని జెడ్పీటీసీ సభ్యులను ప్రత్యేక సమావేశానికి రావాలని నోటీసు ద్వారా సమాచారం అందిస్తారు. జూన్ 8న ఉదయం 10 గంటల వరకు జెడ్పీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కో ఆప్షన్ సభ్యుల పదవులకు పోటీపడే అభ్యర్థుల నుంచి నామినేషన్లను స్వీకరిస్తారు. మధ్యాహ్నం 12 గంటల వరకు నామినేషన్లను పరిశీలించి, అర్హత సాధించినవారి పేర్లు ప్రకటిస్తారు. మధ్యాహ్నం ఒంటి గంట వరకు నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువు విధించి, ఆ తర్వాత ఎన్నిక ప్రక్రియను మొదలుపెడతారు. మధ్యాహ్నం ఒంటిగంటకు జిల్లా పరిషత్ మొదట కో ఆప్షన్ సభ్యుల ఎన్నిక, 3 గంటలకు జిల్లా పరిషత్ చైర్మన్లు, వైస్ చైర్మన్ల ఎన్నిక ఉంటుంది. ప్రతి జిల్లాలోనూ ఏకపక్షంగా టీఆర్ఎస్ అభ్యర్థులు విజయాలు సాధించిన నేపథ్యంలో జెడ్పీ చైర్మన్లు, వైస్‌చైర్మన్లు, కోఆప్షన్ సభ్యుల ఎన్నిక ప్రక్రియ లాంఛనం కానున్నది.

### జెడ్పీ చైర్మన్ల రిజర్వేషన్లు

| జిల్లా | రిజర్వేషన్ |
|---|---|
| మహబూబాబాద్ | ఎస్టీ (మహిళ) |
| కుమ్రంభీం ఆసిఫాబాద్ | ఎస్టీ (మహిళ) |
| భద్రాద్రి కొత్తగూడెం | ఎస్టీ (జనరల్) |
| ఆదిలాబాద్ | ఎస్టీ (జనరల్) |
| మంచిర్యాల | ఎస్సీ (మహిళ) |
| కరీంనగర్ | ఎస్సీ (మహిళ) |
| జయశంకర్ భూపాలపల్లి | ఎస్సీ (మహిళ) |
| జోగుళాంబ గద్వాల | బీసీ (మహిళ) |
| మెదక్ | బీసీ (మహిళ) |
| కామారెడ్డి | బీసీ (మహిళ) |
| వరంగల్ అర్బన్ | ఎస్సీ (జనరల్) |
| నాగర్‌కర్నూలు | ఎస్సీ (జనరల్) |
| ఖమ్మం | ఎస్సీ (జనరల్) |
| పెద్దపల్లి | బీసీ (జనరల్) |
| నారాయణపేట | బీసీ (జనరల్) |
| జగిత్యాల | బీసీ (జనరల్) |
| సిద్దిపేట | జనరల్ (మహిళ) |
| సంగారెడ్డి | జనరల్ (మహిళ) |
| రాజన్న సిరిసిల్ల | జనరల్ (మహిళ) |
| నిర్మల్ | జనరల్ (మహిళ) |
| వరంగల్ రూరల్ | జనరల్ (మహిళ) |
| వికారాబాద్ | జనరల్ (మహిళ) |
| రంగారెడ్డి | జనరల్ (మహిళ) |
| సూర్యాపేట | జనరల్ (మహిళ) |
| వనపర్తి | జనరల్ |
| యాదాద్రి భువనగిరి | జనరల్ |
| నిజామాబాద్ | జనరల్ |
| మహబూబ్‌నగర్ | జనరల్ |
| జనగామ | జనరల్ |
| మేడ్చల్ మల్కాజిగిరి | జనరల్ |
| నల్లగొండ | జనరల్ |
| ములుగు | జనరల్ |

### లోకం పోకడ




ఇంకొక్కరు పోతే పార్టీ గుర్తుకు సార్థకత!

# స్నేహితులు కొట్టారని ఆత్మహత్య

- జనగామలో ఘటన
- తల్లిదండ్రుల ఆందోళన.. పరిస్థితి ఉద్రిక్తం

**జనగామ టౌన్:** స్నేహితుల దాడితో మనస్తాపం చెందిన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా కేంద్రానికి చెందిన బోగ సాయి ప్రసాద్ యాదాద్రి భువనగిరి జిల్లా వంగపల్లి ఆలేరు మండలం వంగపల్లిలో స్వామి వివేకానంద కళాశాలలో బీ ఫార్మసీ రెండో సంవత్సరం చదువుతున్నాడు. బుధవారం రాత్రి రైల్వేపోలీసులు జనగామ రైల్వేస్టేషన్ సమీపంలోని పట్టాలపై బోగసాయి ప్రసాద్ మృతదేహాన్ని గుర్తించారు. అనంతరం సాయిప్రసాద్ ఇంట్లో పోలీసులకు సూసైడ్ నోట్ లభ్యమైంది. స్నేహితులు కొట్టడం వల్లే మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకుంటున్నట్టు లేఖలో పేర్కొన్నాడు. తన చావుకు కారణమైన వాళ్లను కఠినంగా శిక్షించాలని సాయిప్రసాద్ కోరాడు. తమ కుమారుడిని స్నేహితులైన పవన్, వరుణ్ తీవ్రంగా కొట్టి చంపి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని తల్లిదండ్రులు ప్రభాకర్ లక్ష్మి ఆరోపించారు. సాయిప్రసాద్ కుటుంబసభ్యులు, బంధువులు నిందితుల ఇంటి ఎదుట మృతదేహంతో ఆందోళనకు దిగారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని న్యాయం చేస్తామని నచ్చజెప్పడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. మృతుడి తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు రైల్వే పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం జనగామ పోలీసులకు కేసును బదిలీ చేశారు. స్థానిక పోలీసులు ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నారు.



సాయి ప్రసాద్ (ఫైల్)

# నమస్తే తెలంగాణ ధర్మగంట

మీ వద్ద ఉన్న సమాచారాన్ని పంపించాల్సిన చిరునామాలు

ధర్మగంట
నమస్తే తెలంగాణ,
8-2-603/1/7,8,9
రోడ్డు నంబర్ 10, బంజారాహిల్స్,
హైదరాబాద్-500034.
పై అడ్రస్‌కు పోస్టుద్వారా
పంపించండి.

Whatsapp No.
9346979997

dharmaganta@ntnews.com
అడ్రస్‌కు ఈ-మెయిల్ చేయండి.

స్థానిక నమస్తే తెలంగాణ
కార్యాలయంలో వివరాలు
అందించండి.


/NTDAILYONLINE




## వాటర్ ట్యాంక్ ఎక్కిన భూబాధితుడు

- రెవెన్యూ అధికారులు సమస్యను పరిష్కరించడంలేదని ఆరోపణ
- సిరిసిల్ల జిల్లా వేములవాడ మున్సిపాల్టీ శాత్రాజుపల్లిలో ఘటన
- అధికారుల హామీతో దిగివచ్చిన బాధితుడు గుడిసె అశోక్

**వేములవాడ రూరల్:** తమ భూ సమస్యలు అధికారులు పరిష్కరించడంలేదని ఆరోపిస్తూ రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మున్సిపాల్టీ పరిధిలోని శాత్రాజుపల్లి గ్రామానికి చెందిన గుడిసె అశోక్ వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన వ్యక్తంచేశారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. తన తాత గుడిసె కాంతయ్య పేరుమీద ఉన్న 5.20 ఎకరాల్లో తన వాటా తన పేరుపై చేయాలని అశోక్ పదేండ్లుగా తాసిల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. పనికాకపోవడంతో గురువారం గ్రామ శివారులో ఉన్న వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన వ్యక్తంచేశారు. గతంలోనే తాత పేరుపై ఉన్న భూమిలో నుంచి అశోక్ పెద్దనాన్నకు అధికారులు 2.20 ఎకరాలను పట్టాచేశారు. అదే సమయంలో తన పేరుపై కూడాచేయాలని కార్యాలయం చుట్టూ తిరిగినా అధికారులు పట్టించుకోలేదు. అశోక్ సుమారు నాలుగు గంటలపాటు ట్యాంక్‌పై ఉండటంతో గ్రామస్థులు అతనికి నచ్చజెప్పే ప్రయత్నంచేశారు. వెంటనే అక్కడికి వచ్చి అధికారులు కూడా భూసమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో అశోక్ కిందకు దిగారు. ట్యాంక్ దిగిన అనంతరం తాసిల్దార్ శ్రీనివాస్‌తోపాటు ఆర్ఐ, వీఆర్వో మోఖాపైకి వెళ్లి భూమిని పరిశీలించారు. అధికారులు అశోక్ అన్నదమ్ములతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలుచేపట్టారు.



వాటర్‌ట్యాంక్ ఎక్కి నిరసన తెలుపుతున్న గుడిసె అశోక్

## గిరిజనుల భూమిని కబ్జాచేశారు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** గిరిజనుల భూమిని కొందరు రియల్టర్లు కబ్జాచేశారని ఖమ్మం రూరల్ మండలం, పెద్దతండాకు చెందిన భూక్యా వాల్యా ధర్మగంటకు ఫిర్యాదుచేశారు. ఖమ్మం రూరల్ మండలంలోని పెద్దతండాలో చాలాకాలంగా నివాసముటున్నామన్నారు. ఈ మండలంలోని ఎదులాపురం రెవెన్యూ గ్రామంలో మెట్టు ఖుష్కీ భూమి, రాళ్లపోడు, గుట్టభూములు కొన్నేండ్లుగా తన తాత భూక్యా సక్రు పేరుమీద ఉన్నాయన్నారు. ఆ మేరకు పట్టాకూడా ఉన్నదని చెప్పారు. ఈ మేరకు 1985, 86 రెవెన్యూ పహాణీ ప్రకారం సర్వే నంబర్ 165/అలో తమకు ఉన్న 5.34 ఎకరాల భూమిని కొందరు సొసైటీగా ఏర్పడి కాజేశారని పేర్కొన్నారు. ఈ విషయంలో అధికారులకు ఎంత చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. తన తాత పేరుమీద ఉన్న 5.34 ఎకరాల భూమి రాళ్లు, రప్పలు, పొదలు ఉండి వ్యవసాయానికి అనుకూలంగా లేకపోవడం వల్ల రియల్టర్లు కాజేశారని చెప్పారు. ఈ భూమిని తిరిగి తన తాత భూక్యా సక్రు పేరు మీదకు మార్చాలని భూక్యా వాలా రెవెన్యూ అధికారులకు విజ్ఞప్తిచేశారు.

## సర్కారిచ్చిన స్థలం రియల్టర్ల పాలు

- ఫిర్యాదుచేసినా పట్టించుకోని వనపర్తి రెవెన్యూ అధికారులు
- ఎఫ్ఐఆర్ నమోదుచేసి వదిలేసిన పోలీసులు



బాధితురాలు జే చంద్రమ్మ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** గూడులేని పేదలకు అప్పటి సర్కారు ఇంటిస్థలమిస్తే రియల్టర్లు దాన్ని కబ్జాచేశారు. కబ్జాదారుల నుంచి తమను కాపాడి.. ప్లాటు తమకు ఇప్పించాలని వేడుకుంటే అటు రెవెన్యూ అధికారులు కానీ, ఇటు పోలీసులు కానీ పట్టించుకోలేదు. పోలీసులే తమకెందుకులే అన్నట్టు వ్యవహరించి, పరోక్షంగా కబ్జాదారులకు సహాయం చేశారు. వనపర్తి జిల్లా కేంద్రంలో దినసరి కూలిచేసుకొని బతికే జే చంద్రమ్మకు గూడు లేదు.. అడ్డమీద నుంచి కూలి పనులకు వెళ్లి జీవించేది. సొంత గుడిసె కూడా లేని చంద్రమ్మకు 2003 జనవరి 28వ తేదీన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, సర్వే నంబర్ 1133లో 121 గజాల ఇంటి స్థలం ఇచ్చింది. వనపర్తి మండల తాసిల్దార్ ప్రొసీడింగ్ నంబర్ జీ 9278102 ద్వారా పట్టా ఇచ్చారు. ప్రభుత్వమే లేఅవుట్ వేసి ప్లాట్లు చేసి పేదలకు ఇచ్చింది. ప్రభుత్వం ఇచ్చిన ఈ ప్లాటులో ఇల్లు కట్టుకోవడానికి వెళ్తే అప్పటికే అక్కడ తిష్టవేసిన కబ్జారాయుళ్లు చంద్రమ్మపైన, ఆమె కొడుకు రాములుపైన దాడిచేశారు. దీంతో చంద్రమ్మ, ఆమె కొడుకు రాములు జిల్లా కలెక్టర్‌కు, ఎస్పీకి, స్థానిక ఎమ్మార్వోకు, పోలీస్ ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదుచేశారు. అయినా ఇప్పటివరకు ఎవ్వరు కూడా ఈ తల్లీకొడుకుల బాధను పట్టించుకోలేదు. పోలీసులు ఏదో మొక్కుబడిగా 2015 ఫిబ్రవరి 10న ఎఫ్ఐఆర్ నమోదు చేసి వదిలేశారే తప్ప చర్యలు తీసుకోలేదు. రెవెన్యూ అధికారులు కానీ, పోలీసులు కానీ బాధితుల పక్షాన నిలువకపోవడంతో వారికి న్యాయం జరుగలేదు. గూడులేని పేదలకు ప్రభుత్వం ఇచ్చిన ఇంటి స్థలాన్ని కబ్జాదారులు ఆక్రమిస్తే తిరిగి ఆ భూమిని ప్రభుత్వం స్వాధీనంచేసుకొని పేదలకు తిరిగివ్వాల్సిన బాధ్యత అధికారులదే. కానీ అధికారులు బాధితులకు న్యాయంచేయడంలేదు. చంద్రమ్మ ఇంటి ప్లాటు కబ్జా వ్యవహారం పరిశీలిస్తే పోలీసులు కబ్జారాయుళ్లతో కుమ్మక్కు అయ్యారా అన్న సందేహాలు కూడా కలు గుతున్నాయి. తన భూమిని కబ్జా చేశారని, కబ్జారాయుళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుచేస్తే, చర్యలు తీసుకొమ్మని ఎస్పీ ఆదేశాలు ఇచ్చిన తర్వాత కూడా తూతూ మంత్రంగా ఎఫ్ఐఆర్ నమోదుచేసిన పోలీసులు ఇప్పటివరకు కబ్జాదారులను కట్టడి చేయలేదు. ఫలితంగా చంద మ్మ భూమి కబ్జా అయింది. ఎలాగైనా తమ ఇంటి ప్లాట్లు తమకు ఇప్పించాలని ధర్మగంటను ఆశ్రయించారు.


# ఆటోడ్రైవర్‌తో రెవెన్యూ ఆట

- తండ్రి భూమిని తనపేరిట పట్టా చేయాలని కోరిన బాధితుడు
- మూడేండ్లుగా తిప్పిన అధికారులు
- మూడున్నర ఎకరాల భూమికిగాను 15 గుంటలకే పట్టా ఇస్తామని మెలిక
- మనస్తాపానికి గురైన ఆటోడ్రైవర్
- చనిపోతున్నానంటూ వాట్సాప్‌లో వీడియో
- ఇంట్లో ఆత్మహత్య లేఖ రాసి పెట్టి అదృశ్యం
- సురక్షితంగా తీసుకువచ్చిన పోలీసులు


**ఉస్మానియా యూనివర్సిటీ:** పెద్దపల్లి జిల్లా పెగడపల్లి గ్రామానికి చెందిన మల్లారెడ్డి తన కుటుంబంతో హైదరాబాద్‌లోని తార్నాకలో ఉంటూ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. మల్లారెడ్డి తండ్రి నారాయణరెడ్డికి పెగడపల్లి గ్రామం సర్వేనంబర్లు 434బీ లో 15 గుంటలు, 68సీ లో 17 గుంటలు, 532బీలో 19 గుంటలు, 530డీలో 34 గుంటలు, 422లో 1.26 ఎకరాల (ఖాతా నంబర్ 4109) భూమి ఉన్నది. మల్లారెడ్డి తండ్రి 1996లో మృతి చెందారు. అనంతరం తనపేరుపై భూమి పట్టా ఇవ్వాలని కోరుతూ మల్లారెడ్డి 2016లో దరఖాస్తు పెట్టుకున్నారు. అధికారుల సూచన మేరకు విరాసత్ కోసం కూడా దరఖాస్తుచేశారు. సూచనలైతే చేశారుకానీ.. అతని పేరిట పట్టా జారీచేసేందుకు మాత్రం అధికారులకు తీరిక లేకుండాపోయింది. మల్లారెడ్డి మూడేండ్లుగా వీఆర్వో, వీఏవోను కలుస్తూనే ఉన్నారు. కానీ పనిమాత్రం కాలేదు. 2017 జూలైలో గ్రామసభ జరిగినప్పుడు అక్కడికి వెళ్లిన మల్లారెడ్డి తన గోడు వెళ్లబోసుకుంటే.. పట్టా ఇస్తామని హామీ ఇచ్చారు. అనంతరం వీఆర్వోను సంప్రదిస్తే తాసిల్దార్ తిరుపతి వెళ్లారని చెప్పారు. తిరుపతి నుంచి వచ్చాక అడిగితే ఇతర పనులు ఉన్నాయని, టైం పడుతుందని పొద్దుపుచ్చారు. అంతేకాకుండా.. సర్వే నంబర్లు 68 సీలో 17 గుంటలు, 532బీలో 19 గుంటలు, 530 డీలో 34 గుంటల భూమిలో వేరొకరు కబ్జాలో ఉన్నారని, దర్యాప్తు చేస్తున్నామని బాంబు పేల్చారు. ఇక సర్వేనంబర్ 422లోని 1.26 ఎకరాల భూమి వేరేవారి పేరిట రిజిస్ట్రేషన్ అయినట్టు చూపారు. వాస్తవానికి మల్లారెడ్డి తండ్రి 1996లో చనిపోయారు. కానీ.. 2013లో ఆ భూమి రిజిస్ట్రేషన్ వేరొకరి పేరిట తన తండ్రి ఎలా చేస్తారు? తమకు తెలియకుండా 1.26 ఎకరాలు ఇతరులకు ఎలా పట్టా అవుతుంది? తన తండ్రి సంతకం ఎలా ఉంటుంది? అని ప్రశ్నించినా సమాధానం చెప్పేవారు కరువయ్యారు. అవన్నీ మాకు తెలియదు.. ప్రస్తుతం 15 గుంటలు మాత్రమే క్లియర్‌గా ఉన్నది.. దానికి మాత్రమే పట్టా చేస్తామని సెలవిచ్చారు.

**మనస్తాపంతో ఇంటినుంచి బయటకు**

అధికారుల తీరుతో విసుగెత్తిపోయిన మల్లారెడ్డి.. ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. తన బాధనంతా వ్యక్తంచేస్తూ సెల్‌ఫోన్‌లో వీడియో తీసి, కొన్ని వాట్సాప్ గ్రూపుల్లో పోస్ట్‌చేశారు. తార్నాకలోని ఇంటినుంచి తన ముగ్గురు పిల్లలు ప్రశాంతి (10), శ్రీవాణి (8), మణికంఠ జ్ఞానేశ్వర్‌రెడ్డి (6)కు చెప్పులు కొనిస్తానని భార్యకు చెప్పి బయటకు వెళ్లిపోయారు. వెళ్లేముందు పెగడపల్లిలో భూమికి పట్టా ఇవ్వడానికి వీఆర్వో, వీఆర్ఏ ఇబ్బంది పెడుతున్నారని, తన తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన భూమిని తనపేరుపై మార్చాలని దరఖాస్తుచేస్తే పట్టించుకోవడంలేదని, అందుకే ఆత్మహత్య చేసుకుంటున్నానని ముఖ్యమంత్రికి ఒక లేఖ రాశారు. తన, తన పిల్లల చావుకు వీఆర్వో, వీఆర్ఏలే కారణమని ఆ లేఖలో పేర్కొన్నారు. తన మరణానంతరం భూమి తన తల్లికి చెందేలా చూడాలని కోరారు. పని నిమిత్తం బయటకు వెళ్లిన మల్లారెడ్డి భార్య ఇంటికి వచ్చి లేఖను చూసి, ఆందోళనతో పోలీసులకు సమాచారం అందించారు. మరోవైపు మల్లారెడ్డి పోస్టుచేసిన వీడియో అప్పటికే వైరల్‌గా మారింది. వెంటనే స్పందించిన పోలీసులు గాలింపు చేపట్టారు. మల్లారెడ్డిని, ఆయన పిల్లలను భువనగిరి వద్ద అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయం మొత్తం మీడియాలో రావడంతో స్పందించిన అధికారులు.. బాధితుడికి ఫోన్‌చేసి.. కార్యాలయానికి వస్తే సమస్య పరిష్కరిస్తామని చెప్పారు.



సీఎం కేసీఆర్‌కు బాధితుడు రాసిన లేఖ



మల్లారెడ్డి తండ్రి నారాయణరెడ్డి పేరిట ఉన్న భూమి పహాణీ

### వీఏవో శంకర్ ఫోన్‌చేసి రమ్మని చెప్పారు

వీఏవో సార్ రమ్మన్నారు. ఎల్లుండి వస్తే పనిచేసిపెడుతామని చెప్పారు. మా నాన్న పేరుపై ఉన్న భూమి మాకు కావాలి. పాస్‌పుస్తకంలో ఎలా ఉందో అలా ఇప్పించాలి. సమగ్ర విచారణ చేసి న్యాయంచేయాలి. మా కుటుంబానికి ఏదైనా జరిగితే మీదే బాధ్యత అని ఎంపీ ఎన్నికలకు ముందు అధికారులకు చెప్పా. ప్రతి నెలా ఫోన్‌చేస్తూనే ఉన్నా. రావాల్సిన అవసరం లేదు.. పని అయిపోతుందని అధికారులు చెప్పారు. ఆ ఫోన్ రికార్డింగ్‌లు కూడా నా వద్ద ఉన్నాయి.

**- మల్లారెడ్డి, బాధితుడు**

### భువనగిరి వద్ద గుర్తించాం

సూసైడ్‌నోట్‌రాసి ఓ వ్యక్తి అదృశ్యమైనట్టు మాకు ఫోన్ వచ్చింది. వివరాలు తెలుసుకొని ఆచూకీ కోసం ప్రయత్నించాం. బాధితుడి ఫోన్ స్విచ్చాఫ్ వచ్చింది. సాయంత్రం సెల్‌ఫోన్ సిగ్నల్ వచ్చింది. భువనగిరి వద్ద మల్లారెడ్డిని, వారి పిల్లలను అదుపులోకి తీసుకున్నాం. వారిని క్షేమంగా పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చాం.

**- రాజశేఖర్‌రెడ్డి, ఓయూ సీఐ**

# పండుటాకుకూ తిప్పలే

- ఫౌతీ కోసం నాలుగేండ్లుగా యత్నం
- ఇప్పటికి రెండుసార్లు అర్జీ పెట్టుకున్నా బుట్టదాఖలు
- 85 ఏండ్ల వృద్ధురాలు తిప్పన జానమ్మ ఆవేదన

**పండుటాకుకూ తాసిల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు తప్పడం లేదు. నాలుగేండ్ల క్రితం భర్త చనిపోవడంతో ఆయన పేరిట ఉన్న భూమిని తనపేర ఫౌతీచేయాలంటూ 85 ఏండ్ల వృద్ధురాలు నాలుగేండ్లుగా తిరుగుతున్నది. తాసిల్దార్‌ను కలిసి రెండుసార్లు అర్జీ పెట్టుకున్నా స్పందన లేకపోవడంతో బాధితురాలు తిప్పన జానమ్మ నమస్తే తెలంగాణ 'ధర్మగంట'ను ఆశ్రయించారు.**

**మిర్యాలగూడ, నమస్తే తెలంగాణ:** నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం ఆలగడప గ్రామ పరిధిలోని క్యాంపు ప్రాంతానికి చెందిన తిప్పన మట్టారెడ్డికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వీరందరికీ పెండ్లిళ్లు అయ్యాయి. మట్టారెడ్డి తనకున్న సాగుభూమిలో కుమారులు, కుమార్తెలకు భాగాలు పంచి ఇచ్చారు. తన భుక్తికోసం ఆలగడప గ్రామ శివారులో సర్వేనంబర్ 579లో 1.09 ఎకరాలు, 795లో 0.35 ఎకరాలు, 64లో 0.03 ఎకరాలు మొత్తం 2.07 ఎకరాలు భూమి తన పేరున ఉంచుకున్నారు. ఈ భూమిని 1993లో అదే గ్రామానికి చెందిన రైతు వద్ద కొనుగోలు చేశాడు. ఇందుకు సంబంధించిన పట్టాదారు పాస్‌పుస్తకం కూడా ఉన్నది. మట్టారెడ్డి 2015 ఏప్రిల్ 6వ తేదీన మృతి చెందారు. తన భర్త పేరున ఉన్న భూమిని తనపేరున మార్చి ఫౌతీచేయాలని కోరుతూ ఆయన భార్య జానమ్మ మిర్యాలగూడ తాసిల్దార్ కార్యాలయంలో అర్జీ పెట్టుకున్నారు. ఈ విషయమై స్థానిక వీఆర్వోకు పలుమార్లు విన్నవించినా స్పందించలేదు. ఆరోగ్యం సహకరించకపోయినప్పటికీ నాలుగేండ్లుగా తాసిల్దార్ కార్యాలయం, అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. అయినా నేటికి ఫౌతీ చేయకపోవడంతో తెలంగాణ ప్రభుత్వం అందించిన నూతన పాస్‌పుస్తకం ఆమెకు అందలేదు. దీంతో రైతుబంధు సాయం కూడా అందడంలేదు.

### భూమి నాపేరచేసి న్యాయంచేయాలి



నా భర్త మట్టారెడ్డి పేర 2.07 ఎకరాల భూమి ఉన్నది. మాకున్న భూమిలో కొడుకులు, కుమార్తెలకు వాటాలు ఇచ్చిన తర్వాత భుక్తికోసం ఆ భూమిని ఉంచుకున్నాం. దీనికి సంబంధించిన పాత పాస్‌పుస్తకం కూడా ఉన్నది. నా భర్త అనారోగ్యంతో 2015లో చనిపోయిండు. ఆ భూమిని నా పేరున ఫౌతీచేయాలని కోరుతూ ఇప్పటికి రెండుసార్లు దరఖాస్తు పెట్టుకున్నా, వీఆర్వో చుట్టూ నాలుగేండ్లుగా తిరుగుతున్నా.. అయినా పట్టించుకుంట లేరు. అధికారులు కనికరించి నాభర్త పేర ఉన్న భూమిని నా పేరున మార్చి న్యాయంచేయాలి.

**- తిప్పన జానమ్మ, ఆలగడప, మిర్యాలగూడ మండలం, నల్లగొండ జిల్లా**

### త్వరలో ఫౌతీచేసి పాస్‌పుస్తకం అందిస్తాం

ఆలగడప గ్రామానికి చెందిన జానమ్మ భర్త మృతిచెందిన అనంతరం అతడి పేరున ఉన్న భూమిని భార్యకు ఫౌతీ చేయాల్సి ఉన్నది. ఇటీవల వరుస ఎన్నికల విధులు ఉండటం వల్ల చేయడం సాధ్యం కాలేదు. ప్రస్తుతం అవి పూర్తి అయ్యాయి. త్వరలో ఫౌతీ అమలుచేసి పాస్‌పుస్తకాలు అందిస్తాం.

**- అజయ్‌కుమార్, వీఆర్వో ఆలగడప**

## మా మాట!

### ధర్మగంటను మరువరు



'నమస్తే తెలంగాణ' చేపట్టిన ధర్మగంటను రైతులు ఎప్పటికీ మరిచిపోరు. భూసమస్యలతో సతమతమవుతున్న రైతులకు ధర్మగంట కొండంత ధైర్యం ఇచ్చి సమస్యలు పరిష్కరించే విధంగా అధికారులపై ఒత్తిడి పెంచింది. అధికారులు రైతుల వద్దకే వచ్చి సమస్యలు తెలుసుకొని పరిష్కరించే విధంగా ధర్మగంట దోహదపడింది.

**- సోమన్న, తొండ, తిరుమలగిరి, సూర్యాపేట జిల్లా**

### ప్రక్షాళనతో రైతులకు మేలు



రెవెన్యూశాఖను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయడం ద్వారా రైతులకు మేలు జరుగుతుంది. చిన్న, సన్నకారు రైతులు రెవెన్యూ సమస్యలతో సతమతమవుతున్నారు. భూసమస్యల పరిష్కారానికి ధర్మగంట దారిచూపింది. దీంతో ప్రభుత్వ పాలనపై ప్రజలకు విశ్వాసం మరింత పెరిగింది. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న భూసమస్యలు ఒక్కొక్కటి పరిష్కారమవుతుండటం శుభపరిణామం.

**- ఊరె జయరాం, మేళ్లచెర్వు, సూర్యాపేట జిల్లా**

### అవినీతి అంతమవుతుంది



సీఎం కేసీఆర్ చేపట్టనున్న రెవెన్యూ ప్రక్షాళన వల్ల ఆ శాఖలో అవినీతి అంతమవుతున్నది. గతంలో తాసిల్దార్ కార్యాలయానికి పనుల కోసం వెళ్తే పైసలు ఇస్తేనే పనులు అయ్యేవి. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. సమస్య అని కార్యాలయానికి వెళ్తే వెంటనే చర్యలు చేపడుతున్నారు. ఇంతమార్పు కేవలం సీఎం కేసీఆర్ తీసుకుంటున్న చర్యలవల్లే సాధ్యమవుతున్నది. రైతుల కోసం ఇంత మంచి పనులుచేస్తున్న సీఎం కేసీఆర్ రైతుల పక్షపాతి అనడంలో ఎటువంటి సందేహం లేదు.

**- నలబోలు లింగారెడ్డి, ఎల్బీనగర్, గరిడేపల్లి మండలం, సూర్యాపేట జిల్లా**


# కోర్టులో కేసున్నా మారిన రికార్డు

కాసుల కోసం రెవెన్యూ అధికారుల కక్కుర్తి ▪ అసైన్డ్ భూమిని ఇతరులకు బదలాయింపు

ఎన్నికల బదిలీకి ముందు మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ అధికారుల చేతివాటం

**సాధారణంగా కోర్టులో కేసుంటే.. ఆ సాకు చూపి భూ వివాదాలను పరిష్కరించకుండా సాగదీయడం రెవెన్యూ అధికారులకు మామూలే. కానీ మహబూబ్‌నగర్ జిల్లాలో అధికారులకు కోరినంత సొమ్ములు ముట్టజెప్తే.. రికార్డుల మార్పిడికి ఎలాంటి కోర్టు కేసులు అడ్డురావు. పైగా ప్రభుత్వం ఇచ్చిన అసైన్డ్ భూమిని ఇతరులకు బదిలీ చేయడం వారికే చెల్లింది. మిడ్జిల్ మండలంలో ఓ రైతుకు ప్రభుత్వం కేటాయించిన భూమిని అతని వారసులు సేద్యం చేసుకుంటుంటే.. కాసులకు కక్కుర్తి పడిన అధికారులు.. మరొకరిపేరిట మార్చడంతో బాధితులు ధర్మగంటను ఆశ్రయించారు.**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలం వేముల శివారు మసిగుండ్లపల్లికి చెందిన కటిక హుస్సేన్‌కు వేముల శివారులో సర్వేనంబర్ 309/20లో 5.33 ఎకరాలను ప్రభుత్వం 1962లో అసైన్ చేసింది. అప్పటినుంచి హుస్సేన్ ఆ భూమిని అనుభవిస్తున్నారు. 1971-72 నుంచి భూమి శిస్తు చెల్లిస్తూవచ్చారు. 1999 జూన్ 18న హుస్సేన్ మృతిచెందారు. అనంతరం ఆయన ముగ్గురు కుమారుల్లో నరేశ్ 1.38 ఎకరాలు, బందాజీ 1.38 ఎకరాలు, రవీందర్ 1.37 ఎకరాల చొప్పున పంచుకొని 2011 జూన్ 30న వాళ్ల పేర్లమీదకు మార్పిడిచేసుకొన్నారు. అప్పటినుంచి ఆ భూమిని వారే అనుభవిస్తున్నారు. ఈ నేపథ్యంలో సర్వే నంబర్ 309/20లో 3.33 ఎకరాలు కటిక శంకర్‌జీ, కటిక లక్ష్మీబాయికి చెందినదని వారి వారసులైన నాగోజీ, నారాయణజీ, ఈశ్వర్‌జీ, శివాజీ 2012లో కోర్టును ఆశ్రయించారు. ఈ భూమిని తమ పేరున బదలాయించాలని అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. దీనిపై కటిక హుస్సేన్ కుమారులు కూడా కోర్టులో కౌంటర్ కేసు వేయడంతో స్టే ఇచ్చింది. దీంతో సర్వేనంబర్ 309/20లోని 5.33 ఎకరాల భూమి యథావిధిగా హుస్సేన్ వారసుల కబ్జాలోనే కొనసాగుతున్నది. ఆన్‌లైన్ రికార్డుల్లోను హుస్సేన్ వారసుల పేరే ఉన్నది. దీనిపై 15-09-2008న రెవెన్యూ అధికారులు కూడా క్షేత్రస్థాయి విచారణ జరిపారు. ఓ పక్క కోర్టులో కేసు ఉండగానే శంకర్‌జీ, లక్ష్మీబాయివారసులు 309/20 సర్వే నంబర్‌లో 3.33 ఎకరాలకు సంబంధించి గిఫ్ట్‌డీడ్ దస్తావేజులతో తమ పేరున పట్టాచేయాలని 10-09-2018న దరఖాస్తు చేసుకున్నారు. అధికారులు రికార్డులు పరిశీలించకుండా.. కోర్టులో కేసును పరిగణనలోకి తీసుకోకుండానే శంకర్‌జీ, లక్ష్మీబాయివారసులకు18-12-2018లో భూమార్పిడి చేసి పహాణీ ఇచ్చేశారు. ఎన్నికల సమయంలో ఎలాగో బదిలీపై వెళ్తాం కాబట్టి ఎవరూ అడగరన్న ధీమాతో తమ భూమిని ఇతరులకు కట్టబెట్టారని కాస్తులో ఉన్న నరేశ్, బందాజీ, రవీందర్ 'ధర్మగంట' వద్ద వాపోయారు.



బాధితులు కటిక బందాజీ, రవీందర్

### రూ.లక్ష లంచం అడిగిన ఆర్డీవో

భూరికార్డులు మాపేరుపైనే కొనసాగించాలంటే రూ.లక్ష ఇవ్వాలని అప్పటి ఆర్డీవో అడిగారు. వీఆర్వో, తాసిల్దార్, రికార్డు అసిస్టెంట్ శంకర్‌జీ, లక్ష్మీబాయివారసుల నుంచి రూ.30 వేలు తీసుకొని రికార్డులు మార్చారు. ఈ అధికారులు బదిలీ కావడానికి మూడురోజుల ముందు ఈ తతంగమంతా జరిగింది. 40 మంది రికార్డులను ఇలానే మార్చేశారు.

**- కటిక నరేశ్**

### రికార్డుల ఆధారంగానే పనిచేశాం

సర్వే నంబర్ 309/20లోని భూమి మార్పు అనేది రికార్డుల ఆధారంగానే చేపట్టాం. లంచం తీసుకున్నామనేది అవాస్తవం. రికార్డుల ఆధారంగా ఆర్డీవో రిపోర్ట్ ప్రకారమే రికార్డులను సరిచేశాం. ప్రస్తుతం అక్కడ పని చేయడం లేదు. రికార్డు చూస్తేనే దాని గురించి పూర్తిగా అర్థమవుతుంది. అసైన్డ్ భూమి బదలాయింపు అన్ని రికార్డులు సక్రమంగా ఉంటేనేచేస్తాం.

**- పాండునాయక్, మిడ్జిల్ గత తాసిల్దార్**


THE SINGARENI COLLIERIES COMPANY LIMITED
(A Government Company)
Regd. Office: Kothagudem Collieries - 507101.

Employment Notification No. 01/2019

For Lateral entry to work at STPP, Jaipur, Mancherial Dist. Telangana State
SCCL is looking for suitable / Experienced persons from Government / Public Sector/ Private Sector for the following posts in its 2 X 600MW Thermal Power Project

| Name of the Posts | No.of. posts |
|---|---|
| General Manager (Operations & Maintenance) | 1 |
| Deputy General Manager (Safety) | 1 |
| Deputy General Manager (Ash Handling Plant) | 1 |
| Superintendent (Analytical) | 1 |

For Details, i.e., experience, age, qualifications, grade, scale of pay etc., Please visit Our SCCL Website http://www.scclmines.com; "Careers" link available on Home page. Please Apply ONLINE w.e.f 07-06-2019. Contact No. 08744-249992

PR/2019-20/PER (CRP)/DRS/26 Chairman & Managing Director



కేంద్ర బడ్జెట్ రూపకల్పన సందర్భంగా ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా ద్వారా తమ విలువైన అభిప్రాయాలు, ఆలోచనలు పంచుకుంటున్న మేధావులకు, ఆర్థికవేత్తలకు, ఔత్సాహికులకు రుణపడి ఉంటాను. వాటిలో నేను కొన్ని చదివాను. మీ సూచనలను నేను మా సిబ్బందితో సమన్వయం చేసుకుంటున్నాను. ప్రతి ఒక్కరి అభిప్రాయం విలువైందే. మరిన్ని సలహాలు, సూచనలు ఇవ్వండి.

**నిర్మలా సీతారామన్, కేంద్ర ఆర్థిక మంత్రి**

దేశంలో నిరుద్యోగ రేటు 6.1 శాతానికి చేరింది. గత 45 ఏండ్లలో ఇంతగా నిరుద్యోగం పెరిగిపోవడం ఇదే తొలిసారి అని కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ విడుదల చేసిన నివేదికలో పేర్కొన్నది. పేదరిక, నిరుద్యోగ బాధితులు పశ్చాత్తాపం పడాల్సిన అవసరం లేదు. సమయం మించిపోయింది. ఎందుకంటే ఇప్పటికే ప్రజలు ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారు. జరిగిన విషయం గురించి బాధపడితే లాభం లేదు.




**మాయావతి, బీఎస్పీ అధినేత్రి**

**చరిత్రలో నేడు**



1654
ఫ్రాన్స్ చక్రవర్తిగా 14వ లూయి.

1983
మొదటిసారి సత్యాగ్రహాన్ని చేపట్టిన గాంధీ.





2001
బ్రిటన్ సార్వత్రిక ఎన్నికల్లో లేబర్ పార్టీ ఘనవిజయం.

శ్రీలంకలో ఈస్టర్ బాంబుదాడుల తర్వాత మెజార్టీ, మైనార్టీ వర్గ ప్రజల మధ్య ఏర్పడిన అగాథం తాజాగా మరింత పెరిగింది. దాడులకు పాల్పడిన ఉగ్రవాదులకు మైనార్టీ వర్గానికి చెందిన ఇద్దరు గవర్నర్లు, ఓ క్యాబినెట్ మంత్రి మద్దతునిచ్చారని మెజార్టీ బౌద్ధుల్లోని అతివాద గ్రూపులు ఆరోపిస్తూ వారిని పదవుల నుంచి తొలగించాలని డిమాండ్ చేయటంతో వారు రాజీనామా చేశారు. ఆ గవర్నర్లకు మద్దతుగా మరో 9 మంది మంత్రులు మూకుమ్మడి రాజీనామా చేయటంతో పరిస్థితి రాజకీయ సంక్షోభానికి దారితీసింది. ఇంత జరిగినా ఉగ్రవాదులను ముందుగానే గుర్తించి అడ్డుకోలేకపోవటం తమ వైఫల్యమేనని ప్రభుత్వం ఇప్పటికీ అంగీకరించకపోవటం గమనార్హం.

**ది హిందూ**

మనదేశంలో ఇటీవల పేమెంట్ ఎకోసిస్టం సుడిగాలిలా ఎగిసింది. ముఖ్యంగా పెద్దనోట్ల రద్దు తర్వాత ఇది మరింత వేగం పుంజుకున్నది. దేశంలో డెబిట్ కార్డులు జారీ 100 కోట్లు దాటింది. అయితే ఇన్ని కార్డులను వాడటానికి దేశంలో రెండు లక్షల ఏటీఎంలు మాత్రమే ఉండటం విధానపరమైన నిదానానికి అడ్డం పడుతున్నది.

**ది టైమ్స్ ఆఫ్ ఇండియా**



# నిరుద్యోగిత రికార్డు

నిరుద్యోగం గత ఐదు దశాబ్దాలలో ఎన్నడూ లేనిస్థాయికి పెరుగడం ప్రమాద ఘంటికలు మోగిస్తున్నది. పట్టణ, గ్రామీణ నిరుద్యోగం పెరిగింది. అన్నిస్థాయిల విద్యా కేటగిరీల్లో నిరుద్యోగం ఎక్కువగానే ఉన్నది. దాదాపు నలభైయేండ్ల పాటు నిలకడగా, పెద్దగా మార్పులేకుండా ఉన్న నిరోద్యోగిత రేటు గత ఏడేండ్లలో గణనీయంగా పెరిగింది. జాతీయ నమూనా సర్వే(ఎన్ఎస్ఎస్ఓ) నిర్వహించిన తేదీ నాటి నుంచి ఏడాది ముందువరకు ఒక వ్యక్తికి ఎన్నిరోజులు పని దొరికిందన్న అంశంపై ఆధారపడి సాధారణ నిరుగ్యోగితను అంచనా వేస్తారు. సర్వే తేదీ నుంచి వారం రోజుల ముందు వరకు ఒక్కరోజైనా పని దొరికిందా లేదా అన్న అంశాన్ని పరిగణనలోకి తీసుకొని తక్షణ నిరుద్యోగితను లెక్కిస్తారు. వాస్తవానికి జూన్ 2018లోనే ఈ నమూనా సర్వే ముగిసింది. నివేదిక ఎన్నికలకు ముందే రావలసింది. నమూనా సర్వే వివరాలను కేంద్ర ప్రభుత్వం దాస్తున్నదన్న విమర్శలు కూడా దేశవ్యాప్తంగా 12,773 గ్రామాలు, పట్టణ యూనిట్లలో నమూనా సర్వే నిర్వహించారు. మొత్తం 1,02,113 నివాసాలను సందర్శించి, 4,33,339 మందిని సంప్రదించారు. నూట ముప్పై కోట్ల జనాభాతో పోల్చి ఈ నమూనా సర్వే చాలా చిన్నది. ఇది నూటికి నూరు శాతం సరైన అంచనా అని చెప్పలేం. దీనిపై గతంలోనూ వివాదాలు నడిచాయి. కానీ నిరుద్యోగితను వివిధ ఆర్థిక పాటవాలను అంచనా వేయడానికి ఇప్పటిదాకా అనుసరిస్తున్న పద్ధతి ఇదే. జాతీయ నిరుద్యోగిత 6.1 శాతానికి చేరడం ఒక రికార్డు. ఆశ్చర్యకరంగా బాగా చదువుకునే 15-29 వయస్సు యువకుల్లోనూ నిరుద్యోగిత చాలా ఎక్కువగా ఉన్నది.

సార్వత్రిక ఎన్నికలు జరిగి నరేంద్ర మోదీ విజయం సాధించి, అధికారాన్ని చేపట్టిన తొలినాళ్లలో ఈ నివేదిక వెలువడటం ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నది. నిరుద్యోగం పెరిగిందని ఎన్నికలకు చాలా ముందునుంచే ప్రతిపక్షాలు ఎన్డీఏ ప్రభుత్వంపై విరుచుకుపడ్డాయి. అయితే ఆ విమర్శలకు సమర్థనగా గణాంకాలతో కూడిన నిర్మాణాత్మక సమాచారం ఏదీ ఇచ్చేవారు కాదు. పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ వంటి చర్యల వల్ల చిన్న పరిశ్రమలు, వ్యాపారాలు మూతపడ్డాయని, లక్షలాది మంది వీధిన పడ్డారని విమర్శలు వచ్చాయి. ఇప్పుడు బయటికివచ్చిన జాతీయ నమూనా సర్వే ఆ విషయాన్ని ధృవీకరించింది. ప్రస్తుత నిరుద్యోగిత నమూనా సర్వే-2012 అంచనాలతో పోల్చితే పురుషుల్లో రెట్టింపుకంటే పెరిగింది. మహిళల్లో రెట్టింపు అయింది. పట్టణ ప్రాంతాల్లో నిరుద్యోగిత గ్రామీణ ప్రాంతాలకంటే చాలా ఎక్కువగా పెరిగింది. పట్టణ ప్రాంతాలలో నిరుద్యోగిత 7.8 శాతానికి పెరుగగా గ్రామీణ ప్రాంతాలలో 5.3 శాతానికి పెరిగింది. సాధారణ నిరుద్యోగిత కంటే తక్షణ నిరుద్యోగిత ఇంకా ఎక్కువగా ఉన్నది. మొత్తంగా తక్షణ నిరుద్యోగిత రేటు 8.9 శాతం. పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ వంటి చర్యలు చిన్న పరిశ్రమలను, వ్యాపారాలను బాగా దెబ్బతీసింది పట్టణ ప్రాంతాలలోనే. ఆర్థిక నియంత్రణ వచ్చిన తర్వాత మార్కెట్లలో ఉదారంగా లభించిన నిధులు ఆవిరైపోయాయి. కేంద్రం తీసుకున్న ఆర్థిక నియంత్రణ చర్యల వల్ల తక్షణ నిరుద్యోగం విపరీతంగా పెరిగింది.

> **ఉపాధి, నైపుణ్యాల పెంపుపై క్యాబినెట్ కమిటీని నియమించడం మోదీ ప్రభుత్వం ఈ దిశగా వేసిన తొలి అడుగు. విచిత్రమేమంటే నిరుద్యోగం పెరిగిపోతున్నదని అధ్యయన నివేదికలు ఘోషిస్తుంటే, మన షేర్ మార్కెట్ మాత్రం కొత్త రికార్డులు సృష్టిస్తున్నది. ఈ రెండూ విపరీతాలే. ఈ విపరీతాల మధ్య ఏమి జరుగుతున్నదో ప్రభుత్వం గుర్తించాలి. స్వచ్ఛంద ఉపాధి రంగం ఎందుకు కుప్పకూలిందో కనిపెట్టాలి. చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, చిన్న వ్యాపారాలు ఎందుకు కునారిల్లిపోతున్నాయో గుర్తించాలి.**

సామాజికవర్గాల వారీగా చూసినా అన్నివర్గాల ప్రజల్లో నిరుద్యోగం సర్వాంతర్యామిలా విస్తరిస్తున్నది. కేంద్ర ప్రభుత్వం నమూనా సర్వే అంచనాలను యథాతథంగా అంగీకరించడం లేదు. వివిధ ఏజెన్సీల అంచనాలతో పోల్చిచూసిన తర్వాతనే వాస్తవికమైన నిరుద్యోగితను నిర్ధారించుకోవలసి ఉంటుందని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పేర్కొంటున్నది. ఎన్పీఎస్, ఈపీఎఫ్ఓ, ఈఎస్ఐసీ, నేషనల్ స్టాటిస్టికల్ కమిషన్ అందించే వివరాలను నమూనా సర్వే వివరాలను పోల్చి చూస్తామని ఆర్థిక మంత్రిత్వశాఖ చెబుతున్నది. కేంద్రం నిరుద్యోగ తీవ్రతను గుర్తించడానికి నిరాకరిస్తున్నట్టు వారి స్పందన తెలియజేస్తున్నది. నమూనా సర్వే వివరాలను బయటపెట్టకుండా ఆపడంలోనూ, ఇప్పుడు వాటిని ఇతర ఏజెన్సీల అంకెలతో పోల్చి చూసి నిర్ధారిస్తామని చెప్పడంలోనూ కేంద్రం అయిష్టతే కనిపిస్తున్నది. కేంద్రానికి ఇష్టం ఉన్నా లేకపోయినా వాస్తవాలు వాస్తవాలు కాకుండాపోవు. అంకెలలో, శాతాలలో తేడాలు రావచ్చు. కానీ పరిస్థితి విషమిస్తున్నదని మాత్రం అర్థమవుతున్నది. ఎన్నికలు, ఫలితాలు అయిపోయి, అధికారం చేతికి వచ్చినందున, ఇప్పుడైనా కేంద్రం వాస్తవాలను స్వీకరించి, దిద్దుబాటు చర్యలు చేపట్టాలి. ఉపాధి, నైపుణ్యాల పెంపుపై క్యాబినెట్ కమిటీని నియమించడం మోదీ ప్రభుత్వం ఈ దిశగా వేసిన తొలి అడుగు. విచిత్రమేమంటే నిరుద్యోగం పెరిగిపోతున్నదని అధ్యయన నివేదికలు ఘోషిస్తుంటే, మన షేర్ మార్కెట్ మాత్రం కొత్త రికార్డులు సృష్టిస్తున్నది. ఈ రెండూ విపరీతాలే. ఈ విపరీతాల మధ్య ఏమి జరుగుతున్నదో ప్రభుత్వం గుర్తించాలి. స్వచ్ఛంద ఉపాధి రంగం ఎందుకు కుప్పకూలిందో కనిపెట్టాలి. చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, చిన్న వ్యాపారాలు ఎందుకు కునారిల్లిపోతున్నాయో గుర్తించాలి. ఇవన్నీ ప్రభుత్వంతో పెద్దగా ప్రమేయం లేకుండా ఉపాధి కల్పించిన పారిశ్రామిక వ్యాపార కార్యకలాపాలు. ఆ రంగాలను పునరుత్తేజం చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించాలి. బాగా చదువుకున్నవారిలోనూ నిరుద్యోగం పెరుగడం ఏ సమాజానికీ మంచిది కాదు. నిరుద్యోగ భూతం నుంచి యువతను విముక్తి చేయడానికి కేంద్రం తక్షణం దీర్ఘకాలిక విధానాన్ని ప్రకటించాలి.

**జనగళం**

### టీఆర్ఎస్‌కు తిరుగులేదు

స్థానిక సంస్థల ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీ విజయ దుందుభి మోగించింది. 32 జడ్పీ స్థానాలను కైవసం చేసుకొని చరిత్ర సృష్టించింది. దీంతోపాటు పెద్దమొత్తంలో ఎంపీటీసీ స్థానాలను కైవసం చేసుకున్నది. ఇటీవల జరిగిన 17వ లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ పార్టీ 4 స్థానాలను కైవసం చేసుకోగా, కాంగ్రెస్ 3 స్థానాలను కైవసం చేసుకున్నది. అయితే రాష్ట్రంలో టీఆర్ఎస్ పార్టీ పతనం మొదలైందన్న విమర్శకులకు స్థానిక సంస్థల ఫలితాలే సమాధానం చెప్పాయి. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలతో లక్షలాది మందికి లబ్ధి జరుగుతున్నది. దాని ఫలితమే స్థానిక సంస్థల్లో టీఆర్ఎస్ పక్షాన గ్రామీణ ప్రాంత ఓటర్లు మద్దతుగా నిలిచారు.

**- అన్నాజి రాజేందర్, కరీంనగర్**

### చెరువు.. ఊరికి ఆదెరువు

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని మిషన్ కాకతీయ పథకం ద్వారా చెరువుల పుడికతీత పనులకు శ్రీకారం చుట్టింది. అయితే ఈ చెరువుల్లో గ్రామీణ ప్రాంతాల ప్రజలు జంతువుల కళేబరాలు, చికెన్ సెంటర్‌లోని వ్యర్థాలను పడవేస్తున్నారు. దీంతో చెరువుల ప్రాంతాల్లో దుర్గంధం వెదజల్లుతున్నది. చెరువు ఊరికి ఆదెరువు. ఈ చెరువులను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రజలదే. కాబట్టి ప్రజలు చెరువులను రక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

**- చుంచు అరుణ్‌కుమార్, వెల్గనూర్, దండేపల్లి, మంచిర్యాల**

### చెక్‌పవర్ ఇయ్యాలె

రాష్ట్రవ్యాప్తంగా గత జనవరిలో సర్పంచి ఎన్నికలు జరిగాయి. ప్రతి గ్రామానికి సర్పంచి ఎన్నిక కాబడినారు. అయితే ఐదు నెలలు గడిచినా ఇంకా సర్పంచ్‌లకు చెక్ పవర్ రాలేదు. గ్రామీణాభివృద్ధిలో సర్పంచ్‌లది కీలక పాత్ర కాబట్టి వెంటనే ప్రభుత్వం సర్పంచ్‌లకు చెక్ పవర్ ఇవ్వాల్సిన అవసరం ఉన్నది. అయితే ఈ చెక్‌పవర్‌ను సర్పంచ్‌లు దుర్వినియోగం కాకుండా చూసుకొని గ్రామాభివృద్ధికి పాటుపడాలి.

**- షేక్ అస్లాం షరీఫ్, శాంతినగర్**

**ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.** editpage@ntnews.com Fax-040-23291118

**విశ్లేషణ**

**డాక్టర్ పారిపెల్లి శంకర్**
**శేఖర్ శర్మ ఏటూరి**

# సమాజమే కేంద్రంగా పరిశోధనలు

**విశ్వవిద్యాలయాల ర్యాంకింగ్‌లలో నెలకొన్న అసహజత్వాన్ని అధిగమించేందుకు టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ ద్వారా సుస్థిరాభివృద్ధి లక్ష్యాలకు అనుబంధంగా రూపుదిద్దుకొన్న విశ్వవిద్యాలయాల శ్రేష్ఠతను గుర్తించే కొత్త నమూనా ఆహ్వానించదగిన పరిణామం.సంప్రదాయ కొలమానాలకు భిన్నంగా ఈ నమూనాను రూపొందించారు. ఇది భారత్ లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాల విశ్వవిద్యాలయాలకు ఒక ప్రేరణగా చెప్పవచ్చు. ఇదే సందర్భంలో భారతదేశ ఉన్నత విద్యాసంస్థల ప్రస్తుత ర్యాంకింగ్ ఫ్రేం వర్క్‌లోనూ తగిన మార్పులు చేయాలి.**

జాతీయ విద్యా విధానం-2019లో గుణాత్మక విద్యను సాధించే లక్ష్యంతో ముసాయిదాను రూపొందించింది. ఇందులో వర్సిటీలకు ఇచ్చే ర్యాంకింగ్‌లను ప్రపంచ విశ్వవిద్యాలయాల ఆర్థిక, సామాజిక ప్రభావశీలతా ర్యాంకింగ్, యునైటెడ్ నేషన్స్ సభ్యదేశాలు ఆమోదించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో విశ్వవిద్యాలయాలు నిర్వహిస్తున్న పాత్ర ఆధారంగా జరుగనున్నది. స్థానిక సమాజం లేదా ప్రాంతం ఎదుర్కొంటున్న సంక్లిష్టమైన ఆర్థిక, సామాజిక, పర్యావరణ సమస్యలకు విశ్వవిద్యాలయాలు స్పందిస్తున్న తీరు, సూచిస్తున్న పరిష్కారాలు ఈ ర్యాంకింగ్‌కు ప్రాతిపదిక కానున్నా యి. భూగ్రహాన్ని అత్యంత సౌకర్యవంతమైన నివాస స్థలంగా మార్చేందుకు, అంతగా ప్రాచుర్యానికి నోచుకోని వందలాది విశ్వవిద్యాలయాలు నిరంతరంగా జరుపుతున్న కృషి, అవి సూచిస్తున్న పరిష్కారాలు ఇక ముందు వెలుగులోకి రానున్నాయి.

పరిశోధన, పేటెంట్లు, ప్రచురణలు, ప్రతిభావంతులైన బోధనా సిబ్బంది, విదేశీ విద్యార్థుల సంఖ్య, అంతర్జాతీయ నోబెల్ బహుమతి గ్రహీతలు వంటి అంశాలు సంప్రదాయ కొలమానాలు. ప్రస్తుతం చైనా నుంచి వెలువడే షాంఘై విశ్వవిద్యాలయాల ర్యాంకింగ్‌కు ఇంగ్లాండ్ నుంచి ప్రచురించబడే క్యు.ఎస్., టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ ర్యాంకింగ్‌లకు కొలమానంగా పరిగణించబడుతున్నాయి. ఆర్థికంగా, మౌలిక సౌకర్యాల పరంగా శక్తివంతమైన కొన్ని విశ్వవిద్యాలయాలకు మాత్రమే సాధ్యపడే పై అంశాల కారణంగా 100 లోపు ర్యాంకు సాధించడం భారత్ లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలకు అందని ద్రాక్ష పండులా మిగిలిపోతున్నది. అత్యంత విశ్వసనీయంగా పరిగణించబడే పై మూడు సంస్థలు వెలువరించే ర్యాంకులు వివిధ దేశాల ఉన్నత విద్యావ్యవస్థల శ్రేష్టతకు కొలమానంగా పరిగణిస్తున్నారు. నేడు ప్రపంచవ్యాప్తంగా దాదాపు అన్నిదేశాల ప్రభుత్వాలు ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాలు 100 లేదా 200లోపు ర్యాంక్ సాధించేందుకు, ఎంపిక చేసుకున్న కొన్ని విద్యాసంస్థలపై నిధుల వర్షాన్ని కురిపిస్తూ వందలాది విశ్వవిద్యాలయాలను నిర్లక్ష్యం చేస్తున్నాయి. ఈ ధోరణి ఉన్నత విద్యావ్యవస్థల్లో సమానత్వానికి భంగం కలిగిస్తున్నది. తీవ్రమైన అసమానతలకు దారితీస్తున్నది. భారతదేశం కూడా ప్రభుత్వరంగంలో 10, ప్రైవేట్‌రంగంలో 10 ఉన్నత విద్యాసంస్థలను ఎంపికచేసి ర్యాంకుల రేసులో నిలిపేందుకు విధాన రూపకల్పనలు చేసింది. ప్రస్తుతానికి ప్రభుత్వరంగంలో మూడు, ప్రైవేట్ రంగంలో మూడు సంస్థల ఎంపిక పూర్తయింది. ఇప్పటివరకు భౌతికంగా మనుగడలో లేని ఎంపిక ఒక కొత్త వివాదానికి తెరతీసింది. కోటాలో ఈ ఎంపిక జరిపినట్లు వివరణ ఎంతవరకు సమర్థనీయమో ఆలోచించాలి.

స్టాన్‌ఫర్డ్, హార్వర్డ్, ఎం.ఐ.టీ., ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్ వంటి ప్రపంచ ప్రఖ్యాత పరిశోధనా విశ్వవిద్యాలయాలు దశాబ్దాలుగా శాస్త్ర, సాంకేతిక రంగాల్లో, మానవీయ శాస్త్రాలలో అద్భుత విజయాలు సాధిస్తున్నాయి. ఫలితంగా పొందుతున్న నోబెల్ బహుమతులు ఇతర ఫీల్డ్ మెడల్స్ ఆ విద్యాలయాల పరిశోధనా పటిమకు నిదర్శనం. అయినప్పటికీ ఈ విజయాలు అధిక మొత్తాల్లో నిధుల వినియోగం ద్వారా మాత్రమే సాధ్యమైంది. ఈ విశ్వవిద్యాలయాలు తమకు గల పేరు ప్రఖ్యాతులు, ఆర్థిక బలం, సానుకూలమైన పరిశోధనా వాతావరణం కారణంగా ప్రపంచస్థాయిలో మేధావులుగా గుర్తించబడిన వారిని ఆకర్షిస్తున్నాయి. వారిని పరిశోధకులుగా, బోధనా సిబ్బందిగా నియమించుకోవడం వల్ల శాస్త్ర, సాంకేతిక రంగాల్లో తిరుగులేని విజయాలను అందుకుంటున్నాయి. దీంతపాటు విశ్వవిద్యాలయాల ర్యాంకింగ్‌లలో అగ్రస్థానాలలో నిలబడగలుగుతున్నాయి.

ఇదే సందర్భంలో అంతగా ప్రఖ్యాతిగాంచని, తక్కువస్థాయిలో ఆర్థిక వనరులు కలిగిన వివిధ దేశాల్లోని వందలాది విశ్వవిద్యాలయాలు నోబెల్ బహుమతిస్థాయి పరిశోధనా విజయాలు సాధించాయి. అయినప్పటికీ స్థానిక ప్రజల జీవితాలను మార్చగలిగిన అనేక అద్భుతమైన కార్యక్రమాలు నిర్వహించాయి. అవి సాధిస్తున్న విజయాలు గుర్తింపునకు నోచుకోవడం లేదు. ఉప సహారా ఆఫ్రికాలోని కొన్ని విశ్వవిద్యాలయాలు అత్యంత నైపుణ్యం గల నర్సులను అభివృద్ధి చేసి సమాజానికి అందించాయి. దీనిద్వారా స్థానిక ప్రజల ఆరోగ్యస్థితిలో గణనీయమైన మార్పు తీసుకొని రాగలిగాయి. భారత్‌లోని కొన్ని విశ్వవిద్యాలయాలు తీవ్రవాదానికి వ్యతిరేకంగా అటవీ ప్రాంతాలలోని గిరిజన తెగలను చైతన్యపరుచడంలో విజయం సాధిస్తున్నాయి. ఫిన్లాండ్ విశ్వవిద్యాలయాలు వృత్తి నిబద్ధత, గుణాత్మకతతో కూడిన ఉపాధ్యాయ వ్యవస్థను నిర్మించాయి. దీనిద్వారా ఆ దేశం ప్రపంచంలోనే ఉత్తమ విద్యావ్యవస్థగా నిలిచింది. తెలంగాణ ప్రజల చిరకాల స్వప్నం తెలంగాణ రాష్ట్ర సాధన. ఈ ఉద్యమంలో ఉస్మానియా, కాకతీయ విశ్వవిద్యాలయాలు గణనీయమైన పాత్రను పోషించాయి. ఈ విధంగా అనేక సాధారణ స్థాయి విశ్వవిద్యాలయాలు సంప్రదాయ పరిమితులకు అతీతంగా లింగవివక్ష, వాతావరణ శాస్త్రం, క్లీన్ ఎనర్జీ, సానిటేషన్, జబ్బులను ఎదుర్కొవడం వంటి అనేక భిన్నమైన సమస్యల సాధనకు నిరంతరం కృషి చేస్తున్నాయి. ఈ సేవలను గుర్తించాల్సిన అవసరం ఉన్నది.

> **ఉన్నత విద్యా సంస్థలలో శ్రేష్ఠత కంటే, సమత్వం అత్యంత ముఖ్యమని ప్రభుత్వాలు గుర్తించాలి. అంటే అన్ని విశ్వవిద్యాలయాలు కనీస విద్యా ప్రమాణాలను మౌలిక వసతులను కలిగి విద్యార్థులందరికీ ఏ విధమైన వివక్ష లేకుండా సమాన విద్యావకాశాలను కల్పించాలి. సమత్వం లేని శ్రేష్ఠత విద్యావ్యవస్థలో తీవ్ర అసమానతలకు దారితీస్తుంది. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకు అనుబంధంగా ర్యాంకింగ్ ఫ్రేంవర్క్‌ను రూపొందించుకొని విద్యాసంస్థల ర్యాంకింగ్‌ను ప్రతి ఏడాదికి బదులు నాలుగు లేదా ఐదేండ్లకోసారి స్వతంత్ర సంస్థలచే నిర్వహించాలి.**

విశ్వవిద్యాలయాల ర్యాంకింగ్‌లలో నెలకొన్న అసహజత్వాన్ని అధిగమించేందుకు టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ ద్వారా సుస్థిరాభివృద్ధి లక్ష్యాలకు అనుబంధంగా రూపుదిద్దుకొన్న విశ్వవిద్యాలయాల శ్రేష్ఠతను గుర్తించే కొత్త నమూనా ఆహ్వానించదగిన పరిణామం. సంప్రదాయ కొలమానాలకు భిన్నంగా ఈ నమూనాను రూపొందించారు. ఇది భారత్ లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాల విశ్వవిద్యాలయాలకు ఒక ప్రేరణగా చెప్పవచ్చు. ఇదే సందర్భంలో భారతదేశ ఉన్నత విద్యాసంస్థల ప్రస్తుత ర్యాంకింగ్ ఫ్రేం వర్క్‌లోనూ తగిన మార్పులు చేయాలి.

జాతీయస్థాయిలో విద్యాసంస్థల ర్యాంకింగ్ ద్వారా ఉన్నత విద్యలో గుణాత్మకతను పెంచే ఉద్దేశంతో 2015లో జాతీయ ఉన్నత విద్యాసంస్థల ర్యాంకింగ్ ఫ్రేం వర్క్‌ను ప్రారంభించింది. బోధన అభ్యసన వనరులు, పరిశోధనా ఉత్పన్నాలు, పట్టభద్రత పర్యవసానాలు, సంలీనత, చేరువ పరిధి, విద్యాసంస్థపై ప్రజల దృష్టికోణం వంటి అంశాల ఆధారంగా విద్యాసంస్థలకు ర్యాంకులు ఇవ్వబడతాయి. కేవలం గణాంకాల ఆధారంగా లెక్కించదగిన పై అంశాలు విశ్వవిద్యాలయాల వాస్తవ లక్ష్యాలను, క్రియాపరత్వాన్ని సూచించడం లేదనేది ఒక వాదన. ఉన్నత శ్రేణి ఉద్యోగార్హత నైపుణ్యాలు, వ్యవస్థాపకత సామాజిక మూలధన నిర్మాణం, మానవీయ విలువల పెంపుదల, జీవితకాల అభ్యసనం వంటి అంశాలు పరిగణనలో లేకపోవడం శోచనీయం. 2016 నుంచి ప్రతి సంవత్సరం ప్రకటిస్తున్న ఈ ర్యాంకులలో కేంద్రం ప్రభుత్వం నుంచి అధిక మొత్తాలలో నిధులు పొందుతూ, మెరుగైన మౌలిక వసతులుగల కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఉన్నత విద్యాసంస్థలు, విశ్వవిద్యాలయాలు ఉత్తమ ర్యాంకులు పొందుతున్నాయి. నిధులు, మౌలిక సౌకర్యాల కొరతతో ఇబ్బందులు పడుతున్న పాలమూరు, శాతవాహన, మహాత్మాగాంధీ వంటి విశ్వవిద్యాలయాలను కేంద్రీయ విశ్వవిద్యాలయాల జతన చేర్చి ర్యాంకులు తీయడం ఎంతవరకు సమంజసమో ప్రభుత్వాలు ఆలోచించాలి. రాష్ట్ర ప్రభుత్వాలలోని ఉన్నత విద్యాసంస్థలు సింహభాగం విద్యార్థులు నమోదును కలిగి ఉన్నప్పటికీ, యూజీసీ బడ్జెట్లో దాదాపు 65 శాతం నిధులు కేంద్ర ప్రభుత్వ ఉన్నత విద్యాసంస్థలకు కేవలం 35 శాతం నిధులు రాష్ట్రాల ఆధ్వర్యంలోని విద్యాసంస్థలకు కేటాయించడం ఫెడరల్ స్ఫూర్తికి విఘాతం కలిగించడమే.

ఉన్నత విద్యా సంస్థలలో శ్రేష్ఠత కంటే, సమత్వం అత్యంత ముఖ్య మని ప్రభుత్వాలు గుర్తించాలి. అంటే అన్ని విశ్వవిద్యాలయాలు కనీస విద్యా ప్రమాణాలను మౌలిక వసతులను కలిగి విద్యార్థులందరికీ ఏ విధమైన వివక్ష లేకుండా సమాన విద్యావకాశాలను కల్పించాలి. సమత్వం లేని శ్రేష్ఠత విద్యావ్యవస్థలో తీవ్ర అసమానతలకు దారితీస్తుంది. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకు అనుబంధంగా ర్యాంకింగ్ ఫ్రేంవర్క్‌ను రూపొందించుకొని విద్యాసంస్థల ర్యాంకింగ్‌ను ప్రతి ఏడాదికి బదులు నాలుగు లేదా ఐదేండ్లకోసారి స్వతంత్ర సంస్థలచే నిర్వహించాలి. యునైటెడ్ నేషన్స్ సభ్యదేశాలు 2030 వరకు సాధించాల్సిన విస్తృత విద్యా లక్ష్యం 'సమత్వం, సమ్మిళితం, గుణాత్మకతతో కూడిన విద్య అందరికీ జీవితకాల అభ్యసనావకాశాలను ప్రోత్సహించడం సాకారమయ్యే దిశలో భారతదేశ ఉన్న త విద్యా ర్యాంకింగ్ ప్రక్రియ కొనసాగుతుందని ఆశిద్దాం.

# సంస్కరణలే శ్రీరామరక్ష

**రెవెన్యూ**



**మ్యాకం రవికుమార్**

**'పూటకు అన్నం దొరికితే చాలని పొలం పచ్చగా ఉండాలని..**
**నటరాజునకు మొక్కిన ఆ బీదవాని కష్టానికి**
**కటాక్షించెను ఆ బోళాశంకరుడు కానీ**
**నటనతో, మాటలతో మాయచేసే ఆ రెవెన్యూ అధికారుల**
**లూటీలో భూమిని కోల్పోయి, ఆ భువిలో కలిసిపోయేనతడు.'**

నా వాట్సప్‌కు వచ్చిన వ్యాఖ్యలివి. చదువగానే అధికార యంత్రాంగం ఎంతగా అవినీతి మయమైందో అర్థమైనా అది అందరికీ తెలిసిందే కదా అనుకొని వదిలేశాను. అయితే కొద్దిరోజులుగా 'నమస్తే తెలంగాణ' ధర్మగంట పేరుతో రోజువారీగా ప్రచురితమవుతున్న కథనాలను చదువుతుంటే తెలుస్తున్నది పరిస్థితి ఎంతగా దిగజారిపోయిందో? మరీ ముఖ్యంగా రెవెన్యూ వ్యవస్థ ఎంతగా పతమైనందో? ఆ వాట్సప్ సందేశంలో గూడుకట్టుకున్న మనోవ్యథ. ప్రకృతి ఒడిదొడుకులను తట్టుకుంటూ.. దళారీ వ్యవస్థను దాటుకుంటూ.. లాభనష్టాలను బేరీజు వేసుకోకుండా ఆ నేలతల్లినే నమ్ముకున్న వ్యక్తి ఎన్నితిప్పలు పడుతున్నడో బోధపడుతున్నది. తన భూమిపైన తనకే హక్కులేక ఎంతటి మానసిక క్షోభను అనుభవిస్తున్న డో తెలుస్తుంటే హృదయం ద్రవించిపోతున్నది. అంతేనా రెవెన్యూ వ్యవస్థలోని లోపాలు, కొంతమంది అధికారుల ధనదాహం, నిర్లక్ష్యం వెరసి ఎన్ని జీవితాలు ఛిన్నాభిన్నమవుతున్నాయో కళ్లకు కడుతున్నది. అది వ్యక్తికేగాక మొత్తం సామాజిక వ్యవస్థను ఏ స్థాయిలో ప్రభావితం చేస్తున్నదో, కుటుంబ సంబంధాలను ఎంతలా విచ్ఛిన్నం చేస్తున్నదో విశదీకరిస్తున్నది. వాటికి ముగింపు పలుకాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని తేటతెల్లం చేస్తున్నది. అందుకే మొదట రెవెన్యూ వ్యవస్థలో వేళ్లూనుకున్న అవినీతికి బీజం ఎక్కడుంది? అడ్డూ అదుపూ లేకుండా అది ఎందుకు అవిచ్ఛిన్నంగా విస్తరిస్తున్నది? అనే అంశాలను విశ్లేషిద్దాం.

ఇక్కడ మనం తొలుత భూమికి, మనిషికి మధ్యనున్న అవినాభావ సంబంధం తెలుసుకోవాలి. మట్టిపై మనిషికుండే నెనరును ఆకళింపు చేసుకోవాలి. ఏ వ్యక్తయినా కూడు, గూడు, గుడ్డ కోసమే తాపత్రయపడుతాడు. వాటికోసం సమస్త జీవితాన్ని ధారపోస్తాడు. ఆ మూడింటికీ కావాల్సింది భూమే. నేలంటే ఒక నిండు జీవితం, బతుకుపై నమ్మకం, భద్రత, సామాజిక గౌరవం. దానికోసం మనిషి ఎంతకైనా తెగిస్తాడు. ప్రాణాలను తృణప్రాయంగా అర్పిస్తాడు. అందుకు చరిత్రలో ఉదాహరణలు కోకొల్లలు. తెలంగాణ సాయుధ పోరాటమే ఒక నిలువెత్తు నిదర్శనం. ఆ కాలం మారింది కదా అనుకుంటే పొరపాటే. ప్రస్తుతం ప్రతిదీ వ్యాపారమయమవుతున్న ఆధునిక సమాజంలోనూ పెట్టుబడి మూలధనంగా, అన్నింటికంటే లాభదాయకమై, కచ్చితమైన రాబడిగల మారక వస్తువుగా ఆ భూమే చలామణి అవుతున్నది. ఎవుసం కుంటుపడినా, ఫలసాయం రాకున్నా భూమి రేటు రెట్టింపుస్థాయిలో పెరుగడమే ఇక్కడ గమనార్హం. ఇక్కడ మరొక అంశం భూమికీ, మనిషికీ బంధం సజీవమైంది. పుట్టిన తర్వాత మొదలై, కన్ను మూసేదాకా కొనసాగుతుంది. వ్యక్తులు మారుతుంటారు. కానీ, భూమి అలాగే ఉంటుంది. కేవలం చేతులు మాత్రమే మారుతుంది. వీటన్నింటినీ అవగతం చేసుకున్నప్పుడే ఆ అంశాలపై అవగాహన ఉన్నప్పుడే.. ఆ కోణంలో చూసినప్పుడే మట్టి కోసం మనిషి పడే తండ్లాట, అది తనకు దక్కకుండా చేజారిపోతున్నదనే క్షణంలో గురయ్యే మానసిక క్షోభ అర్థమవుతుంది. అంతటి ప్రాధాన్యం కలిగి ఉన్న భూమికి సంబంధించిన రికార్డులు పారదర్శకంగా లేకపోవడం, యజమానుల హక్కులకు భద్రత కరువవడం, క్రయవిక్రయాలు సజావుగా సాగకపోవడం, పారదర్శకత లోపించడం, అంతులేని అవినీతికి తావుండటం, అధికారుల నిర్లక్ష్యం దాగి ఉండటం శోచనీయం.

వృత్తిదారుల నుంచే కొంతమంది వ్యవసాయదారులు పుట్టుకొచ్చారు. కానీ వారికి తమ చేతుల్లోకి వచ్చిన భూమికి సంబంధించి హక్కుపత్రాలు మాత్రం రాలేదు. వాటితో వారికి అంత అవసరమూ ఏర్పడలే దు. అందుకోసం ప్రయత్నించనూ లేదు. కారణం క్రయవిక్రయాలన్నీ సాదాబైనామాల ద్వారానే సాగాయి. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన భూరికార్డుల ప్రక్షాళన సందర్భంగా సుమారు 12 లక్షల దరఖాస్తు లు కేవలం సాదాబైనామాకు చెందినవే కావడం గమనార్హం. వారసత్వంగా భూములు ఒకతరం నుంచి మరొక తరానికి బదిలీ అవుతూ వచ్చాయి. ఉమ్మడి కుటుంబ వ్యవస్థకు బీటలు వారడంతో ఉన్న చిన్న కమతాలు మరింత చిన్నవిగా మారిపోయాయి. ఇక్కడే భూసమస్యలకు బీజం పడింది. తెలంగాణ ప్రాంతంలో 1936లో తెలంగాణలో భూమి సెటిల్‌మెంట్ సర్వే చేయించారు. గ్రామ నక్షలను రూపొందించారు. ఆ తర్వాత ఇప్పటికీ ఆ దిశగా ఏ ప్రభుత్వమూ మారిన పరిస్థితులకు అనుగుణంగా పాలన, రెవెన్యూ విధానాలను మార్చేందుకు ముందుకుపోలేదు. ఆ తర్వాతి కాలంలో తీసుకొచ్చిన రికార్డ్స్ ఆఫ్ రైట్స్ 1971 (ఆర్ఓఆర్) చట్టం, రెవెన్యూ అధికారుల లంచగొండితనం, నిర్లక్ష్యంతో ఉన్న సమస్యలు మరింత జటిలమయ్యా యి. కబ్జాలో ఒకరుంటారు, సర్వే నంబర్‌లో వేరొకరి పేరుంటుంది, క్షేత్రస్థాయిలో అక్కడ మరొకరి భూమి ఉంటుంది. ఇలాంటి సమస్యలు అనేకం.

> **వృత్తిదారుల నుంచే కొంతమంది వ్యవసాయదారులు పుట్టుకొచ్చారు. కానీ వారికి తమ చేతుల్లోకి వచ్చిన భూమికి సంబంధించి హక్కుపత్రాలు మాత్రం రాలేదు. వాటితో వారికి అంత అవసరమూ ఏర్పడలేదు. అందుకోసం ప్రయత్నించనూ లేదు. కారణం క్రయవిక్రయాలన్నీ సాదాబైనామాల ద్వారానే సాగాయి. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన భూ రికార్డుల ప్రక్షాళన సందర్భంగా సుమారు 12 లక్షల దరఖాస్తులు కేవలం సాదాబైనామాకు చెందినవే కావడం గమనార్హం.**

ఇక పట్టణాల సంగతికి వస్తే ఈ ఏడు దశాబ్దాల కాలంలోనే తెలంగాణలో అనేక గ్రామాలు పట్టణాలుగా, నగరాలుగా, మహానగరాలుగా విస్తరించాయి. వాటిని ఆనుకొని ఉన్న అనేక వ్యవసాయ భూములు ప్లాట్లుగా, రియల్ ఎస్టేట్ వెంచర్లుగా రూపాంతరం చెందాయి. అయితే అక్కడా దశాబ్దాల కాలం కిందట నాటి రెవెన్యూ వ్యవస్థ, పట్టణ ప్రణాళికలే అమలవుతుండటం గమనార్హం. ఫలితంగా పట్టణాలు అనేక భూకబ్జాలకు ఆలవాలంగా నిలుస్తున్నాయి. మరోవైపు అడుగడుగునా లోపాలతో కూడిన వ్యవస్థను ఆసరాగా చేసుకొని అధికారులు అవినీతికి తెరలేపారు. నేడు భూ రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, ఇంటి పర్మిషన్, నల్లా కనెక్షన్ ఇలా ప్రతిదానికీ ప్రతిచోటా చేతులు తడుపాల్సిన దుస్థితి నెలకొన్నది.

మరి ఈ భూ సమస్యలకు అంతెక్కడ? వాటిని పరిష్కరించేదెట్లా? భూ హక్కులకు భద్రత కల్పించేదెట్లా? అన్నవి ఇప్పుడు మనముందున్న ప్రశ్నలు. అందుకు సామాన్యులు మొదలు మేధావుల వరకూ చెబుతున్న సమాధానం ఒక్కటే. అది రెవెన్యూ వ్యవస్థ ప్రక్షాళన. సంస్కరణలతో అది సాధ్యం. కాలం చెల్లిన విధానాలకు, కోరలు లేని చట్టాలకు స్వస్తి పలుకాలన్నదే అందరి వాదన. మారిన భౌగోళిక, సామాజిక పరిస్థితులకు అనుగుణంగా పెరిగిన నూతన సాంకేతికత పరిజ్ఞానాన్ని ఆలంబనగా చేసుకొని సరికొత్త వ్యవస్థకు ప్రాణం పోయాలి. పారదర్శకతను పెంచాలన్నదే ప్రతి ఒక్కరీ అభిప్రాయం. అప్పుడే భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. అదే తెలంగాణ ప్రభుత్వం ఆశయం. అదే భూ హక్కులకు శాశ్వత భరోసా. భవిష్యత్ తెలంగాణకు శ్రీరామ రక్ష.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.

# కన్నుల పండువగా విగ్రహ ప్రతిష్ఠాపన

- త్రిదండి చినజీయర్ స్వామి పర్యవేక్షణలో పూజలు



వరంగల్ రూరల్ జిల్లా ఆత్మకూరులోని వేణుగోపాలస్వామి ఆలయంలో కల్యాణం జరిపిస్తున్న త్రిదండి రామానుజ చినజీయర్‌స్వామి

**ఆత్మకూరు:** వరంగల్ రూరల్ జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలోని శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయంలో త్రిదండి రామానుజ చిన జీయర్‌స్వామి ఆధ్వర్యంలో జీర్ణోద్ధరణ పునఃప్రతిష్ఠాపన సంప్రోక్ష కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. సీతాలక్ష్మణ హనుమాత్సమేత శ్రీరామచంద్రస్వామి, శ్రీఅండాళ్ ఆళ్వార్ ఆచార్య, శ్రీఅంజనేయ, శ్రీరుక్మిణి సత్యభామాసమేత శ్రీవేణుగోపాలస్వామి విగ్రహాలను చినజీయర్‌స్వామి ప్రతిష్ఠించి ప్రత్యేకపూజలు చేశారు. ధ్వజస్తంభ, విమానశిఖర కలశ ప్రతిష్ఠను కూడా చిన్న జీయర్‌స్వామి పర్యవేక్షణలో నిర్వహించారు. అనంతరం రుక్మిణి సత్యభామా సమేత వేణుగోపాలస్వామి కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్న జీయర్‌స్వామి మాట్లాడుతూ.. పురాతన దేవాలయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని చెప్పారు. ప్రతి ఒక్కరూ భక్తి భావంతో పాటు, సేవభావాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డికూడా పాల్గొన్నారు.

# పగలు ఎండలు.. సాయంత్రం వానలు

అత్యధికంగా ఆదిలాబాద్‌లో 46.3 డిగ్రీలు నమోదు

నేడు అక్కడక్కడ వర్షాలు ▪ రానున్న మూడు రోజులు మళ్లీ వడగాడ్పులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో విచిత్ర పరిస్థితి నెలకొన్నది. పగలు ఎండలు దంచికొడుతుండగా సాయంత్రం అక్కడక్కడ వర్షాలు పడుతున్నాయి. గురువారం కూడా ఇలాంటి పరిస్థితే ఎదురైంది. అత్యధికంగా ఆదిలాబాద్‌లో 46.3 డిగ్రీలు, నిజామాబాద్‌లో 45.3 డిగ్రీలు, ఖమ్మంలో 43డిగ్రీలు, రామగుండంలో 44.2 డిగ్రీలు, మహబూబ్‌నగర్‌లో 42 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వడదెబ్బతో రాష్ట్రంలో 11 మంది మరణించారు. ఒక్క కరీంనగర్ జిల్లాలోనే నలుగురు మరణించగా, ఆదిలాబాద్, జనగామ, ఖమ్మం, సిద్దిపేట, మంచిర్యాల, పెద్దపల్లి, ములుగు జిల్లాల్లో ఒక్కొక్కరు చొప్పున వడదెబ్బతో ప్రాణాలు కోల్పోయారు.

**నేడు పలుచోట్ల వర్షాలు..**

క్యూములోనింబస్ మేఘాల ప్రభావంతో రాష్ట్రంలోని పలుచోట్ల శుక్రవారం ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారి రాజారావు తెలిపారు. శనివారం నుంచి మూడు రోజుల పాటు మళ్లీ ఎండల తీవ్రత పెరిగే అవకాశం ఉన్నట్టు పేర్కొన్నారు. వచ్చే మూడు రోజుల పాటు వడగాడ్పులు వీచే అవకాశం ఉన్నదని, అందరు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

## గ్రేటర్ హైదరాబాద్‌లో 41.8 డిగ్రీలు

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** గ్రేటర్ హైదరాబాద్‌లో గురువారం 41.8 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. మధ్యాహ్నం తరువాత గాలిలో తేమ 57 శాతంగా నమోదైనట్టు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. అధిక ఉష్ణోగ్రతలకు తోడు తేమ శాతం పెరగడంతో సాయంత్రం 5.30 నుంచి 6గంటల మధ్య గ్రేటర్ హైదరాబాద్‌లోని పలుచోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిశాయి.

**నేడు గ్రేటర్‌లో వర్ష సూచన**

శుక్రవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు గ్రేటర్ హైదరాబాద్‌లోని పలుచోట్ల క్యూములోనింబస్ మేఘాల ప్రభావంతో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశాలున్నట్టు వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.



# జోరు వాన

బీభత్సం సృష్టించిన గాలిదుమారం.. యాదాద్రి జిల్లాలో గోడ కూలి ఒకరి దుర్మరణం

పిడుగుపాటుకు నారాయణపేట జిల్లాలో తండ్రీకొడుకులు. వికారాబాద్ జిల్లాలో ఓ రైతు మృతి

నల్లగొండ జిల్లాలో ఆరు మేకలు సజీవదహనం ▪ పలుచోట్ల కూలిన చెట్లు, ఎగిరిపోయిన ఇంటి పైకప్పులు

నల్లగొండ, ఖమ్మం జిల్లాల్లో వడగండ్లు ▪ ఈసీ నదిలో పెరిగిన నీటి ప్రవాహం



నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలం తూర్పుబాయిగూడెంలో పిడుగు పడటంతో దగ్ధమవుతున్న తాటి చెట్లు

**నమస్తే తెలంగాణ నెట్‌వర్క్:** ఉపరితల ఆవర్తన ప్రభావంతో గురువారం సాయంత్రం తొమ్మి ది జిల్లాల్లో వర్షం కురిసింది. గ్రేటర్ హైదరాబాద్, నారాయణపేట జిల్లాల్లో మాత్రం చిరు జల్లులు కురవగా మిగతా జిల్లాల్లో వర్షం దంచి కొట్టింది. ఈదురు గాలులు, ఉరుములు మెరుపులతో కూడిన వర్షం పడింది. అక్కడక్కడ పిడుగులు పడ్డాయి. నారాయణపేట జిల్లా మక్తల్‌లో పిడుగుపాటుకు తండ్రీకొడుకులు, వికారాబాద్ జిల్లాలో ఓ రైతు మృతి చెందగా, ఇద్దరు గాయపడ్డారు. నల్లగొండ జిల్లాలో పిడుగుపాటుకు ఆరు మేకలు సజీవదహనం కాగా పలు తాటిచెట్లు దగ్ధమయ్యాయి. ఇదే జిల్లా అడ్లూర్ గ్రామంలో పిడుగుపడగా ఓ ఇల్లు పూర్తిగా దహనమైంది. ఆ సమయంలో ఆ ఇంట్లోని వారు గ్రామంలోని విందుకు వెళ్లడంతో ప్రాణాలతో బయటపడ్డారు. యాదాద్రి జిల్లాలో గోడ కూలగా ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. రంగారెడ్డి జిల్లా పరిధిలోని ఈసీ వాగుకు వరద ప్రవాహం పెరిగింది. నల్లగొండ, ఖమ్మం జిల్లాల్లో వడగండ్లు పడ్డాయి.

**నల్లగొండ జిల్లాలో వడగండ్ల వాన..**

నల్లగొండ జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వాన కురిసిం ది. రాళ్లవానతో మునుగోడు మండలంలోని పలు ప్రాంతాల్లో పెంకుల, రేకుల ఇండ్లు దెబ్బతిన్నాయి. కొరటికల్ గ్రామంలో మేకల దొడ్డిపై పిడుగుపడటంతో అందులోని ఆరు మేకలు సజీవదహనమయ్యాయి. కట్టంగూర్ మండ లం తూర్పుబాయిగూడెంలో తాటిచెట్టుపై పిడుగుపడటంతో మంటలు వ్యాపించి పలు తాటిచెట్లు దగ్ధమయ్యాయి. అడవిదేవులపల్లి, శాలిగౌరారం, మాడ్గులపల్లి మండలాల్లోనూ ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వాన పడింది. నల్లగొండ, తిప్పర్తి, నాగార్జునసాగర్, తిపురారం, నిడమనూరు, కట్టంగూరు, కేతేపల్లి, నకిరేకల్‌లో ఈదురు గాలులతో కూడిన ఓ మోస్తరు వర్షం కురిసింది. సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులు, గాలి దుమారంతోపాటు వర్షం కురిసింది. సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఏకధాటిగా గంటన్నరపాటు భారీ వర్షం కురవగా జిల్లా వ్యాప్తంగా ఓ మోస్తరు నుంచి చిరుజల్లులు పడ్డాయి.

**ఖమ్మం జిల్లాలో భారీ వర్షం..**

ఖమ్మం నగరంతోపాటు జిల్లాలోని పలు మండలాల్లో భారీ వర్షం కురిసింది. ఖమ్మం నగరంలోని మయూరి సెంటర్, బస్టాండ్ సెంటర్, కమాన్ బజార్, త్రీటౌన్ ప్రాంతంలోని పీఎస్‌ఆర్ రోడ్ తోపాటు ఆయా కాలనీల్లోకి వరదనీరు వచ్చి చేరింది. ఖమ్మం నగరంతోపాటు శివారు మండలాలు ఖమ్మం రూరల్, రఘునాథపాలెం, కూసుమంచి తదితర మండలాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. రఘునాథపాలెం మండలంలో రాళ్ల వర్షం కురిసింది.



రంగారెడ్డి జిల్లా షాబాద్ మండల పరిధిలో ఉధృతంగా ప్రవహిస్తున్న ఈసీ నది

**భద్రాద్రిలో..**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లావ్యాప్తంగా గురువారం ఈదురుగాలులతో కూడిన వర్షం పడింది. ఉదయం ఆరు గంటలకే ప్రారంభమైన ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షానికి వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. సాయంత్రం కూడా జిల్లా కేంద్రంతోపాటు పలు మండలాల్లో ఈదురు గాలులు వీచాయి. దీంతో విద్యుత్ సరఫరాకు కొంత అంతరాయం ఏర్పడింది. కొత్తగూడెం, పినపాక, ఇల్లెందు, భద్రాచలం, అశ్వారావుపేటలో వర్షం కురిసింది.

**వికారాబాద్ జిల్లాలో ఒకరు మృతి..**

వికారాబాద్ జిల్లా యాలాల మండలం సంగెం కుర్దులో పిడుగుపాటుకు ఒకరు మృతి చెందగా, ఇద్దరికి గాయాలయ్యాయి. నల్ల రాంచందర్, భార్య లావణ్య, మరో మహిళ సావిత్రి పొలంలో పనులు చేస్తుండగా గాలివాన రావడంతో చెట్టు కిందకు వెళ్లారు. అదే చెట్టుపై పిడుగు పడటంతో రాంచందర్ అక్కడికక్కడే మృతిచెందగా అతని భార్యతోపాటు మరో మహిళకు గాయాలయ్యాయి. తాండూరు పట్టణంతోపాటు మండలంలో ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వాన కురవగా, పెద్దేముల్ మండలంలో ఓ మోస్తరు వర్షం కురిసింది. మరోవైపు పరిగి మండలం ఎర్రగడ్డపల్లి వద్ద చెట్టు రోడ్డుపై పడిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వికారాబాద్‌తో పాటు, కొడంగల్, దౌల్తాబాద్, బొంరాసుపేట్ మండలాల్లో భారీ వర్షం కురిసింది.

**ఈసీ నదిలోకి వరద ప్రవాహం..**

రంగారెడ్డి జిల్లా పరిగి, పూడూరు ప్రాంతాల్లో గురువారం కురిసిన భారీ వర్షానికి ఈసీ నది ఉధృతంగా ప్రవహిస్తున్నది. షాబాద్ మండలం నాగరగూడ, చేవెళ్ల మండలం దేవరంపల్లి గ్రామాలను తాకుతూ ఉన్న ఈసీ నది ఉధృతంగా పారుతున్నది. వర్షాకాలం ప్రారంభంలోనే ఈసీ వాగు ప్రవహించడంతో వాగుకు ఇరువైపులా ఉన్న రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కడ్తాల్, కందుకూరు, మహేశ్వరం పాంతాల్లో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం ధన్నూర్(బీ) ప్రాంతంలో బుధవారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. కుచ్లాపూర్-ధన్నూర్(బీ) గ్రామాల మధ్య లో విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో 13 గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

**గ్రేటర్ హైదరాబాద్‌లో జల్లులు..**

గ్రేటర్ హైదరాబాద్‌లో సాయంత్రం జల్లులు పడ్డాయి. బంజారాహిల్స్, ఖైరతాబాద్, మాసబ్‌ట్యాంక్, మెహిదీపట్నం, రాజేంద్రనగర్, నాంపల్లి, అమీర్‌పేట, సికింద్రాబాద్, ఉప్పల్ తదితర ప్రాంతాల్లో తేలికపాటి వర్షం కురిసింది.



యాదగిరిగుట్ట మండలం గొల్లగుడిసెలు గ్రామంలో ఈదురుగాలులకు కూలిన కోళ్లఫారం షెడ్డు.(ఇన్‌సెట్‌లో) శిథిలాల కింద నలిగిన గొర్ల శ్రీను

## కూలిన గోడ.. వ్యక్తి మృతి

యాదాద్రి భువనగిరి జిల్లాలో ఈదురు గాలులతో కురిసిన వర్షానికి ఓ వ్యక్తి బలయ్యాడు. యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం గొల్లగుడిసెలు గ్రామానికి చెందిన గొర్ల శ్రీను (35) గ్రామశివారులో సాయం త్రం 4గంటల సమయంలో గొర్లను మేపుతుండగా ఈదురుగాలులతో కూడిన వర్షం మొదలైంది. తలదాచుకునేందుకు కూతురు, కొడుకుతో కలిసి కోళ్ల ఫారంలో వెళ్లారు. ఇందులో ఉంటే ప్రమాదమని చెప్పి కొడుకు, కూతురిని బయటకు పంపించాడు. వానకు గొర్లు ఎటైనా వెళ్తున్నాయా? అని చూసేందుకు షెడ్డు గోడ ఎక్కగా బలమైన గాలు వీయడంతో కిందపడిపోయాడు. అదే సమయంలో షెడ్డుకు గల పాతగోడ కూలింది. షెడ్డు భీములు, గోడ మొత్తం అతని మీద పడిపోవడంతో శ్రీను అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. శ్రీను మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా దవాఖానకు తరలించారు. మరోవైపు యాదగిరిగుట్ట, ఆత్మకూర్(ఎం), వలిగొండ, భువనగిరి మండలాల్లో ఈదురుగాలులకు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. రామన్నపేటలో నీర్నెంల, వలిగొండ మండలం నర్సాపురం, అరూరులో పలువురి ఇండ్ల పైకప్పులు లేచిపోయాయి. అడ్డగూరు, మోత్కూరులో ఓ మోస్తరు వర్షం కురిసింది.

## ప్రాణాలు నిలిపిన పెండ్లి వేడుక

- పిడుగుపాటుకు ఇల్లు దగ్ధం
- తప్పించుకున్న నలుగురు

**శాలిగౌరారం:** పిడుగుపాటుకు ఓ ఇల్లు దగ్ధం కాగా ఆ సమయంలో సదరు కుటుంబ సభ్యులు పెండ్లి వేడుకకు వెళ్లడంతో ప్రాణాలతో బయట పడ్డారు. ఈ ఘటన నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం అడ్లూర్‌లో గురువారం సాయంత్రం చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అడ్లూర్ గ్రామానికి చెందిన తీర్పాటి యాదగిరి కుటుంబం గ్రామ శివారులోని ఇంట్లో నివాసం ఉంటున్నది. గురువారం సాయంత్రం గ్రామంలో వర్షం కురవగా ఉరుములు, మెరుపులతో ఒక్కసారిగా యాదిగిరి ఇంటిపై పిడుగుపడింది. దీంతో అతని ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఇంట్లోని సామగ్రితోపాటు బంగారు ఆభరణాలు కూడా అగ్నికి ఆహుతయ్యాయి. ఆ సమయంలో యాదగిరితోపాటు అతని భార్య, ఇద్దరు పిల్లలు గ్రామంలో జరుగుతున్న తమ బంధువుల పెండ్లి విందుకు వెళ్లడంతో ప్రాణాలతో బయటపడ్డారు. ఈ ప్రమాదంలో రూ.2 లక్షల వరకు ఆస్తినష్టం జరిగినట్టు బాధితుడు వాపోయాడు.



సూర్యాపేటలోని ప్రధాన రహదారిపై నిలిచిన వరద నీరు



కొత్తగూడెంలో వర్షం కురవడంతో అండర్ బ్రిడ్జిలో నిలిచిన నీరు

## పిడుగుపాటుకు తండ్రీకొడుకులు దుర్మరణం

నారాయణపేట జిల్లా మక్తల్ మండలం మంథన్‌గోడ్ గురువారం రాత్రి పిడుగుపాటుకు తండ్రీకొడుకులు దుర్మరణం చెందారు. గ్రామానికి చెందిన నర్సిం లు(38), తన కొడుకు సుధీర్ (8)తో కలిసి గురువారం సాయంత్రం తమ పొలానికి వెళ్లగా వర్షం మొదలైంది. వీరున్న చోట ఉరుములు మెరుపులతో పిడుగు పడటంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. పొలానికి వెళ్లిన వారు ఇంటికి తిరిగి రాకపోవడంతో అనుమానం వచ్చిన నర్సింలు భార్య శంకరమ్మ తమ బంధువులతో కలిసి పొలానికి వెళ్లి చూడగా ఇద్దరు విగత జీవులుగా పడి ఉన్నారు.



నిర్మల్ జిల్లాలోని బాసర జ్ఞానసరస్వతీ ఆలయాన్ని మాజీ మంత్రి నాయిని నరసింహారెడ్డి కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. బాసరకు చేరుకున్న ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికారు. ఆలయంలోప్రత్యేక పూజలు నిర్వహించి తన మనుమడు సాత్విక్, మనుమరాలు సాన్వికి పండితులచే అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం నాయిని నర్సింహారెడ్డికి ఆలయ ఈవో వినోద్‌రెడ్డి తీర్థప్రసాదాలు అందజేశారు. - బాసర



తెలంగాణ పోలీస్ షీ టీమ్స్ బ్రాండ్ అంబాసిడర్, టేబుల్ టెన్నీస్ క్రీడాకారిణి నైనాజైస్వాల్ గురువారం కుటుంబ సమేతంగా ఏపీలోని శ్రీశైలక్షేత్రాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు ఆలయ అధికారులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. - శ్రీశైలం

# యువత పుస్తకపఠనాన్ని అలవర్చుకోవాలి

- నమస్తే తెలంగాణ డిప్యూటీ ఎడిటర్ వేణుగోపాలస్వామి
- ములకనూరు గ్రంథాలయం, నమస్తే తెలంగాణ సంయుక్త ఆధ్వర్యంలో కథల పోటీలు



వరంగల్ అర్బన్ జిల్లా ములకనూరు గ్రంథాలయంలో మాట్లాడుతున్న నమస్తే తెలంగాణ డిప్యూటీ ఎడిటర్ వేణుగోపాలస్వామి. చిత్రంలో ఫీచర్స్ ఎడిటర్ నగేశ్ బీరెడ్డి

**భీమదేవరపల్లి (వరంగల్ అర్బన్):** పుస్తకం హస్త భూషణమని 'నమస్తే తెలంగాణ' డిప్యూటీ ఎడిటర్ వేణుగోపాలస్వామి పేర్కొన్నారు. ప్రస్తుతం అరచేతిలోకి స్మార్ట్‌ఫోన్ రావడంతో యువతకు పుస్తకాలపై ఆసక్తి తగ్గిందన్నారు. యువత పుస్తకపఠనాన్ని అలవర్చుకోవాలని సూచించారు. గురువారం వరంగల్ అర్బన్ జిల్లా ములకనూరు ప్రజా గ్రంథాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ములకనూరు ప్రజాగ్రంథాలయం, నమస్తే తెలంగాణ దినపత్రిక సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టనున్న కథల పోటీల వివరాలు ప్రకటించారు. ఈ సందర్భంగా వేణుగోపాలస్వామి మాట్లాడుతూ.. గ్రంథాలయాలు ప్రజలను సన్మార్గం వైపు తీసుకెళ్లాయని చెప్పారు. ఆధునిక హంగులతో ములుకనూరు ప్రజాగ్రంథాలయాన్ని నిర్మించడం అభినందనీయమని.. మిగిలిన గ్రామాలు ఇదే తరహాలో గ్రంథాలయాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నమస్తే తెలంగాణ, ములుకనూరు ప్రజా గ్రంథాలయం సంయుక్తంగా నిర్వహిస్తున్న కథల పోటీలు నూతన ఒరవడికి శ్రీకారం చుడతాయని నమస్తే తెలంగాణ ఫీచర్స్ ఎడిటర్ నగేశ్ బీరెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి, చరిత్ర, సమకాలిన జీవన వైవిధ్యాలు, వైరుధ్యాల నేపథ్యంలో కథలు ఉండాలన్నారు. కథల పోటీలకు సంబంధించిన పూర్తి వివరాలు ఈనెల 9న వచ్చే 'బతుకమ్మ' మాగజైన్‌లో వెల్లడిస్తామన్నారు. కథలను బతికించి భవిష్యత్తు తరాలకు అందించేందుకు ములుకనూరు ప్రజాగ్రంథాలయం వేదిక కావడం చారిత్రక ఘట్టమని స్టాంపులు, రిజిస్ట్రేషన్లశాఖ జాయింట్ ఇన్‌స్పెక్టర్ జనరల్ వేముల శ్రీనివాసులు పేర్కొన్నారు. అనంతరం నమస్తే తెలంగాణ డిప్యూటీ ఎడిటర్ వేణుగోపాలస్వామి, ఫీచర్స్ ఎడిటర్ నగేశ్ బీరెడ్డిని సన్మానించారు.

# వ్యక్తి దారుణ హత్య




శ్రీను(ఫైల్)

**వేములపల్లి :** నల్లగొండ జిల్లా వేములపల్లి మండలం సల్కునూరులో బుధవారం రాత్రి ఓ వ్యక్తి దారుణహత్యకు గురయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన తుపాకుల శ్రీను (42)కు 20 ఏండ్ల క్రితం వివాహమైంది. కాగా ఆరునెలలకే అతడిని భార్య వదిలేసింది. ఈ క్రమంలో శ్రీను వివిధ ప్రాంతాలు తిరుగుతూ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం గ్రామానికి వచ్చిన శ్రీను రాత్రి స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ఉన్న బండరాయిపై నిద్రించాడు. కాగా అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు మెడపై మారణాముధంతో దాడి చేసి హత్య చేశారు. గురువారం ఉదయం గమనించిన గ్రామస్థులు పోలీసులకు సమాచారమందించారు. మిర్యాలగూడ సీఐ రమేశ్‌బాబు ఘటనా స్థలికి చేరుకొని వివరాలు సేకరించారు.

## బందీగా ఉన్న నా భర్తను ఇంటికి చేర్చండి

పోలీసులకు భార్య మొర



తన భర్తను స్వగ్రామానికి తీసుకురావాలని పోలీసులను కోరుతున్న అంజమ్మ

**ఊట్కూర్:** ఉత్తరప్రదేశ్‌లోని ఓ దాబా యజమాని వద్ద బందీగా ఉన్న తన భర్తను క్షేమంగా ఇంటికి తీసుకురావాలని నారాయణపేట మండలం ఎర్గట్‌పల్లికి చెందిన చాపలి అంజమ్మ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్గట్‌పల్లికి చెందిన పెద్దయ్య రెండున్నర ఏండ్ల కిందట ఉపాధి కోసం కుటుంబంతో కలిసి హైదరాబాద్‌కు వెళ్లాడు. అక్కడి నుంచి భార్యాపిల్లలకు చెప్పకుండా ఉత్తరప్రదేశ్‌కు వెళ్లాడు. తర్వాత అతడి ఆచూకీ కోసం కుటుంబసభ్యులు గాలించినా దొరకలేదు. కాగా రెండ్రోజుల కిందట విహారయాత్రకు వెళ్లిన మక్తల్ మండలం నర్సిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన బంధువులకు ఉత్తరప్రదేశ్‌లోని బల్వంత్‌పూర్ వద్ద ఓ దాబాలో పెద్దయ్య పాచి పనులు చేస్తూ కనిపించాడు. గుర్తుపట్టిన బంధువులు పెద్దయ్యను స్వగ్రామానికి పంపాలని దాబా యజమానిని కోరగా.. అందుకు అతడు నిరాకరించారు. ఈ విషయాన్ని అతని భార్య అంజమ్మకు ఫోన్‌లో తెలిపారు. దీంతో ఆమె తన భర్తను స్వగ్రామానికి తీసుకురావాలని పోలీసులను ఆశ్రయించారు.

## ఫెన్సింగ్ తీగల్లో ఇరుక్కొని వ్యక్తి మృతి

**ఐనవోలు (వరంగల్ అర్బన్):** వరంగల్ అర్బన్ జిల్లా ఐనవోలు మండలం నందనం గ్రామంలో ఫెన్సింగ్ తీగల్లో ఇరుక్కొని ఓ వ్యక్తి మృతిచెందాడు. నందనం గ్రామానికి చెందిన ఎండీ యాకూబ్(45) మంగళవారం మధ్యాహ్నం తన గ్రామసమీపంలోని కక్కిరాలపల్లిలో ఉంటున్న అక్కబావ ఇంటికి కాలినడకన బయలుదేరాడు. ఈ క్రమంలో పొలాల మధ్యనుంచి నడుచుకుంటూ వెళ్తుండగా ఓ రైతు జామాయిల్ తోటకు ఏర్పాటు చేసిన కంచెలో కాలు ఇరుక్కున్నది. ఎవరూ గమనించకపోవడంతో ఎండతీవ్రతకు అస్వస్థతకు గురై మృతి చెందాడు. గురువారం ఉదయం తోటకాపరి గమనించి పోలీసులకు సమాచారమందించాడు.

### ఎండతీవ్రతకు

# ఐదువేల కోళ్ల మృత్యువాత



జనగామ జిల్లా లక్ష్మాపూర్‌లో ఎండ వేడిమిని తట్టుకోలేక మృత్యువాతపడ్డ కోడి పిల్లలు

**బచ్చన్నపేట:** ఎండ తీవ్రతను తట్టుకోలేక జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం లక్ష్మాపూర్‌లో గురువారం సుమారు ఐదువేల కోడి పిల్లలు మృత్యువాతపడ్డాయి. లక్ష్మాపూర్‌కు చెందిన నూకల రమేశ్‌రెడ్డి ఉపాధి నిమిత్తం గ్రామంలో బ్రాయిలర్ కోళ్ల ఫారం ఏర్పాటు చేసుకున్నాడు. ప్రస్తు తం అందులో 10 వేల కోడి పిల్లలను పెంచుతున్నాడు. అయితే బుధవారం ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో అస్వస్థతకు గురై గురువారం ఐదు వేల కోడి పిల్లలు మృత్యువాత పడటంతో రూ.5 లక్షల మేర నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయారు.

# అక్కాచెల్లెలు అదృశ్యం



సంధ్య



మౌనిక

**నస్రుల్లాబాద్ :** కామారెడ్డి జిల్లా నస్రుల్లాబాద్ మండలంలోని బొమ్మన్‌దేవ్ పల్లి గ్రామానికి చెందిన కుర్మ సంధ్య (15), మౌనిక(12) అనే బాలికలు అదృశ్యమయినట్టు నస్రుల్లాబాద్ ఎస్సై సందీప్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 3న రాత్రి ఇంట్లో తల్లితో కలిసి పడుకున్న బాలికలు ఉదయం కనిపించలేదు. చుట్టుపక్కల గ్రామాల్లో, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో బాలికల తల్లి సాయవ్వ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై దర్యాప్తు జరుపుతున్నారు.

# తల్లి మందలించడంతో..

- ఇంటర్ విద్యార్థిని బలవన్మరణం

**కోరుట్ల:** జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం నాగులపేటలో గురువారం ఓ ఇంటర్ విద్యార్థిని ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగులపేటకు చెందిన రాజారెడ్డి, లక్ష్మి దంపతులకు నలుగురు కూతుర్లు.. రాజారెడ్డి ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లాడు. ఇద్దరు కూతుర్ల వివాహం చేయగా మూడో కూతురు రుచిత (16) ఇంటర్మీడియట్ మొదటి ఏడాది పూర్తిచేసింది. ఇటీవల విడుదలైన ఫలితాల్లో తక్కు వ మార్కులు రావడంతో ఇంప్రూమెంట్ కోసం చదువుతున్నది. ఈ సారైన మార్కుల శాతం పెంచుకోవాలని తల్లి మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన రుచిత ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# అమెరికా నుంచి తైవాన్ ఆయుధాల కొనుగోలు

200 కోట్ల డాలర్ల ఒప్పందం

తైవాన్ తీరుపై చైనా ఆగ్రహం



**తైపై, జూన్ 6:** అమెరికా నుంచి యుద్ధ ట్యాంకులు, క్షిపణుల కొనుగోలు కోసం తాము ప్రతిపాదనలు చేసినట్లు తైవాన్ గురువారం ధ్రువీకరించింది. అయితే తైవాన్ చర్యపై చైనా ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ మేరకు తమ అసమ్మతి తెలియజేసింది. 108 ఎం1 ఏ2 అబ్రమ్స్ ప్రధాన యుద్ధ ట్యాంకులు, 250 స్టింగర్ యాంటీ క్రాఫ్ట్ మిస్సైళ్ల కొనుగోలు కోసం అమెరికాను ప్రాథమికంగా కోరినట్లు తైవాన్ పేర్కొంది. వీటి విలువ 200 కోట్ల డాలర్లు ఉంటుందని తెలిపింది. మరోవైపు అమెరికా నుంచి తైవాన్ ఆయుధాల కొనుగోలు ప్రక్రియ తీవ్ర ఆందోళనకరమని చైనా తెలిపింది. చైనా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి గెంగ్ షువాంగ్ గురువారం మీడియాతో మాట్లాడుతూ.. 'చైనాలో తైవాన్ భాగం అన్న సంగతిని అర్థం చేసుకోవాలని అమెరికాకు పదేపదే వివరించాం. అయితే తైవాన్‌కు ఆయుధాలు విక్రయించాలన్న అమెరికా నిర్ణయం సాధారణ పరిస్థితిని ధ్వంసం చేస్తుంది' అని చెప్పారు. తైవాన్‌లో స్వాతంత్ర్యం కోసం జరిగిన అంతర్యుద్ధం 1949 వరకు సాగినా.. తైవాన్ తమ దేశంలో అంతర్భాగమేనని, తప్పనిసరైతే సైనిక చర్య జరిపైనా తమలో కలిపేసుకోవాలని చైనా భావిస్తున్నది. ఇందులో భాగంగా 2016లో తైవాన్ అధ్యక్షుడిగా ట్సాంగ్‌ఇంగ్‌వెన్ ఎన్నికైనప్పటి నుంచి దౌత్యపరంగా, సైనిక పరంగా ఒత్తిడి తెస్తున్నది. ప్రారంభంలో తైవాన్‌లోనూ చైనా సైనిక విన్యాసాలు జరిపింది. అయితే తైవాన్‌ను కొన్ని దేశాలు గుర్తించడంతో చైనా తన సైనిక విన్యాసాల నిర్వహణను తగ్గించి వేసింది. 1979లోనే తైవాన్‌ను ఒక దేశంగా గుర్తించిన అమెరికా.. చైనాతో ద్వైపాక్షిక సంబంధాలు దెబ్బ తినకుండా ఉండేందుకు అది అనధికారికం అని పేర్కొంది.

## గుజరాత్‌లో భూ ప్రకంపనలు

**అహ్మదాబాద్:** గుజరాత్‌లోని పలు ప్రాంతాల్లో బుధవారం రాత్రి 10.30 గంటలకు భూమి కంపించింది. అహ్మదాబాద్, సబర్‌కాంత, బనస్కాంత, అరవల్లి, అంబాజీ జిల్లాల పరిధిలో పలు చోట్ల భూ ప్రకంపనలు సంభవించాయి. దీంతో ప్రజలు భయభ్రాంతులకు గురై బయటకు పరుగులు తీశారు. రిక్టర్ స్కేల్‌పై భూకంప ప్రభావం 4.0గా నమోదైంది. బనస్కాంత జిల్లాలోని పలంపూర్ పట్టణానికి ఈశాన్య దిశలో 31 కి.మీ. దూరంలో భూకంప కేంద్రం కేంద్రీకృతమైందని భూకంపాల పరిశోధన సంస్థ (ఐఎస్‌ఆర్) తెలిపింది. ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించలేదని అధికారులు తెలిపారు.

# దవాఖానలో 85 హత్యలు!

జర్మన్ కిల్లర్ నర్స్‌కు జీవితఖైదు



నీల్స్ హెగెల్

**ఓల్డెన్‌బర్గ్:** తన సంరక్షణలో ఉన్న 85 మంది రోగులను దారుణంగా హత్య చేసిన సీరియల్ కిల్లర్ నర్స్‌కు జర్మనీలోని కోర్టు జీవితఖైదు విధించింది. నీల్స్ హెగెల్ అనే పురుష నర్సు సాగించిన ఈ మారణహోమం ఊహకు కూడా అందని దారుణమని న్యాయమూర్తి సెబాస్టియన్ బూహెర్మన్ వ్యాఖ్యానించారు. రోగులకు విషపు ఇంజెక్షన్లు ఇవ్వడం ద్వారా 2000-2005 మధ్య నిందితుడు ఈ దారుణాలకు పాల్పడ్డాడు. చావు అంచుల నుంచి రోగిని బతికించడం కోసం తన నైపుణ్యాన్ని ప్రదర్శించాలన్న కోరికతో హెగెల్.. రోగుల ప్రాణాలతో ఆటలాడుకున్నాడు. ఈప్రయత్నంలో చాలా సందర్భాల్లో విఫలమయ్యాడు. ఇప్పటికే అతడు దశాబ్ద కాలంపాటు జైలు జీవితం అనుభవించాడు. తాజాగా మరో ఆరు హత్య కేసుల్లో అతడికి జీవితఖైదు పడింది. హెగెల్ బాధితుల సంఖ్య 200కు పైగానే ఉండే అవకాశం ఉందని పోలీసులు అనుమానిస్తున్నారు. అయితే చాలా మంది బాధితులను శవపరీక్షకు ముందే సమాధి చేయడం, హెగెల్ మతిమరుపు కారణంగా ఈ సంఖ్యపై కోర్టు ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. హెగెల్ చేతిలో మరణించిన వారిసంఖ్య.. ఊహకు అందని విధంగా ఉందని ఓల్డెన్ బర్గ్ ప్రాంతీయ కోర్టు న్యాయమూర్తి బూహెర్మన్ పేర్కొన్నారు.

## లోక్‌సభ డిప్యూటీ స్పీకర్ పదవికి శివసేన పట్టు!


**ముంబయి:** లోక్‌సభ డిప్యూటీ స్పీకర్ పదవిని తమ పార్టీకే కేటాయించాలని బీజేపీ మిత్రపక్షం శివసేన కోరింది. ఇది తమ డిమాండ్ కాదని, తమ పార్టీ హక్కని.. మోదీ నేతృత్వంలోని ప్రభుత్వంపై తమకు వ్యతిరేకత లేదని శివసేన అధ్యక్షుడు ఉద్ధవ్‌ఠాక్రే తెలిపారు. 'డిప్యూటీ స్పీకర్ పదవిని ఆశించే అంశం.. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ-శివసేన పొత్తుపై ప్రభావం చూపదు' అని ఆయన తెలిపారు. 'డిప్యూటీ స్పీకర్ పదవిని ఆశిస్తున్నట్టు బీజేపీకి తెలియజేశాం' అని శివసేన అధికార ప్రతినిధి సంజయ్‌రావత్ పేర్కొన్నారు. రామమందిర నిర్మాణంలో శివసేన చిత్తశుద్ధిని తెలియజేయడంలో భాగంగా.. ఠాక్రే సహా 18మంది పార్టీ ఎంపీలు వచ్చేవారం అయోధ్యలో పర్యటిస్తారని తెలిపారు.



## లోటు బడ్జెట్‌లోనూ
# దీటుగా ఎదుర్కొంటాం

మా శక్తిసామర్థ్యాలను తక్కువగా అంచనా వేయొద్దు

భారత్‌కు పాక్ ఆర్మీ చీఫ్ బజ్వా పరోక్ష హెచ్చరిక



**ఇస్లామాబాద్:** లోటు బడ్జెట్‌లోనూ సరిహద్దు సవాళ్లను దీటుగా ఎదుర్కొంటామని పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ జనరల్ కమర్ జావిద్ బజ్వా స్పష్టం చేశారు. తమ శక్తిసామర్థ్యాలను తక్కువగా అంచనా వేయవద్దని భారత్‌ను పరోక్షంగా ఆయన హెచ్చరించారు. బుధవారం భారత సరిహద్దులోని నియంత్రణ రేఖ వద్ద విధులు నిర్వహిస్తున్న పాక్ జవాన్లతో కలిసి ఆయన ఈద్‌ను జరుపుకున్నారు. ఇలాంటి ముఖ్యమైన పండగ రోజున జవాన్లు తమ కుటుంబాలకు దూరంగా, మాతృదేశ రక్షణకు విధుల్లో ఉండటం గర్వకారణమన్నారు. పాక్ ఆర్థిక సంక్షోభం నేపథ్యంలో రక్షణ బడ్జెట్‌లో కోత విధుంచుకుంటామని సైన్యం బుధవారం స్వచ్ఛందంగా ప్రకటించిన నేపథ్యంలో జనరల్ బజ్వా మాట్లాడారు. బడ్జెట్‌లో ఈ ఏడాది కోత ఉన్నప్పటికీ ఆర్మీ శక్తిసామర్థ్యాలపై ఎలాంటి ప్రభావం ఉండబోదన్నారు. దేశ మిలిటరీ పనితీరుపై దీని ప్రభావం ఏమాత్రం ఉండబోదన్నారు. గత ఏడాది బడ్జెట్‌తోనే ఎలాంటి పరిస్థితులనైనా దీటుగా ఎదుర్కొంటామన్నారు. అయితే వేతన పెంపు రద్దు నిర్ణయం కేవలం అధికారులకు మాత్రమేనని జవాన్లకు ఇది వర్తించదని బజ్వా స్పష్టం చేశారు. బడ్జెట్‌లో కోత నేపథ్యంలో ఖర్చులను నియంత్రించుకుంటామని ఆయన వివరించారు. 2018లో పాకిస్థాన్ రక్షణ వ్యయం 1140 కోట్ల అమెరికా డాలర్లు (రూ.78,946 కోట్లు). ప్రపంచ వ్యాప్తంగా రక్షణ వ్యయంలో పాక్ 20వ దేశంగా ఉందని స్టాక్‌హోమ్‌కు చెందిన అంతర్జాతీయ శాంతి పరిశోధక సంస్థ ఈ ఏడాది ఏప్రిల్‌లో విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. కాగా దేశ ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో పాక్ సైన్యం స్వచ్ఛందగా రక్షణ బడ్జెట్‌ను తగ్గించుకోవడాన్ని పాక్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ స్వాగతించారు. దేశం పలు రక్షణ సవాళ్లను ఎదుర్కొంటున్న తరుణంలో ఈ నిర్ణయం తీసుకున్న పాక్ మిలిటరీకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. బడ్జెట్‌లో కోతతో మిగిలే నిధులను కొత్త గిరిజన ప్రాంతాలు, బలూచిస్థాన్ అభివృద్ధికి వినియోగిస్తామని ఇమ్రాన్ ఖాన్ వివరించారు.

# ముదిరిన విభేదాలు

- పంజాబ్ సీఎం అమరీందర్, సిద్ధూ మధ్య వర్గపోరు తీవ్రం
- సిద్ధూ శాఖలు మార్చిన సీఎం



అమరీందర్ సింగ్



నవ్‌జోత్ సింగ్ సిద్ధూ

**చండీగఢ్, జూన్ 6:** పంజాబ్ సీఎం అమరీందర్ సింగ్, ఆ రాష్ట్ర మంత్రి నవ్‌జోత్ సింగ్ సిద్ధూ మధ్య వర్గపోరు ముదిరింది. తాజాగా జరిగిన మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో సిద్ధూ శాఖలను అమరీందర్ మార్చారు. ఇప్పటి వరకు సిద్ధూ వద్ద ఉన్న స్థానిక సంస్థలు, పర్యాటకం, సాంస్కృతికం శాఖలను తొలిగించి విద్యుత్, ఇంధన పునరుత్పాదక శాఖలను కేటాయించారు. ఈ మార్పులు జరుగడానికి ముందు జరిగిన క్యాబినెట్ సమావేశానికి సిద్ధూ గైర్హాజరయ్యారు. దీంతో క్యాబినెట్ భేటీ జరిగిన కాసేపటికే సిద్ధూ శాఖలను అమరీందర్ మార్చారు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల సందర్భంగా పట్టణ ప్రాంతాల్లో కాంగ్రెస్ అనుకున్నన్ని ఓట్లను సాధించలేకపోయిందని, ఈ నేపథ్యంలో సిద్ధూ నిర్వహిస్తున్న స్థానిక సంస్థల శాఖను మారుస్తానని కొద్దిరోజులుగా సీఎం అమరీందర్ చెబుతున్నారు. దీంతో తీవ్ర అసంతృప్తితో ఉన్న సిద్ధూ క్యాబినెట్ భేటీకి గైర్హాజరైనట్లు తెలుస్తున్నది. సిద్ధూ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల సందర్భంగా సీఎం తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించానని, పంజాబ్‌లో కాంగ్రెస్ ఘన విజయం సాధించడంలో పట్టణ ప్రాంతాలు కీలకపాత్ర పోషించాయని చెప్పారు. 'క్రికెటర్‌గా, కామెంటేటర్‌గా, టీవీ షోలలో వ్యాఖ్యాతగా 40 ఏండ్లు పనిచేసి మంచి పేరు తెచ్చుకున్నాను. అమరీందర్‌ను ఎల్లప్పుడూ నా కంటే పెద్దవాడిగానే చూశాను. ఆయన ఏం చెప్పిన వింటాను. కానీ నా శాఖ ఇప్పుడు ఒంటిరిగా మారిపోయింది. సీఎం అమరీందర్ ఏదైనా చెప్పాలనుకుంటే నన్ను పిలిచి మాట్లాడొచ్చు. కానీ లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ పనితీరుకు నన్ను నిందించడం బాధగా ఉన్నది' అని తెలిపారు. మరో మంత్రి సుఖ్‌జిందర్ సింగ్ మాట్లాడుతూ ఓ వైపు క్యాబినెట్ సమావేశం జరుగుతుంటే.. మరోవైపు సిద్ధూ విలేకరుల సమావేశం నిర్వహించడం బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని చెప్పారు. పంజాబ్‌లో 13 లోక్‌సభ స్థానాలు ఉండగా అందులో కాంగ్రెస్ 8, శిరోమణి అకాలీదళ్, బీజేపీ కూటమి 4, ఆమ్ ఆద్మీ పార్టీ ఒకచోట గెలుపొందిన విషయం తెలిసిందే.

# గాలింపునకు చీకటి అడ్డంకి!

ఒక్క విమానంతోనే ఏఎన్-32 సెర్చ్ ఆపరేషన్

పొగ రావడం చూశామన్న స్థానికులు.. ధ్రువీకరించని అధికారులు



**న్యూఢిల్లీ, జూన్ 6:** భారత వాయుసేన(ఐఏఎఫ్)కు చెందిన ఏఎన్-32 విమానం ఆచూకీ ఇంతవరకూ తెలియలేదు. దాని ఆచూకీ కనుగొనే ఆపరేషన్‌కు వెలుతురు సమస్యైంది. దట్టమైన అడవి, ప్రతికూల వాతావరణం, చీకటి వల్ల ఏఎన్-32 విమానం ఆచూకీ కోసం హెలికాప్టర్లతో చేపట్టిన గాలింపు నిలిపివేశామని గురువారం ఐఏఎఫ్ తెలిపింది. సీ-130జే విమానం మాత్రం రాత్రీ గాలింపు కొనసాగిస్తుందని అధికారులు ప్రకటించారు. 8 మంది సిబ్బంది సహా 13మందితో ప్రయాణిస్తున్న ఏఎన్ - 32 విమానం సోమవారం మధ్యాహ్నం 12.25 గంటలకు అసోంలోని జోర్హాత్ వైమానిక స్థావరం నుంచి బయల్దేరిన కాసేపటికే అ దృశ్యమైంది. నాటి నుంచి విమానం కోసం ఐఏఎఫ్ గాలింపు చేపట్టింది. ఆ విమానం రాడార్ నుంచి అదృశ్యమైన నాడే నల్లని పొగను చూశామని అరుణాచల్‌ప్రదేశ్‌లోని తుంబిన్ వాసులు తెలిపారు. కానీ అధికారులు దీన్ని ధ్రువీకరించలేదు. కాగా, ఈ విమానంలో గల్లంతైన వారి ఆచూకీ కోసం ప్రయత్నాలను తీవ్రతరం చేయాలని బాధి త కుటుంబాలు, ఏఎన్-32 విమానం పైలట్ లెఫ్టినెంట్ ఆశిష్ తన్వర్ తల్లి సరోజ్ ప్రధాని మోదీని కోరారు. ఆ విమానంలోనే ఉన్న మరో లెఫ్టినెంట్ మోహిత్ గార్గ్ కుటుంబీకులు కూడా ఆందోళనగా ఉన్నారు.

# ఇంజినీర్‌కు 100 గుంజీల శిక్ష

ఒడిశాలో రోడ్లు అధ్వానంగా మారడంతో బీజేడీ ఎమ్మెల్యే హుకుం

**భువనేశ్వర్:** ఒడిశాలో అధికార బీజేడీ ఎమ్మెల్యే సరోజ్ మెహెర్.. ఓ అధికారి పట్ల అనుచితంగా వ్యవహరించారు. ఇటీవలి ఎన్నికల్లో బోలంగిర్ జిల్లా పాట్నాగఢ్ స్థానం నుంచి తొలిసారి ఎన్నికైన సరోజ్ మెహెర్.. రెండు రోజుల క్రితం బెల్‌పాడ ప్రాంతంలో పర్యటించారు. రోడ్లు అధ్వానంగా ఉన్నందుకు 5 నిమిషాల్లో 100 గుంజీలు తీయాలని ఇంజినీర్ జశ్వంత్ సబర్‌ను ఆదేశించారు. తనను అవమానించొద్దన్న ఆ ఇంజినీర్ విజ్ఞప్తులను పట్టించుకోలేదు. చేసేదేమీ లేక జశ్వంత్ గుంజీలు తీస్తున్న దృశ్యాన్ని స్థానికులు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో అది వైరలైంది. విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో అలా చేసినందుకు ఎమ్మెల్యే సరోజ్ మెహెర్ క్షమాపణ చెప్పారు. జిల్లా కలెక్టర్ అరిందామ్ డాకువా విచారణకు ఆదేశించారు.

# సూడాన్‌లో మారణకాండ

సైన్యం జరిపిన కాల్పుల్లో 108 మంది మృతి

చనిపోయిన వాళ్ళను నైలు నదిలో పడేస్తున్న సైన్యం

**ఖార్‌తౌమ్:** సూడాన్‌లో ప్రజాస్వామ్య అనుకూల నిరసన తీవ్ర రక్తపాతానికి దారితీసింది. దేశంలో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించాలని ఆందోళన కొనసాగిస్తున్న ఉద్యమకారులపై అక్కడి సైన్యం ఉక్కుపాదం మోపుతున్నది. ఆర్మీ హెడ్ క్వార్టర్స్ వెలుపల శాంతియుత నిరసన తెలుపుతున్న వేలాది మంది ప్రజలపై సైన్యం కిరాతకంగా కాల్పులు జరిపింది. ఈ ఘటనలో వంద మందికిపైగా పౌరులు చనిపోయారని సూడాన్ వైద్యుల కేంద్ర కమిటీ ప్రకటించింది. అయితే, మరణించిన వారి సంఖ్య పదుల సంఖ్యలోనే ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు. దేశంలో ఆర్థికసంక్షోభం నేపథ్యంలో నిత్యావసరాల వాడుకపై అధ్యక్షుడు ఒమర్ ఆల్ బషీర్ ఆంక్షలు విధించారు. దీంతో ప్రజల తిరుగుబాటు మొదలైంది. ఈ నేపథ్యంలో అధ్యక్షుడి నుంచి సైన్యం పగ్గాల్ని తీసుకుంది. అయినా ప్రజల ఆందోళనలు కొనసాగుతూనే ఉన్నాయి. గత సోమవారం రాజధానిలోని ఆర్మీ హెడ్‌క్వార్టర్స్‌లోకి చొరబడేందుకు నిరసనకారులు ప్రయత్నించారు. దీంతో మిలిటరీ కాల్పులకు తెగబడింది. మిలిటరీ అధికారులు 40మంది ఆందోళనకారులను చంపి నైలు నదిలో పడేశారని, వారిని నది నుంచి వెలికి తీశామని సూడాన్ వైద్యుల కేంద్ర కమిటీ బుధవారం పేర్కొంది. చనిపోయిన వారి సంఖ్య 108 వరకు ఉన్నదని తెలిపింది.

# ఆధారాలు చూపినా అడ్డదిడ్డంగానే..

- టీవీ9 మాజీ సీఈవో పొంతనలేని సమాధానాలు
- దర్యాప్తు అధికారులను ముప్పుతిప్పలు పెడుతున్న రవిప్రకాశ్
- మూడోరోజు 10 గంటల పాటు విచారణ
- అరెస్టుపై కొనసాగుతున్న ఉత్కంఠ
- ఏ-2 శివాజీ కోసం ముమ్మర గాలింపు
- నేడు విచారణకు హాజరుకావాలంటూ రవిప్రకాశ్‌కు బంజారాహిల్స్ పోలీసుల నోటీసులు



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** అడ్డదిడ్డమైన సమాధానాలు.. పొంతనలేని ముచ్చట్లతో టీవీ 9 మాజీ సీఈవో రవిప్రకాశ్ వ్యవహరిస్తున్న తీరుతో సైబరాబాద్ సైబర్ క్రైం పోలీసులు అసహనానికి గురవుతున్నారు. ఆధారాలు చూపుతూ ప్రశ్నలు సంధిస్తున్నా.. నోరు మెదపకపోవడంతో తలలు పట్టుకుంటున్నారు. నకిలీపత్రాల సృష్టి, సంతకాల ఫోర్జరీ, డాటా చోరీ ఆరోపణలపై నమోదైన రెండుకేసుల్లో టీవీ 9 మాజీ సీఈవో రవిప్రకాశ్‌ను గురువారం మూడోరోజూ సైబర్‌క్రైం పోలీసులు విచారించారు. ఉదయం 10.25 గంటలకు ఆయన సైబరాబాద్ సైబర్ క్రైం పోలీసుల ఎదుట విచారణకు హాజరయ్యారు. ఉదయం 10.30 నుంచి రాత్రి 9.30 గంటల వరకు పోలీసులు ఆయనను విచారించారు. మంగళ, బుధవారాల్లో సైబర్ క్రైం పోలీసులు అడిగిన ప్రశ్నలకు రవిప్రకాశ్ నుంచి ఎలాంటి సమాధానాలు రాలేదు. దీంతో దర్యాప్తు అధికారులు గురువారం వ్యూహం మార్చినట్టు సమాచారం. సంతకాల ఫోర్జరీ, పాత తేదీలతో డాక్యుమెంట్లు సృష్టించినట్టు లభించిన ఆధారాలు, రవిప్రకాశ్‌కు ఇతరులకు జరిగిన ఈ-మెయిల్ సంభాషణలు, గతంలో ఇదేకేసులో విచారణకు హాజరైన టీవీ9 మాజీ ఉద్యోగి మూర్తి చెప్పిన సమాచారం, టీవీ9 కార్యాలయంలో స్వాధీనం చేసుకున్న హార్డ్‌డిస్కులు, రవిప్రకాశ్, మూర్తి, శివాజీ ఇండ్లలో సోదాల్లో సేకరించిన కీలకపత్రాలు తదితర ఆధారాలను పట్టుకుని ప్రశ్నించినట్టు తెలుస్తున్నది. ఒక అంశంపై ప్రశ్న అడిగిన తర్వాత ఆయన చెప్పే సమాధానం సరైనవిధంగా లేకపోతే వెంటనే ఆధారాలు చూపుతూ మరింత లోతుగా ప్రశ్నించినట్టు సమాచారం. మరోవైపు రవిప్రకాశ్ అరెస్టుపై ఉత్కంఠ కొనసాగుతున్నది. మూడురోజుల విచారణలో సేకరించిన ఆధారాలతో ఆయనను అరెస్టు చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తున్నది. సుప్రీంకోర్టు సూచనల నేపథ్యంలో రవిప్రకాశ్‌ను అరెస్టు చేయాలంటే 48 గంటల ముందే ఆయనకు నోటీసులు ఇవ్వాల్సి ఉన్నది. అయితే కేసు దర్యాప్తును ప్రభావితం చేసే అవకాశం ఉన్నదన్న అంశాన్ని ప్రస్తావిస్తూ పోలీసులు న్యాయసలహా తీసుకుని అరెస్టుపై ముందుకెళ్లనున్నట్టు తెలుస్తున్నది.

### శివాజీ కోసం ముమ్మరమైన గాలింపు..

టీవీ 9లో షేర్ల కొనుగోలుకు సంబంధించి పాత తేదీలతో నకిలీ పత్రాలు సృష్టించి కొత్త యాజమాన్యాన్ని అడ్డుకున్నారన్న కేసులో ఏ-2గా ఉన్న సినీనటుడు శివాజీ కోసం గాలింపు ముమ్మరమైనట్టు తెలుస్తున్నది. కేసులో కీలక నిందితుడు రవిప్రకాశ్‌ను మూడురోజులుగా విచారించిన పోలీసులు.. ఆయన ఇచ్చిన సమాచారం, ఈ మెయిల్స్‌లో ఆధారాలు, ఇతర అంశాలతో శివాజీని సైతం ప్రశ్నించేందుకు సిద్ధమవుతున్నట్టు తెలిసింది. శివాజీ ఎక్కడ ఉన్నాడని రవిప్రకాశ్‌ను ప్రశ్నించగా.. తనకు తెలియదని సమాధానమిచ్చినట్టు సమాచారం. కేసు నమోదైన తర్వాత రవిప్రకాశ్ రెండుసార్లు వీడియో సందేశాలను విడుదల చేశారు. శివాజీ సైతం తనకు వడదెబ్బ తగిలిందని, చికిత్స పొందుతున్నానని.. తర్వాత పోలీసుల ఎదుటకు వస్తానని, అసలు విషయమే లేని ఈ కేసుకు తాను భయపడేది లేదంటూ.. సుదీర్ఘంగా ఓ వీడియోను విడుదల చేసిన విషయం తెలిసిందే.

### మరోసారి బంజారాహిల్స్ పోలీసుల నోటీసులు


టీవీ 9 లోగో అమ్మకం కేసులో ఆ చానల్ మాజీ సీఈవో రవిప్రకాశ్‌కు బంజారాహిల్స్ పోలీసులు 41సీఆర్‌పీసీ కింద గురువారం మరోసారి నోటీసులు జారీచేశారు. రెండువారాల క్రితం కూడా ఇదే సెక్షన్ కింద ఆయనకు నోటీసులు జారీచేసినట్టు బంజారాహిల్స్ ఏసీపీ కేఎస్‌రావు 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు. శుక్రవారం ఉదయం 10.30 గంటలకు దర్యాప్తు అధికారి ఎదుట విచారణకు హాజరుకావాలని రవిప్రకాశ్‌కు ఈ నోటీసుల్లో సూచించినట్టు తెలిపారు. తప్పుడు పత్రాలు సృష్టించి టీవీ 9 చానల్ కాపీరైట్స్, టీవీ 9 లోగోను ఆ చానల్ మాజీ డైరెక్టర్లు రవిప్రకాశ్, ఎంవీకేఎస్ మూర్తి.. మీడియా ఎస్‌ఎక్స్‌టీ ఇండియా ప్రైవేటు లిమిటెడ్‌కు రూ.99 వేలకు విక్రయించినట్టు ఏబీసీఎల్ మీడియా డైరెక్టర్ కౌశిక్‌రావు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ఐపీసీ 467,420,409, 406, 120(బీ) సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే.

# పరిశ్రమల హబ్ .. దండుమల్కాపురం


400 పరిశ్రమలు.. రూ.1,200 కోట్ల పెట్టుబడులు.. వేగంగా టీఐఎఫ్ గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కు పనులు

ప్రత్యక్షంగా 15 వేలు, పరోక్షంగా 20 వేల మందికి ఉపాధి.. ఎమ్మెస్ఎంఈ రంగానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహం

డిసెంబర్ చివరినాటికి పారిశ్రామిక ఉత్పత్తి ప్రారంభం.. రూ.210 కోట్లతో టీఐఎఫ్, టీఎస్ఐఐసీ వసతులు



దండుమల్కాపురంలో గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కు పైలాన్



యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండుమల్కాపురంలోని గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కులో చేపడుతున్న అభివృద్ధి పనులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఉమ్మడి రాష్ట్రంలో నిర్లక్ష్యానికి గురైన పారిశ్రామికాభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నది. కొత్త పరిశ్రమలను ఆకర్షించడంతోపాటు ఉన్న పరిశ్రమల విస్తరణకు ప్రోత్సాహకాలు అందిస్తున్నది. తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక వసతుల కల్పనా సంస్థ (టీఎస్ఐఐసీ) ద్వారా ఒక్కో రంగానికి సంబంధించిన పరిశ్రమలను ఒక్కోప్రాంతంలో ఏర్పాటుచేస్తున్నది. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పారిశ్రామికవేత్తల కోసం రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ పారిశ్రామిక వేత్తల సమాఖ్య (టీఐఎఫ్) ద్వారా గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కును యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండుమల్కాపురంలో ఏర్పాటుచేయాలని నిర్ణయించింది. ఇందుకు 377 ఎకరాలకు ప్రభుత్వం కేటాయించింది. హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారి దండుమల్కాపురం టెక్స్‌టైల్ పార్కును ఆనుకుని కిలోమీటరున్నర లోపల ఈ పార్కుకు స్థలాన్ని కేటాయించారు. ఇక్కడ మొత్తం 400 ఎమ్మెస్ఎంఈ పరిశ్రమలు ఏర్పాటుకానున్నాయి. వీటిద్వారా రూ. 1,200 కోట్ల పెట్టుబడులు రానున్నాయి. 15 వేల మందికి ప్రత్యక్షంగా, మరో 20 వేల మందికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఆయా పరిశ్రమలకు స్థలాల కేటాయింపు పూర్తయింది. రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ, విద్యుత్ పనులు యుద్ధ ప్రాతిపదికన కొనసాగుతున్నాయి. ఈ సంవత్సరం చివరి నాటికి ఇక్కడ పరిశ్రమలు తమ ఉత్పత్తులను ప్రారంభించనున్నాయి. ఎగుమతి చేసే స్థాయి ప్రమాణాలున్న వస్తు ఉత్పత్తుల పరిశ్రమలతోపాటు రక్షణ, ఏరో స్పేస్, ఎలక్ట్రానిక్స్, ప్యాకేజింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ కంపెనీలను ఇక్కడ స్థాపిస్తారు. డ్రిల్లింగ్ యంత్రసామగ్రి, వాటర్ డ్రిల్లింగ్, గనుల డ్రిల్లింగ్‌లో ఉపయోగించే యంత్రాలు, పరికరాలను ఇక్కడ తయారుచేస్తారు.

### మౌలిక సదుపాయాల కోసం రూ. 175 కోట్లు

గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కులో మౌలిక సదుపాయాలు, భూమి కొనుగోలు వంటి వాటికి రూ.175 కోట్ల వరకు టీఐఎఫ్ వెచ్చిస్తున్నది. ఇక్కడ పరిశ్రమల స్థాపించే వారందరు ఈ మొత్తాన్ని చెల్లిస్తున్నారు. నిత్యం వందల సంఖ్యలో కార్మికులు ఇక్కడ పనులు చేస్తున్నారు. పార్కుకు అవసరమైన పర్యావరణ అనుమతులు ఇప్పటికే వచ్చాయి. అక్టోబర్ చివరి నాటికి మౌలిక సదుపాయాల పనులు పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. జూలైకల్లా పరిశ్రమల యజమానులు భవన నిర్మాణాలు ప్రారంభించేందుకు వీలుగా ఏర్పాట్లుచేస్తున్నారు. కొందరు ఇప్పటికే నిర్మాణ పనులు ప్రారంభించారు. పరిశ్రమల విస్తరణకు వీలుగా మరో 120 ఎకరాల వరకు భూ సేకరణ పూర్తయింది. ఈ స్థలాన్ని కూడా టీఎస్ఐఐసీ టీఐఎఫ్‌కు కేటాయించనుంది. మరికొన్ని పరిశ్రమలు అదనంగా రానున్నాయి.

### టీఎస్ఐఐసీ రూ.35 కోట్లు

ఇండస్ట్రియల్ పార్కుకు అవసరమైన మౌలిక సదుపాయాలను టీఎస్ఐఐసీ కల్పిస్తున్నది. జాతీయ రహదారి నుంచి పార్కు వరకు కిలోమీటరున్నర రోడ్డు వేశారు. 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను నిర్మిస్తున్నారు. మిషన్ భగీరథ ద్వారా తాగునీటి వసతిని కల్పిస్తున్నారు. వీటన్నింటికి రూ.35 కోట్లు వెచ్చిస్తున్నది. ఇక్కడ పనిచేసే కార్మికులు, ఉద్యోగులకు సదుపాయాలు కల్పించడానికి టీఐఎఫ్ ప్రాధాన్యం ఇస్తున్నది. కార్మికులు, ఉద్యోగుల కోసం క్యాంటీన్, సర్వీసు అపార్ట్‌మెంట్లు, అతిథిగృహం, రిక్రియేషన్ సెంటర్, బ్యాంకు, ఏటీఎంలను, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయనున్నారు. దండుమల్కాపురంతోపాటుగా సమీప గ్రామాల్లో అర్హత, ఆసక్తి కలిగిన వారికి శిక్షణ ఇచ్చి ఇక్కడి కంపెనీల్లో నియమించుకుంటారు. ఉద్యోగులు, కార్మికులకు ఆరోగ్య సమస్యలు వస్తే అత్యవసర సమయాల్లో చికిత్సను అందించడానికి అం బులెన్స్, ప్రాథమిక వైద్య కేంద్రం అందుబాటులో ఉంచుతారు. టీఎస్ఐపాస్ హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేస్తారు.


### హరితానికి ప్రాధాన్యం

పరిశ్రమలు అంటేనే కాలుష్యమనే భావనను ప్రజల్లో తొలిగించడానికి ఇక్కడ వైట్, గ్రీన్ క్యాటగిరీల పరిశ్రమలకు మాత్రమే అనుమతి ఇచ్చారు. తద్వారా ఇక్కడ కాలుష్య ప్రభావం ఉండదు. వచ్చే జూలైలో రోడ్లకు ఇరువైపులా పెద్దఎత్తున మొక్కలు నాటేందుకు ఏర్పాట్లుచేస్తున్నారు. ప్రతి పరిశ్రమకు కేటాయించిన స్థలంలో 30 శాతం గ్రీనరీ పెంచాల్సి ఉంటుంది. ప్రధానరోడ్లు 100 ఫీట్లు, మిగిలిన రోడ్లు 80 ఫీట్లు, 60 ఫీట్లలో నిర్మిస్తున్నారు. వర్షపు నీరు పోవడానికి వీలుగా కల్వర్టులను నిర్మిస్తున్నారు. మురుగునీటి శుద్ధికి సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంటు ఏర్పాటుచేయనున్నారు. మొత్తం పార్కు స్థలంలో 40 ఎకరాలను గ్రీనరీ కోసం వదిలిపెడుతున్నారు.

### ఇండ్ల స్థలాల ప్రతిపాదన

కార్మికులు, ఉద్యోగుల కోసం పారిశ్రామిక ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలు కేటాయించాలని సీఎం కేసీఆర్ గతంలోనే నిర్ణయించారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉన్న పారిశ్రామిక పార్కులను నగరం అవతలికి తరలించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇలా ముందుకొచ్చిన వారిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో పారిశ్రామిక పార్కు సమీపంలోనే ఇండ్ల స్థలాలు కేటాయిస్తారు. టీఐఎఫ్ పార్కులో పక్కనే దాదాపుగా 194 ఎకరాలను కార్మికులకు ఇవ్వాలని ప్రభుత్వాన్ని టీఐఎఫ్ కోరింది. దీనికి ప్రభుత్వం సానుకూలంగా ఉంది. అధికారికంగా కేటాయింపులు జరుగాల్సి ఉంది. ఈ పార్కుకు త్వరలో ఇండస్ట్రియల్ ఏరియా లోకల్ అథారిటీ (ఐలా) హోదా రానుంది. దీనిద్వారా పారిశ్రామికవాడల్లో నిర్మించే భవనాలకు ఐలా కమిషనర్ స్థాయిలో అనుమతులు ఇచ్చే అవకాశం ఉంటుంది.

### ఆదర్శపార్కుగా తీర్చిదిద్దుతాం



తెలంగాణలో పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ పారిశ్రామికవేత్తల సమాఖ్యకు స్థలాన్ని కేటాయించింది. ఎమ్మెస్ఎంఈ పరిశ్రమలకు స్థలాన్ని కేటాయించాలని అడగ్గానే సీఎం కేసీఆర్, అప్పటి పరిశ్రమలశాఖ మంత్రి కే తారక రామారావు కేటాయించారు. వారందరికీ ధన్యవాదాలు. ఈ పార్కును ఆదర్శపార్కుగా తీర్చిదిద్దడానికి టీఎస్ఐఐసీ సహకారంతో చర్యలు తీసుకుంటున్నాం. ఈ పార్కు ద్వారా ఈ ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుంది. ఇక్కడి ప్రజలకు ఉపాధి అవకాశాలు, జీవన ప్రమాణాలు పెరుగుతాయి. స్థానికుల ఉపాధి కల్పనకు ప్రాధాన్యం ఇస్తాం. పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

– కే సుధీర్‌రెడ్డి, టీఐఎఫ్ అధ్యక్షుడు

### ఎమ్మెస్ఎంఈ రంగానికి ప్రోత్సాహం



తెలంగాణ ప్రభుత్వం ఎమ్మెస్ఎంఈ పరిశ్రమలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో టీఐఎఫ్‌కు స్థలం కేటాయించింది. ఇక్కడ మౌలిక సదుపాయాలను టీఎస్ఐఐసీ కల్పిస్తున్నది. ఒక్కో రంగానికి ప్రత్యేక పార్కుల్లో దండుమల్కాపురం పార్కు ప్రారంభం మాత్రమే. భవిష్యత్‌లో మరిన్ని ప్రారంభిస్తాం. ఇందుకు అవసరమైన స్థలాలను గుర్తించాం. సుల్తాన్‌పూర్‌లో మెడికల్ డివైజెస్ పార్కు, మహంకాళ్‌లో ప్లాస్టిక్ పార్కు, బండ తిమ్మాపూర్‌లో ఫుడ్‌పార్క్, బండమైలారంలో సీడ్‌పార్క్, ఇబ్రహీంపట్నంలో కాంపోజిట్స్ మ్యానుఫాక్చరింగ్ పార్క్ పనులు జరుగుతున్నాయి. వీటిలో కూడా ఎమ్మెస్ఎంఈ రంగానికి 30 శాతం స్థలాలు కేటాయించాలని ప్రభుత్వం విధానపరంగా నిర్ణయించింది. మహిళలకు ప్రత్యేక పార్కులను ఏర్పాటుచేస్తున్నాం.

– ఈ వెంకట నర్సింహారెడ్డి, ఎండీ, టీఎస్ఐఐసీ

# రీవెరిఫికేషన్ ఫలితాల వెల్లడి పూర్తి

ఫెయిలైన విద్యార్థుల్లో 1,183 మంది ఉత్తీర్ణత

సమాధాన పత్రాలు వెబ్‌సైట్‌లో ఉంచాం.. హైకోర్టుకు వివరించిన ఇంటర్ బోర్డు

తదుపరి విచారణ 10వ తేదీకి వాయిదా

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఫెయిలైన 3,82,116 మంది విద్యార్థుల సమాధాన పత్రాల రీవెరిఫికేషన్ ప్రక్రియ పూర్తయిందని ఇంటర్‌బోర్డు.. హైకోర్టుకు నివేదించింది. ఈ ఫలితాలను వెల్లడించామని, 3.82 లక్షల మంది ఫెయిలైనవారిలో 1,183 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని తెలిపింది. ఫెయిలైన విద్యార్థులకు సంబంధించిన దాదాపు 9 లక్షల సమాధానపత్రాలను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్టు పేర్కొన్నది. ఈ ఫలితాలను గ్లోబరీనా సంస్థతోపాటు మరో సంస్థతో సమాంతరంగా మదింపు చేయించామని వివరించింది. పాసైన 1,183 మంది విద్యార్థుల్లో 582 మంది ద్వితీయ సంవత్సర విద్యార్థులు ఉన్నారని, వారంతా యథావిధిగా ఉన్నతవిద్యను కొనసాగించవచ్చని ఇంటర్ బోర్డు చెప్పింది. ఆత్మహత్య చేసుకున్న 23 మంది విద్యార్థుల్లో 20 మంది ఫెయిల్ అయ్యారని, మొదట విడుదలచేసిన ఫలితాల్లోనే ఇద్దరు ఉత్తీర్ణులయ్యారని పేర్కొన్నది. మరో విద్యార్థిని మూడు పరీక్షలు అయ్యాక ఆత్మహత్య చేసుకున్నదని, ఆమె రాసిన మూడు పరీక్షల్లో పాసైందని తెలిపింది. మరోవైపు రీవెరిఫికేషన్ ప్రక్రియ పూర్తి కాలేదని, చాలామంది విద్యార్థుల సమాధాన పత్రాలను అప్‌లోడ్ చేయాల్సి ఉన్నదని పిటిషనర్ తరపు న్యాయవాది పేర్కొన్నారు. చనిపోయిన విద్యార్థుల సమాధాన పత్రాలు అందుబాటులో లేవని తెలిపారు. అభ్యంతరాలుంటే లిఖితపూర్వకంగా కౌంటర్ దాఖలుచేయాలని పిటిషనర్‌కు హైకోర్టు సూచించింది. చనిపోయిన విద్యార్థుల సమాధాన పత్రాలను సమర్పించాలని ఇంటర్‌బోర్డును ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 10వ తేదీకి వాయిదా వేసింది.

# అసెంబ్లీ ఎన్నికలు ఎప్పుడైనా రావచ్చు


- జేడీ(ఎస్) కార్యకర్తలతో కుమారస్వామి తనయుడు నిఖిల్
- సామాజిక మాధ్యమాల్లో వీడియో వైరల్


నిఖిల్

**బెంగళూరు, జూన్ 6:** కర్ణాటకలో సంకీర్ణ ప్రభుత్వ భాగస్వామ్య పక్షాల మధ్య విశ్వాసం లోపించినందున అసెంబ్లీ ఎన్నికలకు జేడీ(ఎస్) కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని సీఎం హెచ్‌డీ కుమారస్వామి తనయుడు నిఖిల్ కుమారస్వామి పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరలైంది. 'ఎన్నికలు ఎప్పుడైనా రావచ్చు. అది వచ్చే ఏడాదే కావచ్చు. రెండు మూడేండ్ల తర్వాత కావచ్చు. కానీ మనం మాత్రం వచ్చే నెల నుంచే సిద్ధం కావాలి. తర్వాత అంటే కుదరదు' అని ఆయన జేడీ(ఎస్) శ్రేణులకు సూచిస్తున్నట్టు ఆ వీడియోలో ఉన్నది. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో నిఖిల్ కుమారస్వామి మాండ్య స్థానం నుంచి.. ప్రముఖ సినీనటి సుమలత అంబరీశ్ చేతిలో ఓడిపోయిన సంగతి తెలిసిందే. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వానికి ముప్పేమీ లేదని, సీఎంగా తన తండ్రి కుమారస్వామి నిర్దేశిత పదవీ కాలం పూర్తిచేస్తారని నిఖిల్ చెప్పటం విశేషం. రెండ్రోజుల క్రితం నిఖిల్ మాండ్యలో జేడీ(ఎస్) కార్యకర్తలతో మాట్లాడుతున్నప్పుడు చిత్రీకరించిన ఈ వీడియోను ఆ పార్టీకి చెందిన సునీల్ గౌడ దండిగనహళ్లి అనే కార్యకర్త తొలిసారి షేర్ చేశారు.

# ఓట్ల కోసమే ఆ ప్రకటన!

## ఢిల్లీలో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తామన్న ఆప్ సర్కార్ హామీపై కేంద్రమంత్రి హర్దీప్ మండిపాటు


హర్దీప్ సింగ్ పురి

**న్యూఢిల్లీ, జూన్ 6:** బస్సులు, మెట్రోరైళ్లలో మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చని ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ఇటీవల చేసిన ప్రకటనపై కేంద్ర గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎలాంటి కసరత్తు లేకుండా ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని హడావుడిగా ఈ ప్రకటన చేశారని విమర్శించారు. కోర్టు ఆదేశాల ప్రకారం ఢిల్లీలో 11వేల బస్సులే ఉండాలని, దీన్ని దృష్టిలో ఉంచుకొని మహిళల ఉచిత ప్రయాణం కోసం ఎన్ని బస్సులు అందుబాటులో ఉంచారని నిలదీశారు. త్వరలో జరుగనున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలోనే ఓటర్లను ఆకట్టుకోవడానికి రెండు, మూడు నెలల్లో ఉచిత ప్రయాణం పథకం అందుబాటులోకి తీసుకొస్తామని కేజ్రీవాల్ ప్రకటన చేశారన్నారు. ఏ ప్రభుత్వమైనా తొలుత ప్రతిపాదనలను సిద్ధం చేసి తర్వాత పథకాన్ని ప్రకటిస్తుందని, కానీ కేజ్రీవాల్ ప్రభుత్వం మాత్రం మొదట ప్రకటన చేసి, తర్వాత ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నదని విమర్శించారు. మరోవైపు ఢిల్లీ ప్రభుత్వం స్పందిస్తూ పక్కా ప్రణాళిక ప్రకారమే మహిళలకు ఉచిత ప్రయాణ ప్రకటనను చేశామని, ఈ పథకం అమలుకు నిధుల కొరత కూడా లేదని తెలిపింది.

## ఎస్సెస్సీ ప్రశ్నపత్రం లీకేజీ

# సూత్రధారి అరెస్టు

**న్యూఢిల్లీ, జూన్ 6:** స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్సెస్సీ) – 2017 పరీక్ష ప్రశ్నపత్రం లీక్ కేసులో ప్రధాన సూత్రధారి అక్షయ్ కుమార్ మాలిక్, అతని సహాయకులు సందీప్ మాథూర్, ధర్మేంద్రలను అరెస్ట్ చేసినట్లు సీబీఐ అధికారులు గురువారం తెలిపారు. అక్షయ్ కుమార్ మాలిక్ ఈ ప్రశ్నపత్రాన్ని లీక్ చేశాడు. అతడి సహాయకులు సందీప్, ధర్మేంద్ర పరీక్ష రాస్తున్న అభ్యర్థులకు దాన్ని విక్రయించేందుకు సిద్ధమయ్యారు. ఈ ప్రశ్నపత్రాన్ని రూపొందించిన సిఫీ టెక్నాలజీస్‌కు చెందిన 10 మంది ఉద్యోగులతోపాటు మొత్తం 17మందిపై సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. గతేడాది ఫిబ్రవరి 21న సెకండ్ టైర్ కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవెల్ (సీజీఎల్) పరీక్ష ప్రారంభం కావడానికి 20 నిమిషాల ముందే ప్రశ్నపత్రం, ఆన్సర్ కీ లీకయ్యాయి. సోషల్ మీడియాలోనూ వైరల్ అయ్యాయి.

# నాస్‌డాక్‌లో భారతీయుడి మోసం

## సంస్థ ఆదాయాన్ని తప్పుగా చూపి అమెరికా స్టాక్ మార్కెట్‌లో నమోదుకు యత్నం


వెంకట మీనవల్లి

**వాషింగ్టన్:** అమెరికా స్టాక్ మార్కెట్‌లో ఓ భారతీయుడి భారీ మోసం బయటపడింది. మూతపడ్డ క్రిప్టోకరెన్సీ కంపెనీ పేరు నాస్‌డాక్ (అమెరికా స్టాక్ ఎక్స్ఛేంజ్)లో నమోదు కోసం కోట్లలో సంస్థ ఆదాయం అని మోసపూరితంగా మదుపర్లను ఆకట్టుకునేందుకు యత్నించారు. వెంకట మీనవల్లి (49) మరి కొందరితో కలిసి లాంగ్‌ఫిన్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేశారు. క్రిప్టోకరెన్సీ, బ్లాక్‌చైన్ పద్ధతుల్లో ఆధునిక వస్తువుల వ్యాపారం చేస్తున్నామన్నారు. 2017–18 మధ్య కంపెనీ ఆదాయం 6.6 కోట్ల డాలర్లు (రూ.457 కోట్లు)గా తప్పుగా చూపి స్టాక్‌మార్కెట్‌లో మదుపర్లను ఆకట్టుకునేందుకు యత్నించారు. దీంతో ఆ కంపెనీ షేర్ ఒక్కసారిగా 2000% పెరిగింది. దీన్ని అమెరికా సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ గుర్తించింది. లాంగ్‌ఫిన్ సంస్థతోపాటు సీఈవో వెంకట మీనవల్లి ఏ క్రిప్టోకరెన్సీ లావాదేవీలు జరుపలేదని, సంస్థ ఆదాయం రూ.457 కోట్లు అని తప్పుగా ప్రకటించినట్లు నిర్ధారించింది. ఆ కంపెనీతోపాటు వెంకట మీనవల్లి తదితరులపై మోసం ఆరోపణలపై కేసులు నమోదు చేసింది. ఆయనపై నేరం రుజువైతే గరిష్ఠంగా 20 ఏండ్ల జైలుతోపాటు 50 లక్షల డాలర్ల వరకు జరిమానా విధించొచ్చని న్యాయవాది క్రైగ్ కార్పెనిటో చెప్పారు.






# నేరుగా రైతులకే!

- తీవ్రంగా యోచిస్తున్న కేంద్ర ప్రభుత్వం
- డీబీటీ రెండో విడుతలో అమలయ్యే అవకాశం

**న్యూఢిల్లీ, జూన్ 6:** ఎరువులపై కేంద్రం ఇచ్చే రాయితీని ఇకపై కంపెనీలకు కాక నేరుగా రైతులకే అందజేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) పథకం రెండో విడుత అమలులో భాగంగా ఈ సబ్సిడీని నేరుగా రైతులకు అందజేయాలని ప్రభుత్వం తీవ్రంగా యోచిస్తున్నట్టు సీనియర్ ఎరువుల శాఖ అధికారి ఒకరు గురువారం చెప్పారు. 2017 అక్టోబర్‌లో ఎరువులపై తొలి విడుత డీబీటీని అమలు చేసిన ప్రభుత్వం.. పాయింట్ ఆఫ్ సేల్స్ (పీవోఎస్) యంత్రాల ద్వారా సేకరించిన రిటైల్ అమ్మకాల గణాంకాలను పరిశీలించి ఆ సబ్సిడీని కంపెనీలకు బదిలీ చేసిన విషయం తెలిసిందే. దీనిపై ప్రభుత్వం నీతి ఆయోగ్ నుంచి అభిప్రాయాలను స్వీకరించి రెండో విడుతలో నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో ఈ రాయితీని జమచేయనున్నట్టు తెలుస్తున్నది. అన్నదాతలకు చౌకగా ఎరువులను అందజేసేందుకు కేంద్రం ఏటా రూ.70 వేల కోట్లకుపైగా సబ్సిడీని భరిస్తున్నది. 'ఎరువులపై ఇచ్చే సబ్సిడీని నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసేందుకు ప్రయత్నించాలని మేం భావిస్తున్నాం. రెండో విడుత డీబీటీలో దీన్ని అమలు చేసేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. రైతులకు నేరుగా సబ్సిడీ బదిలీని ఎప్పుడు ఎలా అమలు చేయాలన్న విషయంపై చర్చ జరుగుతున్నది' అని ఆ అధికారి పీటీఐ వార్తా సంస్థకు వివరించారు. ఎరువులపై రాయితీలను సజావుగా అమలు చేసేందుకు రిటైల్ వ్యాపారులు పీవోఎస్ యంత్రాలతోపాటు డెస్క్‌టాప్ లేదా ల్యాప్‌టాప్‌లను ఉపయోగించునేందుకు వీలుకల్పించడం ద్వారా ప్రత్యక్ష నగదు బదిలీ పథకాన్ని మరింత మెరుగుపర్చాలని కూడా ప్రభుత్వం యోచిస్తున్నట్టు తెలిపారు. 'ప్రస్తుతం పీవోఎస్ యంత్రాల ఆధారంగా డీబీటీ పథకం అమలవుతున్నది. పీవోఎస్ యంత్రాల్లో తెర (స్క్రీన్) చిన్నగా ఉండటంతో కొన్ని సమయాల్లో రిటైల్ వ్యాపారులకు సమస్యలు ఎదురవుతున్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని పీవోఎస్ యంత్రాలతోపాటు డెస్క్‌టాప్/ల్యాప్‌టాప్‌లను కూడా ఉపయోగించుకునేలా రిటైల్ వ్యాపారులకు వీలు కల్పించబోతున్నాం. దీంతో వారి వ్యాపారం సులభం అవుతుంది' అని ఆ అధికారి చెప్పారు. గత ఆర్థిక సంవత్సరం (2018–19)లో ఎరువుల సబ్సిడీ కోసం రూ.74 వేలకోట్లు చెల్లించిన కేంద్ర ప్రభుత్వం.. ప్రస్తుత ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో ఇందుకోసం దాదాపు రూ.78 వేలకోట్లు కేటాయించింది.

# షా.. నంబర్ 2

## కేంద్ర క్యాబినెట్‌లో ప్రధాని మోదీ తర్వాత కీలకస్థానం అమిత్ షాదే

మంత్రివర్గ సంఘాల్లో హోంమంత్రికి విశేష ప్రాధాన్యం.. మొత్తం ఎనిమిది కమిటీల్లోనూ చోటు

**వసతి ఏర్పాటు కమిటీ సారథ్య బాధ్యతలు కూడా..**



**న్యూఢిల్లీ, జూన్ 6:** లోక్‌సభ ఎన్నికల్లో ఘనవిజయం సాధించి మరోమారు కొలువు దీరిన కేంద్ర సర్కార్‌లో.. తన తర్వాత స్థానం అత్యంత విశ్వసనీయమైన తన అనుచరుడు అమిత్‌షాదేనని క్యాబినెట్ కమిటీల నియామకం ద్వారా ప్రధాని నరేంద్రమోదీ స్పష్టం చేశారు. బుధ, గురువారాల్లో వరుసగా ఎనిమిది అత్యంత కీలకమైన క్యాబినెట్ కమిటీలను మోదీ ఏర్పాటు చేశారు. వీటన్నింటిలోనూ హోంమంత్రి అమిత్‌షాకు స్థానం లభించింది. వసతి ఏర్పాటు కమిటీ సారథ్య బాధ్యతలను కూడా ఆయనకే అప్పగించారు. మరోవైపు, తొలుత రెండు కమిటీల్లోనే రాజ్‌నాథ్‌కు స్థానం కల్పించిన మోదీ, అనంతరం జాబితాను సవరించి మరో నాలుగు కమిటీల్లో ఆయనకు చోటునిచ్చారు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రివర్గానికి రాజ్‌నాథే నేతృత్వం వహించనున్నారు. ఆర్థిక వ్యవహారాలు, పార్లమెంట్ వ్యవహారాలు, రాజకీయ వ్యవహారాలు, నియామకాలు, వసతి అంశాలకు సంబంధించి ఐదు మంత్రివర్గ సంఘాలను కేంద్రం గురువారం నియమించింది. పెట్టుబడులు–ఆర్థికాభివృద్ధి, ఉద్యోగాల కల్పన–నైపుణ్యాభివృద్ధిపై బుధవారమే మంత్రివర్గ సంఘాలు ఏర్పాటైన విషయం తెలిసిందే. ఈ రెండు అంశాలపై క్యాబినెట్ కమిటీలు ఏర్పాటుకావడం బహుశా ఇదే మొదటిసారి. భద్రతా వ్యవహారాల మంత్రివర్గ సంఘం కూడా బుధవారమే ఏర్పాటైనట్లుగా గురువారం వెల్లడైంది.

**గతంలో మాదిరిగానే..**

క్యాబినెట్ కమిటీల్లో అమిత్ షాకు అమిత ప్రాధాన్యం ఇచ్చారని అభిప్రాయాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో.. **గతంలో** మాదిరే ఈసారి కూడా మంత్రిత్వ శాఖల ప్రాధాన్యాన్ని అనుసరించి మంత్రివర్గ సంఘాలను ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. గతంలో హోం మంత్రిగా ఉన్న రాజ్‌నాథ్ కూడా అన్ని సంఘాల్లో సభ్యుడిగా ఉండేవారని పేర్కొంటున్నాయి. సీతారామన్‌కు ముందు ఆర్థిక శాఖ బాధ్యతలు నిర్వహించిన అరుణ్‌జైట్లీ కూడా అన్ని కమిటీల్లో సభ్యులుగా ఉండేవారు. అనారోగ్య కారణాల రీత్యా ఈసారి ఆయన మంత్రివర్గంలో చేరలేదు. తాజా క్యాబినెట్ కమిటీల్లో అమిత్ షా తర్వాత నిర్మలా సీతారామన్ ఎక్కువ (7) కమిటీల్లో సభ్యులుగా ఉన్నారు. ఆ తరువాత స్థానంలో రాజ్‌నాథ్(6) ఉన్నారు.

### క్యాబినెట్ కమిటీలు ఇవే

**1.ఆర్థిక వ్యవహారాలు**

అత్యంత కీలకమై ఆర్థిక వ్యవహారాల మంత్రివర్గ సంఘానికి ప్రధాని మోదీ అధ్యక్షత వహిస్తారు. ఈ కమిటీలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, హోం మంత్రి అమిత్‌షా, రోడ్డు రవాణా, హైవే శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, కెమికల్స్, ఫర్టిలైజర్స్ శాఖ మంత్రి డీవీ సదానంద గౌడ, వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్రసింగ్ తోమర్, సమాచార శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి హర్‌సిమ్రత్ కౌర్ బాదల్ సభ్యులుగా ఉంటారు. విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్, వాణిజ్యం, రైల్వే శాఖ మంత్రి పీయుష్ గోయల్, పెట్రోలియం శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ప్రత్యేక ఆహ్వానితులుగా ఉంటారు.

**2.పార్లమెంట్ వ్యవహారాలు**

పార్లమెంట్ సమావేశాల నిర్వహణపై సూచనలు అందించే పార్లమెంటరీ వ్యవహారాల కమిటీకి రాజ్‌నాథ్ నేతృత్వం వహిస్తారు. ఈ కమిటీలో షా, నిర్మలా సీతారామన్, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి రాంవిలాస్ పాశ్వాన్, నరేంద్రసింగ్ తోమర్, రవిశంకర్ ప్రసాద్, సామాజిక న్యాయశాఖ మంత్రి తావర్‌చంద్ గెహ్లాట్, పర్యావరణ శాఖ మంత్రి ప్రకాశ్ జవదేకర్, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్‌జోషి సభ్యులుగా ఉంటారు. పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయమంత్రులు అర్జున్‌రామ్ మేఘ్వాల్, మురళీధరన్ ప్రత్యేక ఆహ్వానితులు.

**3.రాజకీయ వ్యవహారాలు**

కీలక విధాన నిర్ణయాల్లో ప్రభుత్వానికి సూచనలు అందించే రాజకీయ వ్యవహారాల క్యాబినెట్ కమిటీకి ప్రధాని మోదీ సారథ్యం వహిస్తారు. ఈ కమిటీలో రాజ్‌నాథ్, అమిత్ షా, గడ్కరీ, సీతారామన్, గోయల్, పాశ్వాన్, తోమర్, రవిశంకర్ ప్రసాద్, హర్‌సిమ్రత్ కౌర్, వైద్య శాఖ మంత్రి హర్షవర్ధన్, భారీ పరిశ్రమల శాఖ మంత్రి అరవింద్ సావంత్, ప్రహ్లాద్ జోషి ఇతర సభ్యులు.

**4.నియామకాలు**

ఈ సంఘానికి ప్రధాని మోదీ నేతృత్వం వహిస్తారు. హోం మంత్రి అమిత్ షా మరో సభ్యుడిగా ఉంటారు.

**5. వసతి ఏర్పాటు**

అమిత్ షా సారథ్యంలో ఏర్పాటైన వసతి (అకామిడేషన్) క్యాబినెట్ కమిటీలో నితిన్ గడ్కరీ, సీతారామన్, పీయుష్ గోయల్ సభ్యులుగా ఉంటారు. పీఎంవో సహాయ మంత్రి జితేంద్ర సింగ్, గృహ, పట్టణ వ్యవహారాల, విమానయాన శాఖల మంత్రి హర్దీప్ సింగ్ పురి ప్రత్యేక ఆహ్వానితులుగా ఉంటారు.

**6.భద్రతా వ్యవహారాలు**

కీలకమైన భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీకి ప్రధాని మోదీ నేతృత్వం వహిస్తారు. ఈ కమిటీలో రాజ్‌నాథ్‌సింగ్, అమిత్ షా, జైశంకర్, నిర్మలా సీతారామన్ ఇతర సభ్యులు. దేశ భద్రత, విదేశీ వ్యవహారాలను ఈ సంఘం పర్యవేక్షిస్తుంది.

**7.పెట్టుబడులు- ఆర్థికాభివృద్ధి**

దీనికి ప్రధాని మోదీ సారథ్యం వహిస్తారు. రాజ్‌నాథ్, అమిత్ షా, నితిన్ గడ్కరీ, నిర్మలా సీతారామన్, పీయుష్ గోయెల్ సభ్యులుగా ఉంటారు.

**8. ఉద్యోగాల కల్పన -నైపుణ్యాభివృద్ధి**

ప్రధాని మోదీ నేతృత్వం వహించే ఈ మంత్రివర్గ సంఘంలో రాజ్‌నాథ్, అమిత్ షా, నిర్మలా సీతారామన్, పీయుష్ గోయెల్, ధర్మేంద్ర ప్రధాన్, నరేంద్ర సింగ్ తోమర్, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి రమేశ్ పోఖ్రియాల్ నిశాంక్, నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి మహేంద్రనాథ్ పాండే, కార్మిక శాఖ సహాయ మంత్రి సంతోష్ గంగ్వార్, హర్దీప్ సింగ్ పురి సభ్యులుగా ఉంటారు.

## అంతర్జాతీయంగా

# భారత్ స్థాయి పెరిగింది

- ఎంతో మంది భారతీయులు ఈ విషయాన్ని గుర్తించారు
- ప్రవాస భారతీయలను ఆదుకునేందుకు సుష్మ బాటలోనే పయనిస్తా
- సార్క్ కంటే బిమ్‌స్టెక్‌కే అధిక ప్రాధాన్యమిస్తాం: జైశంకర్



**న్యూఢిల్లీ:** గత ఐదేండ్లలో అంతర్జాతీయంగా భారత్ స్థాయి పెరిగినట్టు చాలా మంది భారతీయులు గుర్తించారని, ఎన్డీఏ సర్కార్ వరుసగా రెండోసారి అధికారం కైవసం చేసుకోవడంలో ఇది ముఖ్యపాత్ర పోషించిందని విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ అన్నారు. గురువారం ఆయన భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ), అనంత సెంటర్ నిర్వహించిన గ్రోత్ నెట్ సమ్మిట్ 7.0లో ప్రసంగిస్తూ.. ప్రస్తుతం అంతర్జాతీయ సమీకరణలు మారుతున్నాయన్నారు. చైనాతోపాటు భారత్ స్థిరంగా అభివృద్ధి చెందుతున్నదన్న అభిప్రాయం చాలా బలంగా వినిపిస్తున్నదన్నారు. భారత్ ఎదుగుదలపై ప్రజల ఆశలను ప్రభుత్వం సజీవంగా ఉంచడంతోపాటు వారి ఆకాంక్షలను మరింత బలోపేతం చేసిందన్నారు. 2015 నుంచి గతేడాది వరకు విదేశీ వ్యవహారాల శాఖ కార్యదర్శిగా పనిచేసిన జైశంకర్ ఆ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టాక బహిరంగ కార్యక్రమంలో పాల్గొనడం ఇదే తొలిసారి. ప్రభుత్వ జాతీయ భద్రత, విదేశాంగ విధానాల పట్ల ప్రజలు ఈ ఎన్నికల్లో విశ్వాసం వ్యక్తం చేశారన్నారు. భారత కంపెనీలు, ప్రత్యేకించి విదేశీ మార్కెట్లలోని కంపెనీల ఆర్థిక సమస్యలపై దృష్టి కేంద్రీకరించేందుకు ప్రభుత్వ విభాగాలు మరింత సమన్వయం తో పనిచేయాలన్నారు. గత విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్ బాటలోనే తానూ కొనసాగుతానని, సోషల్ మీడియా ద్వారా ఎన్నారైలకు చేరువై వారికి సాయమందిస్తానన్నారు. మోదీ ప్రభుత్వం తమకు అందుబాటులో ఉంటుందని ఎన్నారైలు ఆశలు పెట్టుకున్నారని, ఆపదలో ఉన్న ఎన్నారైలను ఆదుకునేందుకు అధిక ప్రాధాన్యం ఇస్తానన్నారు. దక్షిణాసియా ప్రాంతీయ సహకార సమాఖ్య (సార్క్) కంటే బిమ్‌స్టెక్ (బే ఆఫ్ బెంగాల్ ఇనిషియేటివ్ ఫర్ మల్టీ సెక్టోరల్ టెక్నికల్ అండ్ ఎకనమిక్ కో–ఆపరేషన్)పై ఎక్కువగా దృష్టి సారించి ఈ కూటమి బలోపేతానికి కృషి చేస్తామని స్పష్టం చేశారు.

# ఆ ఆరుగురికి 'నిపా' లేదు


వెల్లడించిన కేరళ ఆరోగ్యమంత్రి

రాష్ట్రవ్యాప్తంగా అబ్జర్వేషన్ వార్డుల్లో 316 మంది.. 33 మందికి ముప్పు

**కొచ్చి/ న్యూఢిల్లీ, జూన్ 6:** 'నిపా' వైరస్ సోకిందన్న అనుమానంతో ముగ్గురు నర్సులు, ఒక నర్సింగ్ సహాయకుడితోపాటు ఆరుగురికి జరిపిన వైద్య పరీక్షల్లో 'నెగెటివ్' అని ఫలితం వచ్చిందని కేరళ ఆరోగ్యశాఖ మంత్రి కేకే శైలజ తెలిపారు. 'నిపా' పరిస్థితిపై ముఖ్యమంత్రి పినరాయి విజయన్ అధ్యక్షతన గురువారం సమీక్షా సమావేశం ముగిసిన తర్వాత శైలజ మీడియాతో మాట్లాడారు. పుణెలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ (ఎన్ఐవీ)లో ఆరుగురి రక్త నమూనాలపై పరీక్షల్లో నెగెటివ్ అని రావడం తమకు భారీ ఉపశమనం అని చెప్పారు. కొచ్చిలోని కళామస్సెరీ వైద్యకళాశాల దవాఖానలో చికిత్స పొందుతున్న విద్యార్థికి నిపా సోకిందని 'ఎన్ఐవీ' పరీక్షల్లో నిర్ధారించిన సంగతి తెలిసిందే. ఆ విద్యార్థి ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉన్నదని శైలజ చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల్లో 316 మందిని ఐసోలేషన్ వార్డులకు తరలించగా, వారిలో 33 మంది పరిస్థితి ప్రమాదకరంగా ఉన్నదని, మిగతా వారికి తక్కువ ముప్పు ఉన్నదన్నారు. వీరిలో ఎనిమిది మందిని కొచ్చి కళామస్సెరీ మెడికల్ కళాశాల దవాఖాన ఐసోలేషన్ వార్డు కు మార్చినట్లు చెప్పారు. సదరు 33 మందికి నిర్వహించిన వైద్య పరీక్షల నివేదిక కోసం మరో 12 గంటలు వేచి ఉండాలని మంత్రి తెలిపారు.

# నీతి ఆయోగ్ పునర్వ్యవస్థీకరణ

- ఎక్స్ అఫీషియో సభ్యుడిగా అమిత్‌షా
- రాజ్‌నాథ్, నిర్మలా సీతారామన్, నరేంద్ర సింగ్ తోమర్ కూడా..
- వైస్ చైర్మన్‌గా రాజీవ్ కుమార్ పునర్నియామకం


రాజీవ్ కుమార్

**న్యూఢిల్లీ, జూన్ 6:** ప్రభుత్వ మేధో సంస్థ నీతి ఆయోగ్ పునర్వ్యవస్థీకరణకు ప్రధాని నరేంద్ర మోదీ గురువారం ఆమోదముద్ర వేశారు. ఎక్స్ అఫీషియో సభ్యుడిగా కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు నీతి ఆయోగ్‌లో కొత్తగా చోటు కల్పించారు. సంస్థ వైస్ చైర్మన్‌గా రాజీవ్ కుమార్‌ను పునర్నియమించారు. శాశ్వత సభ్యుల్లో వీకే సారస్వత్, రమేశ్‌చంద్, వీకే పాల్‌ను కొనసాగించగా, వివేక్ దేవ్ రాయ్‌ను మాత్రం తప్పించారు. అమిత్ షాతో పాటు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్రసింగ్ తోమర్ కూడా ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఉంటారని కేంద్రం ఓ ప్రకటనలో వెల్లడించింది. అలాగే రోడ్డు రవాణా, హైవేస్ శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, రైల్వే శాఖ మంత్రి పీయుష్ గోయెల్, గణాంక శాఖ మంత్రి ఇంద్రజిత్ సింగ్ ప్రత్యేక ఆహ్వానితులుగా ఉంటారని తెలిపింది. విధాన నిర్ణయాల్లో కేంద్రానికి నీతి ఆయోగ్ సలహాలు, సూచనలు ఇస్తుంది. వ్యూహాత్మక, దీర్ఘ కాలిక విధానాలను, పథకాలను రూపొందించడమే కాకుండా, సంబంధిత అంశాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సాంకేతిక సహకారం కూడా అందిస్తుంది. దేశంలో స్వాతంత్ర్యానంతరం నుంచి ఉనికిలో ఉన్న ప్రణాళికా సంఘం స్థానంలో 2015లో మోదీ సర్కారు నీతి ఆయోగ్‌ను తీసుకువచ్చింది. అరవింద్ పనగరియా తొలి వైస్ చైర్మన్‌గా వ్యవహరించారు. 2017 సెప్టెంబర్‌లో పనగరియా స్థానంలో రాజీవ్ కుమార్‌ను కేంద్ర ప్రభుత్వం నియమించింది. వ్యవసాయం, భద్రత, నీటి నిర్వహణ తదితర అంశాలపై చర్చించేందుకు ప్రధాని మోదీ నేతృత్వంలో ఈనెల 15న నీతి ఆయోగ్ పాలకమండలి సమావేశం కానుంది. మోదీ సర్కారు రెండోసారి అధికారంలోకి వచ్చిన తరువాత జరుగనున్న తొలి సమావేశం ఇదే. పాలకమండలిలో ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర పాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లు, పలువురు కేంద్ర మంత్రులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు సభ్యులుగా ఉంటారు.


జోగిందర్ సింగ్

# పాక్ ప్రజలపై భారతీయుని ఔదార్యం

మారుమూల ప్రాంతాల్లో చేతి పంపుల నిర్మాణం

ఆహారధాన్యాల పంపిణీ

**దుబాయ్:** పుల్వామా దాడి అనంతరం భారత్–పాకిస్థాన్ మధ్య అస్థిర పరిస్థితులు నెలకొన్నాయి. అయితే, మానవత్వానికి ఎల్లలు లేవని చాటుతూ.. రాజకీయాలకు అతీతంగా, శత్రు దేశం పాక్‌పై సైతం దుబాయ్‌కి చెందిన భారత సంతతి వ్యాపారవేత్త తన ఔదార్యాన్ని చాటుకున్నాడు. దాహార్తితో అలమటిస్తున్న అక్కడి ప్రజలకు సాయం చేశాడు. ఆగ్నేయ పాక్‌లో పేదరికం పట్టి పీడిస్తున్న సింధ్ రాష్ట్రంలోని తర్పార్కర్ జిల్లాలో.. భారత సంతతి వ్యాపారవేత్త జోగిందర్ సింగ్ సలేరియా ప్రజల దాహార్తిని తీర్చేందుకు 62 చేతి పంపులను ఏర్పాటు చేశారు. సామాజిక కార్యకర్తల సాయంతో ఆ ప్రాంతంలోని పేద ప్రజలకు ఆహారధాన్యాలు కూడా పంపిణీ చేశారు. జోగిందర్ సింగ్ సలేరియా యూఏఈలో 1993 నుంచి రవాణా వ్యాపారం చేస్తున్నారు. యూట్యూబ్, ఫేస్‌బుక్‌లలో కొంతమంది సామాజిక కార్యకర్తల ద్వారా సింధ్‌లో ఉన్న సమస్యల గురించి ఆయన తెలుసుకున్నారు. పేద ప్రజల కోసం పెహల్ చారిటబుల్ ట్రస్ట్ స్థాపించిన సలేరియా.. తర్పార్కర్ జిల్లాలో ఈ కార్యక్రమాలు చేపట్టడానికి కొన్నేండ్లపాటు నిర్విరామ కృషి చేశామని చెప్పారు.

# పీకేతో దీదీ!



## మమతకు ఎన్నికల వ్యూహకర్తగా ప్రశాంత్ కిషోర్

గతంలో బీజేపీ, జేడీయూ, వైసీపీకి సేవలు

**కోల్‌కత, జూన్ 6:** 2021లో జరిగే పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ విజయానికి రాజకీయవ్యూహాలను రచించేందుకు ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్‌తో తృణమూల్ కాంగ్రెస్ పార్టీ(టీఎంసీ) గురువారం ఒప్పందం కుదుర్చుకున్నది. ఈ నేపథ్యంలో టీఎంసీ అధినేత్రి, పశ్చిమబెంగాల్ సీఎం మమత బెనర్జీ గురువారం ప్రశాంత్ కిశోర్‌తో దాదాపు రెండు గంటలపాటు చర్చలు జరిపారు. తర్వాత టీఎంసీ ఎన్నికల వ్యూహకర్తగా ప్రశాంత్ కిషోర్‌ను నియమిస్తూ ఒప్పందంపై సంతకాలు చేసినట్టు తృణమూల్ వర్గాలు తెలిపాయి. గత ఎన్నికలతో పోలిస్తే(34), ఈ లోక్‌సభ ఎన్నికల్లో కేవలం 22 సీట్లే టీఎంసీ గెలుచుకున్నది. గతంలో రెండు సీట్లకు పరిమితమైన బీజేపీ ఈసారి ఏకంగా 18 చోట్ల గెలుపొందింది. ఈ నేపథ్యంలోనే మమత తన పార్టీ ఎన్నికల వ్యూహకర్తగా ప్రశాంత్ కిశోర్‌ను నియమించుకున్నారని విశ్లేషకులు అం చనా వేస్తున్నారు. ప్రశాంత్ కిశోర్ 2014 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి, 2015లో బీహార్‌లో నితీశ్ కుమార్ నేతృత్వంలోని జేడీయూకు వ్యూహకర్తగా ఉండి ఆయా పార్టీల విజయంలో క్రియాశీల పాత్ర పోషించారు. తాజాగా ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైసీపీకి ఎన్నికల ప్రచార వ్యూహకర్తగా వ్యవహరించారు. పీకే వ్యూహం ఫలించడంతో వైసీపీ ఘన విజయం సాధించి అధికారాన్ని చేపట్టింది. ఆంధ్రప్రదేశ్‌లో జగన్ గెలుపుతో చాలా పార్టీలు తమను సంప్రదిస్తున్నాయని పీకే బృందంలోని ఓ సభ్యుడు తెలిపారు.

## మాలేగావ్ పేలుళ్ల కేసులో

# కోర్టుకు గైర్హాజరైన ఎంపీ ప్రజ్ఞాసింగ్

**భోపాల్ /ముంబై:** మాలేగావ్ బాంబు పేలుళ్ల కేసులో నిందితురాలు, భోపాల్ బీజేపీ ఎంపీ ప్రజ్ఞాసింగ్ ఠాకూర్ గురువారం ముంబైలోని ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు ముందు హాజరుకాలేదు. ఈ కేసులో ఆమె విచారణకు హాజరుకాకపోవడం ఇది రెండోసారి. ఆమె తీవ్రమైన రక్తపోటుతో బాధపడుతున్నారని, భోపాల్ నుంచి ముంబైకి ప్రయాణం చేసే స్థితిలో లేరని ప్రజ్ఞాసింగ్ తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. వ్యక్తిగత హాజరుపై ఆమెకు మినహాయింపునివ్వాలని కోరారు. అందుకు అంగీకరించిన కోర్టు శుక్రవారం హాజరుకావాలని ఆదేశించింది.

# ఎస్‌సీవో సదస్సులో మోదీ, ఇమ్రాన్ భేటీ కారు

విదేశాంగ శాఖ వెల్లడి


రావీశ్‌కుమార్

**న్యూఢిల్లీ:** ఈ నెల 13, 14 తేదీల్లో కిర్గిస్థాన్ రాజధాని బిష్‌కెక్‌లో జరుగనున్న షాంఘై కో ఆపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్‌సీవో) సదస్సు సందర్భంగా ప్రధాని మోదీ, పాకిస్థాన్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ భేటీ అయ్యే అవకాశం లేదని విదేశాంగ శాఖ తెలిపింది. ఈ సమావేశం సందర్భంగా ఇరువురు నేతలు సమావేశం అవుతారని తొలుత వార్తలు వచ్చాయని, కానీ భేటీ జరిగే సూచనలు కనిపించడం లేదని పేర్కొంది. రెండు రోజులపాటు జరిగే ఈ సదస్సుకు హాజరయ్యే ప్రధాని అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటారని వెల్లడించింది. విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రావీశ్‌కుమార్ మాట్లాడుతూ ఇరువురు ప్రధానులు ఈ సదస్సుకు హాజరవుతున్నప్పటికీ వాళ్లు భేటీ అయ్యే అవకాశాలు మాత్రం లేవన్నారు. రంజాన్ పండుగ సందర్భంగా లాహోర్‌లోని స్టేడియంలో ప్రార్థనలు చేయడానికి ముంబై ఉగ్రదాడి సూత్రదారి హాఫీజ్ సయీద్‌ను పాక్ అధికారులు అనుమతించలేదు కదా అని విలేకరులు ప్రస్తావించగా.. ఇలాంటి కంటితుడుపు చర్యలతో ఉగ్రవాదం అంతంకాదని, ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో సహా పీకేయడానికి పాక్ గట్టి చర్యలు చేపట్టాలన్నారు.

## పాయింట్ల పట్టిక

| స్థానం | జట్టు | ఆ | గె | ఓ | నె.ర.రే | పా |
|---|---|---|---|---|---|---|
| 1. | న్యూజిలాండ్ | 2 | 2 | 0 | +2.27 | 4 |
| 2. | ఆస్ట్రేలియా | 2 | 2 | 0 | +1.05 | 4 |
| 3. | వెస్టిండీస్ | 2 | 1 | 1 | +2.05 | 2 |
| 4. | ఇంగ్లండ్ | 2 | 1 | 1 | +0.90 | 2 |
| 5. | భారత్ | 1 | 1 | 0 | +0.30 | 2 |
| 6. | బంగ్లాదేశ్ | 2 | 1 | 1 | +0.00 | 2 |
| 7. | శ్రీలంక | 2 | 1 | 1 | -1.51 | 2 |
| 8. | పాకిస్థాన్ | 2 | 1 | 1 | -2.41 | 2 |
| 9. | దక్షిణాఫ్రికా | 3 | 0 | 3 | -0.95 | 0 |
| 10. | ఆఫ్ఘనిస్థాన్ | 2 | 0 | 2 | -1.26 | 0 |

ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, నె.ర.రే - నెట్ రన్‌రేట్, పా-పాయింట్లు

వరల్డ్ కప్‌లో నేడు: పాకిస్థాన్ X శ్రీలంక - 3 గం. స్టార్ స్పోర్ట్స్‌లో

అత్యధిక పరుగులు: 158 రూట్ (ఇంగ్లండ్)

అత్యధిక వికెట్లు: 7 హెన్రీ (న్యూజిలాండ్)



# భారత్ 10-0 రష్యా

### ఎఫ్ఐహెచ్ సిరీస్‌లో ఘన విజయం.. నేడు పోలెండ్‌తో ఢీ

**భువనేశ్వర్:** ఒలింపిక్స్ పతక వేటను భారత్ ఘనంగా ఆరంభించింది. మెగాటోర్నీలో అర్హత కోసం జరుగుతున్న ఎఫ్ఐహెచ్ హాకీ సిరీస్ ఫైనల్స్ టోర్నీ తొలి మ్యాచ్‌లో అదిరే బోణీ కొట్టింది. రష్యాతో గురువారం జరిగిన మొదటి పూల్ మ్యాచ్‌లో 10-0 గోల్స్ తేడాతో భారీ విజయం సాధించింది. భారత ఆటగాళ్లు హర్మన్‌ప్రీత్ సింగ్(32,48 ని.), అక్షర్‌దీప్ సింగ్(42,56 ని.) చెరో రెండు గోల్స్ చేసి సత్తా చాటగా, మరో ఆరుమంది చెరో గోల్ కొట్టి జట్టుకు భారీ విజయాన్ని కట్టబెట్టారు. మ్యాచ్ తొలి 12 నిమిషాలు నువ్వా-నేనా అన్న తీరున సాగింది. మూడో నిమిషంలో రెండు పెనాల్టీ కార్నర్ అవకాశాలు వచ్చినా భారత్ సద్వినియోగం చేసుకోలేకపోయింది. అప్పటి దాకా చప్పగా సాగిన మ్యాచ్ 13వ నిమిషంతో పూర్తిగా మారిపోయింది. ఆత్మరక్షణ ధోరణిలో ఆడిన టీమిండియా ... నీలకంఠ శర్మ తొలి గోల్ కొట్టడంతో ఖాతా తెరిచింది. అప్పటి నుంచి దూకుడైన ఆటను ప్రదర్శించింది. 19 నిమిషంలో సిమ్రన్‌జీత్ సింగ్ చూడచక్కని షాట్‌తో గోల్ చేశాడు. మలి నిమిషం(20)లోనే వచ్చిన పెనాల్టీ కార్నర్‌ను వినియోగించుకున్న అమిత్ రోహిదాస్ డ్రాగ్‌ఫ్లిప్‌తో గోల్ సాధించాడు. రెండో పూల్ మ్యాచ్‌లో పోలెండ్‌తో భారత్ శుక్రవారం తలపడనుంది.



# భారత్ అసలైన పోటీదారు

**సౌతాంప్టన్:** ప్రస్తుత ప్రపంచ కప్ టోర్నీలో భారత జట్టు అసలైన పోటీదారని దక్షిణాఫ్రికా దిగ్గజ ఆల్‌రౌండర్ జాక్వెస్ కలిస్ అన్నాడు. ఇప్పటికే వరుసగా హ్యాట్రిక్ ఓటములు ఎదుర్కొన్న దక్షిణాఫ్రికాకు మిగిలిన ఆరు మ్యాచ్‌లు నాకౌట్‌తో సమానమని కలిస్ అన్నాడు. బుధవారం భారత్‌తో జరిగిన మ్యాచ్‌లో సఫారీలు ఆరు వికెట్ల తేడాతో ఓటమిపాలై సెమీస్ అవకాశాలను ఒకింత క్లిష్టం చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఐసీసీకి రాసిన ప్రత్యేక కాలమ్‌లో కలిస్ పలు అంశాలను ప్రస్తావించాడు. 'మెగాటోర్నీలో దక్షిణాఫ్రికా పేలవ ప్రదర్శన కొనసాగుతున్నది. ఇంగ్లండ్, టీమ్‌ఇండియాపై ఓటములు అంతగా ఆశ్చర్యం కల్గించకపోయినా...బంగ్లాదేశ్ చేతిలో ఓడటం జట్టులో లోపాలను తెలియజేస్తున్నది. మెగాటోర్నీలో టీమ్‌ఇండియా ప్రధానమైన పోటీదారుగా నేను భావిస్తున్నాను. సఫారీలతో మ్యాచ్‌లో వారు మూడు విభాగాల్లో సమిష్టి అత్యుత్తమ ప్రదర్శన కన' అని కలిస్ అన్నాడు.

# ఏబీ వస్తానన్నా.. వద్దన్నారు!



**జొహాన్నెస్‌బర్గ్:** ఏబీ డివిలీయర్స్ క్రికెట్‌ను కొత్త పుంతలు తొక్కించిన ఆటగాడు. తన వినూత్న షాట్లతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న క్రికెటర్. సరిగ్గా ప్రపంచకప్ ప్రారంభం కావడానికి ఏడాదికి ముందు ఉన్నట్టుండి క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించి అందరినీ ఆశ్చర్యపరిచాడు. అయితే మెగాటోర్నీకి జట్టును ప్రకటించే 24 గంటల ముందు తాను మళ్లీ జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తానంటూ కెప్టెన్ డుప్లెసిస్, కోచ్ ఓటిస్ గిబ్సన్‌తో పాటు దక్షిణాఫ్రికా సెలెక్షన్ కమిటీ విన్నవించుకున్నాడు. అయితే డివిలీయర్స్ లోటును భర్తీ చేసేందుకు అప్పటికే దేశవ్యాప్తంగా జల్లెడ పట్టిన దక్షిణాఫ్రికా క్రికెట్ బోర్డు (సీఎస్ఏ) ఏబీని కాదనుకుంది. ఈ విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. మెగాటోర్నీలో ఇప్పటికే హ్యాట్రిక్ ఓటములు చవిచూసిన సఫారీలు చావోరేవో లాంటి పరిస్థితిని ఎదుర్కొంటున్నది. ఈ నేపథ్యంలో ఏబీ తిరిగి జట్టులోకి వస్తానన్న సీఎస్ఏ తిరస్కరించడంపై అభిమానుల్లో వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. అంతర్జాతీయ క్రికెట్‌లో అపార అనుభవమున్న డివిలీయర్స్ జట్టు కొండంత బలమని అందరూ భావిస్తున్నారు.

# భారత్ నిష్క్రమణ

### ఆస్ట్రేలియన్ బ్యాడ్మింటన్ ఓపెన్

**సిడ్నీ:** టైటిల్ ఆశలతో ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో అడుగుపెట్టిన పీవీ సింధు సహా భారత బ్యాడ్మింటన్ స్టార్లు రెండో రౌండ్‌లోని ఓడిపోయి ఇంటిముఖం పట్టారు. గురువారమిక్కడ జరిగిన రెండో రౌండ్‌లో భారత్ స్టార్‌షెట్లర్ పీవీ సింధు థాయ్‌లాండ్‌కు చెందిన నిచాన్ జిందపోల్ చేతిలో 19-21, 18-21తో పరాజయం చెందింది. పురుషుల సింగిల్స్‌లో రెండో రౌండ్‌లో.... వాంగ్ జువీ(చైనీస్ తైపి)తో జరిగిన పోరులో సమీర్‌వర్మ 16-21, 21-7, 13-21తో ఓడాడు. రెండో సీడ్ ఆటగాడు ఆంథో సునుస్కా(ఇండోనేషియా) చేతిలో ప్రణీత్ 23-25, 9-21తో వరుస సెట్లు కోల్పోయి టోర్నీ నుంచి నిష్క్రమించాడు. భారత స్టార్ షెట్లర్ పారుపల్లి కశ్యప్... ఒలింపిక్ మాజీ చాంపియన్ లిన్ డాన్(చైనా) చేతిలో 17-21, 22-20, 14-21తో పరాజయం చెందాడు. పురుషుల డబుల్స్ రెండో రౌండ్‌లో రెండో సీడ్ జంట లి జున్హీ, లీ యుచెన్ చేతిలో సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి 19-21, 18-21తో వరుస సెట్లు కోల్పోయి పరాజయం చెందారు.

APEX Educational Services
T NEWS
TELANGANA'S GOLDEN EDUCATION FAIR - 2019
A MUST ATTEND EVENT FOR ASPIRING STUDENTS
FREE ENTRY 10AM - 7PM
Chief Guest
PROF T. PAPI REDDY
Chairman TSCHE
COMPLETED SSC / INTER / DEGREE
NEXT ఏంటి?
THE ANSWER TO YOUR EDUCATIONAL QUERIES END HERE...
Grand Inaguration @ 10:30 am Today
SSC, ఇంటర్, డిగ్రీ తర్వాత ఏ కోర్స్ చేస్తే బాగుంటుంది?
ఇంజనీరింగ్‌లో కాలేజ్ మరియు బ్రాంచ్ ఎంపికలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏంటి?
ఎంసెట్ వెబ్ ఆప్షన్స్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏంటి?
ఇలా ఎన్నో సందేహాలు నివృత్తి చేసుకోవడానికి తప్పక విచ్చేయండి.
1:00 PM to 2:00 PM స్టూడెంట్ నెంబర్ 1 అవ్వాలంటే..? - By SUDHEER SANDRA.
2:30 PM to 3:30 PM ఎంసెట్ వెబ్ ఆప్షన్స్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలేంటి..? - By DINESH KUMAR GATTU.
4:00 PM to 5:00 PM IMPORTANCE OF ENGLISH IN PROFESSIONAL EDUCATION - By PROF. SUMITA ROY.
5:00 PM to 6:30 PM విద్యార్థి నుండి విజేత వరకు..! - By DR. BV. PATTABHIRAM.
JUNE 07 08 09 FRI SAT SUN
NIZAM COLLEGE GROUNDS, HYDERABAD.
VISIT & WIN ATTRACTIVE GIFTS
* లక్కీడ్రాలో పాల్గొనడానికి ఉచిత రిజిస్ట్రేషన్ తప్పకుండా చేసుకోగలరు.
PLATINUM SPONSOR: MARRI LAXMAN REDDY GROUP OF INSTITUTIONS
DIAMOND SPONSOR: Sri Indu
GOLD SPONSOR: CMR
SILVER SPONSORS: VIGNAN, GNI, BRILLIANT, నారాయణ IAS అకాడమీ
CO-SPONSORS: ST. MARTIN'S, Anurag, Geethanjali Institutions, ASHOKA, శ్రీచైతన్య, SRIGAYATRI, JB GROUP
GIFT SPONSOR: ST. MARY'S GROUP
PRINT MEDIA PARTNERS: నమస్తే తెలంగాణ, మన తెలంగాణ
OUT DOOR MEDIA PARTNER: Prakash Arts, Uni ads Limited
WEB MEDIA PARTNERS: greattelangaana.com




# ఆసీస్ అదుర్స్

### వెస్టిండీస్‌పై 15 పరుగులతో విజయం
### స్మిత్, నైల్ అర్ధసెంచరీలతో విజృంభణ
### స్టార్క్‌కు ఐదు వికెట్లు

**నాటింగ్‌హామ్:** ఎన్ని ఒడిదొడుకులు ఎదురైనా.. పోరాటాన్ని తమ నరనరాన జీర్ణించుకోవడంలో ఆస్ట్రేలియాను మించిన జట్టు లేదు. రికార్డు స్థాయిలో ఆరోసారి ప్రపంచకప్‌ను ముద్దాడాలన్న తలంపుతో బరిలోకి దిగిన కంగారూలు అందుకు తగ్గట్లు దూసుకెళుతున్నారు. పాక్‌ను చిత్తుచిత్తుగా ఓడించి జోరు మీద కనిపించిన కరీబియన్లను తమ సమిష్టి ప్రదర్శనతో నేలకు దించారు. గురువారం జరిగిన మ్యాచ్‌లో ఆసీస్ 15 పరుగుల తేడాతో విండీస్‌పై విజయం సాధించింది. ఆసీస్ నిర్దేశించిన 289 పరుగుల లక్ష్యఛేదనలో విండీస్ 50 ఓవర్లలో 273/9 స్కోరు చేసింది. షాయి హోప్(105 బంతుల్లో 68, 7ఫోర్లు), హోల్డర్(57 బంతుల్లో 51, 7ఫోర్లు, సిక్స్) అర్ధసెంచరీలతో ఆకట్టుకున్నారు. స్టార్క్(5/46) ఐదు వికెట్లతో విజృంభించగా, కమ్మిన్స్(2/41) రెండు వికెట్లు తీశాడు. తొలుత స్మిత్(103 బంతుల్లో 73, 7ఫోర్లు), కౌల్టర్‌నైల్(60 బంతుల్లో 92, 8ఫోర్లు, 4సిక్స్‌లు) అర్ధసెంచరీలతో రాణించడంతో ఆసీస్ 49 ఓవర్లలో 288 పరుగులు చేసింది. బ్రాత్‌వైట్(3/67), థామస్(2/63), కాట్రెల్(2/56), రస్సెల్(2/41) ఆకట్టుకున్నారు. అర్ధసెంచరీతో జట్టుకు పోరాడే స్కోరు కట్టబెట్టిన నైల్‌కు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ దక్కింది.

**స్టార్క్ పాంచ్ పటాకా:**
నిర్దేశిత లక్ష్యఛేదన కోసం బ్యాటింగ్‌కు దిగిన విండీస్‌కు ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. కమ్మిన్స్ రెండో ఓవర్లో ఓపెనర్ లెవిస్(1) సింగిల్ డిజిట్ స్కోరుకే ఔటయ్యాడు. గేల్ తనదైన దూకుడు కనబరుస్తూ బౌండరీలతో విరుచుకుపడటంతో లక్ష్యం దిశగా సాఫీగా సాగినట్లు అనిపించింది. ఒకే ఓవర్లో రెండు సార్లు ఔట్ నుంచి బయటపడ్డ గేల్‌ను స్టార్క్ పెవిలియన్ పంపాడు. ఫుల్‌లెంగ్త్‌ను ఆడే క్రమంలో గేల్ వికెట్ల ముందు అడ్డంగా దొరికిపోయాడు. దీంతో విండీస్ శిబిరంలో ఒత్తిడిలో కూరుకుపోయింది. మిడిలార్డర్‌లో హోప్, పూరన్(40) గెలుపు దిశగా నడిపించినా..వరుస విరామాల్లో వికెట్లు కోల్పోవడం చిక్కులు తెచ్చిపెట్టింది. ఆఖర్లో కెప్టెన్ హోల్డర్ ఆఖరి వరుస బ్యాట్స్‌మెన్ రస్సెల్(15), బ్రాత్‌వైట్(16), నర్స్(19 నాటౌట్)తో కలిసి జట్టును గెలిపించే ప్రయత్నం నెరవేరలేదు. ఆసీస్ పట్టువిడువకుండా పోరాడటంతో విండీస్ దీటుగా సమాధానమివ్వలేక గెలిచే మ్యాచ్‌ను చేజార్చుకుంది. చివరి ఓవర్లో నర్స్ వరుసగా 4 ఫోర్లు కొట్టినా..ఫలితం లేకుండా పోయింది.

**కంగారెత్తించిన కరీబియన్లు:**
టాస్ గెలిచిన వెస్టిండీస్ కెప్టెన్ జాసన్ హోల్డర్ ఏ మాత్రం తడబాటు లేకుండా లక్ష్యఛేదన వైపు మొగ్గు చూపాడు. పాకిస్థాన్‌ను చిత్తుగా ఓడించిన పిచ్‌పై తిరిగి అదే ఫలితాన్ని పునరావృతం చేద్దామనుకున్న కెప్టెన్ అంచనాలకు అనుగుణంగా విండీస్ బౌలర్లు ఆసీస్ బ్యాట్స్‌మెన్‌కు ముచ్చెమటలు పట్టించారు. పిచ్‌ను తమకు అనుకూలంగా మలుచుకుంటూ షార్ట్‌పిచ్ బంతులు, బౌన్సర్లతో కంగారూలకు చుక్కలు చూపించారు. బ్రాత్‌వైట్(3/67), ఓషానె థామస్(2/63), కాట్రెల్(2/56), రస్సెల్(2/41) విజృంభణతో డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియా మరో ఓవర్ మిగిలుండగానే 288 పరుగులకు ఆలౌటైంది. తొలుత థామస్, కాట్రెల్ పేస్ ద్వయం ఆసీస్ ఓపెనర్లు ఫించ్(6), వార్నర్(3)ను క్రీజులో కుదురుకోనివ్వలేదు. థామస్ వేసిన ఇన్నింగ్స్ మూడో ఓవర్లో ఫించ్..వికెట్ కీపర్ హోప్‌కు క్యాచ్ ఇచ్చి తొలి వికెట్‌గా వెనుదిరిగాడు. ఆఫ్ స్టంప్ దిశగా వెళుతున్న బంతిని షాట్ ఆడబోయిన ఫించ్.థామస్‌కు వికెట్ సమర్పించుకున్నాడు. ఆ మరసటి ఓవర్లోనే వార్నర్ కూడా ఫించ్‌ను అనుసరించాడు. కాట్రెల్ బంతిని షాట్‌గా మలుచబోయిన వార్నర్..బ్యాక్‌వర్డ్ పాయింట్‌లో హెట్‌మైర్ క్యాచ్‌తో వెనుదిరిగాడు. వార్నర్‌ను ఔట్ చేసిన ఆనందంలో కాట్రెల్ తనదైన శైలిలో మిలటరీ సెల్యూట్‌తో ప్రేక్షకులకు అభివాదం చేశాడు. దీంతో ఆసీస్ 26 పరుగులకే ఓపెనర్లను కోల్పోయింది. ఇన్నింగ్స్ చక్కదిద్దే బాధ్యతను స్టీవ్ స్మిత్, ఉస్మాన్ ఖవాజ(13) భుజానికి ఎత్తుకున్నారు. అయితే అదే కరీబియన్ పేసర్లు ఖవాజను పెవిలియన్ పంపి తమ పేస్ రుచి ఏంటో చూపించారు. రస్సెల్ బౌలింగ్‌లో కీపర్ హోప్ సూపర్ క్యాచ్‌తో ఖవాజ మూడో వికెట్‌గా నిష్క్రమించాడు. ఆదుకుంటాడనుకున్న విధ్వంసక వీరుడు మ్యాక్స్‌వెల్(0) పరుగుల ఖాతా తెరువకుండానే పెవిలియన్ బాట పట్టాడు. ఇలా ఓవైపు వరుసగా వికెట్లు పడుతున్నా..స్మిత్ వెనుకకు తగ్గలేదు. మ్యాక్స్‌వెల్ స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన ఆల్‌రౌండర్ స్టోయినిస్..బ్రాత్‌వైట్ బౌలింగ్‌లో రెండు ఫోర్లతో విరుచుకుపడటంతో రెగ్యులర్ పవర్ ప్లే ముగిసే సరికి ఆసీస్ 4 వికెట్లు కోల్పోయి 48 పరుగులు చేసింది. ఇన్నింగ్స్ కుదురుకుంటున్న తరుణంలో హోల్డర్ మళ్లీ దెబ్బతీశాడు. భారీ షాట్ ఆడబోయిన స్టోయినిస్..మిడ్‌వికెట్‌లో పూరన్ క్యాచ్‌తో ఔటయ్యాడు. దీంతో ఆసీస్ 79 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయింది.

**స్మిత్, నైల్ విజృంభణ:**
నిషేధం తర్వాత వార్నర్, స్మిత్ అదరగొడుతున్నారు. ఆఫ్ఘన్‌తో మ్యాచ్‌లో వార్నర్ రాణిస్తే..విండీస్‌తో మలి మ్యాచ్‌లో స్మిత్(73) బాధ్యతాయుత ఆటతీరుతో జట్టును ఒడ్డున పడేశాడు. టాపార్డర్ వికెట్లు కోల్పోయి స్వల్ప స్కోరుకే పరిమితమైతుందా అనుకున్న జట్టును స్మిత్ గాడిన పడేసిన తీరు ఆకట్టుకుంది. ఆరో వికెట్‌కు అలెక్స్ క్యారీ(45)తో కలిసి 68 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పిన స్మిత్..ఆ తర్వాత కౌల్టర్‌నైల్(92)తో ఇన్నింగ్స్‌ను మరో స్థాయికి తీసుకెళ్లాడు. ముఖ్యంగా కౌల్టర్‌నైల్ స్పెషలిస్టు బ్యాట్స్‌మెన్ తరహాలో చూడచక్కని ఆటతీరుతో ఆకట్టుకున్నాడు. కుదురుకోవడాని కొంత సమయం తీసుకున్న నైల్.. ఆ తర్వాత స్మిత్‌కు పోటీనిచ్చాడు. వీలుచిక్కినప్పుడల్లా బౌండరీలు కొడుతూ స్కోరును అంతకంతకు పెంచుకుంటూ పోయారు. ఈ క్రమంలో అర్ధసెంచరీలు పూర్తి చేసుకుని జోరు మీద కనిపించిన స్థితిలో స్మిత్..కాట్రెల్ అద్భుత క్యాచ్‌తో ఔట్ కావడంతో ఏడో వికెట్‌కు 102 పరుగులకు బ్రేక్ పడింది. కాట్రెల్ బౌలింగ్‌లో నైల్ కొట్టిన రెండు భారీ సిక్స్‌లు మ్యాచ్‌కు హైలెట్‌గా నిలిచాయి.

### స్కోరు బోర్డు

**ఆస్ట్రేలియా:** వార్నర్(సి)హెట్‌మైర్(బి)కాట్రెల్ 3, ఫించ్(సి)హోప్(బి)థామస్ 6, ఖవాజ(సి)హోప్(బి)రస్సెల్ 13, స్మిత్(సి)కాట్రెల్(బి)థామస్ 73, మ్యాక్స్‌వెల్(సి)హోప్(బి)కాట్రెల్ 0, స్టోయినిస్(సి)పూరన్(బి)హోల్డర్ 19, క్యారీ(సి)హోప్(బి)రస్సెల్ 45, కౌల్టర్‌నైల్(సి)హోల్డర్(బి)బ్రాత్‌వైట్ 92, కమ్మిన్స్(సి)కాట్రెల్(బి)బ్రాత్‌వైట్ 2, స్టార్క్(సి)హోల్డర్(బి)బ్రాత్‌వైట్ 8, జంపా 0 నాటౌట్; **ఎక్స్‌ట్రాలు:** 27; **మొత్తం:** 49 ఓవర్లలో 288 ఆలౌట్; **వికెట్లపతనం:** 1-15, 2-26, 3-36, 4-38, 5-79, 6-147, 7-249, 8-268, 9-284, 10-288; **బౌలింగ్:** థామస్ 10-0-62-2, కాట్రెల్ 9-0-56-2, రస్సెల్ 8-0-41-2, బ్రాత్‌వైట్ 10-0-67-3, హోల్డర్ 7-2-28-1, నర్స్ 5-0-31-0.

**వెస్టిండీస్:** గేల్(ఎల్బీ)స్టార్క్ 21, లెవిస్(సి)స్మిత్(బి)కమ్మిన్స్ 1, హోప్(సి)ఖవాజ(బి)కమ్మిన్స్ 68, పూరన్(సి)ఫించ్(బి)జంపా 40, హెట్‌మైర్(రనౌట్) 21, హోల్డర్ (సి)జంపా(బి)స్టార్క్ 51, రస్సెల్ (సి)మ్యాక్స్‌వెల్(బి)స్టార్క్ 15, బ్రాత్‌వైట్(సి)ఫించ్(బి)స్టార్క్ 16, నర్స్ 19 నాటౌట్, కాట్రెల్ (బి)స్టార్క్ 1, థామస్ 0 నాటౌట్; **ఎక్స్‌ట్రాలు:** 20; **మొత్తం:** 50 ఓవర్లలో 273/9; **వికెట్ల పతనం:** 1-7, 2-31, 3-99, 4-149, 5-190, 6-216, 7-252, 8-252, 9-256; **బౌలింగ్:** స్టార్క్ 10-1-46-5, కమ్మిన్స్ 10-3-41-2, కౌల్టర్‌నైల్ 10-0-70-0, మ్యాక్స్‌వెల్ 6-1-31-0, జంపా 10-0-58-1, స్టోయినిస్ 4-0-18-0.

# అనిసిమోవా సంచలనం

### డిఫెండింగ్ చాంపియన్ హెలెప్‌పై గెలుపు..



**పారిస్:** ఫ్రెంచ్ ఓపెన్ మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్‌లో సంచలనం నమోదైంది. 17ఏళ్ల అమందా అనిసిమోవా(51వ ర్యాంకు)... డిఫెండింగ్ చాంపియన్, మూడో సీడ్ సిమోనా హలెప్(రొమేనియా)ను ఓడించింది. 6-2,6-4 తేడాతో విజయం సాధించి సెమీఫైనల్‌కు చేరుకుంది. ఈ టోర్నీ చరిత్రలో 1990 తర్వాత అతితక్కువ వయసులో సెమీస్‌కు చేరిన టెన్నిస్‌తారగా రికార్డు సృష్టించింది. మరో క్వార్టర్ ఫైనల్‌లో ఎం.కీస్(అమెరికా)ను ఆస్ట్రేలియాకు చెందిన ఆష్లే బార్టీ ఓడించింది. సెమీస్‌లో అనిసిమోవాతో తలపడనుంది. పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్స్‌లో ప్రపంచ నంబర్ వన్ నొవాక్ జకోవిచ్ విజయం సాధించి సెమీస్‌కు చేరాడు. మరో మ్యాచ్‌లో కె.కచనోవ్(రష్యా)పై డి.థీమ్(రష్యా) గెలిచి ముందడుగేశాడు. శుక్రవారం జరిగే పురుషుల సెమీస్‌లో దిగ్గజ ఆటగాళ్లు ఫెదరర్-నాదల్, జకోవిచ్-డి.థీమ్ తలపడనున్నారు.

డిఫెండింగ్ చాంపియన్‌పై సునాయసంగా..డిఫెండింగ్ చాంపియన్ హెలెప్‌పై అనిసిమోవా సునాయస విజయం సాధించింది. 6-2, 6-4తో గెలిచి సెమీస్‌కు దూసుకెళ్లింది. మ్యాచ్ మొదటి నుంచి ఆధిపత్యం ప్రదర్శించిన అనిసిమోవా మొత్తం 25 విన్నర్స్‌ను బాదింది. ఆమె దూకుడైన ఆటతో ఖంగుతిన్న హెలెప్ రెండుసార్లు డబుల్ ఫాల్ట్ చేయడమే కాకుండా మ్యాచ్ మొత్తమ్మీద 17 తప్పిదాలు చేసి ఓటమి చవి చూసింది. తొలి సెట్ ఐదో గేమ్‌లో 4-2తో హెలెప్ సర్వ్‌ను బ్రేక్ చేసిన అనిసిమోవా.. ఏ దశలోనూ వెనక్కి తగ్గలేదు. తొలి సెట్‌ను 6-2తో గెలుచుకుంది. రెండో రౌండ్‌లోనూ మరింత దూకుడు పెంచింది. బలమైన షాట్లతో చురుగ్గా కదులుతూ విరుచుకుపడింది. 4-4తో ఉన్న సమయంలో హెలెప్ సర్వ్‌ను బ్రేక్ చేసి.. 6-4తో రెండో సెట్ సాధించి మ్యాచ్‌ను గెలిచింది. సెమీస్ చేరింది. మహిళల మరో క్వార్టర్స్‌లో ఎం.కీస్(అమెరికా)పై ఏ.బార్టీ(ఆస్ట్రేలియా) 6-3,7-5తో వరుససెట్లను గెలిచి సెమీస్‌కు చేరింది.

పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్స్‌లో..ప్రపంచ నంబర్ వన్ నొవాక్ జకోవిచ్(సెర్బియా)... అలెగ్జాండర్ జ్వెర్వ్(జర్మనీ,ఐదో సీడ్)పై 7-5, 6-2,6-2తో సునాయస విజయం సాధించాడు. అలెగ్జాండర్ మొత్తం పది ఏస్‌లు సాధించినా... ఎనిమిది డబుల్ ఫాల్ట్‌లు చేసి అనుభవలేమిని ప్రదర్శిస్తే.. ఏకంగా ఆరు సార్లు ప్రత్యర్థి సర్వ్‌ను బ్రేక్ చేసి తన సత్తా ఏంటో చూపించాడు జకోవిచ్. మ్యాచ్ మొత్తం మీద 35 విన్నర్లు సాధించిన సెర్బియా వీరుడి ధాటికి... అలెగ్జాండర్ ఏకంగా 40 తప్పిదాలు చేశాడు. జకోవిచ్‌కు సునాయస విజయాన్ని అందించాడు. సెమీస్‌లో జకో.. కె.కచనోవ్(రష్యా)పై విజయం సాధించిన డి.థీమ్(రష్యా)తో తలపడనున్నాడు. క్వార్టర్స్‌లో కచనోవ్‌పై థీమ్ 6-2,6-4, 6-2తో సునాయస విజయం సాధించాడు. ఫ్రెంచ్ ఓపెన్ సెమీఫైనల్ మ్యాచ్‌లు శుక్రవారం జరగనున్నాయి.

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 39,530 | 11,844 |
| ↘554 | ↘177 |

ముడి చమురు (బ్రెంట్) ↘ 60.57 డాలర్లు

**బంగారం ధరలు**

| న్యూఢిల్లీ (రూ.లలో) | |
|---|---|
| 24 క్యారెట్లు | 33,490 |
| 22 క్యారెట్లు | 33,320 |
| వెండి (కిలో) | 37,900 |

**విదేశీ మారకం**

| కరెన్సీ | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|
| అమెరికా డాలర్ | 66.40 | 71.90 |
| యూరో | 74.40 | 82.40 |
| బహ్రెయిన్ దినార్ | 174.00 | 188.00 |
| కువైట్ దినార్ | 218.00 | 233.00 |
| సౌదీ రియాల్ | 17.00 | 18.80 |
| యూఏఈ దిర్హామ్ | 17.50 | 19.10 |

**చికెన్ ధరలు**

| (రూ.లలో) | |
|---|---|
| ఫారం ధర | 128.00 |
| రిటైల్ లైవ్ | 150.00 |
| డ్రెస్డ్ | 218.00 |
| స్కిన్‌లెస్ | 248.00 |

**నెక్ (వంద గుడ్లకు)**

| (రూ.లలో) | |
|---|---|
| హైదరాబాద్ | 335-00 |
| రంగారెడ్డి | 335-00 |
| మెదక్ | 335-00 |
| కరీంనగర్ | 338-00 |
| వరంగల్ | 338-00 |
| రిటైల్ ప్రైస్ | 3-95 |

# రుణాలు మరింత చౌక

## వడ్డీరేట్లు పావుశాతం తగ్గించిన ఆర్బీఐ

### 5.75 శాతానికి రెపోరేటు.. గృహ, వాహన రుణాలపై తగ్గనున్న ఈఎంఐ

### తొమ్మిదేండ్ల కనిష్ఠ స్థాయికి వడ్డీరేటు

**ముంబై, జూన్ 6:** ఐదేండ్ల కనిష్ఠ స్థాయికి పడిపోయిన దేశీయ ప్రగతి చక్రాలను మళ్లీ గాడిలో పెట్టడానికి రిజర్వు బ్యాంక్ కీలక వడ్డీరేట్లను తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో ద్వైమాసిక పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను గురువారం ప్రకటించింది. ఇందులో రెపో రేటుపై పావు శాతం కోత విధించింది. ఆర్బీఐ తీసుకున్న తాజా నిర్ణయంతో ప్రస్తుతం 6 శాతంగా ఉన్న రెపో రేటు 5.75 శాతానికి తగ్గనున్నది. అలాగే రివర్స్ రెపోరేటును 5.50 శాతానికి తగ్గించిన సెంట్రల్ బ్యాంక్..బ్యాంక్ రేటును 6 శాతానికి సవరించింది.బ్యాంక్ తీసుకున్న తాజా నిర్ణయంతో గృహ, వాహన, ఇతర రుణాలపై నెలవారి చెల్లింపులు మరింత తగ్గనున్నాయి. ప్రస్తుత సంవత్సరంలో వడ్డీరేట్లను తగ్గించడం ఇది మూడోసారి కావడం విశేషం. దీంతో వడ్డీరేట్లు తొమ్మిదేండ్ల కనిష్ఠ స్థాయికి జారుకున్నాయి. ఐదేండ్ల కనిష్ఠ స్థాయికి పడిపోయిన దేశ వృద్ధిరేటుకు మళ్లీ ఊతమివ్వడానికి, ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టడంతో వడ్డీరేట్లను తగ్గించాలని ఆర్బీఐ నిర్ణయించింది. ఆరుగురు సభ్యులు కలిగిన పరపతి సమీక్షలో అందరూ వడ్డీరేట్లను తగ్గించడానికి ఓటువేశారు. శక్తికాంత దాస్ ఆర్బీఐ గవర్నర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత జరిగిన వరుస సమీక్షల్లో వడ్డీరేట్లను పావు శాతం చొప్పును 75 బేసిస్ పాయింట్ల వరకు తగ్గించడం విశేషం. 2010 జూలై తర్వాత రెపో రేటు 5.75 శాతంగా ఉండగా, ఆ తర్వాత ఇంత తక్కువ స్థాయికి పడిపోవడం ఇదే తొలిసారి. ఈ సందర్భంగా దాస్ మాట్లాడుతూ..వరుస మూడు సమీక్షల్లో వడ్డీరేట్లను తగ్గించినప్పటికీ బ్యాంకులు మాత్రం వడ్డీరేట్లు తగ్గించడానికి ఆసక్తి చూపడం లేదని, ఈసారైన రేట్లను తగ్గించాలని ఆయన ఆదేశించారు. జనవరి-మార్చి మధ్యకాలంలో భారత వృద్ధిరేటు ఐదేండ్ల కనిష్ఠ స్థాయి 5.8 శాతానికి జారుకున్న విషయం తెలిసిందే. తొలిసారిగా చైనా కంటే తక్కువ వృద్ధిని నమోదు చేసుకున్నది. ఆర్బీఐ తీసుకున్న ఈ తాజా నిర్ణయంతో వృద్ధికి ఊతమివ్వడంతోపాటు మందకొడిగా కొనసాగుతున్న దేశ ఆర్థిక వ్యవస్థ పరుగులు పెట్టే అవకాశం ఉన్నది. నూతన ఆర్థిక మంత్రిగా నియమితులైన నిర్మలా సీతారామన్ వచ్చే నెలలో ప్రవేశపెట్టబోతున్న సార్వత్రిక బడ్జెట్‌లో పలు కీలక నిర్ణయాలు ప్రకటించబోతున్నట్లు తెలుస్తున్నది. వీటిలో ఉద్యోగ కల్పన, ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి పలు చర్యలు ప్రకటించనున్నారు. నిలకడైన ప్రభుత్వం ఏర్పాటు కావడం, అధిక సామర్థ్యాన్ని వినియోగించుకోవడం, స్టాక్ మార్కెట్లు రాకెట్ వేగంతో దూసుకుపోవడం, వ్యాపార సానుకూల పవనాలతో రెండో త్రైమాసికంలో వృద్ధి పరుగులు పెట్టే అవకాశాలున్నాయని పాలసీ కమిటీ పేర్కొంది.

**బ్యాంకులు తగ్గించింది సగమే**

వరుస సమీక్షల్లో రిజర్వు బ్యాంక్ వడ్డీరేట్లను పావుశాతం చొప్పున రెండు సార్లు తగ్గించినప్పటికీ ఈ ప్రయోజనాన్ని రుణ గ్రహీతలకు అందించడంలో బ్యాంకులు ఆసక్తి చూపడం లేదు. జనవరి, ఏప్రిల్ నెలలో జరిగిన సమీక్షలో ఆర్బీఐ వరుసగా అరశాతం వడ్డీరేట్లను తగ్గించగా, బ్యాంకులు మాత్రం వీటిలో సగానికి సగం అంటే 0.21 శాతం మాత్రమే వడ్డీరేట్లను తగ్గించి చేతులు జులుపుకున్నాయి. మేము వడ్డీరేట్లను తగ్గిస్తుపోతున్నప్పటికీ.. బ్యాంకులు మాత్రం పెడచెవిన పెడుతున్నాయని, భవిష్యత్తులో బ్యాంకులు ఇంట్రెస్ట్ రేట్లను తగ్గించకపోతే బాగుండదని ఆయన పరోక్షంగా హెచ్చరికలు జారీ చేశారు. తద్వారా నూతనంగా రుణాలు తీసుకునే వారికి, గతంలో తీసుకున్న వారికి ఆర్థికంగా ప్రయోజనం కలుగనున్నదని టాటా క్యాపిటల్ ఎండీ, చీఫ్ ఎగ్జిక్యూటివ్ రాజీవ్ సభర్వాల్ తెలిపారు.

**నాలుగు రోజుల్లో ఎన్‌పీఏ మార్గదర్శకాలు**

మొండి బకాయిల భరతం పట్టడానికి రిజర్వు బ్యాంక్ మరో ఆయుధాన్ని సందించబోతున్నది. ఫిబ్రవరి 12 సర్క్యూలర్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసిన నేపథ్యంలో మరో మూడు నుంచి నాలుగు రోజుల్లో నూతన మార్గదర్శకాలను విడుదల చేయనున్నట్లు దాస్ ప్రకటించారు. ఫిబ్రవరి 12, 2018న సెంట్రల్ బ్యాంక్ జారీ చేసిన మార్గదర్శకాలను ఈ ఏడాది ఏప్రిల్ 2న సుప్రీంకోర్టు ఆభ్యంతరాలు వ్యక్తంచేసిన విషయం తెలిసిందే. సవరించిన మార్గదర్శకాలను త్వరలో విడుదల చేయనున్నట్లు సమీక్ష సమావేశం అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దాస్ చెప్పారు. ఎన్‌పీఏలను గుర్తించేక్రమంలో ఎన్నో అభ్యంతరాలు వ్యక్తమయ్యాయని, ముఖ్యంగా పలు చట్టపరమైన ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకోసమే ఈ మార్గదర్శకాల విడుదల ఆలస్యమైందన్నారు. రూ.2 వేల కోట్ల కంటే అధిక రుణాలు తీసుకొని ఎగ్గొట్టిన వారిని 180 రోజుల్లో వీటిని ఎన్‌పీఏలుగా గుర్తించే అవకాశం ఉండేది.



ముంబైలో జరిగిన సమీక్షా సమావేశం అనంతరం ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్‌తో డిప్యూటీ గవర్నర్లు

## ఆగస్టులో చిన్న ఫైనాన్స్ బ్యాంకుల నూతన మార్గదర్శకాలు

చిన్న మొత్తాల్లో రుణాలు అందించడానికి త్వరలో చిన్నస్థాయి ఫైనాన్స్ బ్యాంకులు రాబోతున్నాయి. ఇందుకు సంబంధించి వచ్చే రెండు నెలల్లో రిజర్వు బ్యాంక్ మార్గదర్శకాలను జారీ చేయబోతున్నది. బ్యాంకింగ్ సదుపాయాలు లేనిచోట సామాన్యులకు రుణాలు అందించే ఉద్దేశంలో భాగంగా సెంట్రల్ బ్యాంక్ ఈ చిన్న స్థాయి ఫైనాన్స్ బ్యాంకులను తెరపైకి తీసుకొచ్చింది. సెప్టెంబర్ 2015లోనే సెంట్రల్ బ్యాంక్ 10 సంస్థలకు ప్రాథమికంగా అనుమతినిచ్చింది. అర్హత కలిగిన సంస్థలు..లైసెన్స్ కోసం వేచిచూడకుండా తమ కార్యకలాపాలను ప్రారంభించుకోవచ్చునని సూచించింది. ఇప్పటికే ఉజ్జీవన్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, జనలక్ష్మీ ఫైనాన్షియల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, ఈఎస్‌ఏఎఫ్ మైక్రోఫైనాన్స్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్, ఈక్విటాస్ హోల్డింగ్స్ లిమిటెడ్‌లు లైసెన్స్ పొందిన పది సంస్థల్లో ఉన్నాయి. బ్యాంకింగ్ సేవల్లో భాగంగా ఈ చిన్న స్థాయి ఆర్థిక సేవల సంస్థలు..డిపాజిట్లను తీసుకోవడంతోపాటు రుణాలు ఇవ్వడం, చిన్న స్థాయి వ్యాపారాలకు ఆర్థికంగా చేయూతనందించడం, రైతులకు రుణాలు ఇవ్వనున్నాయి.

## తగ్గనున్న ఏటీఎం చార్జీలు!

బ్యాంక్ ఖాతాదారులకు సెంట్రల్ బ్యాంక్ మరో ఉపశమనాన్ని కల్పించబోతున్నది. ప్రస్తుతం ఏటీఎం వినియోగించడంపై విధిస్తున్న చార్జీలను తగ్గించడానికి కసరత్తు చేస్తున్నది. ఇందుకోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయబోతున్నట్లు శక్తి కాంత దాస్ ప్రకటించారు. ఈ కమిటీ తొలిసారి సమావేశమైన తర్వాత రెండు నెలల్లో తన తుది నివేదికను సమర్పించనున్నట్లు ఆయన వెల్లడించారు. తొలి సమావేశం ఎప్పుడనేదానిపై ఆయన స్పష్టమైన సమాధానం ఇవ్వలేదు. ఈ కమిటీలో ఆయా బ్యాంకుల చైర్మన్లు, చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారులు, ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ సభ్యులు ఉండనున్నారు. ఏటీఎం చార్జీలు, ఫీజులు తగ్గించాలని బ్యాంక్ ఖాతాదారుల డిమాండ్ నేపథ్యంలో సెంట్రల్ బ్యాంక్ ఈ నిర్ణయం తీసుకున్నది.

## ముున్ముందు ద్రవ్యోల్బణంతో సవాళ్లే..

మున్ముందు ద్రవ్యోల్బణంతో సవాళ్లు తప్పవని రిజర్వు బ్యాంక్ తాజాగా హెచ్చరికలు జారీ చేసింది. ఒకవైపు ఆహార పదార్థాల ధరలు భగ్గుమంటుండటం, మరోవైపు ఇంధన ధరలు కూడా పెరుగుతుండటంతో ఈ ఏడాది తొలి ఆరు నెలల్లో ద్రవ్యోల్బణం 3-3.1 శాతం మధ్యలోకి చేరుకోనున్నదని ఆర్బీఐ అంచనావేస్తున్నది. గత సమీక్షలో ద్రవ్యోల్బణం 2.9-3 శాతం లోపు ఉంటుందని అంచనావేసిన సెంట్రల్ బ్యాంక్..ఈ సారి తన అంచనాను సవరించింది. అక్టోబర్ నుంచి మార్చి మధ్యకాలంలో రిటైల్ ద్రవ్యోల్బణ గణాంకాలు 3.4 శాతం-3.7 శాతం మధ్యలో నమోదవనున్నదని వెల్లడించింది. వేసవికాలంలో కూరగాయల ధరలు అంచనాలకుమించి పెరుగడం వల్లనే గణాంకాల అంచనాలను మార్చినట్లు తెలిపింది.

### సమీక్షలో ముఖ్య అంశాలు..

- రెపోరేటు 25 బేసిస్ పాయింట్లు తగ్గించడంతో 5.75 శాతానికి వడ్డీరేటు.
- రివర్స్ రెపోరేటు 5.50 శాతానికి, మార్జినల్ స్టాండింగ్ ఫెసిలిటీ రేటు 6 శాతం.
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జీడీపీ అంచనాను 7.2 శాతం నుంచి 7 శాతానికి కుదింపు.
- తొలి అర్థభాగంలో ద్రవ్యోల్బణం 3-3.10 శాతం లోపు, రెండో అర్థభాగంలో 3.4 - 3.7 శాతంగా ఉండవచ్చును.
- స్వల్పకాలంలో ఆహార పదార్థాలు భగ్గుమనుండటంతో ద్రవ్యోల్బణ గణాంకాలు పెరిగే అవకాశం ఉన్నది.
- డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించడానికి ఆర్టీజీఎస్, నెఫ్ట్ చార్జీలను పూర్తిగా ఎత్తివేసిన సెంట్రల్ బ్యాంక్.
- మే 31 నాటికి విదేశీ ఎక్స్చేంజ్ రిజర్వులు 421.9 బిలియన్ డాలర్లు.
- ఆగస్టు 7న తన తదుపరి సమీక్ష.

### ఎవరు.. ఏమన్నారు..!

మరోదఫా వడ్డీరేట్లు తగ్గించే అవకాశాలు ఉన్నాయి. ఈ ఏడాది ఇప్పటివరకు మూడు సార్లు తగ్గించినప్పటికీ రిటైల్, కార్పొరేట్ రంగంలో రుణ వితరణ పెరుగాలంటే మరో సారి తగ్గించాల్సిన అవసరం ఉన్నది.
**- సందీప్ సోమాన్యా, ఫిక్కీ ప్రెసిడెంట్**

దాస్ మూడుసార్లు వడ్డీరేట్లను తగ్గించినప్పటికీ బ్యాంకులు మాత్రం వడ్డీరేట్లను తగ్గించడం లేదు. ఒకవేళ తగ్గిస్తే నిధులు లభ్యత పెరుగడంతోపాటు రుణాల చెల్లింపులు మరింత తగ్గనున్నాయి.
**- బీకే గోయెంకా, అసోచామ్ ప్రెసిడెంట్**

వృద్ధిరేటు అవసరాలను బట్టి బ్యాంకులు వడ్డీరేట్లను తగ్గిస్తాయి.
**- సునీల్ మెహతా, ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ చైర్మన్**

ఆందోళనకర స్థాయిలో కదలాడుతున్న ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వాలనే ఉద్దేశంతో సెంట్రల్ బ్యాంక్ వడ్డీరేట్లను తగ్గించింది.
**- రజనీష్ కుమార్, ఎస్బీఐ చైర్మన్**

స్వల్పకాలంపాటు వృద్ధిని పెంచే ఉద్దేశంలోభాగంగా ఆర్బీఐ కీలక నిర్ణయం తీసుకున్నది.
**-దీనబంధు మోహపాత్ర, బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎండీ**

### ఎన్‌బీఎఫ్‌సీలపై ప్రత్యేక దృష్టి

బ్యాంకింగేతర సంస్థల్లో జరుగుతున్న మోసాలను అరికట్టడానికి రిజర్వు బ్యాంక్ నడుంబిగించింది. ఎన్‌బీఎఫ్‌సీ, హౌజింగ్ ఫైనాన్స్ కంపెనీల ఆర్థిక స్థితిగతులపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు గురువారం ఆర్బీఐ ప్రకటించింది. బాండ్ల జారీ చేయడం ద్వారా సేకరించిన నిధులను తిరిగి చెల్లింపులు జరుపడంలో డీహెచ్‌ఎఫ్‌ఎల్ విఫలమైన నేపథ్యంలో శక్తికాంత దాస్ ఈ వ్యాఖ్యలు చేశారు. దాస్ వ్యాఖ్యల నేపథ్యంలో స్టాక్ మార్కెట్లో ఈ రంగ షేర్లు కుదేలయ్యాయి.

## బ్యాంక్ ఖాతాదారులకు శుభవార్త

■ **ఆర్టీజీఎస్, నెఫ్ట్ చార్జీల ఎత్తివేత**




బ్యాంక్ ఖాతాదారులకు రిజర్వు బ్యాంక్ శుభవార్తను అందించింది. డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించడంలో భాగంగా ఆర్టీజీఎస్, నెఫ్ట్ ద్వారా జరిపే లావాదేవీలపై విధించే చార్జీలను పూర్తిగా ఎత్తివేస్తున్నట్లు గురువారం ఆర్బీఐ ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను రెండో ద్వైమాసిక సమీక్షలో భాగంగా రిజర్వు బ్యాంక్ ఈ నిర్ణయం తీసుకున్నది. వెంటనే ఈ ప్రయోజనాన్ని బ్యాంకులు తమ ఖాతాదారులకు బదిలీ చేయాలని ఆదేశించింది కూడా. ఎక్కువ మొత్తంలో నగదు బదిలీ కోసం రియల్ టైమ్ గ్రాస్ సెటిల్‌మెంట్ సిస్టమ్(ఆర్టీజీఎస్), రూ.2 లక్షల వరకు నగదు లావాదేవీలకోసం నేషనల్ ఎల్రక్టానిక్ ఫండ్స్ ట్రాన్స్‌ఫర్ (ఎన్‌ఈఎఫ్‌టీ) వ్యవస్థను ఉపయోగిస్తున్నారు. అయితే వీటి ద్వారా నగదు బదిలీ చేసినప్పుడు బ్యాంకులు కొంతమేర చార్జీలు విధిస్తుంటాయి. ప్రభుత్వరంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) నెఫ్ట్ ద్వారా జరిపే లావాదేవీలపై రూ.1 నుంచి రూ.5 వరకు, ఆర్టీజీఎస్ లావాదేవీలపై రూ.5 నుంచి రూ.50 వరకు చార్జీలు విధిస్తున్నది. సాధారణంగా ఈ లావాదేవీలపై బ్యాంకుల నుంచి ఆర్బీఐ చార్జీలు వసూలు చేస్తుండటంతో బ్యాంకులు ఖాతాదారుల నుంచి రుసుమును తీసుకుంటున్నాయి. అయితే డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించేందుకు గాను ఈ చార్జీలను పూర్తిగా ఎత్తివేస్తున్నట్లు గురువారం ప్రకటించింది.

## వృద్ధి అంచనాల్లో కోత




రిజర్వు బ్యాంక్ కూడా దేశీయ వృద్ధి అంచనాల్లో కోత విధించింది. 2019-20 ఆర్థిక సంవత్సరంలో గతంలో 7.2 శాతంగా ఉంటుందని అంచనావేసిన ఆర్బీఐ..ప్రస్తుతానికిగాను దీనిని 7 శాతానికి కుదించింది. దేశీయ కార్యకలాపాల్లో నెలకొన్న మందగమనం, అంతర్జాతీయంగా వాణిజ్య యుద్ధంతో వృద్ధిరేటు తగ్గించడానికి ప్రధాన కారణాలని పేర్కొంది. ఏప్రిల్ నెలకుగాను ప్రకటించిన పరపతి సమీక్ష అప్పుడు ఈ ఏడాదికిగాను వృద్ధి 7.2 శాతంగా ఉంటుందని అంచనావేసింది. తొలి ఆరు నెలల్లో 6.8 శాతం నుంచి 7.1 శాతంగాను, రెండో అర్థభాగంలో 7.3-7.4 శాతానికి ఎగబాకనున్నదని పేర్కొంది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో నెలకొన్న మందకొడి పెట్టుబడులు ఈ ఏడాది కూడా కొనసాగనున్నాయని, అమెరికా-చైనా దేశాల మధ్య కొనసాగుతున్న వాణిజ్య యుద్ధమేఘాలు కూడా పెట్టుబడులపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని పేర్కొంది. ప్రైవేట్ పెట్టుబడులు కూడా నిరాశావాదంగా ఉండటం, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో గడిచిన కొన్ని నెలలుగా తగ్గుముఖం పట్టడం వృద్ధికి బ్రేక్ పడుతున్నదని తెలిపింది. కానీ, ఇదే సమయంలో నిలకడైన ప్రభుత్వం ఏర్పాటు కావడంతో బిజినెస్ అంచనాలు ఊపందుకోవడంతో రెండో త్రైమాసికం నాటికి పరిస్థితులు కుదుటపడే అవకాశం ఉన్నదని పేర్కొంది. జనవరి-మార్చి మధ్యకాలానికిగాను దేశ వృద్ధిరేటు ఐదేండ్ల కనిష్ఠ స్థాయి 5.8 శాతానికి పడిపోయిన విషయం తెలిసిందే.

## పదవీ విరమణ చేయనున్న అజీం

### విప్రో నూతన చైర్మన్‌గా రిషద్ ప్రేమ్‌జీ



**బెంగళూరు, జూన్ 6:** దేశంలో మూడో అతిపెద్ద ఐటీ సేవల సంస్థ విప్రో నాయకత్వంలో పలు మార్పులు చోటు చేసుకున్నాయి. కంపెనీ వ్యవస్థాపకుడు, 53 ఏళ్లుగా ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు నిర్వర్తించిన అజీం ప్రేమ్‌జీ వచ్చే నెల చివర్లో పదవీ విరమణ చేయబోతున్నారు. అజీం ప్రేమ్‌జీ పదవీ విరమణ చేయనున్నప్పటికీ కంపెనీ బోర్డులో నాన్-ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా 2024వరకు కొనసాగనున్నారు. ప్రస్తుతం కంపెనీ చీఫ్ స్ట్రాటజీ అధికారిగాను, బోర్డు సభ్యుడిగా విధులు నిర్వహిస్తున్న ఆయన కుమారుడు రిషద్ ప్రేమ్‌జీ నూతన చైర్మన్‌గా నియమితులయ్యారు. అలాగే కంపెనీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న అబిదాలి జెడ్ నీముచ్‌వాలాకు పదోన్నతి కల్పించింది. జూలై 31 నుంచి ఆయన చీఫ్ ఎగ్జిక్యూటివ్‌గాను, మేనేజింగ్ డైరెక్టర్‌గాను కొనసాగనున్నారు. 'విప్రోను అంతర్జాతీయ స్థాయికి తీర్చిదిద్దిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు..ముఖ్యంగా క్లయింట్లకు, భాగస్వామ్యులకు, ఇతర వాటాదారులు తమపై పెట్టుకున్న నమ్మకం, విశ్వాసం వల్లనే ఇది సాధ్యమైందని' అజీం ప్రేమ్‌జీ పేర్కొన్నారు. భవిష్యత్తులో దాతృత్వ కార్యకలాపాలకు మరింత సమయం వెచ్చించడానికి వీలు పడనున్నదన్న ఆయన..రిషద్ నాయకత్వంపై పూర్తి స్థాయి నమ్మకం ఉన్నదని వ్యాఖ్యానించారు. ఆయన సారథ్యంలో సంస్థ పురోగతి సాధించే అవకాశాలున్నాయన్నారు. చిన్న స్థాయిలో ప్రారంభమైన విప్రో.. అంచెలంచెలుగా ఎదుగుతూ 8.5 బిలియన్ డాలర్ల స్థాయి కంపెనీగా అవతరించింది. అజీం ప్రేమ్‌జీ సారథ్యంలో ఎఫ్‌ఎంసీజీ, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇంజినీరింగ్ అండ్ మెడికల్ డివైజ్ విభాగాల్లోకి ప్రవేశించింది కూడా. నూతన చైర్మన్‌గా నియమితులైన రిషద్ ప్రేమ్‌జీ మాట్లాడుతూ..నూతన చైర్మన్‌గా నియమితులవడం చాలా సంతోషంగా ఉన్నది, వాటాదారులకు, ఉద్యోగులకు మెరుగైన సేవలు అందించడానికి తనవంతుగా కృషి చేయనున్నట్లు ప్రకటించారు.

## సైలస్‌లో వాటాపెంచుకున్న సైయెంట్

**హైదరాబాద్, జూన్ 6:** హైదరాబాద్ కేంద్రస్థానంగా ఐటీ సేవలు అందిస్తున్న సైయెంట్ లిమిటెడ్..కార్పొరేట్ వెంచర్ ఇన్వెస్ట్‌మెంట్‌లో భాగంగా ఇజ్రాయిల్ కేంద్రస్థానంగా సేవలు అందిస్తున్న సైలస్‌లో వాటాను మరింత పెంచుకున్నది. ఈ వాటాను కొనుగోలు చేయడానికి ఎంతమేర పెట్టుబడులు పెట్టేదానిపై స్పష్టమైన సమాధానం ఇవ్వలేదు. భవిష్యత్తు పెట్టుబడుల్లోభాగంగా రైల్ ఇండస్ట్రీస్‌లో స్మార్ట్‌గా, వేగవంతంగా పరిష్కారం లభించనున్నదని ఒక ప్రకటనలో వెల్లడించింది. ఇరు సంస్థలు కలిపి సైబర్ సెక్యూరిటీ రంగంలో ఉన్న అవకాశాలను అందుకోవాలని చూస్తున్నాయి.




## మార్కెట్లకు ఆర్బీఐ షాక్

### సెన్సెక్స్ 554 పాయింట్లు, నిఫ్టీ 178 పాయింట్లు క్షీణత



**ముంబై, జూన్ 6:** రిజర్వు బ్యాంక్ వడ్డీరేట్లను తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయం స్టాక్ మార్కెట్లకు ఏ మాత్రం రుచించలేదు. బ్యాంకింగ్, ఆర్థిక రంగాల షేర్లు అమాంతం పడిపోవడంతో దలాల్‌స్ట్రీట్ అమ్మకాలు మిన్నంటాయి. తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిన బ్యాంకింగేతర సంస్థలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు సెంట్రల్ బ్యాంక్ ప్రకటనతో మదుపరుల్లో ఆందోళనను మరింత పెంచింది. బాంబే స్టాక్ ఎక్స్చేంజ్ సూచీ సెన్సెక్స్ ఏకంగా 550 పాయింట్లకు పైగా పడిపోవడంతో 40 వేల దిగువకు పడిపోగా, జాతీయ స్టాక్ ఎక్స్చేంజ్ సూచీ నిఫ్టీ 11,900 దిగువకు జారుకున్నది.ఉదయం స్వల్ప నష్టాలతో ప్రారంభమైన సూచీలు సెంట్రల్ బ్యాంక్ తన పరపతి సమీక్షను ప్రకటించిన మరుక్షణమే కుప్పకూలింది. 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ 553.82 పాయింట్లు లేదా 1.38 శాతం పడిపోయి 39,529.72 వద్ద స్థిరపడింది. నిఫ్టీ కూడా 177.90 పాయింట్లు (1.48 శాతం) కోల్పోయి 11,843.75 పాయింట్ల వద్ద ముగిసింది. ప్రస్తుత సంవత్సరంలో ఇంతటి భారీ స్థాయిలో పడిపోవడం ఇదే తొలిసారి. ఏప్రిల్ 22న సెన్సెక్స్ 495.10, నిఫ్టీ 158.35 పాయింట్లు పడిపోయిన విషయం తెలిసిందే. బ్యాంకింగ్, ఇంధన, క్యాపిటల్ గూడ్స్ రంగాల్లో నెలకొన్న ఒత్తిడి పతనానికి ఆజ్యం పోసింది.

**ఆర్థిక, రియల్టీ, వాహన షేర్లలో అలజడి**

ఆర్థిక సంక్షోభానికి కారణమవుతున్న ఎన్‌బీఎఫ్‌సీల ఆర్థిక స్థితిగతులను దగ్గరగా పర్యవేక్షించనున్నట్లు ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ వ్యాఖ్యలు మార్కెట్లో ప్రకంపనాలు సృష్టించాయి. వడ్డీరేట్ల తగ్గింపునకు సంబంధించిన బ్యాంకింగ్, వాహన, రియల్టీ రంగ షేర్లు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. ఈ రంగ షేర్లు ఏకంగా 7 శాతం వరకు నష్టపోయాయి. ఇండస్‌ఇండ్ బ్యాంక్ ఏకంగా 6.97 శాతం పడిపోగా, బ్యాంక్ ఆఫ్ బరోడా షేరు 6.33 శాతం, యెస్ బ్యాంక్ 6.15 శాతం, ఎస్బీఐ 4.34 శాతం, ఫెడరల్ బ్యాంక్ 2.69 శాతం, ఐసీఐసీఐ బ్యాంక్ 1.75 శాతం, యాక్సిస్ బ్యాంక్ 1.38 శాతం, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1.18 శాతం, కొటక్ మహీంద్రా బ్యాంక్ 1.05 శాతం నష్టపోయాయి. రియల్టీ రంగానికి చెందిన షేర్లలో గోద్రేజ్ ప్రాపర్టీస్ 4.13 శాతం క్షీణించగా, ఒబెరాయ్ రియల్టీ 3.60 శాతం, డీఎల్‌ఎఫ్ 2.53 శాతం పతనం చెందాయి. ఆటోమొబైల్ రంగానికి చెందిన షేర్లలో ఎంఆర్‌ఎఫ్ 3.12 శాతం మార్కెట్ వాటాను కోల్పోగా, మహీంద్రా 2.48 శాతం, టాటా మోటర్స్ 2.08 శాతం, అశోక్ లేలాండ్ 1.77 శాతం, మారుతి సుజుకీలు తగ్గాయి. వీటితోపాటు ఎల్ అండ్ టీ, టాటా స్టీల్, బజాజ్ ఫైనాన్స్, వేదాంత, ఆర్ఐఎల్‌లు కూడా తగ్గుముఖం పట్టాయి. కానీ, కోల్ ఇండియా, పవర్‌గ్రిడ్, ఎన్టీపీసీ, హెచ్‌యూఎల్, హీరో మోటోకార్ప్, ఇన్ఫోసిస్‌లు మాత్రం రెండు శాతం వరకు బలపడ్డాయి. రంగాల వారీగా చూస్తే బీఎస్‌ఈ బ్యాంకెక్స్ సూచీ 2.34 శాతం తగ్గి 34,653.44కి జారుకోగా, రియల్టీ ఇండెక్స్ 1.84 శాతం కోల్పోయి 2,173.03, ఆటో ఇండెక్స్ 1 శాతం కోల్పోయి 18,556.56 పాయింట్ల వద్ద ముగిసింది.

### రూ.2.22 లక్షల కోట్లు గోవిందా

స్టాక్ మార్కెట్ల భారీ పతనంతో మదుపరుల సంపద హారతి కర్పూరంలా కరిగిపోయింది. ప్రస్తుత సంవత్సరంలో ఒకే రోజు గురువారం భారీగా పతనమవడంతో మదుపరులు రూ.2.22 లక్షల కోట్ల మేర కోల్పోయారు. దీంతో స్టాక్ మార్కెట్లో లిస్టెన సంస్థల మార్కెట్ క్యాపిటలైజేషన్(ఎం-క్యాప్) విలువ రూ.2,22,304.65 కోట్లు తగ్గి రూ.1,53,19,126.66 కోట్లకు పడిపోయింది. వడ్డీరేట్లను తగ్గిస్తు సెంట్రల్ బ్యాంక్ తీసుకున్న నిర్ణయం, ఎన్‌బీఎఫ్‌సీలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు దాస్ ప్రకటన మదుపరుల్లో ఆందోళనను మరింత తీవ్రతరం చేసింది. దీంతో చేసేదేమిలేక అమ్మకాలకు మొగ్గుచూపారు. ఫలితంగా కంపెనీల నికర విలువ భారీగా పడిపోయింది.




## టయోటా నుంచి గ్లాంజా

■ ప్రారంభ ధర రూ.7.22 లక్షలు

**న్యూఢిల్లీ, జూన్ 6:** జపాన్‌కు చెందిన ఆటోమొబైల్ సంస్థ టయోటా..దేశీయ మార్కెట్లోకి ప్రీమియం హ్యాచ్‌బ్యాక్ 'గ్లాంజా'ను విడుదల చేసింది. మారుతికి చెందిన బాలెనో వెర్షన్‌లాగా ఉండే ఈ కారు ధరను రూ.7.22 లక్షల నుంచి రూ.8.9 లక్షల మధ్యలో నిర్ణయించింది. బీఎస్-6 ప్రమాణాలకు లోబడి 1.2 లీటర్ల పెట్రోల్ ఇంజిన్‌తో తయారైన ఈ కారులో ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్‌ను ఎంపిక చేసుకునే అవకాశం కూడా వినియోగదారులకు కల్పించింది. ప్రస్తుతం మారుతి సుజుకీ..నాలుగు రకాలు కలిగిన పెట్రోల్, డీజిల్ ఇంజిన్‌తో తయారైన బాలెనోను విక్రయిస్తున్నది. ఈ సందర్భంగా టయోటా కిర్లోస్కర్ మోటార్ ఎండీ మసకజు యోషిమురా మాట్లాడుతూ..డైనమిక్ మార్కెట్‌లాంటి భారత్‌లోకి ఈ నూతన కారును విడుదల చేసినట్లు, వినియోగదారులు కోరుకుంటున్న అన్ని రకాల ఫీచర్స్ దీంట్లో ఉన్నాయన్నారు. ఈ కారుపై మూడేండ్లు/లక్ష కిలోమీటర్ల వ్యారెంటీని ఐదు సంవత్సరాలు/2.2 లక్షల కిలోమీటర్లకు పెంచింది. ఆండ్రాయిడ్ ఆటో కలిగిన టచ్‌స్క్రీన్ ఫీచర్, స్మార్ట్‌ఫోన్లలో ఉండే నావిగేషన్ సిస్టమ్ యాపిల్ కార్‌ప్లే వంటి ఫీచర్స్ ఈ కారులో ఉన్నాయి. వినియోగదారుల నుంచి డిమాండ్ ఆధారంగా వాహనాలను విక్రయించాలనుకుంటున్నట్లు, లక్ష్యాన్ని మాత్రం నిర్దేశించుకోలేదని ఆయన స్పష్టంచేశారు.

## నాట్కో కొత్తురు ప్లాంట్‌పై అమెరికా అభ్యంతరాలు

**హైదరాబాద్, జూన్ 6:** రాష్ట్రానికి చెందిన ప్రముఖ ఫార్మా సంస్థ నాట్కో ఫార్మా లిమిటెడ్‌కు చెందిన కొత్తురు యూనిట్‌పై అమెరికా నియంత్రణ మండలి అధికారుల తనిఖీలు చేసి తొమ్మిది అభ్యంతరాలను వ్యక్తంచేశారు. ఇందుకు సంబంధించి ఫామ్ 483ని జారీ చేసినట్లు కంపెనీ ఒక ప్రకటనలో వెల్లడించింది. మే 30 నుంచి జూన్ 5 వరకు కంపెనీకి కొత్తురులో ఉన్న ఔషధ తయారీ ప్లాంట్‌ను యూఎస్‌ఎఫ్‌డీఏ ఉన్నతాధికారులు తనిఖీ చేశారని, వీరు లేవనెత్తిన 9 అభ్యంతరాలను వచ్చే పదిహేను రోజుల్లో సరిదిద్దనున్నట్లు కంపెనీ ఒక ప్రకటనలో వెల్లడించింది. కంపెనీకి సంబంధించిన సమాచారం గురించి అభ్యంతరాలను వ్యక్తంచేయలేదని, కేవలం ప్లాంట్లో ఉత్పత్తి అవుతున్న ఔషధాల గురించి మాత్రమే అనుమానాలు వ్యక్తంచేసిందని తెలిపింది. దీంతో స్టాక్ మార్కెట్లో కంపెనీ షేరు ధర 2.13 శాతం తగ్గి రూ.535.30 వద్దకు జారుకున్నది.

## ఏపీఎస్‌ఆర్టీసీలో సమ్మె సైరన్

**అమరావతి:** తమ డిమాండ్ల పరిష్కారం కోసం ఏపీఎస్‌ఆర్టీసీ కార్మికసంఘాలు యాజమాన్యంతో జరిపిన చర్చలు విఫలమయ్యాయి. తాము ప్రతిపాదించిన 26 డిమాండ్లు పరిష్కరించాలని ఆ సంఘాలు డిమాండ్ చేశాయి. ఆర్టీసీ యాజమాన్యంతో సమావేశం అనంతరం కార్మిక సంఘాల జేఏసీ నేత దామోదర్ మీడియాతో మాట్లాడుతూ.. గడువు కావాలని యాజమాన్యం కోరిందని.. అయితే ఇప్పటికే జూన్ 13ను సమ్మె తేదీగా ప్రకటించినందున ఈ విషయంలో వెనక్కి తగ్గేదిలేదన్నారు.



గురువారం మెక్సికోలోని శాన్‌లూయిస్ పాటోసి రాష్ట్రంలో నిర్వహించిన తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో నృత్యాలు చేస్తున్న దృశ్యం

## మెక్సికోలో తెలంగాణ ఆవిర్భావ వేడుకలు

పెద్దఎత్తున పాల్గొన్న తెలంగాణ ప్రవాసులు, మెక్సికన్లు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ (టీటా) మెక్సికో చాప్టర్ ఆధ్వర్యంలో మెక్సికోలోని శాన్‌లూయిస్ పాటోసి రాష్ట్రంలో గురువారం అట్టహాసంగా నిర్వహించారు. మెక్సికోలో నివసిస్తున్న తెలంగాణ ప్రవాసులు, మెక్సికన్లు పెద్దఎత్తున సంబురాల్లో పాల్గొన్నారు. మెక్సికో దేశం, తెలంగాణ రాష్ట్రం మధ్య సంస్కృతి, పర్యాటక సంబంధాన్ని చాటిచెప్పేలా నిర్వహించిన ఆవిర్భావ వేడుకలను శాన్‌లూయిస్ రాష్ట్ర ప్రభుత్వ అధికారులు ప్రశంసించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. వేడుకలకు శాన్‌లూయిస్ పాటోసి రాష్ట్ర స్కూల్ ఎడ్యుకేషన్, స్టేట్ డ్యాన్స్‌స్కూల్ డైరెక్టర్ ఎల్డా ఓజునా మార్టినెజ్ జెపుటురా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తెలంగాణ చరిత్ర, సంస్కృతి, పర్యాటకం గురించి టీటా కల్చర్ అండ్ టూర్ కోఆర్డినేటర్ రమేశ్ వారికి వివరించారు. త్వరలో వివిధ కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఎల్డా ఓజునా మార్టినెజ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం విజేతలకు చిరునామా అని ప్రశంసించారు. హైదరాబాద్ అద్భుతమైన చారిత్రక నేపథ్యం కలిగి ఉండి, అభివృద్ధిపథంలో దూసుకెళ్తూ ప్రపంచం చూపును ఆకర్షిస్తున్నదని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలతో మెక్సికో, భారత్‌ల మధ్య సంబంధాలు మరింత బలపడుతాయని అభిప్రాయపడ్డారు.

# దేవాలయాలకు నిధులు కేటాయించాలి

కేంద్ర హోంశాఖ సహాయమంత్రి కిషన్‌రెడ్డికి తెలంగాణ అర్చక సమాఖ్య విజ్ఞప్తి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు ఉన్నాయని, రాష్ట్రంలోని పురాతన దేవాలయాలకు కేంద్రం నిధులు కేటాయించాలని తెలంగాణ అర్చక సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గంగు ఉపేంద్రశర్మ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో గురువారం తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి వేణుగోపాలాచారితో కలిసి ఆయన కేంద్ర సహాయమంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. తెలంగాణలోని కేంద్ర పురావస్తుశాఖ ఆధీనంలోని దేవాలయాలు, కట్టడాలకు నిధులు విడుదలచేయించేలా కేంద్ర పర్యాటకశాఖను ఒప్పించాలని కోరారు. చార్మినార్, గోల్కొండ, అలంపూర్ జోగుళాంబ దేవాలయం, వేయిస్తంభాల దేవాలయం, రామప్ప, వరంగల్ కోట కట్టడాలకు నిధులు కేటాయించాలని కోరారు. తెలంగాణ ప్రాంతాన్ని టూరిజం హబ్‌గా మార్చాలని విజ్ఞప్తిచేశారు. కేంద్రం ఆధీనంలో ఉన్న దేవాలయాలు, కట్టడాలపై నివేదిక తెప్పించి, నిధులు వచ్చేలా కృషిచేస్తానని కిషన్‌రెడ్డి హామీ ఇచ్చినట్టు గంగు ఉపేంద్రశర్మ తెలిపారు. ఆయనవెంట అర్చకసమాఖ్య ప్రతినిధులు వేముగంటి సుధాకర్‌శర్మ ఉన్నారు.



ఢిల్లీలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కలిసిన తెలంగాణ అర్చక సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గంగు ఉపేంద్రశర్మ తదితరులు

### నేడు రాష్ట్రానికి కిషన్‌రెడ్డి

కేంద్ర హోంశాఖ సహాయమంత్రి జీ కిషన్‌రెడ్డి నాలుగురోజులపాటు స్వరాష్ట్రంలో పర్యటించనున్నారు. శుక్రవారం సాయంత్రం బేగంపేట విమానాశ్రయానికి చేరుకోనున్న ఆయనకు స్వాగతం పలికేందుకు బీజేపీ శ్రేణులు సిద్ధమయ్యాయి. మంత్రి వివిధ కార్యక్రమాల్లో పాల్గొని 11న తిరిగి ఢిల్లీ వెళ్తారు.











## ఎమ్మెల్యేల విలీనంపై కాంగ్రెస్ నేతల నిరసన

అదుపులోకి తీసుకుని వదిలేసిన పోలీసులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కాంగ్రెస్ ఎమ్మెల్యేలను టీఆర్‌ఎస్ పార్టీలో విలీనం చేయడాన్ని నిరసిస్తూ అసెంబ్లీ ఆవరణలో నిరసనకు దిగిన తెలంగాణ కాం గ్రెస్ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకుని అనంతరం వదిలేశారు. తమను టీఆర్‌ఎస్‌లో విలీనంచేయాలని కోరుతూ గురువారం ఉదయం 12 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డిని కలిశారు. వారి విలీనాన్ని నిరసిస్తూ అసెంబ్లీ వద్ద ఉన్న మహాత్మాగాంధీ విగ్రహం ఎదుట సీఎల్పీ నేత భట్టివిక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మాజీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు నోటికి నల్లగుడ్డలు కట్టుకుని నిరసన చేపట్టారు. దీంతో అసెంబ్లీ బయట ట్రాఫిక్ జామ్ కాగా, పోలీసులు బలవంతంగా వారిని టప్పాచబుత్ర పోలీస్‌స్టేషన్‌కు తరలించి.. అనంతరం వదిలేశారు. పీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. పీసీసీ చీఫ్‌కు సమాచారం లేకుండా ఎల్పీ సమావేశం ఎలా పెడుతారని ప్రశ్నించారు. ఈ విషయాన్ని న్యాయపరంగా ఎదుర్కొంటామని తెలిపారు.



పెండ్లిండ్ల సీజన్ ఇంకా ఉంది.. ఈ సమయంలో మామూలు చీరలు కట్టలేం.. అలా అని బరువైన పట్టు గురించి ఆలోచిస్తేనే.. చెమటలు పట్టేస్తాయేమో కదా! మరి ఎలా అనే సందేహం లేకుండా.. పట్టులోనే తేలికైన.. సౌకర్యవంతమైన పట్టు ఒకటుంది.. అదే ఉప్పాడ.. ఈ కాలంలో ఉత్తమమైంది! ఆ కలెక్షన్‌నే ఈ వారం మీ కోసం తీసుకొచ్చాం..

# ఉత్తమమైన.. ఉప్పాడ!



సిల్వర్ కలర్ ఉప్పాడ టిష్యూ చీర ఇది. చీర మొత్తం ఒకే ప్యాటర్న్‌లో ఉంటుంది. దీనికి పూర్తి కాంట్రాస్ట్‌గా ఏ కలర్ బ్లౌజ్ వేసినా సూటవుతుంది. బ్లౌజ్‌కి మాత్రం హెవీ వర్క్ చేయించడం మరువద్దు. గ్రాండ్ లుక్ కోరుకునే వాళ్లు ఈ చీర ట్రై చేయండి.



కామాక్షి మహంకాళి
ఫౌండర్/చైర్మన్
www.vynam.com
లార్జెస్ట్ సిల్క్ అండ్ హ్యాండ్‌లూమ్ కలెక్షన్స్
ఫోన్: 8296848484
9000564333

మల్టీ కలర్‌లో వచ్చిన ఉప్పాడ చీర చూడగానే ఆకట్టుకునేలా ఉంది. బ్లూ, రెడ్, హాఫ్ వైట్‌కాంబినేషనల్ చీర వచ్చింది. దీనికి గోల్డెన్ జరీ బార్డర్, హాఫ్ వైట్ పల్లూ చూడ ముచ్చటగా ఉంది. దీనికి కూడా కాంట్రాస్ట్ బ్లౌజ్ వేస్తే సూపర్ లుక్ సొంతమవుతుంది.

క్లాస్‌గా కనిపించేందుకు ఈ చీర కట్టాల్సిందే! ఉప్పాడ లోనే పోచంపల్లి డిజైన్ వచ్చిన చీర ఇది. పింక్ కలర్‌లో ఉన్న ఈ చీరకి గోల్డెన్, పింక్ కలర్ బార్డర్ జతకావడంతో మరింత అందంగా కనిపిస్తున్నది. చీరతో వచ్చే బ్లౌజ్‌కి కాస్త వర్క్ చేయిస్తే మరింత బాగుంటారు.

చెక్స్ ప్యాటర్న్ ఇప్పుడు నడుస్తున్న ట్రెండ్. మల్టీ కలర్ కాంబినేషన్‌లో వచ్చిన ఉప్పాడ చీర ఇది. గ్రీన్, రెడ్, బ్లూ, గోల్డ్ కాంబినేషన్ అదిరిపోయింది. పింక్ కలర్ కొంగు, బ్లౌజ్ అద్దినట్టుగా కనిపిస్తాయి.

## ఎదిగిన చదువుల తల్లి!



చిన్నప్పుడు ఆమె ఒక బెగ్గింగ్ మాఫియా బాధితురాలు. చదువు మీద ఉన్న ఆసక్తి ఆమె జీవితాన్నే మార్చేసింది. బస్తీ పిల్లల జీవితాల్లో వెలుగులు నింపడానికి ఉపయోగపడు తున్నది.

నీతు హర్యానాకు చెందిన యువతి. పేదరిక కుటుంబం. హర్యానాలోని వీధుల్లో బలవంతంగా బెగ్గింగ్ మాఫియాకు చిక్కింది. కానీ వారికి తెలియకుండా పాఠశాలకు వెళ్లేది. పాఠశాల అయిపోయిన తర్వాత ఆమె గుళ్లలో, వీధుల్లో భిక్షాటన చేస్తున్నప్పుడు స్థానిక టీచర్లకు కనిపించింది. దీంతో ఆమెను చేరదీసి బెగ్గింగ్ మాఫియా నుంచి రక్షించారు. తర్వాత ఆమె పాఠశాల విద్యను అభ్యసించింది. గురువుల ప్రోత్సాహంతో బీఎడ్ చేసింది. స్థానికంగానే ఓ పాఠశాలలో గెస్ట్ ఫ్యాకల్టీగా చేరింది. కొన్నాళ్లు బాగానే ఉన్నా ఆ పాఠశాల వారు ఉపాధ్యాయులను తొలిగించారు. అప్పుడు ఆమె ఆ స్కూల్‌ని వదిలేయాల్సి వచ్చింది. ఒక రోజు రోడ్డు మీద నడుస్తున్నప్పుడు ఓ పాప భిక్షాటన చేస్తూ కనిపించింది. దీంతో నీతూకు తన చిన్నతనం గుర్తుకువచ్చింది. తనను ఆ టీచర్లు చేరదీసి ఉండకపోతే జీవితం ఇలా ఉండేది కాదని గుర్తుచేసుకుంది. వెంటనే అక్కడ కనిపించిన పాప తల్లిదండ్రులను కలిసి చదివించాలని కోరింది. అట్లా బస్తీలోని పిల్లల తల్లిదండ్రులందరితో మాట్లాడింది. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్య పథకం కింద కొందరిని పాఠశాలల్లో చేర్పించింది. ఇంకొందరినీ తానే సొంతంగా చేరదీసి వీధిలోని ఓ చెట్టుకింద పాఠాలు చెప్పడం ప్రారంభించింది. దీనికి మొదట చాలా అడ్డంకులే వచ్చాయి. కానీ ఆమె ప్రయత్నం అందరికీ అర్థం అవడంతో ఇప్పుడు సజావుగా సాగుతున్నది. బస్తీల్లో తిరిగే ఎనభై శాతం మంది పిల్లలు ఇప్పుడు ఆమె దగ్గర పాఠాలు నేర్చుకుంటున్నారు.

## కేశ సౌందర్యానికి ఉల్లి

ఉల్లిపాయ ఆరోగ్యానికే కాదు సౌందర్యానికీ ఉపయోగపడుతుంది. ప్రతి రోజూ వంటల్లో ఉల్లిగడ్డను ఉపయోగించడం వల్ల ఆరోగ్యంతో పాటు అందం కూడా భద్రంగా ఉంటుంది. అంతేకాకుండా ఉల్లిపాయలను ఉపయోగించి అందాన్ని ఎలా కాపాడుకోవచ్చో ఈ చిన్న చిట్కాల ద్వారా తెలుసుకుందాం.



- ఉల్లిపాయలలో అధిక శాతం సల్ఫర్ ఉంటుంది. సల్ఫర్ రక్త ప్రసరణను పెంచి, కురులకు శక్తిని ఇస్తుంది. ఉల్లిపాయను మెత్తగా చేసి తలకు రాయడం వల్ల జుట్టు రాలడాన్ని అరికడుతుంది. ఉల్లిపాయ పేస్టు తలకు పట్టించడం లేదా ఏదైనా ఇతర హెయిర్ ప్యాక్‌లతో ఈ పేస్టును కూడా కలిపి తలకు పట్టించాలి. ఇలా చేయడానికి అరగంట ముందు హాట్ ఆయిల్ మసాజ్ చేయాలి.
- ఉల్లిపాయ రసం తలలో ఇతర ఇన్‌ఫెక్షన్లను నివారిస్తుంది. ఫంగల్ ఇన్‌ఫెక్షన్ మీ కేశాలను డ్యామేజ్ చేయవచ్చు. అంతేకాదు అది జుట్టు రాలడానికి ముఖ్య కారణం కావచ్చు. కాబట్టి స్లాప్ ఇన్‌ఫెక్షన్ అరికట్టడానికి ఉల్లిపాయ రసాన్ని ఉపయోగిస్తే మంచిది.
- ఉల్లిపాయ రసాన్ని తలకు పట్టించడం వల్ల తలలో రక్తప్రసరణ బాగా జరిగి కొత్తగా వెంట్రుకలు మొలవడానికి సహాయపడుతుంది. ఉల్లిపాయలో ఉండే సల్ఫర్ హెయిర్ ఫాల్‌ను అరికట్టడమే కాదు, హెయిర్ గ్రోత్‌కు కూడా సహాయపడుతుంది.
- ఉల్లిపాయ రసాన్ని కొబ్బరి నూనెలో కలుపుకొని బాగా మిక్స్ చేసి మాడుకు మసాజ్ చేయాలి. అలా చేసిన అరగంట తర్వాత రెగ్యులర్‌గా ఉపయోగించే మంచి షాంపూతో, చల్లటి నీటితో తల స్నానం చేయాలి.
- హోం రెమిడీస్‌లలో చుండ్రును వదలగొట్టడానికి ఇదో అద్భుతమైన చిట్కా. ఉల్లిపాయ రసాన్ని తలకు పట్టించడం వల్ల హెయిర్ లాస్ అరికడుతుంది. అలాగే చుండ్రును నివారిస్తుంది. మీరు రెగ్యులర్‌గా తలకు వాడే హెయిర్ ప్యాక్‌కి కొద్దిగా ఉల్లిపాయ రసాన్ని కూడా చేర్చడం వల్ల చుండ్రు నివారణ అవుతుంది.

## పర్యావరణ హితంగా..!





ఇంటి కట్టడంలో రకరకాల లోహాలు, సిమెంటు, ఇసుకలతో పాటు ప్లాస్టిక్‌ను కూడా బాగా వినియోగిస్తున్నారు. దీనివల్ల పర్యావరణానికి నష్టం వాటిల్లుతున్నది. పర్యావరణహితం కోసం ఆధునిక యుగంలోనూ పురాతన పద్ధతులను అనుసరిస్తూ ఓ మహిళా ఆర్కిటెక్చర్ మట్టి, వెదురులతో ఇండ్లను నిర్మిస్తున్నది.


ఒడిశాలోని భువనేశ్వర్‌కు చెందిన ఆర్కిటెక్చర్ రేవతికామత్ పర్యావరణానికి మేలు చేసే పద్ధతిలో ఎన్నో ప్రాజెక్టులను తీర్చిదిద్దింది. 1990 నుంచి ఇప్పటి వరకూ ఆమె దేశంలో వివిధ ప్రాజెక్టులను డిజైన్ చేసింది. ఆమె డిజైన్లను అనుసరిస్తూ అనేక కట్టడాలను నిర్మించారు. ఇంటి గోడలకు మట్టితో తయారు చేసిన ఇటుకలను, పైకప్పును గడ్డి, వెదురుతోనూ నిర్మిస్తూ ఎంతో ఆదర్శంగా నిలుస్తున్నది రేవతికామత్. ఇండ్లన్ని పురాతనం నుంచి మట్టితోనే నిర్మించారని, అటువంటి ఇండ్లతో ఏమాత్రం హాని ఉండదని రేవతికామత్ చెబుతున్నది. అప్పట్లో ప్రపంచవ్యాప్తంగా ఇదే విధానాన్ని అనుసరించేవారని ఆమె అంటున్నది. ఎండాకాలం, వర్షాకాలం, చలికాలాలను దృష్టిలో పెట్టుకొని అప్పట్లో ఇండ్లు కట్టేవారు. అలా నిర్మించడం వల్ల అవి ఎంతో రక్షణగా నిలిచేవి. కామత్ డిజైన్ స్టూడియో పేరుతో ఓ డిజైన్ స్టూడియోను ప్రారంభించి జనాలను పర్యావరణహితం వైపు నడిపించే ప్రయత్నం చేస్తున్నది రేవతి. ఈమె డిజైన్ చేసిన ఇండ్లలో శంకుస్థాపన దగ్గర నుంచి ఇంటి పైకప్పు వరకూ ఇంటి నిర్మాణం మొత్తంలో కేవలం 3శాతం మాత్రమే సిమెంటును వినియోగిస్తుంది. నీళ్లు ఇంట్లోకి దిగకుండా ఉండేందుకు పలురకాల నూనెలను వాడుతుంది. గోడల మధ్యలో వెదురు దుంగలను, ఆవుపేడను ఉపయోగిస్తున్నది. రేవతి 100 శాతం పర్యావరణానికి మేలు చేసే ఉత్పత్తులతోనే ఇండ్లను నిర్మిస్తున్నది. రాజస్థాన్‌లో పలు చోట్ల మట్టి, వెదురు, గడ్డి ఉపయోగించి రిసార్టులు, ఇండ్లు, హోటళ్లు, భోపాల్‌లోని ట్రైబల్ హెరిటేజ్ మ్యూజియాన్ని కూడా నిర్మించింది.

## ఆపరేషన్ తర్వాత..?

**నా వయసు 38 యేండ్లు. ఈ మధ్యనే కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ ఆపరేషన్ చేయించుకున్నాను. నేను ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?**

**కె.ప్రసాద్, వరంగల్**

అడుగండి చెబుతా



కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ ఆపరేషన్ అయిన తర్వాత డాక్టర్లు ఇచ్చే మందులు క్రమం తప్పకుండా జీవితాంతం వాడాలి. చాలామంది పేషెంట్లు కిడ్నీ బాగా పనిచేస్తుంది కదా అనుకొని మందులు వాడడం ఆపుతారు. ఇలా చేయడం వల్ల కిడ్నీ రిజెక్ట్ అవుతుంది. కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ అయిన తర్వాత ఇన్‌ఫెక్షన్స్ వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. జలుబు గానీ, జ్వరం గానీ ఏ ఇబ్బంది తలెత్తినా వెంటనే డాక్టర్‌ను సంప్రదించండి. వారు ఇచ్చిన మందులు వాడాలి. డాక్టర్ పర్యవేక్షణ లేకుండా ఏ ఇతర మందులు వాడకూడదు. ఆహారం ఎప్పటికప్పుడు తయారు చేసుకొని తినాలి. గోరువెచ్చని నీటిని తాగాలి. ఇన్‌ఫెక్షన్ ఉన్న వ్యక్తులకు దూరంగా ఉండాలి. జన సందడి ఎక్కువగా ఉండే ప్రదేశాలకు వెళ్లకుండా జాగ్రత్త తీసుకోవాలి. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. బీపీ, షుగర్ ఉన్నట్లయితే వాటిని అదుపులో ఉంచుకోవాలి. దీంతో పాటు ప్రతిరోజూ వ్యాయామం చేయాలి.



డాక్టర్ విక్రాంత్ రెడ్డి
కన్సల్టెంట్ నెఫ్రాలజిస్ట్
కేర్ హాస్పిటల్స్,
బంజారాహిల్స్
హైదరాబాద్

II.
నమస్తే తెలంగాణ
# చింతన
[ కరీంనగర్ ]
శుక్రవారం 7 జూన్ 2019

## పర్వదినాలు

- వనగౌరీ వ్రతం (రేపు)
- భానుసప్తమి (9వ తేది)
- దశహర పాపదశమి (12వ తేది)
- గాయత్రీ జయంతి, రామలక్ష్మణ ద్వాదశి (13వ తేది)



## మేల్కొలుపు




**ఇత్థం వృషాచలపతే రిహ సుప్రభాతమ్**
**యే మానవా: ప్రతిదినం పఠితుం ప్రవృత్తా:**
**తేషాం ప్రభాత సమయే స్మృతిరంగ భాజాం**
**ప్రజ్ఞాం పరార్థ సులభాం పరమాం ప్రసూతే ॥ 29 ॥**
(సమాప్తం)

**- శ్రీ వేంకటేశ్వర సుప్రభాతమ్**

ఇదీ వృషాచలపతి అయిన శ్రీ వేంకటేశ్వర స్వామి పరమ పవిత్ర సుప్రభాతం. ఈ రకంగా స్తోత్రయుక్తంగా ప్రభాత సమయంలో ఎవరు దీనిని ప్రతి దినం పఠిస్తూ ఉంటారో.. వారికి మోక్ష సాధనకు కావలసిన ప్రజ్ఞాసంపత్తి లభిస్తుంది.

## మంచిమాట



ఎప్పుడూ సత్యాన్నే పలకండి. ధర్మంగానే జీవించండి. శాస్త్రాలను అధ్యయనం చేయండి. సత్యమార్గాన్ని, నైతిక నియమాలను ఎంతమాత్రం విడవవద్దు. అలాగే, ప్రకృతి సంపదలను నిర్లక్ష్యం చేయకండి.

**- తైత్తిరియోపనిషత్ (1.11.1)**

తత్త్వబోధ

# సృష్టికర్తే అసలు సంస్కర్త!



**'స్వార్థానికి మరోపేరు మనిషి' అని ఊరకే అనరు. దీనికి సంబంధించిన ఆధ్యాత్మిక కథ ఒకటి ఉపనిషత్తుల్లో కనిపిస్తుంది. భగవంతుడు సృష్టి చేసిన తర్వాత పంచభూతాలకు ఆకలేసింది. అవి భగవంతునితో తమ ఆకలిని తీర్చమని అడిగాయట. అప్పుడు భగవంతుడు గోవును సృష్టించి ''అందులో ప్రవేశించి, తద్వారా మీ ఆకలి తీర్చుకొనండి'' అని ఆదేశించాడట. అవి వెంటనే గోవులోకి ప్రవేశించాయి. కానీ, వాటి ఆకలి తీరలేదు. ఆ కారణంగా అవి తిరిగి భగవంతుడిని ''గోవు మా ఆకలి తీర్చజాలదు. మరొక దాన్ని సృష్టించండి'' అని కోరాయట. అప్పుడు భగవంతుడు బాగా ఆలోచించి మనిషిని సృష్టించాడట. పంచభూతాలు వెంటనే మనిషిలోకి ప్రవేశించి, 'మనిషే తమ ఆకలి తీర్చడానికి అనువైన వాడని' నిశ్చయించుకొని భగవంతునికి కృతజ్ఞతలు చెప్పుకొన్నాయట! ఈ కథవల్ల మనకు తెలుస్తున్నదేమంటే, 'మనిషి స్వార్థపరుడుగా పుట్టాడని'. అందుకే, భగవంతుడు మనుషులను తీర్చిదిద్దే క్రమంలో ''దానగుణం అలవర్చుకోండి. స్వార్థపరులు కాకండి'' అని సందేశమిచ్చాడు 'మూడు దాల' కథలో. ఏమిటా మూడు దాలకథ? చదవండి మరి!**

మానవులందరూ భగవంతుని సంతానమే. అతనికందరూ ప్రేమపాత్రులే. అందరి సుఖదు:ఖాలనూ పట్టించుకొనే వాడు, దు:ఖం నుంచి బయట పడవేసి, మోక్షాన్ని ఇచ్చేవాడు భగవంతుడే. ఆయనెంత కరుణాలువో తెలియజేసే కథే ఈ 'మూడు దాలకథ'. ప్రకృతికి మూడు గుణాలున్నవి. ఒకటి: సత్వగుణం, రెండు: రజోగుణం, మూడు: తమోగుణం. ఈ గుణాల న్యూనాధిక్యతల వల్లనే మనుషులు మూడుపేర్లతో వ్యవహరింపబడుతున్నారు.

నిజానికి భగవంతుడు ఇతర ప్రాణికోటి లాగానే మానవజాతిని సృష్టించాడు. 'ఆకృతి గ్రహణాజ్జాతి:' అని దర్శనం చెపుతుంది. ఆకారం వల్లనే జాతి గుర్తింపబడుతుంది. అందువల్ల మానవులదంతా ఒకే జాతి. కాని స్వభావాలను బట్టి ఆయా పేర్లతో పిలువబడుతారు. సత్వగుణాధిక్యతవల్ల మానవులు దేవతలుగాను, రజోగుణాధిక్యత వల్ల కేవలం మానవులుగాను, తమోగుణాధిక్యత వల్ల రాక్షసులుగాను వ్యవహరింపబడుతారు. కావాలని భగవంతుడు రాక్షసులను సృష్టించడు. మన స్వభావంతోనే రాక్షసులమనిపించుకుంటాం.

అదే విధంగా దేవతలు కూడా ప్రత్యేకంగా సృష్టింపబడరు. దేవలోకం ప్రత్యేకంగా ఉండదు. మానవులలో జ్ఞానులెవరైతే ఉన్నారో వారే దేవతలు. వారున్న లోకం దేవలోకం. అంతేగాని, దేవతలకు ప్రత్యేకంగా ఒక లోకం సృష్టింపబడడం గాని, దానికి వెయ్యి నేత్రాలున్న పెద్ద మనిషి ఒకరిని అధిపతిగా చేయడం గాని వట్టి కల్పన మాత్రమే. విషయం ఏమంటే, మనలోనే దేవతలున్నారు, రాక్షసులున్నారు. ఐతే, సృష్టికర్త కోరిక ఏమంటే, మనమంతా మానవులుగా పుట్టినప్పటికీ రాక్షసులం కాకుండా, దేవతలం కావాలని మాత్రమే. సమాజం సజావుగా నడవాలంటే ఎప్పటికప్పుడు దాన్ని పునర్నిర్మిస్తూ ఉండాలి. అందుకు తల్లిదండ్రులు, గురువులు, పాలకులు పూనుకోవాలి. వీరినే ఒకమాటలో మార్గదర్శకులని చెప్పవచ్చు. భగవంతుడు సమస్త జీవుల క్షేమం కోరేవాడని మొదటనే చెప్పుకొన్నాం కదా! ఆయన కేవలం సృష్టికర్త మాత్రమే కాదు, సంస్కర్త కూడా అనడానికి ఈ 'మూడు దాలకథ' చక్కని నిదర్శనం.

### ఆ వేదవాక్కు నిజం కావాలంటే?

ఒక గొప్ప సందేశాన్ని ఇస్తున్న 'మూడు దాలకథ' బృహదారణ్యకోపనిషత్తులో చోటు చేసుకొన్నది. భగవంతుని సందేశాన్ని అందుకున్న మేఘాలు, లోక క్షేమం కోరి ఇప్పటికీ ఆకాశంలో 'ద ద ద' అని ఉరుముతుంటాయట! అందుకే, మనిషి తన చిన్న పొట్టకీ శ్రీరామరక్ష అనుకోకుండా పరహిత బుద్ధితో నడుచుకొన్న నాడు 'సర్వేజనా: సుఖినోభవంతు' అనే వేద వాక్కు సార్థకమవుతుంది.



భగవంతుని ఆదేశం మేరకు మొదట దేవతలు సమీపించి ''మేం అందరిలో కలిసి పోవడానికి, కీర్తిమంతులం కావడానికి మాకేదైనా ఉపదేశించండి'' అని కోరారట. అప్పుడు భగవంతుడు వారికి 'ద' అనే అక్షరాన్ని ఉపదేశించాడట. 'ద' అంటే 'దామ్యత- దమనం' అని అర్థం. జ్ఞానంతోపాటు సకల సంపదలుండడం వల్ల దేవతలకు గర్వమెక్కువ. అందువల్ల వారు అందరితో కలవరు. కనుక, గర్వాన్ని వదులుకొమ్మని భగవంతుడు 'ద' అనే అక్షరాన్నిచ్చి, ''ఇంద్రియాలను అదుపులో పెట్టుకోండి'' అనే సందేశమిచ్చాడు. దేవతలని అనుకొంటున్న వారు భగవంతునివల్ల ఒక లాభాన్ని పొందుతున్నప్పుడు తక్కిన వారూ ఊరుకుంటారా? అనంతరం మానవుల వంతు వచ్చింది.

వారు భగవంతుడిని సమీపించి, ఉపదేశించవలసిందిగా కోరారు. అప్పుడు భగవంతుడు వారికి కూడా 'ద' అనే అక్షరాన్నే ఉపదేశించాడు. 'ద' అంటే దానమని అర్థం. మానవులకు స్వార్థం ఎక్కువ కనుక వారు ఇతరులతో కలువ లేకపోతున్నారు. వారిని కూడా సంస్కరించే ఉద్దేశంతో దానగుణాన్ని అలవర్చుకొమ్మని ఉపదేశించడం గమనార్హం. ఈ విధంగా దేవతలు, మానవులు భగవంతుని వల్ల ప్రయోజనం పొందగానే రాక్షస స్వభావం కలిగిన వారు (రాక్షసులు) భగవంతుని దగ్గరకు వచ్చి ''తమకు కూడా ఉపదేశం ఇవ్వండని'' కోరారు. వారికి కూడా భగవంతుడు యథాపూర్వకంగా 'ద' అనే అక్షరాన్నే ఉపదేశించాడు. ఇక్కడ 'ద' అంటే దయ. దయాగుణం లేని మానవులే రాక్షసులు. అందుకే భగవంతుడు దయాగుణం ద్వారా సమాజంలో మంచివారుగా రాణించాలని వారికి ఉపదేశించాడు.

ఒకరికంటే మరొకరు గొప్పవారమనే గర్వానికి రానీయక, తోటివారిని తమతో సమానంగా చూసుకొమ్మని భగవంతుడు దేవతలకు సందేశమిచ్చాడు. కేవలం తిండికోసమే బతుకక, త్యాగబుద్ధితో వ్యవహరించాలని భగవంతుడు మానవులకు సందేశమిచ్చాడు. హింసకు పాల్పడుతూ సమాజ శ్రేయస్సుకు భంగకరంగా మెలగకుండా, సమస్త ప్రాణులమీద దయ కలిగి ఉండాలని భగవంతుడు రాక్షసులకు సందేశమిచ్చాడు. దేవతలు, మానవులూ, రాక్షసులూ ఈ ముగ్గురూ సమాజంలో భాగమే. శరీరంలో ఒక అవయవం చెడిపోతే శరీరానికెంతటి నష్టమో, సమాజంలో ఎవరు దుర్మార్గంగా వ్యవహరించినా సమస్త మానవకోటికి అపకారమే జరుగుతుంది.

**ఆచార్య మసన చెన్నప్ప**
**సెల్: 9885654381**



మల్లాది వెంకట కృష్ణమూర్తి | తీర్థయాత్ర 7

# నర్మద పరిక్రమ





## ఏవీ శాశ్వతం కావు!

(గత సంచిక తరువాయి)

పై రెండు సందర్భాల్లో ఒక దాన్ని ఉంచుకోవాలన్న తపన ఉంది. ఆ యువతి డైమండ్ నెక్లెస్‌ను, బ్రాహ్మణుడు తన బ్రాహ్మణత్వాన్ని మరణించే దాకా శాశ్వతంగా తమతోనే ఉంచుకోవాలని అనుకొన్నారు. ఈ రెండు సందర్భాలలో శాశ్వతంగా కోరుకున్నవి వారిని విడిచి వెళ్లిపోయాయి. వజ్రం కాని, కులం కాని, ప్రపంచంలోని ఎవరైనా తమకు శాశ్వతంగా ఉండాలని కోరుకొనే మరేదైనా కానీ.. ఏదీ శాశ్వతంగా మన దగ్గర ఉండదు.


మన మనసులోని ఓ భాగంలో 'అవి నావి' అని భావిస్తుంటాం. నాది అన్న ఆ భావనలను అన్నింటినీ మనం కనుక పోగొట్టుకోగలిగితే, అప్పుడు శాశ్వతమైన సద్వస్తువు మనకు దక్కుతుంది. జీవితం అనే నదిచుట్టూ మనం పరిక్రమ చేస్తూ ఉంటాం. మనుషులు వస్తారు, వెళ్తారు. కొన్ని వస్తువులను మనవి అనుకొంటాం. కొద్ది కాలానికి అవి మనవి కాకుండా పోయాక కూడా ఇంకా 'అవి మనవే, పోయాయి' అనుకొంటాం. 'అంతటితో అవి మనవి కావు కాబట్టే, పోయాయి' అన్న సత్యాన్ని అర్థం చేసుకోగలిగితే ఏ బాధా ఉండదు.

నర్మద నది పరిక్రమలో భిల్లులు ఈ ఆధ్యాత్మిక సత్యాన్ని బోధించే పాత్రను పోషిస్తారు. సన్యాసాశ్రమ స్వీకారం తర్వాత ఉత్తర భారతదేశంలోని సన్యాసులు చాలా మంది నర్మద పరిక్రమను కాలి నడకన చేస్తుంటారు. ఇది వారు వైరాగ్యాన్ని ఒంట పట్టించుకోవడానికే అయుండవచ్చు.

***

మా బస్‌లో ఓ మధ్యాహ్నం ఐలారి అనే గ్రామం మీంచి వెళ్లేపుడు రోడ్డుమీద కొందరు భిల్లులను చూశాను. మామూలు దుస్తుల్లో వాళ్లు చూడటానికి సామాన్యంగానే ఉన్నారు. నేను రచయితనని, నర్మదా యాత్రను అక్షరబద్ధం చేస్తానని వెంకటేశ్వరరావు ముందే దేశాయ్‌కు చెప్పడం వల్ల ఆయన నాకు 'ఇది రాయి మూర్తీ' అంటూ ఆయా సందర్భాలలో యాత్ర పొడుగునా చాలా విషయాలను.. ఇలా వివరిస్తూ పోయారు. మహారాష్ట్ర ఆచారాలను కూడా చాలావరకు చెప్పారు.

ఉదయం ఏడున్నరకు శ్రీమతి దేశాయ్ ఎదురు రాగా, మా బస్ బయల్దేరింది. వెంటనే 'గణపతి పప్పా, మోరియా' అంటూ వంటమనిషి పుష్పా మౌసి అరిచింది. మా యాత్రలో బస్ బయలు దేరినప్పుడల్లా ఈవిడ 'గణపతి పప్పా, మోరియా' అంటూ అరవడం ఒక్కసారి కూడా మరిచిపోలేదు.



**'షిరిడీ గుడి అప్పట్లో చాలా చిన్నది' అని నాకు స్పష్టంగా గుర్తుంది. సాయిబాబా పేరు వినడం తప్ప, నాకు అప్పట్లో పెద్దగా భక్తి ఉండేది కాదు.**

సిటీ ట్రాఫిక్ మొదలవకుండానే ముంబై నగరం నుంచి బయట పడాలన్నది దేశాయ్ తలంపు. కొద్దిదూరం వెళ్లాక కుడివైపు ఉదయించే సూర్యబింబం బంగారు రంగులో డిస్క్‌లా కనిపించింది. ఉత్తరదిక్కుకు మా ప్రయాణం సాగింది. బస్‌లో దేశాయ్, ఆయన కొడుకు కాకుండా ట్రావెల్స్ తరపున వంటమనిషి పుష్పా మౌసి, ఇద్దరు సేవకులు కూడా ఉన్నారు.

బస్ సిటీ లిమిట్స్ దాటాక వారిలోని జగ్గు, మరొకతను లేచి, తెల్లవారు ఝామున ఇంటి దగ్గర వండి తెచ్చిన ఉప్మాను డిస్పోజబుల్ ప్లేట్లలో అందరికీ బ్రేక్‌ఫాస్ట్‌గా సర్వ్ చేశారు. 'ఇంకా కావాలా?' అని అడిగి రెండోసారి కూడా పెట్టారు. తర్వాత ఓ చోట బస్‌ను ఆపి పుష్ప మౌసి స్టవ్‌మీద టీని తయారుచేస్తే అంతా వేడి వేడి టీ తాగారు. వెంకటేశ్వరరావుకు, నాకు.. కాఫీ, టీలు అలవాటు లేదు కాబట్టి, ఈ యాత్రలో మేం వాటిని తీసుకోలేదు.

### తొలి షిరిడీ యాత్ర

ఉదయం పదకొండుకు మా బస్ నాసిక్‌కు చేరి హైవేలో వెళుతుండగా, ఎడమ వైపు ఓ కాంపౌండ్ వాల్ గేటుకు ఉన్న 'హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్' అన్న బోర్డు కనిపించింది. నేను మెంబర్, ఆడిట్ బోర్డ్ అండ్ ఎక్స్ అఫీషియో డైరెక్టర్ ఆఫ్ కమర్షియల్ ఆడిట్ అనే కేంద్ర ప్రభుత్వ కార్యాలయంలో సీనియర్ ఆడిటర్‌గా పనిచేస్తున్నపుడు, 1973లో ఇక్కడికి ఆడిట్‌కు కొందరు కొలీగ్స్‌తో కలిసి వచ్చిన సంగతి.. అప్పుడు నాకు గుర్తుకు వచ్చింది.

ఆ ఆవరణలోని కంపెనీ గెస్ట్ హౌస్‌లోనే అప్పుడు మేం బస చేశాం. ఓ ఆదివారం నేను, మా సెక్షన్ ఆఫీసర్లు జగ్గయ్య, సత్యనారాయణ, ఆడిట్ ఆఫీసర్ సత్యనారాయణ త్ర్యయంబకేశ్వర్ ఆలయానికి, గోదావరి నది పుట్టిన బ్రహ్మగిరికి హెచ్‌ఏఎల్ కారులో వెళ్లాం. మరో ఆదివారం ఆర్‌టీసీ బస్‌లో షిరిడీ వెళ్లాం. 'షిరిడీ గుడి అప్పట్లో చాలా చిన్నది' అని నాకు స్పష్టంగా గుర్తుంది. సాయిబాబా పేరు వినడం తప్ప, నాకు అప్పట్లో పెద్దగా భక్తి ఉండేది కాదు.

సెప్టెంబర్ 1999లో దైవఘటనగా నేను ఆధ్యాత్మిక మార్గంలోకి వచ్చాక, ఓసారి శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టారి జీవితచరిత్రను చదివాను. ఆయనలో ఆధ్యాత్మిక మేలుకొలుపు షిరిడీ దర్శించాకే జరిగిందని తెలుసుకొన్నాక, నాకు షిరిడీ సాయిబాబా మీద చాలా కోపంగా ఉండేది. 'ఆ ఏడాది సెప్టెంబర్‌లో మూకాంబికా తల్లి నన్ను ఆధ్యాత్మిక మార్గంలోకి నడిపించినట్లుగా బాబా 1973లోనే ఆయన దర్శనానికి వెళ్లినప్పుడే నాలో మార్పును ఎందుకు తేలేదు? భరద్వాజ మాస్టారి మీద చూపించిన అనుగ్రహాన్ని నాపైన బాబా ఎందుకు చూపించలేదు?

-సశేషం

జీవన వేదం

## ధర్మమార్గమే శ్రేయస్కరం



అగ్నిని ఆశ్రయించి 33,342 తత్వాలున్నాయి. వాటిని తెలుసుకొని మానవులు సకల కార్యాలను సిద్ధింపజేసుకోవాలె. విద్వాంసులైన వారంతా పవిత్ర హృదయులుగా ఉండాలి. వారే మిగతా వారికి విద్యను, విజ్ఞానాన్ని ఉత్తమ శిక్షణ ద్వారా అందిస్తూ అందరినీ పవిత్రులను చేయాలి. ఈ రకంగా లోకంలోని మానవులంతా పవిత్రులవడం ద్వారా సుఖాలను పొందడానికి కావలసిన సామర్థ్యాల్ని సముపార్జించుకోవాలి. విద్వాంసులు మాత్రమే విద్వాంసుల శ్రమను గుర్తించగలుగుతారు. కనుక, విద్వాంసులను విద్వాంసులే సత్కరించాలె. సర్వాంతర్యామి అయిన పరమేశ్వరుని ఆజ్ఞ మేరకే సూర్యచంద్రాది గ్రహాలు, సమస్త సృష్టీ నియమం ప్రకారం నిర్దుష్ట మార్గంలో సంచరిస్తున్నాయి. ఇదే విధంగా మానవులందరూ ధర్మమార్గంలోనే నడువాలె. అదే లోకానికి శ్రేయస్కరం, క్షేమకరం కూడా.

– ఋగ్వేదం

ప్రశ్నోపనిషత్

## భగవంతుణ్ణి ఏం కోరుకోవాలి?



దేవుణ్ణి ఎవరు ఏదైనా కోరుకోవచ్చునని అనుకొంటారు. ఏది నిజమైన, సవ్యమైన కోరిక? స్వీయాత్మకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వడంలో తప్పు లేదు. ఆ తర్వాతైనా న్యాయమైన, ధర్మమైన కోర్కెలు కోరాల్సి ఉంటుంది. చాలామంది తమకు అధిక ధనధాన్యాలు కావాలని, సుఖసంతోషాలు కలగాలని.. ఇలా రకరకాల నిత్యజీవిత సంబంధమైన లౌకిక కోర్కెలే ఎక్కువగా కోరుకుంటుంటారు. భగవంతుడు వీటిని తీరుస్తాడా? అంటే, తీర్చవచ్చు లేదా తీర్చకపోనూ వచ్చు. దేవుడే ప్రత్యక్షమై 'ఏం కావాలి?' అని అడిగినపుడు అజ్ఞానులు మాత్రమే స్వార్థపరమైన, అశాశ్వతమైన సుఖాలను ఇచ్చే వరాలను ఆశిస్తారు. మోక్షాన్ని ప్రసాదించాలని, పాపాలను కడిగేసి జన్మరహితమైన స్వర్గప్రాప్తిని అందించమనే వారూ ఉంటారు. కానీ, లోకకల్యాణం కోసం దేవుణ్ణి ప్రార్థించే వారు చాలా అరుదుగా ఉంటారు. మీ కోసం దేవుణ్ణి వేడుకోవడం కన్నా పరుల కోసం ప్రార్థించడంలో ఉత్తమ వ్యక్తిత్వం, అద్భుతమైన తృప్తి, మానసిక ప్రశాంతత ఉంటాయి. మనమేది కోరుకున్నా, దేవుడు మనకిచ్చిన దానినే మనదిగా స్వీకరించాల్సిన మనసును కూడా మనం అలవర్చుకోవాలి. అప్పుడు మన కోర్కెల్ని తీర్చలేదన్న బాధా ఉండదు. మనం న్యాయసమ్మతంగా ఉంటూ, ధర్మబద్ధంగా జీవనం సాగిస్తున్నంత కాలం మనకు లభించే ఏవైనా సరే అవి దేవుడిచ్చినవిగానే, సవ్యమైనవిగానే భావించాలి. ఇప్పుడు నిర్ణయించుకోండి, పూజ చేసే సమయంలోనో లేదా గుడికి వెళ్లినప్పుడో దేవుణ్ణి మీరు ఏం కోరుకోవాలో!



**–మల్లన్నశర్మ,**
వేములవాడ

**– సావధానశర్మ**

★ 8 మార్చి 2019 సంచికలో పై ప్రశ్న ప్రచురితమైంది. దీనికి సమాధానం ఇక్కడ చదవండి.

### ఈ వారం ప్రశ్నలు

★ దేవుడు నిజంగానే ఉంటే అందరికీ ఎందుకు కనిపించడు?
**- డి.రామ్‌గోపాల్,**
మల్లాపూర్, హైదరాబాద్

★ మోక్ష సాధనకు అత్యంత తేలికైన మార్గం ఏదో చెప్పండి?
**- మంచికంటి శ్రీనివాసరావు,**
నిజామాబాద్

(ఈ ప్రశ్నలకు త్వరలో సమాధానాలు చదువగలరు)

## సుడోకు

**డైలీ సుడోకు 55 సమాధానం**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 3 | 8 | 1 | 4 | 7 | 6 | 9 | 2 | 5 |
| 6 | 9 | 4 | 2 | 1 | 5 | 8 | 3 | 7 |
| 2 | 5 | 7 | 9 | 3 | 8 | 1 | 4 | 6 |
| 5 | 1 | 6 | 7 | 2 | 9 | 3 | 8 | 4 |
| 4 | 3 | 9 | 8 | 6 | 1 | 5 | 7 | 2 |
| 8 | 7 | 2 | 5 | 4 | 3 | 6 | 9 | 1 |
| 1 | 4 | 5 | 3 | 8 | 7 | 2 | 6 | 9 |
| 9 | 2 | 8 | 6 | 5 | 4 | 7 | 1 | 3 |
| 7 | 6 | 3 | 1 | 9 | 2 | 4 | 5 | 8 |

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

**డైలీ సుడోకు -56**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | | 5 | | | 6 | | | |
| 2 | 6 | | | 9 | 5 | | 7 | |
| | | 9 | | | | | | |
| 9 | 1 | | | | 7 | | 8 | |
| | | 3 | 9 | | 8 | 1 | | |
| | 7 | | 1 | | | | 3 | 9 |
| | | | | | | 7 | | |
| | 3 | | 6 | 4 | | | 9 | 8 |
| | | | 5 | | | 2 | | |

## ట్వీట్

**సోనమ్ మహాజన్**@AsYouNotWish



**డాటర్ అంటే టెన్షన్స్ కాదు. డాటర్ అంటే.. టెన్ సన్స్(పదిమంది కొడుకులతో సమానం). ఆడపిల్లల్ని బతుకనీయండి. బతికించండి. ఆడపిల్లలు ఎప్పటికీ భారం కాదు. కాకూడదు.**

సోనమ్ మహాజన్‌ను ట్విట్టర్‌లో ఫాలో అవుతున్న వారి సంఖ్య
3,68,208

## కామన్‌మ్యాన్ వాయిస్

మతం ఏం చెయ్యగలదంటే..? బులెట్‌కి ఎదురెళ్లే గుండె ధైర్యం గలవాణ్ణి కూడా పిల్లి ఎదురొస్తే పరేషాన్ అయ్యే పిరికిపందని చెయ్యగలదు.
–Kumar Balasubramaniam

తెలంగాణలో మీకు రక్షణ లేదని భావిస్తే మీ దేవుళ్లు పాలిస్తున్న యూపీ, గుజరాత్ పోవచ్చు. మందిని పాకిస్థాన్ పొమ్మన్నట్లు మీకూ వర్తిస్తుంది.
–Nawin Samala

నీకున్న డిగ్రీ, పీజీ పట్టాలు కాగితం ముక్కతో సమానం. నువ్వు చదువుకున్న చదువు, నీ క్రమశిక్షణ, నీ ప్రవర్తన నీ ఉన్నతిని చాటే విషయాలు.
–M Sridhar

రెక్కల్ని కాపాడుకోలేని పక్షి ఎగురలేదు. హక్కుల్ని కాపాడుకోలేని వ్యక్తి ఎదుగలేడు.
–Upendar Kongari

## వైరల్ వీడియో





**దొరల గడీలకెళ్లి దొరసానిని ఇష్టపడుతున్నా అని చెప్తే ఎట్లుంటది? వీపు విమానం మోత మోగుతది. దొరల కాలంలో జరిగిన సంఘటన ఆధారంగా రూపొందించిన చిత్రం దొరసాని. ఈ సినిమా టీజర్ విడుదలై యూట్యూబ్‌లో హల్‌చల్ చేస్తున్నది.**

Dorasaani Official Teaser II Anand Deverakonda II Shivathmika Rajashekar II K V R Mahendra
Total views : 53,568+
Published on Jun 5, 2019

నమస్తే తెలంగాణ
# విహారం
[ కరీంనగర్ ]
శుక్రవారం 7 జూన్ 2019

## ప్రకృతి మధ్య ఉద్యోగం



ఉద్యోగంలో ప్రశాంతత కావాలని ప్రతి ఉద్యోగి కోరుకుంటాడు. ప్రశాంతతలోనే ఉద్యోగం దొరికితే ఎలా ఉంటుంది? ప్రకృతి అందాల మధ్య ఉద్యోగం లభిస్తే చెప్పనక్కర్లేదు. సంవత్సరానికి కోటికి పైగా జీతం ఇస్తే అంతకన్నా ఆనందం ఏమున్నది..

వారానికి నాలుగు రోజుల పని.. సంవత్సరానికి కోటికి పైగా జీతం.. ఆలస్యం చేయకుండా అప్లయ్ చేయాలనిపిస్తుంది కదూ! సముద్ర తీరంలో అందమైన దీవిలో, అలల శబ్దం తప్ప వేరే శబ్దాలు వినిపించని ఆహ్లాదకరమైన వాతావరణం అది. అమెరికాలోని కాలిఫోర్నియాలో 'ఈస్ట్ బ్రదర్ లైట్ స్టేషన్' సంస్థ ఈ అద్భుతమైన ఆఫర్‌ని ప్రకటించింది. శాన్ పాబ్లో సముద్రపు దీవిలో ఉన్న స్టేషన్ భవనాన్ని చూసుకోవడానికి( కేర్ టేకర్) ఉద్యోగ ప్రకటనను విడుదల చేసింది. ఇంత జీతం ఇచ్చి ఉద్యోగులను తీసుకోవడం అంటే ఆషామాషీ కాదు. ఇది ముందు లైట్ హౌస్. దీన్ని 1874లో నిర్మించారు. 1960లో ఆధునీకరించారు. అయితే ఇప్పుడు మాత్రం ఐదు గదుల హోటల్‌గా మార్చారు. వారానికి నాలుగు రోజులు మాత్రమే తెరిచి ఉంటుంది. పదిమంది పర్యాటకులు బస చేసేలా దీని నిర్మాణం జరిపారు. హోటల్‌లో ఉద్యోగం చేయాలనుకునే వారు దాన్ని పరిశుభ్రంగా ఉంచాలి. పర్యాటకులు ఎవరైనా వస్తే వాళ్లను ఒడ్డు నుంచి హోటల్‌కి తీసుకురావాలి. తిరిగి ఒడ్డుకు చేర్చాలి. బ్రేక్‌ఫాస్ట్‌తో పాటు భోజనం వండిపెట్టాలి. హోటల్‌లోనే 24 గంటలు అందుబాటులో ఉండాలి. ఉద్యోగులకు కావాల్సిన వస్తువులను, ఆహార పదార్థాలను సంస్థ ఉచితంగా ఇస్తుంది. కచ్చితంగా ఇద్దరు పనిచేయాల్సి ఉంటుంది. ఉద్యోగులు భార్యాభర్తలు అయితే మరింత బాగుంటుందని ఇచ్చిన ప్రకటనలో పేర్కొన్నది. రెండేళ్లపాటు తప్పనిసరిగా ఉద్యోగం చేయాల్సి ఉంటుంది. బోట్ నడపడంలో లైసెన్స్ ఉండాలి.

## రంగుల నది



ఒకటి కాదు రెండు కాదు ఏడు రంగుల్లో కనిపించే నీటి ప్రవాహాన్ని చూస్తే ఆశ్చర్య పడక మానరు కదా! దక్షిణ అమెరికాలోని కొలంబియా దేశంలో ఉన్న కనో క్రిస్టాలీస్ అనే నది సప్తవర్ణాలను పులుముకుని ఉంటుంది. దీన్ని ఖనిజాల గని అని, రెయిన్‌బో రివర్ అని కూడా పిలుస్తారు. దీనినే 'షీల్ ఆఫ్ గయానా'గా అభివర్ణిస్తారు. ఈ నది రంగు గురించి అనేక వాదనలు ఉన్నాయి. రాళ్లలో ఖనిజాలు ఉండడం వల్ల ఆ రంగులు వచ్చాయని కొందరు అంటారు. ఆ ప్రాంతంలో మకరేనియా క్లేవిగెరా అనే నీటి మొక్కలు ఎక్కువగా పెరుగుతాయి. వీటి వల్లే ఆ నది రంగులతో ఉంటుందని మరో చర్చ. అమెజాన్ అడవి, ఆండియన్ పర్వత శ్రేణులు, ఒరినోకియా మైదాన ప్రాంతం ఇక్కడే కలిసి ఉన్నాయి. నీటి మొక్కలు పెరిగే ఈ ప్రాంతంలో వేర్వేరు జోన్లు ఉన్నాయి. గతంలో ఈ నదిని ప్రమాదకరమైన ప్రాంతంగా భావించే వారు. అయితే ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసి గొప్ప పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దారు.

నదిలో గలగలా పారుతున్న నీటిని ఎవరైనా ఆస్వాదిస్తారు. ఆ నది చుట్టూ ప్రకృతి రమణీయత ఉంటే మంత్రముగ్ధులవ్వాల్సిందే. మరి వీటితో పాటు నది నీరు రంగు రంగులుగా ఉంటే ఎలా ఉంటుంది.

తెలంగాణలో చారిత్రక ప్రాధాన్యం ఉన్న ప్రదేశాల్లో సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలంలోని ఫణిగిరి ఒకటి. ఇక్కడి కొండల ఆకారం పాము పడగను పోలి ఉండటం వల్ల ఫణిగిరి అనే పేరు వచ్చింది. తెలంగాణలో బౌద్ధం చాలా చోట్ల విస్తరించినట్లు ఆధారాలు లభ్యమయ్యాయి. ఫణిగిరి, హీన యాన, మహాయాన బౌద్ధ శాఖలకు నిలయమై ప్రసిద్ధ బౌద్ధాచార్యులకు ఆవాసంగా ఉన్నట్లు తెలిపే ఆధారాలు దొరికాయి.



# ఫణిగిరి.. చరిత్ర లోగిలి

ఉత్తర భారతదేశాన్ని దక్షిణ పథంతో కలిపే ఒకప్పటి జాతీయ రహదారి సమీపంలో ఉన్న ఫణిగిరిపై బౌద్ధ ఆనవాళ్లను 1941 నుంచి 1944 వరకు అంటే స్వాతంత్ర్యం రాకముందే గుర్తించారు. నిజాం ప్రభుత్వంలో ఆనాటి పురావస్తు శాఖ డైరెక్టర్ ఖాజా మహమ్మద్ అహ్మద్ ఆధ్వర్యంలో పురావస్తు తవ్వకాలు జరిపారు. ఆ తవ్వకాలలో గుండ్రంగా ఉన్న సుమారు 30 స్తూపాలు, ఒక మహాస్తూపం, చైత్యగృహాలు (బౌద్ధసాధకుల ఆవాసాలు), ఉద్దేశిక స్తూపాలు(ప్రార్థనా స్థూపాలు), బుద్ధుని ప్రతిమలు, బౌద్ధచిహ్నాలు, జాతక కథలు, సిద్ధార్థ, గౌతముని జీవిత ఘట్టాలను మలిచిన అపురూప శిల్పాలు, బౌద్ధ శిలాఫలకాలు, మట్టిపాత్రలు, బ్రాహ్మీ లిపిశాసనాలు, శాతవాహన, ఇక్ష్వాకుల నాణేలు బయటపడ్డాయి. ఇక్ష్వాకుల నాణేలు, మట్టి, సున్నపు బొమ్మలు పూసలు ఇలా ఎన్నో చారిత్రక అవశేషాలు లభించాయి. ఆ వివరాలతో పురావస్తు శాఖ వారు ఒక పుస్తకాన్ని కూడా ముద్రించారు. ఆ తరువాత కాలంలో 2001లో, 2013-14 లోనూ తవ్వకాలు జరిగాయి. ప్రస్తుతం కూడా తవ్వకాలు జరుగుతున్నాయి. 2019 ఫిబ్రవరి 2న తవ్వకాల్లో అనేక చారిత్రక వస్తువులు వెలుగుచూశాయి. తొలిసారిగా ఏడవ రోమన్ చక్రవర్తి నెర్వ క్రీ.శ 96-98 విడుదల చేసిన 7.3 గ్రాముల బరువు గల బంగారు నాణం , క్రీ.పూ 1వ శతాబ్దానికి చెందినట్లుగా భావిస్తున్న అరు అడుగుల పొడవున్న భోధిసత్వుడి ప్రతిమ బయల్పడ్డాయి .

రాతి కొండమీద ఒక మహా చైత్యం దానికి చుట్టూ రాతి, మట్టి స్తూపాలు, మహాచైత్యానికి పశ్చిమ దిక్కులో గదుల వంటి కట్టడాలున్నాయి. కొండ మీద నిర్మాణాలు ఉండడం, ఎక్కువ మొత్తంలో ఇటుక నిర్మాణాలు అవడం మూలాన వర్షపు నీరు నిల్వ ఉండకుండా కిందకు ప్రవహించడానికి అనుగుణంగా కాలువలను సైతం ఏర్పాటు చేశారు. మామూలుగా ఎక్కడానికే కష్టమైన కొండమీదకు ఇన్ని సున్నపు రాళ్ళను, ఇటుకలను, నాపరాళ్లను ఆ రోజుల్లో ఎలా పైకి మోసుకుని వెళ్లారో ఆలోచిస్తే ఆశ్చర్యం కలుగకమానదు. చైత్య గృహాలలోకి చేరుకునే మెట్ల నిర్మాణం గ్రీకు రోమన్ పద్ధతులను తలపిస్తుంది. సున్నపు రాతి శిల్పాలలోని ఎద్దులు కూడా సుమేరియన్, మొహెంజోదారో వృషభాలను గుర్తుచేసేలా ఎత్తయిన మూపురాలతో ఉన్నాయి. ప్రస్తుతం జరుగుతున్న తవ్వకాల్లో డంగు సున్నంతో చేసిన దాదాపు ఆరు అడుగుల బోధిసత్వుని విగ్రహం బయటపడింది. తెలంగాణలో మాత్రమే కాకుండా యావత్ భారత దేశంలోనే ఇప్పటి వరకూ దొరికిన విగ్రహాలలో అత్యంత పెద్దది. దేశంలో ఇప్పటివరకు రెండు అడుగుల పరిమాణంలో ఉండే సున్నం ప్రతిమలు లభించగా డంగు సున్నంతో 1.73 మీటర్ల ఎత్తు, 35 సెంటీ మీటర్ల వెడల్పుతో రియల్ లైఫ్ సైజులో గార లేదా పూత వున్న విగ్రహం లభించడం ఇదే ప్రథమం.

బౌద్ధంలో బుద్ధుని, లేదా ఇతర ధాతు విశేషాలను గౌరవప్రదంగా లేదా స్మృతి చిహ్నంగా లేదా పూజా సంకల్పంతో భద్రపరిచే ఆచారం ఉండేది. బుద్ధుని నిర్వాణం తరువాత అతని ధాతువులపై 8 చైత్యాలను నిర్మించారు. తరువాత చక్రవర్తి అశోకుడు వాటిలో ఏడింటిని తెరిపించి అందులోని శకలాలను చిన్న ముక్కలుగా చేసి 84 వేల స్తూపాలను కట్టించాడని ఒక ప్రతీతి ఉంది. కాలక్రమంలో బుద్ధుని, ఇతర గురువుల శరీర అవశేషాల, వారు వాడిన వస్తువులపై కూడా ఇలాంటి చైత్యాలను నిర్మాణం ప్రారంభం అయింది.



### న్యూయార్క్ మ్యూజియంలో..



ఇక్ష్వాకుల కాలంలో రూపొందిన నాలుగు అడుగుల ఎత్తున్న శిల్పంలో సున్నపురాయితో రూపుదిద్దుకున్న ఈ శిల్పం బుద్ధుడి జీవిత పరమార్థాన్ని 3 విభాగాలుగా వివరిస్తూ రూపొందింది. రాజ మందిరంలో ఉండటం సరికాదని నిర్ధారించుకుని సిద్ధార్థుడు అడవికి వెళ్లిపోవటం, బుద్ధుడిగా మారి జీవిత పరమార్థాన్ని వివరిస్తూ తన బోధనలను విశ్వవ్యాప్తం చేయటం, తుదకు స్వర్గానికి చేరుకోవటం. శిల్పుల పనితీరు కూడా అద్భుతంగా ఉన్న ఈ శిల్పాన్ని న్యూయార్క్ లోని ది మెట్రోపాలిటన్ మ్యూజియమ్స్ ఆఫ్ ఆర్ట్ (ది మెట్)' 150వ వార్షికోత్సవం సందర్భంగా 'ట్రీ అండ్ సర్పెంట్' పేరుతో బుద్ధుడి అంశాలను ఇతివృత్తంగా తీసుకొని ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసింది. ప్రపంచవ్యాప్తంగా వివిధ మ్యూజియాల్లో ఉన్న బుద్ధుడికి సంబంధించిన అరుదైన కళాఖండాలను ఇందులో ప్రదర్శనకు ఉంచారు. హైదరాబాద్ స్టేట్ మ్యూజియంలో ఉన్న బుద్ధుడి జీవితగాథను ప్రతిబింబించే శిల్పాన్ని ఎంపిక చేశారు.

### శాసనాలు..

క్రీస్తు పూర్వం 1వ శతాబ్దం నాటి బ్రాహ్మీ శాసనంతో పాటు శ్రీ పర్వత, విజయపురిలను పాలించిన ఇక్ష్వాక రాజు ఎహువల శాంతమూలుని 18వ పాలన కాలానికి సంబంధించిన శాసనాలు ఇక్కడ లభించాయి. ఇంత వరకు ఆ రాజు 11 సంవత్సరాలు మాత్రమే పాలించిన ఆధారాలు లభించగా 18 ఏళ్ల ఆ రాజు పాలించాడని తెలిపే శాసనం ఇక్కడ లభించడం మరో విశేషం. అదే శాసనంలో శ్రీ కృష్ణుని ప్రస్తావన కూడా ఉంది. కృష్ణుని గురించి పేర్కొన్న తొలి శాసనం కూడా ఇక్కడే లభ్యమవడం మరో విశేషం .

### నాణేలు..

ఫణిగిరిలో జరిపిన తవ్వకాల్లో వివిధ రాజుల పాలనా కాలాలకు సంబంధించిన, అనేక దేశాలకు చెందిన నాణేలు దొరికాయి. 40 సీసపు నాణేలు, రోమన్ చక్రవర్తి ఆగస్టస్ నాణెం, 42 శాతవాహన నాణేలు లభించాయి . రోమన్ నాణేలు లభించడం ద్వారా గతంలోనే విదేశీయులు ఇక్కడకు వచ్చినట్లు తెలుస్తున్నది. ఇక్ష్వాకుల కాలంలో సామంత స్థాయి కలిగిన అధికారులను మహాతలవరులు అని పిలిచేవారు. ఇక్కడ దొరికిన మహాతలవర నాణేలపై 2008లో ఆర్కియాలజీ విభాగం ఒక పుస్తకాన్ని ప్రచురించింది. 1.3 గ్రాముల బరువు 1.5 సెంటిమీటర్ల వ్యాసంతో ఉన్న పోటిన్ మెటల్ (రాగి, తగరం, సీసంలను ప్రత్యేక నిష్పత్తిలో కలిపిన మిశ్రమ లోహం వెండిలా అనిపిస్తుంది) కాయిన్ దొరికింది. దానిపై బొమ్మగా ఒక మహారాజు సగం చిత్రం వెనకవైపు 3వ శతాబ్దపు ఓడ బొమ్మ ఉన్నాయి. అయితే ఇప్పటివరకు రాగి, వెండి నాణేలు మాత్రమే లభించినా, తాజాగా జరిపిన తవ్వకాల్లో కాపర్, లెడ్ మిశ్రమంతో తయారైన పోషన్ కాయిన్స్ దొరకడం ఫణిగిరి చరిత్రలోనే గొప్ప అంశంగా భావిస్తున్నారు.

### ఇతర సందర్శనీయ ప్రదేశాలు..

ఫణిగిరికి 5 కిలోమీటర్ల దూరంలో వర్ధమానుకోట, తిరుమలగిరి, నాగారం, సింగారం, అర్వపల్లి దర్గా, ఆర్లగడ్డ గూడెం దగ్గర బౌద్ధులు నడయాడిన చరిత్ర, విహారాల ఆనవాళ్ళు, బుద్ధవిగ్రహాలు,శిలామండపాలు ఉన్నాయి. ఫణిగిరి గ్రామంలో పురాతన రామాలయం, శివాలయం కూడా చూడదగ్గవి.

### ఎలా వెళ్లాలి?

తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నుండి సుమారు 126 కిలోమీటర్ల దూరంలో ఫణిగిరి ఉన్నది. హైదరాబాద్ - సూర్యాపేట రహదారి నుంచి 3 కిలోమీటర్ల దూరంలో స్తూపం ఉన్నది. హైదరాబాద్ ఇతర ప్రముఖ పట్టణాల నుండి రోడ్డు రవాణా సంస్థ బస్సులు అందుబాటులో ఉంటాయి. ప్రైవేటు వాహనాలు నడుస్తాయి. సొంత వాహనాల ద్వారా కూడా వెళ్ళవచ్చు.

అరవింద్ ఆర్య పకిడె

రైడింగ్ అంటే ఇష్టం లేని తక్కువ మంది ఉంటారు. రోడ్లపై ప్రయాణాలు చేయాలని ఉంటుంది. కానీ కనీస అవగాహన కూడా మనకు ఉండదు. తెలుసుకోవాలని కూడా ప్రయత్నించం. రోడ్డు మార్గం రోజురోజుకూ అభివృద్ధి చెందుతుంది. టూ లైన్ రోడ్లు కాస్తా ఫోర్ లైన్ రోడ్లుగా, నేషనల్ హైవేలుగా మారుతున్నాయి. మరి ఆ రోడ్ల మీద ఉండే గుర్తులకు అర్థాలు చాలా మందికి తెలియవు. ఈ చిత్రాలు చూసి కొంతైనా అవగాహన తెచ్చుకోండి.




బ్రోకెన్ లైన్ ఉంటే ఓవర్‌టేక్ చెయ్యొచ్చని అర్థం



కంటిన్యూగా లైన్ ఉంటే ఓవర్‌టేక్ చెయ్యొద్దని అర్థం



డబుల్ లైన్ ఉంటే ఎట్టి పరిస్థితుల్లో ఓవర్‌టేక్ చెయ్యొద్దని అర్థం

# నిపుణ — విద్య ఉద్యోగ సమాచారం —

## నాన్ ఎగ్జిక్యూటివ్‌లు

భారత రక్షణ శాఖ పరిధిలోని మజ్‌గావ్ డాక్ షిప్‌బిల్డర్ లిమిటెడ్ (ఎండీఎల్) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.



- మొత్తం ఖాళీలు: 27 (పర్సనల్ అసిస్టెంట్ కమ్ క్లర్క్-20, జూనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్-1, సెక్యూరిటీ సిపాయి-6)
- అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి పర్సరల్ అసిస్టెంట్ పోస్టులకు ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ, హిందీ ట్రాన్స్‌లేటర్‌కు పీజీ (హిందీ/ఇంగ్లిష్) ఉత్తీర్ణతతోపాటు హిందీ నుంచి ఇంగ్లిష్ ట్రాన్స్‌లేషన్‌లో డిప్లొమా/సర్టిఫికెట్ ఉండాలి. సెక్యూరిటీ సిపాయి పోస్టులకు పదోతరగతి ఉత్తీర్ణత.
- వయస్సు: 33 ఏండ్లకు మించరాదు.
- ఎంపిక: ఆన్‌లైన్ రాతపరీక్ష/పర్సనల్ ఇంటర్వ్యూ
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- దరఖాస్తులకు చివరితేదీ: జూన్ 26
- ఆన్‌లైన్ రాతపరీక్ష: జూలై 15
- వెబ్‌సైట్: www.mazagondock.gov.in

## ఈఐఎల్‌లో మేనేజ్‌మెంట్ ట్రెయినీలు

న్యూఢిల్లీలోని నవరత్న హోదా కలిగిన ఇంజినీర్స్ ఇండియా లిమిటెడ్ (ఈఐఎల్) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న మేనేజ్‌మెంట్ ట్రెయినీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.




- పోస్టు పేరు: మేనేజ్‌మెంట్ ట్రెయినీ
- మొత్తం ఖాళీలు - 79
- విభాగాలవారీగా.. సివిల్-16, మెకానికల్-36, కెమికల్-10, ఎలక్ట్రికల్-9, ఇన్‌స్ట్రుమెంటేషన్-8
- అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి మెకానికల్, కెమికల్, సివిల్, ఇన్‌స్ట్రుమెంటేషన్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో బీఈ/బీటెక్ లేదా బీఎస్సీ ఇంజినీరింగ్/ తత్సమాన పరీక్షలో 65 శాతం మార్కులతో ఉత్తీర్ణత. సంబంధిత బ్రాంచీలో గేట్-2019లో వ్యాలిడ్ స్కోర్ ఉండాలి.
- వయస్సు: 2019 జూలై 1 నాటికి 25 ఏండ్లకు మించరాదు. ఎస్సీ/ఎస్టీలకు ఐదేండ్లు, ఓబీసీలకు మూడేండ్లు, పీహెచ్‌సీ అభ్యర్థులు పదేండ్లవరకు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- ప్రొబేషనరీ పీరియడ్: ఏడాది
- పే స్కేల్: శిక్షణ కాలంలో రూ. 60,000/- అదనంగా అకామిడేషన్ & ట్రాన్స్‌పోర్టేషన్-నెలకు రూ. 15000/- చెల్లిస్తారు. ట్రెయినింగ్ పూర్తయిన తర్వాత డీఏ, హెచ్‌ఆర్‌ఏ, మెడికల్, తదితర సౌకర్యాలు కలుపుకొని సుమారుగా ఏడాదికి రూ. 15 లక్షల జీతం చెల్లిస్తారు
- ఎంపిక: గేట్-2019 స్కోర్+ఇంటర్వ్యూ ద్వారా
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- దరఖాస్తులకు చివరితేదీ: జూన్ 20
- వెబ్‌సైట్: www.engineersindia.com

## ఎంఆర్‌పీఎల్‌లో ఇంజినీర్లు

మంగళూరులోని ఓఎన్‌జీసీ పరిధిలోని మంగళూరు రిఫైనరీ & పెట్రోకెమికల్స్ లిమిటెడ్ (ఎంఆర్‌పీఎల్) ఖాళీగా ఉన్న మేనేజ్‌మెంట్ క్యాడర్ (గేట్ స్కోర్ ద్వారా) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.




- మొత్తం పోసులు: 41 (ఇంజినీర్-26, సూపర్‌వైజర్-36, హెచ్‌ఆర్ ఎగ్జిక్యూటివ్-5)
- విభాగాలవారీగా ఖాళీలు: కెమికల్-6, మెకానికల్-9, ఎలక్ట్రికల్-3, ఇన్‌స్ట్రుమెంటేషన్-4, సివిల్-3, ఇన్ఫర్మేషన్ సిస్టమ్-1, ల్యాబొరేటరీ సూపర్‌వైజర్-10
- అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి కెమికల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఇన్‌స్ట్రుమెంటేషన్, సివిల్, కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్‌లో బీఈ/బీటెక్ లేదా బీఎస్సీ ఇంజినీరింగ్, ఎమ్మెస్సీ (కెమిస్ట్రీ), ఎంబీఏ లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణత. ఇంజినీర్/ సూపర్‌వైజర్ పోస్టులకు గేట్-2019 స్కోర్, హెచ్‌ఆర్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు యూజీసీ నెట్ డిసెంబర్-2018లో అర్హత సాధించాలి.
- వయస్సు: 28 ఏండ్లు మించరాదు.
- ఎంపిక: గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ ద్వారా
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- దరఖాస్తులకు చివరితేదీ: జూలై 4
- వెబ్‌సైట్ : https://mrpl.co.in

## ఐఐటీ రోపర్‌లో

రోపర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) ఖాళీగా ఉన్న ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.

- పోస్టు పేరు: ఫ్యాకల్టీ
- విభాగాలు: కెమిస్ట్రీ, సివిల్, కెమికల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్, మెకానికల్, మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజినీరింగ్, హ్యూమానిటీస్ & సోషల్ సైన్స్, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్
- అర్హత: సంబంధిత బ్రాంచీలో పోస్టు గ్రాడ్యుయేట్ డిగ్రీ, పీహెచ్‌డీ డిగ్రీ ఉత్తీర్ణత. టీచింగ్/రిసెర్చ్/ ఇండస్ట్రీ రంగంలో అనుభవం ఉండాలి.
- ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- దరఖాస్తులకు చివరితేదీ: జూలై 4
- వెబ్ సైట్: www.iitrpr.ac.in

## నేషనల్ ఫర్టిలైజర్స్‌లో

నేషనల్ ఫర్టిలైజర్స్ లిమిటెడ్ వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న కింది బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.

- మొత్తం పోస్టులు: 19
- విభాగాలవారీగా ఖాళీలు: సీనియర్ మేనేజర్ (హెచ్‌ఆర్-1, ఫైనాన్స్ అండ్ అకౌంట్స్-1), మేనేజర్ (ఎలక్ట్రికల్)-2, అసిస్టెంట్ మేనేజర్ (మార్కెటింగ్)-3, ఇంజినీర్ (సివిల్-1, మెకానికల్-2, కెమికల్-4, ఎలక్ట్రికల్-2, ఇన్‌స్ట్రుమెంటేషన్-1), ఆఫీసర్ -1, మెడికల్ ఆఫీసర్-1
- అర్హత: సంస్థ నిబంధనల ప్రకారం
- ఎంపిక: పర్సనల్ ఇంటర్వ్యూ
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- దరఖాస్తులకు చివరితేదీ: జూలై 4
- వెబ్‌సైట్: www.nationalfertilizers.com

## ఆర్‌జీసీబీలో సైంటిస్టులు

తిరువనంతపురంలోని రాజీవ్ గాంధీ సెంటర్ ఫర్ బయోటెక్నాలజీ (ఆర్‌జీసీబీ) లో ఖాళీగా ఉన్న కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీల సంఖ్య: 9
- పోస్టు పేరు: ఫ్యాకల్టీ సైంటిస్ట్
- అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి పీజీతోపాటు పీహెచ్‌డీ ఉత్తీర్ణత. సంబంధిత రంగంలో అనుభవం ఉండాలి.
- ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా
- దరఖాస్తు: ఆఫ్‌లైన్‌లో
- దరఖాస్తులకు చివరితేదీ: జూన్ 30
- వెబ్‌సైట్: www.rgcb.res.in

నమస్తే తెలంగాణ
చిత్రం
[ కరీంనగర్ ]
శుక్రవారం 7 జూన్ 2019

# 'ఓ బేబీ'తో ఆ కోరిక తీరింది!



నందినిరెడ్డి, సమంత, శ్రీతేజ్, సురేష్‌బాబు

'మంచి సినిమాలు చేయాలి లేదంటే ఇంట్లో కూర్చోవాలి అని నిర్ణయించుకున్న తరువాత రంగస్థలం, మహానటి, సూపర్‌డీలక్స్, మజిలి వంటి చిత్రాలొచ్చాయి. నేను తీసుకున్న నిర్ణయం వల్ల ఎలాంటి చిత్రాలు చేయాలో స్పష్టత వచ్చింది. అలాంటి సమయంలో వచ్చిన సినిమానే 'ఓ బేబీ' అన్నారు సమంత. ఆమె నటిస్తున్న తాజా చిత్రం 'ఓ బేబీ'. నందినిరెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. డి.సురేష్‌బాబు, సునీత తాటి, టి.జి. విశ్వప్రసాద్, హ్యూన్ హ్యూ థామస్ కిమ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా చిత్ర బృందం గురువారం హైదరాబాద్‌లో మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా సమంత మాట్లాడుతూ 'నేను నటిగా రిటైర్ అయ్యేలోపు పూర్తిస్థాయి వినోదాత్మక చిత్రాన్ని చేయలేకపోతానా? అనే చిన్న వెలితి వుండేది. 'ఓ బేబీ'తో ఆ కోరిక తీరినందుకు చాలా సంతోషంగా వుంది. ఇది కేవలం కామెడీ సినిమా మాత్రమే కాదు. క్లైమాక్స్‌లో కంటతడిపెట్టిస్తుంది. చిన్నతనంలో ఏం సాధించాలని వుండేదని మా అమ్మని నేను ఎప్పుడూ అడగలేదు. నేను, నా సోదరుడు తప్ప అమ్మకు మరో లోకం లేదు. కానీ నేను నా డ్రీమ్స్‌ని పుల్‌ఫిల్ చేసుకున్నాను. ఓ యాక్టర్ అయ్యాను. నాకు అవకాశం వచ్చింది. కానీ అమ్మలకు, అమ్మమ్మలకు అవకాశాలు రాలేదేమో. కానీ 'ఓ బేబీ' సినిమా చూసిన తరువాత చాలా మంది ఇంటికి వెళ్లి వాళ్ల అమ్మల్ని, అమ్మమ్మల్ని మీకు ఏం కావాలని వుండేదని తప్పకుండా అడుగుతారు. వాళ్లు చేసిన త్యాగాల్ని గుర్తుచేసుకుని ఆత్మీయంగా ఆలింగనం చేసుకుంటారు' అని తెలిపారు. నందినిరెడ్డి మాట్లాడుతూ 'నేను కొరియన్ సినిమాలు చూడను. అయితే కొరియన్ చిత్రాన్ని చూడమని సమంత ఫోన్ చేసి చెప్పింది. చూసిన తరువాత లక్ష్మీభూపాల్‌తో మాట్లాడాను. ఈ కథలో మా అమ్మ, మా అమ్మమ్మతో పాటు మా ఇంట్లో వుండే వాళ్లంతా కనిపించారు. భాష వేరైనా ఇదొక యూనివర్సల్ స్టోరీ. దీన్ని తప్పకుండా తెలుగు ప్రేక్షకులకు చెప్పాలనుకున్నాను. స్క్రిప్ట్‌లో ఏం మార్చాలి? ఏం మార్చకూడదో వాటినే మార్చాం. ఈ సినిమాని ఓ బాధ్యతగా చేశాం. ఉన్నదాన్ని చెడగొట్టకుండా ఒరిజినల్ సినిమాపై వున్న గౌరవంతో చాలా జాగ్రత్తగా ఈ చిత్రాన్ని రూపొందించాం. సినిమాకు మంచి టీమ్ కుదిరింది. సమంతకు ఇంత వరకు చేసిన సినిమాలతో పోలిస్తే చాలా ప్రత్యేకమైన చిత్రమిది' అన్నారు. ఈ కార్యక్రమంలో డి.సురేష్‌బాబు, శ్రీతేజ్, లక్ష్మీభూపాల్, సునీత తాటి తదితరులు పాల్గొన్నారు.

# దొరసాని నన్ను సూత్తాంది!



శివాత్మిక, ఆనంద్ దేవరకొండ

ఆనంద్ దేవరకొండ, శివాత్మిక నాయకానాయికలుగా నటిస్తున్న చిత్రం 'దొరసాని'. కేవీఆర్ మహేంద్ర దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. మధుర ఎంటర్‌టైన్‌మెంట్స్, బిగ్‌బెన్ సినిమాస్ పతాకాలపై మధుర శ్రీధర్‌రెడ్డి, యష్ రంగినేని నిర్మిస్తున్నారు. ఈ చిత్ర టీజర్‌ను గురువారం ప్రముఖ నిర్మాత డి.సురేష్‌బాబు విడుదల చేశారు. 'చిన్న దొరసాని గడీల నుంచి బయటకే రాదు. దొరసానిలు ఎప్పుడైనా బయటకొత్తార్రా' అంటూ నలుగురు యువకుల సంభాషణతో టీజర్ ఆసక్తికరంగా మొదలైంది. 'నేను దొరసానిని ప్రేమిస్తున్నాన్రా... దొరసాని కూడా నన్ను సూత్తాంది' అని కథానాయకుడు రాజు తన మిత్రుడితో అనడం, చివరగా 'మీరు నా దొరసాని' అంటూ రాజు కథానాయిక శివాత్మికతో చెప్పే భావోద్వేగభరిత డైలాగ్‌తో టీజర్ ఆకట్టుకుంది. దొరసాని దేవకి పాత్రలో శివాత్మిక చక్కటి హావభావాలతో మెప్పించింది. ఈ సందర్భంగా సురేష్‌బాబు మాట్లాడుతూ 'అందమైన ప్రేమకథ ఇది. నాలుగు కాలాల పాటు గుర్తుండిపోతుంది' అన్నారు. 'స్వచ్ఛమైన, ఆర్ద్రత కలబోసిన ప్రేమకథాంశమిది. సంభాషణలన్నీ తెలంగాణ మాండలికంలో సహజంగా ఉంటాయి. హృదయాల్ని స్పృశించే ఉద్వేగాలుంటాయి' అని దర్శకుడు చెప్పారు. నిర్మాత మధుర శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ 'ఈ చిత్రం కొత్త దర్శకులకు రిఫరెన్స్‌లా ఉంటుంది. మహేంద్ర తన ఆలోచనల్ని వందశాతం తెరమీదకు తీసుకొచ్చాడు. ఈ సినిమా విషయంలో సురేష్‌బాబుగారు మాకు మద్దతుగా నిలిచారు' అన్నారు. తెలంగాణ ప్రాంతంలో 80వ దశకం నేపథ్యంలో ఈ చిత్రాన్ని రూపొందించారు. కన్నడ కిషోర్, వినయ్ వర్మ, శరణ్య తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సన్నీ కూరపాటి, ఆర్ట్: జెకె మూర్తి, ఎడిటర్: నవీన్ నూలి, సమర్పణ: సురేష్‌బాబు, సంగీతం: ప్రశాంత్ విహారి, రచన-దర్శకత్వం: కేవీఆర్ మహేంద్ర.

# ఇండియన్-2 నుంచి తప్పుకుందా?



కాజల్ అగర్వాల్

'ఇండియన్-2' సినిమా నుంచి కాజల్ అగర్వాల్ తప్పుకుందా అంటే ఔననే అంటున్నాయి కోలీవుడ్ వర్గాలు. '2.ఓ' తర్వాత కమల్‌హాసన్‌తో 'ఇండియన్-2' చిత్రానికి శ్రీకారం చుట్టారు దర్శకుడు శంకర్. ఈ సినిమాలో కమల్‌హాసన్‌కు జోడీగా కాజల్ అగర్వాల్ కథానాయికగా నటిస్తున్నది. జనవరిలో లాంఛనంగా ప్రారంభమైన తర్వాత కమల్‌హాసన్ రాజకీయాలతో బిజీగా ఉండటం, ఆర్థికపరమైన కారణాల వల్ల చిత్రీకరణకు పుల్‌స్టాప్ పడింది. ఎన్నికలు పూర్తయిన తర్వాత షూటింగ్‌ను తిరిగి ప్రారంభించేందుకు శంకర్ చేసిన ప్రయత్నాలు ఫలించలేదని సమాచారం. షూటింగ్ పలుమార్లు వాయిదా పడటంతో అసంతృప్తి చెందిన కాజల్ ఈ సినిమా నుంచి తప్పుకున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. త్వరలోనే దీనిపై ఆమె అధికారిక ప్రకటన చేయనున్నట్లు తెలిసింది. తాను నటిస్తున్న ఇతర సినిమాల షూటింగ్‌లకు ఇబ్బంది తలెత్తకూడదనే కాజల్ ఈ నిర్ణయం తీసుకుందని తెలుస్తున్నది.

# కథే సూపర్‌స్టార్



సముద్ర, సునీల్, సాయి అరుణ్‌కుమార్ తదితరులు

శ్రీకాంత్, సునీల్, శ్రీ, పృథ్వీ, ప్రవీణ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'జై సేన'. వి. సముద్ర దర్శకుడు. శివ మహాతేజ ఫిల్మ్స్ పతాకంపై వి.సాయి అరుణ్‌కుమార్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్ర టైటిల్ లోగోను సునీల్ గురువారం హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఈ చిత్రానికి కథే సూపర్‌స్టార్. ఇప్పటి వరకు వినోదభరిత పాత్రల్లో కనిపించా కానీ తొలిసారి ఈ చిత్రంలో నా పాత్ర గత చిత్రాలకు భిన్నంగా వుండబోతుంది' అన్నారు. సముద్ర మాట్లాడుతూ 'ఈ చిత్రంలో శ్రీకాంత్, సునీల్‌తో పాటు నలుగురు కొత్త హీరోలు నటిస్తున్నారు. కొంత ప్యాచ్‌వర్క్ మినహా చిత్రీకరణ పూర్తయింది. నా ప్రతి చిత్రంలో ఓ సామాజిక సందేశం ఉన్నట్లే ఈ చిత్రంలోనూ మంచి సందేశం ఉంటుంది. మా టీమ్‌కి మంచి పేరు తెచ్చిపెడుతుంది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి చిత్రాన్ని వచ్చే నెల విడుదల చేయాలని సన్నాహాలు చేస్తున్నాం' అన్నారు. కార్తికేయ, అభిరామ్, హరీష్ గౌతమ్, అజయ్ ఘోష్, మధు, ఆజాద్, ధన్‌రాజ్, వేణు, చమ్మక్ చంద్ర తదితరులు నటిస్తున్నారు. ఈ చిత్రానికి మాటలు: తిరుమలశెట్టి సుమన్, పార్వతీ చందు, పాటలు: అభినయ శ్రీను, సిరాశ్రీ, సంగీతం: రవిశంకర్, సహనిర్మాతలు: పి.శిరీష్‌రెడ్డి, దేవినేని శ్రీనివాస్, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: వి. సముద్ర.



కారుణ్య, సుమన్‌బాబు

## మదర్ సెంటిమెంట్ నేపథ్యంలో..

కారుణ్య చౌదరి, 'మహానటి' ఫేమ్ సాయి తేజస్విని ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'ఎ ర్రచీర'. చెరువుపల్లి సుమన్‌బాబు స్వీయ దర్శకత్వంలో నటిస్తూ తెరకెక్కిస్తున్నారు. ఫస్ట్‌లుక్‌ను దర్శకుడు అనిల్ రావిపూడి బుధవారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ 'ఫస్ట్‌లుక్‌లో హారర్ కోణం కనిపిస్తోంది. సాయి తేజస్విని అద్భుతంగా నటించింది. ఈ సినిమా విజయం సాధించి టీమ్ అందరికి మంచి పేరు రావాలి' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'ఫస్ట్‌లుక్ పోస్టర్ చూసి హారర్ థ్రిల్లర్ అనుకుంటున్నారు. కానీ ఇది ఫ్యామిలీ, మదర్ సెంటిమెంట్ వున్న సినిమా. దీనికి హారర్ అంశాల్ని జతచేశాం' అన్నారు. ఈ కార్యక్రమంలో బేబీ సాయితేజస్విని, కమల్ కామరాజు తదితరులు పాల్గొన్నారు.







